సమావేశము - IV
వాల్యూం - I
నెం. 7

వెల : రూ. 140-00
21 డిసెంబర్, 2024
శనివారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

1. "రైతు భరోసా" - స్వల్ప వ్యవధి చర్చ ... 1
2. వాయిదా ప్రతిపాదనలు ... 90

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి శ్రీమతి వి.ఎన్.ప్రసన్నకుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి ఎస్. నాగమణి శ్రీ ఎమ్. రఘుమారెడ్డి శ్రీ ఎ. సుధాకర్
సహాయ కార్యదర్శులు	:	శ్రీ పి. శ్రీనివాస్ శ్రీమతి ఎ. పద్మాసిని శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ శ్రీ ఎన్. సుజిత్ కుమార్ శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ శ్రీ సి.కె.వినోద్‌కుమార్ శ్రీమతి బి. ప్రమీల శ్రీ ఆర్.రమణయ్య శ్రీ సిహెచ్.నాగరాజు శ్రీ పి.వెంకటేశం శ్రీ మహమ్మద్ హమీదుద్దీన్ శ్రీ పి.వి.సునీల్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వరరెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(3వ శాసన సభ)

(నాలుగవ సమావేశం – ఏడవ రోజు)

శనివారం, డిసెంబర్ 21, 2024

(సభ ఉ.గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

శ్రీ టి.హరీష్ రావు :- అధ్యక్షా, సమయం గం.10.10 నిమిషాలు కావొచ్చింది అధ్యక్షా. ఈ సెషన్‌లో ఏ ఒక్క రోజు కూడా అసెంబ్లీ గం.10.00 లకు మొదలు కాలేదు. మీరు లాస్ట్ సెషన్ చూడండి. మేము పది సంవత్సరాలు సభ నడిపితే గం.10.00 లు అంటే ఖచ్చితంగా, టంచన్‌గా సభ నడిపాము అధ్యక్షా. సభ సమయ పాలన పాటించడం చాలా ముఖ్యం. ప్రతి రోజు ఈ సెషన్‌లో మీరు చూస్తే రోజూ 5 నిమిషాలు, 10 నిమిషాలు, 15 నిమిషాలు సభ ఆలస్యంగా ప్రారంభం కావడం కారెక్ట్ కాదు అధ్యక్షా. సభ అందరికీ ఆదర్శంగా ఉండాలి కానీ ఇలా ఆలస్యంగా నడపడం కారెక్ట్ కాదని మీకు మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :- రైతు భరోసాపై స్వల్ప వ్యవధి చర్చ. గౌరవ మంత్రిగారూ..

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు (ఖమ్మం) :- అధ్యక్షా, ఈనాడు అతి ముఖ్యమైన రాష్ట్ర రైతాంగానికి, అదే విధంగా రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే వ్యవసాయానికి సంబంధించిన రైతు భరోసాపై స్వల్ప కాలిక చర్చకి అవకాశమిచ్చిన స్పీకర్ గారికి, సభ్యులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆనాటి ప్రభుత్వం 2018-19వ సంవత్సరంలో రైతు బంధు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో మొదటగా ఒక పంటకు ఎకరానికి 4వేల రూపాయలు చొప్పున రెండు దఫాలుగా నమోదు చేసి భూయజమానులకు, అలాగే ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులందరికీ ఇచ్చారు. అదే విధంగా, 2019-20వ సంవత్సరంలో ఈ సహాయాన్ని 5వేల రూపాయలకు పెంచడం జరిగింది అధ్యక్షా.

10.10 ఉ. ఈ పథకం ధరణి పోర్టల్‌లో లభ్యమయ్యే భూమి హక్కుల రికార్డుల ఆధారంగా నిర్ణయించబడింది అధ్యక్షా. కాబట్టి, భూమి కలిగిన వారు సాగు చేసిన, చేయకపోయినా, ఈ పథకానికి అర్హులైనారు. ఈ రైతుబంధు అమలు చేసినటువంటి విధానం వ్యవసాయ శాఖకు లబ్ధిదారుల పేర్లు మార్చడం లేదా సిసిఎల్ఏ మీద అందిన భూమి విస్తీర్ణంలో మార్పు చేయడానికి అనుమతి లేదు. వ్యవసాయ శాఖ పట్టాదారుల బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించి రైతుబంధు పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తున్నది. ఆ

ప్రకారంగా, RBI యొక్క ఈ– కుబేర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా భూమి యజమాన్యం విస్తీర్ణానికి అనుగుణంగా రైతుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా ప్రయోజనాలు బదిలీ చేయబడుతున్నాయి. ప్రతి పంటకాలానికి ముందు CCLA కమిషనర్ నుండి, గిరిజన సంక్షేమశాఖ నుండి సేకరించిన పట్టాదారుల డేటా మరియు ROFR పట్టాదారుల ఆధారంగా ఈ పథకం కింద సహాయం అందించడం జరిగింది.

ఈ పథకం ప్రారంభం అయినప్పటి నుండి 12 సీజన్లకు గాను రూ.80,453.41 కోట్ల రూపాయలు రైతుబంధు కింద రైతులకు విడుదల చేయడం జరిగింది. అయితే 2023–24కి సంబంధించిన సహాయం రూ. 7,625.14 కోట్ల రూపాయలు మా ప్రభుత్వం చెల్లించింది. 2018 వరకు పంటల సర్వే రెవెన్యూ శాఖ ద్వారా జరిగేది. అందులో గ్రామం వారీగా, పంట వారీగా విస్తీర్ణాన్ని, కంటి అంచనాలతో ఉజ్జాయింపుగా చేసేవారు. 2018లో భూమి రికార్డుల డిజిటలైజేషన్ తర్వాత, పంటల సర్వే వ్యవసాయ శాఖ బాధ్యతగా మారింది. వానాకాలం 2019 నాటికి, AEOలు మొబైల్ యాప్ సహాయంతో పంటల నమోదు/సర్వే ప్రారంభించారు.

2019పంటల నమోదు ప్రారంభం నుంచి రైతు వారీగా రైతుబంధు సహాయం పొందిన విస్తీర్ణం మరియు వారు పంట వేసిన విస్తీర్ణము విశ్లేషణ చేయగా 21,283.66 కోట్ల రుపాయలు సాగు చేయని భూముల కోసం విడుదలయ్యాయని గమనించడం జరిగింది. ఏ సంవత్సరంలో ఎంత విడుదల చేయడం జరిగిందనే వివరాలు కింద టేబుల్‌లో ఇవ్వడం జరిగింది.

క్ర.సం.	సంవత్సరం	రెండు పంటకాలాలకు కలిపి చెల్లించిన రైతుబంధు మొత్తం		రెండు పంటకాలలో సాగైన మొత్తం విస్తీర్ణం	రెండు పంటకాలలో మొత్తం విస్తీర్ణం సాగుకాని	
		విస్తీర్ణం లక్షల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో	విస్తీర్ణం లక్షల ఎకరాలలో	విస్తీర్ణం లక్షల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో
1	2	3	4	5	6	7
1	2018–19	262.16	10,486.36	-	-	-
2	2019–20	210.64	10,532.02	141.71	68.93	3,446.04
3	2020–21	293.13	14,652.02	204.63	88.50	4,425.29
4	2021–22	295.47	14,772.94	212.86	82.61	4,130.69
5	2022–23	294.88	14,743.02	206.76	88.12	4,406.02
6	2023–24	305.00	15,263.05	207.49	97.51	4,875.62
	Total		80,453.41			21,283.66

దీని వల్ల రైతు భూమి సాగు చేస్తే మాత్రమే ప్రయోజనాలు ఇవ్వాలి. G.O.RT.NO 231 ప్రకారం ఈ పథకం యొక్క ముఖ్యోద్దేశం. కానీ దీనిని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, అమలులో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. అదేవిధంగా గౌరవ సభ్యుల పరిశీలనార్థం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న PMKISAN యోజన అమలు తీరుతెన్నులను అనుబంధంగా జతచేయడమైనది. ఈవిధంగా ఈ యొక్క విధివిధానాలను రూపకల్పన చేయడం కోసం ఆర్థిక మంత్రి ఆధ్వర్యంలో కేబినేట్ గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేసుకొని విధివిధానాలను సక్రమంగా గతంలో కాకుండా పకడ్బందీగా రైతులకు సాగు చేసే భూములకు ఇచ్చే పద్ధతులు ఏమైనా ఉంటే మీరు పరిశీలన చేయమని సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. దాంట్లో భాగంగానే సబ్‌కమిటీ రైతు భరోసా పథకం కోసం ప్రమాణాలు మరియు నిబంధనల కోసం అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్గాలతో, వివిధ జిల్లాలలో సమావేశాలు నిర్వహించాం. అంతేకాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల నుండి ప్రతిపాదిత పథకం గురించి అభిప్రాయాలు సేకరించాం. సహకార సంఘాలతో కూడా ప్రత్యేక సమావేశాలను నిర్వహించి అభిప్రాయాలను మరియు సూచనలను తీసుకోవడం జరిగింది. ఇప్పటికే వివిధ మార్గాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించినందున, గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు జనవరి నుండి అమలు చేయతలపెట్టినటువంటి రైతుభరోసా పథకంకు సంబంధించి గౌరవ సభలో సభ్యుల సూచనలు, సలహాలు, తీసుకొని వీటిని కూడా క్రోడీకరించుకొని భవిష్యత్తులో రైతుభరోసా యొక్క విధివిధానాలు ప్రకటించి సక్రాంతి పండుగ నుండి రైతుభరోసా ఇవ్వాలనేది ప్రభుత్వం యొక్క ఆలోచన అధ్యక్షా.

కాబట్టి దయచేసి గౌరవ సభ్యులు గతంలో జరిగినటువంటి విధివిధానాలు కూడా మీ ముందుంచాము. అక్కడ జరిగినటువంటి లోపాలు, కూడా మీ దృష్టిలో పెట్టాం. కాబట్టి రేపు రాబోయే రోజులలో నిజమైనటువంటి సాగు చేసినటువంటి రైతుకు ఏరకంగా రైతుకు ఇవ్వాలనేది మీసూచనల ద్వారా తీసుకొని తప్పకుండా సంక్రాంతి పండుగ కల్లా విధివిధానాల రూపకల్పన చేసి సంక్రాంతికి రైతుభరోసా వేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పి విజ్ఞప్తి చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వ పథకంలో ఉన్నటువంటి విధివిధానాలను కూడా మీముందు ఉంచాము. వీటన్నింటిని గమనించి మీ అమూల్యమైన సూచనలు ఇచ్చి రాష్ట్ర రైతాంగానికి సక్రమమైన మార్గంలో ఈ పథకం అమలు చేసే స్థితికి మీ సూచనలు ఉండాలని గౌరవ సభ్యులను కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ :- గౌరవ సభ్యులు హరీష్‌రావుగారు చాలా సీనియర్ సభ్యులు , పది సంవత్సరాలు మంత్రిపదవి చేశారు, 21 సంవత్సరాలు శాసనసభలో ఉన్నారు. కానీ ఎప్పుడు సభ ఆలస్యంగా ప్రారంభం కాలేదు. నేను తొమ్మిది నుండి తొమ్మిదన్నర లోపు వస్తాను. ఈ రోజు ఆలస్యం కావడానికి ఒక్కటే కారణం జీరోఅవర్ తీసుకుందామని, సభ్యులందరికి మాట్లాడే అవకాశం ఇద్దామని చిన్న చర్చ జరిగినందుకు కొద్దిగా లేట్ అయ్యిందని మీకు మరొకసారి తెలియజేస్తున్నాను.

శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి :- అధ్యక్షా, ప్రతిరోజు ఏదో ఒకటి సభను కించపరచడం స్పీకర్ పోడియంకు రావడం బాగా అలవాటైపోయింది. ఎప్పుడు స్టార్ట్‌చేశామని కాదు సభలో ఎంతసేపు ప్రజా సమస్యల గురించి చర్చించామన్నది ముఖ్యం. అతి ముఖ్యమైన బిల్లులో ఈసారి ఏ విషయంలో కూడా చర్చకు తీసుకురాలేదు, చర్చ పెట్టలేదు. వారు పెట్టిన ప్రివిలేజ్ మోషన్ కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారు భూ భారతి మీద రెండు రోజుల సమయం అడిగితే మీరు ఉదారస్వభావంతో సమయం ఇస్తే ప్రిపేరై వస్తామని ఎంతో పెద్దగా చెప్పినవాళ్లు

ఏం చేశారు అధ్యక్షా? ఒక్కసారైనా, ఒక్కనిమిషమైనా సభలో మాట్లాడారా?

ఇంకొకటి అధ్యక్షా, సమయం గురించి మాట్లాడుతున్నారు, ప్రిన్సిపుల్స్ గురించి మాట్లాడుతున్నారు, అసలు లీడర్ ఆఫ్ అపోజిషన్ ఇప్పటివరకు ఈ సభకే రాలేదు అధ్యక్షా. ఈ సభ గౌరవాన్ని తక్కువ చేస్తున్నారు, దాని గురించి కూడా మాట్లాడాలి కదా? అంటే ఏదో ఒకటి మీ మీద యాక్యుజేషన్ చేయాలి, ఈ సభ సజావుగా జరగడం లేదని , మా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సభ బ్రహ్మాండంగా జరిపినమన్నట్లు ప్రజలల్లోకి సమాచారం పోయే విధంగా ప్రతిరోజు ఏదో ఒక కుట్ర పన్నుతున్నారు. నిన్న అక్బరుద్దీన్ ఓవైసీ గారు ఎంత దారుణమైన మాట అన్నారు మొత్తం సభ ఫ్లోర్‌ను కచ్చరా చేశారు అని అన్నారు అధ్యక్షా, అంతకంటే అవమానం ఇంకొకటి ఉంటుందా అధ్యక్షా? ఒక రాజకీయ పార్టీని కచ్చరా అని మాట్లాడం అంతకంటే అవమానం ఉంటుందా అధ్యక్షా,? దాని గురించి మాట్లాడరెందుకు?

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ చింతకుంట విజయరమణారావు (పెద్దపల్లి):- అధ్యక్షా, 2018-2019 సంవత్సరంలో మరి అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకం ప్రవేశపెట్టడం జరిగింది. మరి ఆ రోజు నుండి పోయిన వర్షాకాలం వరకు అంటే మొన్నకాక అంతకుముందు వర్షాకాలం పంట వరకు 72,816 కోట్ల రూపాయలు మొత్తం ఇప్పటివరకు వెచ్చించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒకసారి రైతుభరోసా ఇవ్వడం, దానికన్నా ముందు గత ప్రభుత్వం ఇవ్వడం సాగు అయిన భూములకు ఇచ్చింది 50,210కోట్ల రూపాయలు. ఇందులో రాళ్లకు, రప్పలకు, పంటలకు, పంటలు వేయనటువంటి భూములకు, దాదాపు 22,606కోట్ల రూపాయలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పనంగా ఇవ్వడం జరిగింది. పంటలు వేసినటువంటి రైతులకే కాకుండా పంటలు వేయకున్నా, సాగు చేయకున్నా, సాగులో ఆ భూములు లేకున్నా కూడా ఆనాడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుట్టలకు, వాగులకు, వంకలకు, చెరువులలో ఉండే పట్టాభూములకు, నేషనల్ హైవేలకు, హైదరాబాద్ నగరం చుట్టూ, ఏదైతే కొత్తగా ధరణి వచ్చిన తరువాత కొత్తగా పాస్‌పుస్తకాలు, పట్టాపుస్తకాలు, సంపాదించుకొని రియల్ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వారు కూడాఈ రైతు బంధు పథకం డబ్బులు తీసుకోవడం జరిగింది.

10.20 ఉ. ఇంత పెద్ద దుర్వినియోగం జరిగి, గత ప్రభుత్వం రూ. 22,600 కోట్లు ఆనాడు వెనకాముందు చూడకుండా, ఎలాంటి చర్యలు లేకుండా ఇష్టం వచ్చినట్లు ఇవ్వడంతో ఈరోజు ప్రజాధనం దుర్వినియాగం అయింది. ఏవైతే రైతులకు చెందాల్సిన డబ్బులు పెద్ద, పెద్ద వ్యాపార వేత్తలకు, రియల్ ఎస్టేట్లకు, అలాగే ఎవరైతే పెద్ద, పెద్ద భూస్వాములున్నారో వారందరు కూడా వందల ఎకరాలు కలిగి ఉంటారు. వారందరు కూడా హైదరాబాద్‌లో ఉంటారు, వారికి గ్రామాలతో, వ్యవసాయంతో సంబంధమే ఉండదు. ఇక్కడ రియల్ ఎస్టేట్ చేసి అక్రమంగా సంపాదించుకున్నటువంటి భూములు ఏవైతే ఉన్నాయో, వాటన్నింటికీ పెద్దఎత్తున రైతుబంధు ఇవ్వడం జరిగింది.

గౌరవ వ్యవసాయ మంత్రివర్యుల ఆధ్వర్యంలో రైతు భరోసాపై షార్ట్ డిస్కషన్ పెట్టి ఈ యాసంగి పంట నుండి సంక్రాంతి తరువాత నుంచి రైతు భరోసా ఇవ్వాలని చెప్పి ప్రభుత్వం నిర్ణయించుకోవడం జరిగింది. దానికి అనుగుణంగా ఈరోజు అసెంబ్లీలో చర్చ పెట్టి, అన్ని రాజకీయ పార్టీల సభ్యుల అభిప్రాయాన్ని తీసుకొని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవాలని ప్రభుత్వం భావిస్తుంది.

మీద్వారా ప్రభుత్వానికి నేను కూడా ఒక చిన్న సూచన చేయాలని అనుకుంటున్నాను. యాసంగి పంట గానీ, వర్షాకాలం కానీ. రైతు ఏదైతే పండించినటువంటి పంటకు, ఏ రైతు అయితే పంట పండిస్తున్నాడో, ఆ రైతుకే రైతు

భరోసా ఇవ్వాలని నేను సూచన చేస్తున్నాను. ఎందుకంటే, చాలామటుకు ఎలాంటి పంట వేయకుండా గతంలో రైతుబంధు తీసుకున్నారు. అటువంటిది జరగకుండా, పక్కాగా, ప్రభుత్వానికి ఉన్న సమాచారం మేరకు. వరి పంట ఎంత ఉంది, ఇతరత్రా పంటలైన మొక్కజొన్న గానీ, పత్తి, మిర్చీ, పసుపు, సోయా కావచ్చు, ఎర్ర జొన్న కావచ్చు, రాష్ట్రంలో పండించేటువంటి వాణిజ్య పంటలు గానీ, పప్పు దినుసులు గానీ, పండ్లతోటలు గానీ, ఎటువంటి పంటలైనా కూడా క్షేత్రస్థాయిలో అధికారులతో ఒక సమగ్రమైన సర్వే చేయించుకొని ప్రభుత్వం ఒక మంచి రిపోర్ట్ తీసుకోవాలి. వానాకాలం పండేటువంటి పంట ఏది? యాసంగిలో పండేటువంటి పంట ఏది? సంవత్సరం మొత్తంగా ఆరు నెలలు, ఎనిమిది నెలలు పండేటువంటి పంట కూడా ఉంటుంది. అటువంటి పంటలు ఈ రాష్ట్రంలో ఏవేవి ఉన్నాయి? వాటికి ఎట్లెట్ల ఇస్తే బాగుంటుందని ఆలోచన చేసి ఇస్తే ప్రభుత్వ సొమ్ము రాళ్ల పాలు కాదు. వాగుల పాలు కాదు. హైవేల పాలు కాదు. అది రైతులకు చెందేటువంటి అవకాశం ఉంటుంది. కాబట్టి, దీనిమీద ఆలోచన చేసి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని తెలియజేస్తున్నాను.

అలాగే, దీంతోపాటు మీరు సన్న వడ్లు పెట్టుకోండని, సన్న వడ్లు పెడితే ప్రభుత్వం నుండి ప్రతి రైతుకు క్వింటాలుకు రూ. 500/– బోనస్ ఇస్తామని ప్రభుత్వం వర్షాకాలం పంటముందు రైతాంగానికి చెప్పంది. ఇలా చెప్పి బ్రహ్మాండంగా సన్నవడ్లకు బోనస్ ఇస్తున్న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిదని తెలియజేస్తున్నాను.

ఆనాడు, అప్పుడున్నటువంటి ప్రభుత్వం రైతులకు చెప్పింది. అప్పుడున్నటువంటి నాయకుడు, అప్పుడున్నటువంటి ముఖ్యమంత్రి గారు చెప్పారు. దొడ్డు వడ్లు వద్దు, మీరు సన్న వడ్లు పెట్టండి అని. సన్నవడ్లు పెడితే రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి ఆనాడు చెప్పి, రైతులకు బోనస్ ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వం మోసం చేసింది.

ఆనాడు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్ పార్టీ గానీ, ఇతర పార్టీల అన్ని పక్షాలు మాట్లాడితే, మాకు తెలియదానయ్యా మీరు చెప్పాలా క్వింటాలుకు వందో, రెండు వందలో బోనస్ ఇస్తాం మీరు మాకు చెప్పేదేంది అని ఆనాటి ప్రభుత్వం చెప్పింది. ఆసారి ఆ పంట ఖర్మ కాలి, ఆసారి పంటకు వైరస్ వచ్చి, పచ్చ రోగం వచ్చి, దోమపోటు వచ్చి రైతులకు పది, పన్నెండు క్వింటాళ్ల కంటే ఎక్కువగా ఆసారి సన్నవడ్లు పండనటువంటి పరిస్థితి.

ఈరోజు మన రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం. రైతులకు మాట ఇచ్చి, మీరు సన్న వడ్లు పెట్టండి. ఈ రాష్ట్రంలో ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నులున్నా కూడా దానికి రూ. 500/– బోనస్ ఇస్తామని చెప్పి బ్రహ్మాండంగా ప్రభుత్వం బోనస్ ఇస్తూ ఉంది. అదే కాకుండా, దానికంటే ముందు పోయిన వర్షాకాలం పంట గానీ, మధ్యలో యాసంగి పంట గానీ, మళ్లీ ఈసారి వర్షాకాలం యాసంగి పంట గానీ, దాదాపు మూడు పంటలు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు దళారి చేతిలో మోసపోవద్దని, రైతుకు అన్యాయం జరగవద్దని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలని చెప్పి ఆనాడు ఐకేపి కేంద్రాలను, సింగిల్ విండో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా అటువంటి కేంద్రాల్లో వడ్లు జోకిన రైతుకు గిట్టుబాటు ధర వచ్చేవిధంగా ఆనాటి ప్రభుత్వం కల్పించింది. కానీ, మధ్యలో వచ్చినటువంటి బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు రైస్ మిల్లర్లను పెట్టి పెద్దఎత్తున క్వింటాలుకు ఐదు కిలోలు, పది కిలోలు, 15 కిలోలు వడ్ల కటింగ్ పెట్టి రైతును ఇష్టానుసారంగా ముంచిందీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం.

ఇవాళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సంవత్సర కాలంలో మూడు ఫసల్లల్లా, ప్రభుత్వం వచ్చిన 2023వ సంవత్సరంలో, పోయిన యాసంగి, మొన్నటి వానాకాలం పంట. రైతులకు పారదర్శకంగా ఎక్కడకూడా వడ్ల కటింగ్ లేకుండా పంట కొంట అయిన తరువాత నలభై

ఎనిమిది గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు పడే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది, ఇవాళ రైతుకు ఈ రకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి ఒక గొప్ప చరిత్రాత్మకమైనటువంటి ఒక ఘట్టం.

ఏనాడైనా గత ప్రభుత్వం రైతులను పట్టించుకున్నటువంటి దాఖలాలు ఉన్నాయా? వడ్లకటింగ్ అవుతా ఉంటే, వడ్ల కటింగ్ గురించి మాట్లాడిన దాఖలాలున్నాయా? పోయిన యాసంగి కానీ, మొన్న వానాకాలం గానీ నలుగురు, ఐదుగురు మాజీ మంత్రులు తిరుగుతా ఉంటే నాకు ఆశ్చర్యం వేసింది. ఐకేపి సింగిల్ విండో కేంద్రాల్లోకి పోయి వడ్లు కొనడం లేదు, ఇంకా వడ్లు జోకడం లేదు, రైతులకు అన్యాయం జరుగుతోందని చెప్పి ఒకరోజు మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వం రైతులకు బోనస్ ఇవ్వడం లేదని చెప్పి పక్కకేంద్రంలోకి పోయి అక్కడ మాట్లాడుతున్నారు.

అసలు రైతుల వడ్లే జోకడం లేదని వారే చెబుతారు. రైతులకు బోనస్ ఇవ్వడం లేదని వారే చెబుతూరు. అసలు ఇది నిజమా? అది నిజమా? ఏది నిజమో ఒక్కసారి ఆలోచన చేయాలని కోరుతున్నాను. అబద్ధం ఆడినా, ఆ అబద్ధం అతికినట్లు ఉండాలి. ఇంత సత్య దూరమైనటువంటి మాటలు చెప్పి రైతులను కన్ఫ్యూస్ చేసి, రైతులను మోసం చేసినటువంటి ప్రభుత్వం, గత ప్రభుత్వం.

అయినా, ఈరోజు రైతులెవరు కూడా అధైర్యపడటం లేదు. రైతులందరికీ కూడా ఈ ప్రభుత్వంపై ఒక నమ్మకం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిమీద ఒక విశ్వాసం. మన వ్యవసాయ మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారు సుధీర్ఘమైన అనుభవం ఉన్నటువంటి వ్యక్తి. ఆయనకు గత నలభై, యాభై సంవత్సరాల నుండి వ్యవసాయం మీద అనుభవం ఉంది. వ్యవసాయానికి సంబంధించి ఈ రాష్ట్ర రైతాంగానికి ఏమి కావాలి? రైతులకు ఏమి ఇస్తే బాగుంటుంది? రైతులు ఏ పంట పెడితే బాగుంటుందని తెలిసినటువంటి వ్యక్తి ఆయన. అధ్యక్షా, అందుకే మీరు గమనించండి. ఈ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలో ఏరోజైనా, ఏ రైతుకైనా, ఏ పంటకైనా, ఏ గ్రామంలోనైనా, మీరు ఈ పంట పెట్టండి, ఈ పంట వద్దని ఈ మూడు సీజన్లలో ఏ రోజైనా ఈ ప్రభుత్వం చెప్పిందా? మీరు ఆలోచన చేయాలని కోరుతున్నాను. మీరు దొడ్లు వడ్లు పెట్టద్దు, సన్న వడ్లు పెట్టాలని. మళ్లీ సన్న వడ్లు వద్దు, దొడ్డు వడ్లు పెట్టాలని గత ప్రభుత్వం తెలియజేయడం జరిగింది. ఒకసారేమో పత్తి వద్దని, మళ్లోసారి పత్తి పెట్టండని ఇట్లా రకరకాలుగా చెప్పి రైతులను ఆనాడు గందరగోళానికి గత ప్రభుత్వం గురిచేసింది.

ఒక సామెత ఉంది అధ్యక్షా. ఎద్దు అడుగు జాడల్లోనే పంట చేయడం ఉంటుంది. రైతుకు తెలిసిన తీరు ఎవ్వరికీ తెలియదు, ఏ శాస్త్రజ్ఞుడికి తెలియదు. ఏ వ్యవసాయ భూమిలో ఏ పంట పెట్టాలని చెప్పి రైతుకు తెలిసినంతగా ఎవ్వరికీ తెలియదు. ఒడ్డు ఇవతల పంట ఒక తీరు ఉంటుంది. ఒడ్డు అవతల పంట మరో తీరు ఉంటుంది. కానీ, గత ప్రభుత్వంలో మేమే శాస్త్రజ్ఞులం, మేము చెప్పిన పంటనే మీరు వేయాలి. మా అంత గొప్పోళ్లు ఈదేశంలో ఎవరూ లేరు. మాకు తెలిసినంత ఎవరికీ తెలియదని చెప్పి చాలాసార్లు కన్ఫ్యూజ్ చేసి ఆనాటి ప్రభుత్వం రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టింది.

ఆనాడు ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ చేయాలంటే, ప్యాడీ కొనాలంటే ఆనాటి రెండు పార్టీలు, ఇక్కడున్నటువంటి బీఆర్ఎస్ పార్టీ, అక్కడున్నటువంటి బీజేపి పార్టీ వీధి రౌడీల్లాగా ఆనాడు కొట్లాడిన చరిత్రను మనం చూశాం. ఒకసారి పంట వేయవద్దు, మేము కొనమని చెప్పారు. మాకు సంబంధం లేదని కేంద్రం చెప్పింది. ఇట్లా రకరకాలుగా ఇబ్బంది పెట్టి రైతు బంధు ఇస్తున్నాం, ఇదే సర్వరోగ నివారిణి అని చెప్పి ఆనాడు పంట నష్టపోతే పంటకు నష్టపరిహారం ఇచ్చినటువంటి దాఖలాలు లేవు.

ఇవాళ్ల ఈ రైతు ప్రభుత్వం వచ్చిన తరువాత. ఎక్కడ పంట పాడైనా, ఎక్కడ అకాల వర్షాలు వచ్చినా, ఎక్కడ రైతు నష్టపోయినా ఆ రైతుకు నష్ట పరిహారం ఇచ్చేటువంటి ఏర్పాటును ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. ఈ

ప్రభుత్వం రైతులకు గొప్ప, గొప్ప కార్యక్రమాలు చేస్తోంది. రైతు బీమా విషయంలో కూడా, రైతు బీమాకు కూడా ఈ పంట నుండే ప్రభుత్వం పెద్ద ఎత్తున డబ్బులు కడుతుంది. ఇలా పంట బీమా గానీ, రైతు బీమా గానీ వీటన్నింటిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొని చేయబోతా ఉంది.

10.30 ఉ. మరి గతంలో ఏన్నడూ లేనివిధంగా మొన్న బడ్జెట్ నుండి ఇప్పటి వరకు సంవత్సర కాలంలో దాదాపు రూ.54 వేల కోట్లు ఇవాళ రైతు కోసం ప్రభుత్వం ఖర్చుపెట్టింది. అదే కాకుండా, మీరు గత రుణమాఫీని గమనిస్తే, ఆనాడు పదేళ్ళు ఈ రాష్ట్రంలో రైతు రుణమాఫీ జరిగింది. 2014 నుంచి 2018 వరకు, 2018 నుంచి 2023 వరకు. ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ ఒక్క రైతుకైనా రైతు రుణమాఫీ జరిగి, గత పదేళ్ళలో ఏనాడైనా, ఏ రైతైనా మళ్ళీ ఆ బ్యాంకు నుండి తిరిగి రుణం తీసుకున్నారా అనడుగుతున్నాను. ఒకసారి గమనిస్తే, దాన్ని కూడా... అసలు రైతు రుణమాఫీనే ఎక్కడా జరగలేదు అనేవిధంగా వారొక విషప్రచారం చేసే ప్రయత్నం చేశారు. ఇవాళ రూ.21 వేల కోట్లతో, కొంత అటూ ఇటుగా దాదాపు 25 లక్షలమంది రైతుల అకౌంట్లలో రుణమాఫీ డబ్బులు పడ్డాయి. రైతు రుణమాఫీ డబ్బులు పడడమే కాకుండా, మీరు ఎక్కడికైనా వెళ్ళండి, ఏ గ్రామానికైనా వెళ్ళండి, ఏ మండలానికైనా వెళ్ళండి, ఏ రైతునైనా అడగండి... దాదాపు 70 శాతం మంది రైతులకు ఇవాళ రైతు రుణమాఫీ జరిగింది. ఆ ప్రభుత్వం లాగా రైతులను మోసం చేయాలనో, రైతు రుణమాఫీ చేయాలని రైతులను మభ్యపెట్టాలని చూసే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేదు. ఖచ్చితంగా రుణమాఫీ జరుగుతుంది.

ఇవాళ రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, మిగతా రైతులకు చేయదని అనుకోవడానికి అవకాశం లేదు. దాదాపుగా 4 లక్షల పైచిలుకున్నటువంటి అకౌంట్లు ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డీఫాల్టర్‌గా ఉన్నాయి. మనం వాళ్ళకి ఏమి చేసినా, రైతు రుణమాఫీ జరగదు. మొన్న కూడా దాదాపుగా 5 లక్షలకు పైగా ఎవరైతే ఉన్నటువంటి రైతులున్నారో, వైట్ రేషన్ కార్డులు లేని వారున్నారో, ఆధార్ కార్డు నెంబరు తప్పు పడిన వాళ్ళు, దాంతోపాటు అకౌంట్ నెంబర్లు తప్పుపడినటువంటి వాళ్ళెవరైతే ఉన్నారో, 5 లక్షలకు పైగా అకౌంట్లు ఏవైతే ఉన్నాయో, మరి, తుమ్మల నాగేశ్వర రావు గారి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు, గ్రామగ్రామాన ఇంటింటికీ గ్రామ పంచాయతీ అధికారి ఉండి, మీటింగు పెట్టి, వాళ్ళని పిలిచి మాట్లాడితే, ఇవాళ దగ్గర దగ్గర 3 లక్షల అకౌంట్లు క్లియరైపోయినాయి. మిగతా 2 లక్షల చిల్లర అకౌంట్లు మండల కేంద్ర కార్యాలయంలో కూర్చొని పిలిచినా, జిల్లా కేంద్రంలో కూర్చొని పిలిచినా, నియోజకవర్గ కేంద్రంలో కూర్చొని పిలిచినా వాళ్ళెక్కడా దొరకలేదు. దగ్గర దగ్గర అవి నాలుగున్నర లక్షలు, ఇవొక రెండున్నర లక్షలు... అంటే, 6 లక్షల పైచిలుకున్న అకౌంట్లు ఎక్కడా కూడా దొరికే పరిస్థితి లేదు. అంటే, ఇన్ని జరిగినా, ఇంత బ్రహ్మాండంగా ప్రభుత్వం లెక్కలతో సహా చెప్పినా, దాన్ని కూడా మీరు అబద్ధం చేసే ప్రయత్నం చేశారు. ఇవాళ మీరు ఎంత అబద్ధం చెప్పే ప్రయత్నం చేశారంటే, అసలు ఈ రాష్ట్రంలో రూణమాఫే జరగలేదనే విధంగా చెప్పే ప్రయత్నం చేశారు. ఇవాళ మీకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, ఇవాళ బీఆర్ఎస్ గానీ, బీజేపీ గానీ, మిగతా పార్టీలు గానీ.. ఎవరైనా రండి. నా నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామ పంచాయతీలలో నేనే తీసుకుపోయి తిప్పుతా. ఇవాళ దగ్గర దగ్గర 72 శాతం రైతుల రుణమాఫీ నా నియోజకవర్గంలో జరిగింది. ఇవాళ రైతుకు బ్రహ్మాండంగా బోనస్ పడింది. గతంలో మోసం చేసినట్లు మా ప్రభుత్వం రైతులను మోసం చేయలేదు. బరాబర్ ఇస్తమని చెప్పి, మాట తప్పకుండా, మడమ తిప్పకుండా రైతుకు బోనస్ ఇచ్చినటువంటి గొప్ప ప్రభుత్వం ఈ దేశంలో, కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పటి వరకు ఈ దేశంలో ఎక్కడా కూడా బోనస్ ఇచ్చినటువంటి దాఖలాలు లేవు. అంత గొప్ప ప్రభుత్వం, మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.

ఈరోజు మీరొక ప్రధాన ప్రతిపక్షంగా.... మీరు పదేళ్ళు అధికారంలో ఉన్నారు, మీకు అనుభవముంది, కాబట్టి, మీరొక మంచి సూచన ఇవ్వండి. ఇంకా ఏరకంగా మంచి నిర్ణయాలు తీసుకొని రైతులకు ఇంకా మంచి చేసేటువంటి కార్యక్రమాలుంటే చెప్పండి. కానీ, మీరు వట్టిగనే కల్లాల కాడకు పోయి, సెంటర్ల కాడకు పోయి, కుప్పలకాడికి పోయి నిల్చొని వట్టిగనే... ఇవాళ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ అయిపోయింది. దాదాపు 90 శాతం ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ ఈ రాష్ట్రంలో జరిగిపోయింది. మీలాగా, వర్షం పడితే వడ్లు నల్లబడతెనో, వడ్లు మొలకెత్తితేనో, వడ్లు ముక్కబడితెనో కొనకుండా లేదు ఈ ప్రభుత్వం. మీరు ఆనాడు రైస్ మిల్లర్లను విచ్చలవిడిగా విడిచిపెట్టిపోతే ఇవాళ రూ.10 వేల కోట్లు బకాయిలంటే కూడా మా ప్రభుత్వం, మా ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు సరిచేసిన్రు. ఇంత బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. ఆనాడు రైస్ మిల్లర్లను యథేచ్ఛగా విడిచిపెడితే, ఎవరి ఇష్టానుసారంగా వాళ్ళు ప్రవర్తించారు. అంటే, రైతు బంధు ఇస్తున్నాం, అదే సర్వరోగ నివారిణి. దాంతోనే మొత్తం జరిగిపోతదనే విధంగా ఆరోజు మీ మాటలు, మీ తీరు... ఆరోజు మీరు వ్యవహరించారు.

ఇవాళ ఈ రాష్ట్రంలో మంచి వర్షాలు పడ్డాయి. మీకేమీ ఇబ్బంది లేదు. ఏ రైతుకీ ఇబ్బంది లేదు. మొన్న వర్షాకాలంలో బ్రహ్మాండంగా పంటలు పండినయి. ఇవాళ బ్రహ్మాండమైన పంటలు పండించుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. కాబట్టి, ఇవాళ మా అధ్యక్షుని ద్వారా మీ అందరికీ ఒక విజ్ఞప్తి, ఇవాళ వట్టిగనే ప్రాజెక్టులలో నీళ్ళు లేని టైమ్‌లో పోయి, ప్రాజెక్టుల కాడ నిలబడి నీళ్ళు లేవంటే, వర్షం పడితే నీళ్ళుంటాయి. ఆరోజు ప్రభుత్వంలో మీరున్నప్పుడే వర్షాలు పడలేదు. కానీ, ఏదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వచ్చినంక, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక వర్షాలు పడలేదన్నట్లు మీరు ఆనాడు ఊరుకులాడిన్రు. ఊరుకురికి లేచి పడ్డారు. మరి అట్లనే ఎండిపోయిన డ్యామ్‌ల కాడికి పోయి, నీళ్ళు లేకుంటే, ఏందయ్యా నీళ్ళియ్యకపోతివే అని మాట్లాడిన్రు. ఎప్పుడైనా కూడా ఆ ఎస్సారెస్పీ కావచ్చు, ఎల్ఎమ్‌డి కావచ్చు, మిడ్‌మానేరు కావచ్చు, ఎల్లంపల్లి కావచ్చు, ఏ ప్రాజెక్టు అయినా, జూలై తరువాత ఆగష్టు ఎండింగ్ వరకే నీళ్ళు వచ్చేటువంటి అవకాశముంటుంది. ఇవాళ ఇది కొత్త కాదు. ఇవాళ ఎస్సారెస్పీ ప్రాజెక్టు కట్టి, 40, 45 ఏళ్ళవుతోంది. అంటే, దాన్ని కూడా మీరు విషప్రచారం చేసే ప్రయత్నం చేశారు. అధ్యక్షా, నాకీ అవకాశమిచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ :- గౌరవ సభ్యులు కేటీఆర్ గారూ...

శ్రీ కె. తారక రామారావు (సిరిసిల్ల) :- అధ్యక్షా, అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇది అతిముఖ్యమైన సమస్య. రాష్ట్రంలోని లక్షలాది రైతు కుటుంబాలకు సంబంధించిన సమస్య. కాబట్టి, సవివరంగా చర్చకు అనుమతివ్వాలని మిమ్మల్ని నేను కోరుతున్నాను.

ఎందుకంటే, ఈ రైతుబంధు పథకాన్ని కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన తరువాత, ఇప్పుడే గౌరవ మంత్రిగారు చెప్పారు. మంత్రిగారు కూడా స్వయంగా రైతు, మాకు ఆత్మీయ మిత్రులు. వారు స్వయంగా వారి గ్రామంలో వ్యవసాయం చేసే రైతు.

ఇంత ముఖ్యమైన సమస్యకు సంబంధించి దయచేసి, సావధానంగా వినాలని, సాకల్యంగా మాకు చెప్పాలని గౌరవ మంత్రిగారిని, ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాం. మేమేదైనా నిర్మాణాత్మక సూచనలు చేసినా, మేము కొద్దిగా విమర్శనాత్మకంగా మాట్లాడినా అది రైతులను వారి ప్రయోజనాలకు కాపాడడానికే తప్ప, మీమీద దుమ్మెత్తిపోయడానికో, ఇంకోటో కాదు. దయచేసి మంత్రి గారూ, సద్విమర్శగానే తీసుకోండి. నిర్మాణాత్మకంగా తీసుకోండి. ఇంకా ఎన్నికలకు నాలుగేళ్ళ సమయం ఉంది కాబట్టి, ఇప్పటికిప్పుడు మనమిక్కడ బలప్రదర్శన చేసి కూడా లాభం లేదనేమాట కూడా వారికి చెప్తూ...

అధ్యక్షా, ముందుగా నేను మంత్రి గారిని ఒక విషయంలో, ఒక వాస్తవం చెప్పినందుకు అభినందిస్తున్నాను. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. దాదాపు 73 వేల కోట్ల రూపాయలు గత ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాల్లో జమ అయినాయి. మా ప్రభుత్వం ఇచ్చిన తరువాత ఒక్క దఫా మాత్రమే డబ్బులిచ్చాము, రూ.7600 కోట్లు. రెండు పంటలకుగాను ఒక్కసారే ఇచ్చాము, వానాకాలం ఇవ్వలేదు.., అని చెబుతూ, రూ.80 వేల కోట్లు ఎట్లెట్లా ఇచ్చామో చెప్పారు. అందులోనే గౌరవ మంత్రి గారు ఒక్క మాట చెప్పారు, ఏదో దుర్వినియోగం జరిగిపోయింది, రూ.21,283 కోట్ల దుర్వినియోగం జరిగిందన్నట్టుగా వారొక ఖాతా ఇచ్చారు.

మంత్రి గారూ, మేము కోరుతున్నాం, మీరిచ్చినదానిలో రెండవ పేజీని దయచేసి ఒకసారి చూడండి. అందులో... మీరిచ్చిన దానిలోనే ఏమి రాశారు? రెండు పంట కాలాలలో సాగైన మొత్తం విస్తీర్ణం, 2019-20కి 141 లక్షల ఎకరాలు, 2020-21కి 204 లక్షల ఎకరాలు..., అధ్యక్షా, అంటే, మీరు గమనిస్తే, సాగు చేసినా, చేయకపోయినా రైతుబంధు డబ్బులు ఇవ్వడం వల్లనే 141 లక్షల ఎకరాల నుంచి 204 లక్షల ఎకరాలకు పెరిగింది, తరువాత 212 లక్షల ఎకరాలకు పెరిగింది, ఆ తరువాత మళ్ళీ 206... అంటే, 2 కోట్ల 6 లక్షల ఎకరాలకు పెరగడానికి కారణం..., గౌరవ మంత్రి గారూ మేము సాగు విస్తీర్ణం పెరగాలనే ఉద్దేశంతో ఇచ్చినాం కాబట్టే విస్తీర్ణం పెరిగిందనేమాట మీరిచ్చిన లెక్కల్లోనే ఉన్నది.

అట్లాగే, మంత్రి గారూ, మేమొక రెండు మూడు విషయాలు చెప్పాలి. నేను మాట్లాడిన తరువాత మీ ఇష్టమున్నంత సేపు చెప్పండి. ముందుగా నేను ఈ ప్రశ్నలడిగి తరువాత సబ్జెక్టులోకి పోతాను. ఎందుకంటే, వారిచ్చిన నోట్ ఇప్పుడే అందింది మాకు. ఇప్పుడే అందిన నోట్‌లో లేవనెత్తిన..., మాకున్న సందేహాలు, మాకున్న అనుమానాలు ముందే చెప్తాం. మంత్రి గారు ఆర్.ఓ.ఎఫ్.ఆర్. గురించి ప్రస్తావించారు.

అధ్యక్షా, గౌరవ పెద్దలు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో ఆనాడు ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం క్రింద నాలుగున్నర లక్షల మంది గిరిజన బిడ్డలకు పోడు పట్టాలిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది, ఆ ఘనత కేసీఆర్ గారి నాయకత్వానిది. ఇక్కడ చాలా మంది గిరిజన శాసనసభ్యులు కూడా ఉన్నారు, చాలామంది గిరిజన ప్రజలుండే నియోజకవర్గాల నుండి వచ్చిన మిత్రులు, శాసనసభ్యులు కూడా ఉన్నారు. ఈ ఆర్.ఓ.ఎఫ్.ఆర్. పట్టాలు గిరిజనుల చేతిలో ఏవైతే ఉంటాయో అక్కడ కూకట్టం మీద ఒక్క పంట మాత్రమే సాగు చేసే అవకాశం ఉంటుంది. ఎందుకంటే, అక్కడ కాలువలు ఉండొచ్చు, ఉండకపోవచ్చు. అక్కడ ఇతర సమస్యలుండొచ్చు. మేజర్ కాలువలు ఉండకపోవచ్చు.

10.40 ఉ. కాబట్టి కట్టం మీద అక్కడ పండేది ఒక పంట. అది కూడా చాలా కట్టంతో వారు చేసుకుంటారు, ఆ రెండు నెలలు వాళ్ళు తనకలాడుతారు. ఇప్పుడు మంత్రిగారు చెప్పిన లెక్కల ప్రకారం ఈ గిరిజన బిడ్డలు ఎవరికైతే మేము గతంలో పోడు భూముల పట్టాలిచ్చామో, ఎవరికైతే మేము నాలుగు లక్షల ఎకరాలు పట్టా ఇచ్చామో, వారికి రెండవ విడత రైతు బంధు ఇవ్వరా? నేను గిరిజనుల తరఫున అడుగుతున్నాను, సమాధానం చెప్పాలి.

అదే విధంగా మంత్రిగారికి తెలుసు, వారు స్వయంగా రైతు, పత్తి, కంది ...తెలంగాణలో పత్తి దాదాపు 45 లక్షల ఎకరాలలో పండుతుంది. పత్తి 8 నెలల పంట, తరువాత రెండవ పంటకి అవకాశం కూడా ఉండదు. మంత్రిగారు చెప్పిన లెక్కల ప్రకారం 45 లక్షల ఎకరాలు సాగు చేసే పత్తి రైతులకు, ఒకటే పంటకి రైతు బంధు ఇస్తామన్నట్లున్నది, మరి ఒక పంటకి ఇస్తారా? రెండు పంటలకు ఇస్తారా మంత్రివర్యులు మా సందేహం నివృత్తి చేయాలి. కంది కూడా సేమ్. వికారాబాద్ జిల్లాలో కూడా కంది విస్తృతంగా పండిస్తారు. అది కూడా 7-8 నెలలు..

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- మీరు ఇంకో రకంగా వెళ్ళొద్దు. మేమేమి చెప్పలేదు. కేవలం గత ప్రభుత్వంలో జరిగిన విధివిధానాలే మేము సభ ముందు ఉంచాం. మీరేది చెబితే దానిని అమలు చేయాలనే ఆలోచనే తప్పితే, ఆ పంటకింతిస్తారా? దీనికెంతిస్తారు? ఇవన్నీ మేము నిర్ణయమే చేయలేదు. మీ సూచనల తరువాతే నిర్ణయించబడుతుంది. రైతు భరోసా మీద ఈ ప్రభుత్వం నిర్ణయించలేదు. మా నిర్ణయాలందులో ఏమీ లేవు కాబట్టి, మా మీద దేనిని మీరు రుద్దొద్దని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఏమి చేయాలో, ఎలా చేయాలో, పత్తికి ఏమి చేయాలో మీరు చెప్పండి, దాని ప్రకారం ప్రభుత్వం భవిషత్తులో నిర్ణయిస్తుంది.

శ్రీ కె. తారక రామారావు :- ఒకవేళ కోసే ప్రయత్నమే చేయకపోతే, రైతు బంధు పథకానికి కోతలు పెట్టే ఉద్దేశ్యం లేకపోతే.., వారు పి.యం. కిసాన్ గురించి చెప్పరు. పి.యం. కిసాన్ లెక్కలు నా దగ్గరున్నాయి. పి.యం. కిసాన్ ప్రామాణికంగా తీసుకుంటే దాదాపు 25 శాతం రైతులకే వర్తిస్తుంది. పి.యం. కిసాన్ పథకమే మీకు మార్గదర్శకమైతే. మంత్రిగారు స్టేట్‌మెంట్‌లోనే పి.యం. కిసాన్ గురించి చెప్పినారు కాబట్టి..

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- సభ్యులకు అవగాహన కోసం చెప్పాము. ఇవ్వమంటే ఇస్తాం, వద్దంటే మీ ఇష్టం అంటున్నాను. కోతలు విధిస్తామని మేమందులో చెప్పామా?

శ్రీ కె. తారకరామారావు :- ఉన్నదున్నట్లు ఇచ్చేటందుకు చర్చ ఎందుకు? యధాతథంగా ఇచ్చేందుకు చర్చ ఎందుకో మాకు అర్థం కాలేదు. రైతు బంధు ఉన్నదున్నట్లు ఇస్తే, కోతలు పెట్టం అనుకుంటే చర్చ ఎందుకు ఇంక? యధాతథంగా ఇవొచ్చు.

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- ప్రజాభిప్రాయం ప్రకారంగా, మీ అభిప్రాయం ప్రకారంగా విధివిధానాలు నిర్మించబడుతాయి. యధావిధిగా ఇవ్వమని చెబితే చెప్పండి. మేము అభ్యంతరం చెప్పట్లేదు.

శ్రీ కె. తారక రామారావు :- మంత్రిగారి స్టేట్‌మెంట్ గురించి ఇంకా రెండు అనుమానాలు. ముందు అవి చెబుతాను, తరువాత నా సబ్జెక్ట్‌లోకి వస్తాను. స్టేట్‌మెంట్‌లో వారు చెప్పారు... పత్తి 8 నెలల పంట, కంది 8 నెలల పంట, మరి ఒక పంటకిస్తారా, రెండు పంటలకిస్తారా మంత్రిగారు తమరి సమాధానంలో ప్రభుత్వ విధానం ఏమిటో చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయం చెప్పాలి కదా? లేకపోతే చర్చ ఎందుకు? టైం పాస్‌కైతే చర్చ చేయం కదా?

అదే విధంగా మంత్రిగారిది స్వయంగా ఖమ్మం జిల్లా... కొత్తగూడెం, భద్రాద్రి జిల్లాలో వారి సొంత ఊరుంటది. అక్కడ పామాయిల్ పంటను విపరీతంగా గత ప్రభుత్వం కూడా ప్రోత్సహించింది. పామాయిల్‌గానీ, మామిడి తోటలు గానీ, హార్టీకల్చర్‌గానీ...హార్టీకల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా? ఇవ్వరా? పామాయిల్ వేసిన రైతుకి ఇంటర్ క్రాపింగ్ చేయకపోతే రైతు బంధు ఇవ్వరా?

హైదరాబాదు చుట్టు ప్రక్కల ప్రాంతంలో రంగారెడ్డి జిల్లా గానీ, వికారాబాద్ ప్రాంతంలో మూడు పంటలు వేసే రైతులు కూడా ఉన్నారు. రెండు పంటలు సాగు చేసిన వారికి రైతు బంధు ఇస్తామని మంత్రిగారు చెబుతున్నారు. మరి రేపు మూడు పంటలు సాగు చేస్తే మూడు పంటలకు ఇస్తారా? ఎందుకంటే, రైతులు కూడా తెలివైన వాళ్ళు. సాగు చేస్తేనే ఇస్తాం, పంటలు వేస్తేనే ఇస్తామంటే రైతులు మూడు పంటలైనా సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే చేస్తున్నారు. ముఖ్యమంత్రిగారు కూడా గతంలో ప్రతిపక్ష నాయకుడిగా రెండు పంటలకెందుకు ఇస్తారు, మూడవ పంటకెందుకు ఇవ్వరు, బరాబరు ఇవ్వాల్సిందే అని మాట్లాడారు. కాబట్టి, అది కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

నాకు ఆప్పుడు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుగారు..2009లో ఇద్దరం మొదటిసారి ఎమ్మెల్యేలైనాం. ఆయన మాటలు వింటే నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు. ఎందుకంటే, గతంలో మేమేదో మొత్తం నాశనం చేసిపోయాం, మా ప్రభుత్వం ఉన్నప్పుడు

వర్షాలే పడలేదు అనడం.. మరి మా ప్రభుత్వం ఉన్నప్పుడు వర్షాలే పడకపోతే దిగుబడి ఎట్లా పెరిగింది? వ్యవసాయం విస్తీర్ణం ఎలా పెరిగింది? ఇంకా విచిత్రమైన విషయం.. రేవంత్ రెడ్డిగారిక్కడ కూర్చొని ఇచ్చిన స్పీచ్. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి ఏమిటి? కరెంటు పరిస్థితి ఏంది, నీళ్ళ పరిస్థితి ఏమిటని రేవంత్ రెడ్డిగారిక్కడ నిలుచోని ఇచ్చిన స్పీచ్ అధ్యక్షా. వారి తండ్రిగారు చనిపోతే నెత్తి మీద నీళ్ళు చల్లుకుందామంటే కూడా కరెంటు లేదు, మా బోరు పని చేస్తలేదని చెప్పి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు ఇక్కడి నుంచి చెప్పిన మాట ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో రైతుల దుస్థితికి నిదర్శనమనే మాట నేను మీకు గుర్తు చేస్తున్నాను. దానిని చదివితే మళ్ళీ కాంట్రవర్సీ చేస్తారు, ఇంకొకటంటారు.

అధ్యక్షా, వాస్తవం తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడింది. 2014కు ముందు నేను ఒక్కరినీ నిందించడం లేదు, ఆనాడు వెంకట్‌రెడ్డిగారినో, ఇంకొకరినో నిందించట్లేదు. కేవలం ఆనాటి పరిస్థితులు మాత్రం చెప్పే ప్రయత్నం చేస్తా ఉన్నాను. ఉమ్మడి రాష్ట్రంలో ఎద్దు ఏడ్చింది, తప్పకుండా వ్యవసాయం ఏడ్చింది. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుండదంటారు. నిజంగా ఆనాడు చాలా దారుణమైన పరిస్థితి ఉండేది. సాగు సంక్షోభంలో మునిగింది, అన్నదాత వెన్ను విరిగిందన్న మాట వాస్తవం. దానికి నా దగ్గర NCRB లెక్కలతో సహా ఉన్నాయి (కాగితం చూపుతూ). ఆరోజు భారతదేశంలో జరిగే రైతు ఆత్మహత్యల్లో ఆనాడు తెలంగాణ ప్రాంతం, అదే విధంగా మహారాష్ట్రలోని విదర్భ ఈ రెండు ప్రాంతాలే టాప్. తెలంగాణ ఏర్పడ్డనాడు భారతదేశంలో రైతు ఆత్మహత్యల్లో 11.01 శాతం ఆత్మహత్యలు మన రాష్ట్రం నుంచి జరిగేది. ఈరోజు నేను గర్వంగా చెబుతున్నాను. మీరు మాకు అప్పజెప్పిన నాడు రైతుల ఆత్మహత్యలు 11.01 శాతముంటే మేము మీకు ప్రభుత్వాన్ని అప్పజెప్పిన నాడు భారతదేశంలోనే అత్యల్పంగా 01.5 శాతం రైతుల ఆత్మహత్యలతో మీకు అప్పజెప్పినాం. రైతుల ఆత్మహత్యలు తగ్గించినాం అనే మాట గర్వంగా చెబుతా ఉన్నాను. దానికి కూడా ప్రామాణికం. రేవంత్ రెడ్డిగారు ఆనాడు పార్లమెంటు సభ్యునిగా పార్లమెంటులో రేవంత్ రెడ్డిగారడిగిన ప్రశ్న.. చదువమంటే చదువుతాను.. అధ్యక్షా.. (కాగితం చూపుతూ). ఆనాడు మాల్కాజ్‌గిరి ఎం.పి.గారు అడిగారు కేంద్ర వ్యవసాయ శాఖను తెలంగాణలో రైతు ఆత్మహత్యల గురించి చెప్పండని, చెబితే మొత్తం సావధానంగా లెక్కలు చెప్పి కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాట 2014లో 898 ఉంటే, ఆ తరువాత తగ్గుకుంటూ, తగ్గుకుంటూ 2020 సంవత్సరానికి వచ్చేసరికి 466కు తగ్గింది, దానితో బాటు తెలంగాణ అత్యల్ప రైతు ఆత్మహత్యలు నమోదవుతున్న రాష్ట్రమని చెప్పి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే ఆనాడు ఎం.పి.గా కేంద్ర ప్రభుత్వమే వివరణ ఇచ్చింది.

దానితోబాటు ఎట్లెట్ల సాగు విస్తీర్ణం పెరిగింది, రైతు ఆత్మహత్యలు ఎట్లెట్ల తగ్గినాయో ఆ ఆర్.బి.ఐ. లెక్కలు గౌరవ సభ్యులకు మీ ద్వారా పంపుతాను, దయచేసి వారికివ్వాలని నేను కోరుతున్నాను (సంబంధిత వివరాలు సభకు అందచేశారు). ఆరోజు పరిస్థితి ఏమిటంటే, నెర్రెలు వారిన నేలలు, ఎండిపోయిన చెరువులు, చిన్న నీటి వనరులను పట్టించుకోలేదు. కరవు, కన్నీళ్ళు, అప్పులు, ఆత్మహత్యలు ఇది వాస్తవం. తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టులు లేవు, సాగు నీరు లేదు. బొక్కబోర్లపడే పరిస్థితి. నల్లగొండ నియోజకవర్గం మూసంపల్లిలో రాంరెడ్డిగారని ఒక రైతు ఉంటాడు ఆయనొక్కడే 55 బోర్లు వేసిండు, ఆయన పేరే ఊర్లో బోర్లరాంరెడ్డి అయింది. అట్లా కరెంటు కోతలొకవైపు, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు మరొకవైపు. అర్ధరాత్రి వచ్చే కరెంటు కోసం, ఆనాడు కరెంటు పెట్టపోయి షాకులు తగిలి చచ్చిపోయిన రైతుల లెక్క దీస్తే చేంతాడంత ఉంటది. పోలీస్ స్టేషన్లల్లో విత్తనాలు, ఎరువులు పంచుడు, బయట పెడితే చెప్పులు

లైన్‌లో పెట్టుకుని నిల్చునే పరిస్థితి. చెప్పరాని తిప్పలతో ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతన్న గోస పడ్డాడు.

ఈరోజు మన ఎమ్మెల్సీ గోరటి వెంకన్నగారు ప్రజాకవి. వాళ్ళ మాటల్లో చెప్పాలంటే సేతానమేడుందిరా తెలంగాణ సేళ్ళన్నీ బీళ్లాయరా.. అని ప్రజాకవి రైతు ఆవేదనను రైతు బిడ్డగా చెప్పే పరిస్థితి చూశాం. చేను గట్ల మీద స్వయంగా ఆత్మహత్యలు మనం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చూశాం. ఆనాడు ఆత్మహత్యలకే కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన పరిస్థితి .. మా విప్‌గారు లేశారు, వారికి కూడా నేను గుర్తు చేస్తున్నాను. మా సిరిసిల్ల జిల్లాలో వెంకటాపూర్ అనే గ్రామముంటది. ఆ గ్రామంలో ములిగె ఎల్లయ్య అని దళిత రైతు, ఎరువుల కోసం లైన్లో నిలబడి, నిలబడి అక్కడనే మూర్ఛ వచ్చి , కుప్పకూలి 2012-2013 సంవత్సరంలో చచ్చిపోతే ఆనాడు మంత్రిగా శ్రీధర్‌బాబుగారు, ఎమ్మెల్యేగా నేను కలిసి పోయాము. ఆ కుటుంబంలో విశ్వాసం నింపే ప్రయత్నం చేశాం. నేను వివరాలు చేస్తలేను అధ్యక్షా. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు పరిస్థితి చెబుతున్నాను తప్ప ఇంకొకటి చెబుతలేను. ఆనాటి పరిస్థితి ఒక్క మాటలో చెప్పాలంటే ..

(ఈ సందర్భంలో ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ గారు మైక్ ఇవ్వమని కోరారు)

I am not yielding. మంత్రిగారిని చెప్పమనండి. అది పద్ధతి. నేనేమీ విమర్శ చేస్తలేను. గోరటి వెంకన్నగారి పాట .. కాంగ్రెస్ పార్టీ ఆనాడు 2004లో అధికారంలోకి రావడానికి ఆలంబనగా మారింది. పల్లె కనీళ్ళు పెడుతోంది అంటూ ఆనాడు రాజశేఖర్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్రం మొత్తం ఆ పాట హోరెత్తింది, ultimateగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇది వాస్తవం. నేను చెప్పేదేదీ అవాస్తవం కాదు. తెలంగాణ పల్లె ఆనాడు కన్నీరు పెడుతోంది అంటూ మనం పాటలు పాడుకున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నాం. అట్లాంటి..

శ్రీ ఆది శ్రీనివాస్ :- అధ్యక్షా, ఈరోజు రైతు భరోసా పైన short discussionలో జరుగుతున్నటువంటి అంశంలో గౌరవ వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గారిచ్చినటువంటి సందర్భం, ఆ అంశంపైన చర్చ జరిపే విషయంలో మా విజయ రమణాగారు కూడా ఆ అంశంపై చర్చించారు. వారు నెర్ర బారిన నేల అని చెప్పి తెలంగాణ రాకముందు ఉన్న చరిత్ర గురించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు, అది కరెక్టు కాదు. తెలంగాణ తెచ్చుకున్నదే అందుకు. తెలంగాణ వచ్చిన తరువాత జరిగిన అంశం చెప్పడంలో తప్పులేదు కానీ గతంలో కరెంటు అంశం, ఆనాడు సమైక్యాంధ్రలో తెలంగాణకు అన్యాయం జరిగిందనే కదా తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నది. తెలంగాణ వచ్చిన తరువాత జరిగిన అంశం, ఆ అంశంపై మరొకసారి చర్చ పెట్టుకుందాం. కానీ ఈరోజు కేవలం రైతు భరోసా పైన వారిచ్చే సూచనలు, సలహాలందివ్వాలని కోరుతున్నాను. మీరు కూడా ఆ అంశంపైనే వారిని పర్మిట్ చేసే ప్రయత్నం చేయండి. కేటీఆర్‌గారంటే మాకు వ్యక్తిగతంగా ఉద్దేశ్యం ఏమీ లేదు, వారిచ్చిన సూచనలు, సలహాలు తీసుకుంటామని మా వ్యవసాయశాఖామాత్యులు కూడా చెప్పారు. ఇప్పటికే ఈరోజు రైతు భరోసాపైన గౌరవనీయులు డెప్యూటీ సి.యం. భట్టి విక్రమార్కగారి ఆధ్వర్యంలో కమిటీ వేశాం. పది జిల్లాల్లో రైతులందరి సలహాలు, సూచనలు తీసుకున్నాం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు క్లియర్‌గా చెప్పారు, అసెంబ్లీలో రైతు భరోసాపై చర్చ జరిగిన తరువాత విధివిధానాలన్నీ కూడా మేము అవలంభిస్తామని చెప్పారు.

10.50 ఉ. అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారు చాలా స్పష్టంగా చెప్పారు. అసెంబ్లీలో రైతు భరోసాపై చర్చ జరిగిన తరువాత, ఈ రైతు భరోసాకి సంబంధించిన విధివిధానాలను అవలంభిస్తామని క్లియర్‌గా చెప్పడం జరిగింది. వాళ్ల లాగే వాగులు, వంకలు, కొండలు, కోనలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, నేషనల్ హైవేలకు ఇవ్వాలని వాళ్లు సూచనలు చేస్తారా అధ్యక్షా? అలాంటివి

కాకుండా, రైతుకి ఏ విధంగా చేస్తే వారికి ఉపయోగకరంగా, ప్రయోజనకరంగా ఉంటుందో వాళ్లని సూచన చెయ్యమంటున్నాము. వారు కిందిది మీదికి, మీదిది కిందికి పెట్టి, మీరు పత్తి పంట ఒక్కదానికే ఇస్తారా, పామాయిల్ ఒక్కదానికే ఇస్తారా అంటూ, కావాలని రైతులకి లేని అనుమానాలు సృష్టిస్తున్నారు అధ్యక్షా. ఈ రోజు సభలో సూచనలు, సలహాలు తీసుకున్న తరువాతనే ఈ కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించడం జరుగుతుంది. కంపల్సరీగా రైతులకు రైతు భరోసా ఇచ్చే కార్యక్రమం ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. అందులో ఎలాంటి అనుమానాలకు తావు అవసరం లేదు కాని, నేను మీ ద్వారా ఒక్కటే సూచన చేయదలచుకున్నాను గౌరవ సభ్యుల కేటీఆర్ గారికి. రైతు భరోసాకి సంబంధించి విధివిధానాల పై చర్చకు పరిమితమై మాత్రమే మాట్లాడాలని నేను వారిని కోరుతున్నాను. ఇది వారికి నా సలహా.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ :- అధ్యక్షా, ఇప్పుడు సభ సజావుగా జరగాలనేటటువంటిది మీ ఉద్దేశం. కోఆపరేట్ చెయ్యమని మమ్మల్ని అడుగుతున్నారు. అందుకు మేము కూడా సహకరిస్తున్నాము. ఈరోజు షార్ట్ డిస్కషన్ పెట్టింది రైతు భరోసా అనే అంశం గురించి. మంత్రిగారు స్పష్టంగా చెప్పారు. మరి గౌరవ కాంగ్రెస్ శాసన సభ్యులు మాట్లాడినప్పుడు విప్‌గారు ఇక్కడే ఉన్నారు. అంటే వారు కేవలం రైతు భరోసా మీదనే సూచన చేశారా? రైతు భరోసా అన్నప్పుడు ఈ రాష్ట్రానికి సంబంధించి గత ప్రభుత్వం చేసినటువంటి రైతు బంధు విషయంలో మనకున్న సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పరిణామాలు, ఆ తరువాత 2014 నుండి ఇప్పటివరకు జరిగిన అంశాలు కూడా లింకై ఉంటాయి. అంతేగాని రెండే నిమిషాల్లో మీరిది చెప్పాలని పద్ధతిలో వారు చెప్పడం కరెక్టు కాదు. రెండోది నా రిక్వెస్టు ఏంటంటే స్పీకర్‌గారు పర్మిషన్ ఇచ్చినప్పుడు గౌరవ శాసన సభ్యులు మాట్లాడినతరువాత మా శాసన సభ్యుడు కేటీఆర్‌గారు మాట్లాడుతున్నప్పుడు కొద్దిగా ఓపికగా వింటే, సభ సజావుగా జరుగుతుంది. మళ్లా మీరడుగుతారు, మేమడుగుతాము, లేనిపోని కాంట్రవర్సీ వస్తుంది. అది అవసరం లేదు కదా. రాష్ట్రంలో రైతాంగం ఇబ్బంది పడుతున్నారు. మా కోసం ఈ రైతు భరోసా ద్వారా మాకు మేలు జరుగుతుందనే ఆలోచనతోని, మీరిచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని రైతాంగం ఎదురుచూస్తున్నది. కాబట్టి చర్చలు సజావుగా జరుపుకుందాం, లేనిపోని కాంట్రవర్సీలు చేసుకుంటే, సబ్జెక్టు పక్కదారి పడుతుంది. కాబట్టి దయచేసి దీనిని పరిగణనలోకి తీసుకోవాలని నేను కోరుతున్నాను అధ్యక్షా.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్షా, 75 ఏండ్ల స్వాతంత్ర భారత చరిత్రలో రైతుకు వ్యవసాయం చేసుకోవడానికి పెట్టుబడి సహాయం అందించిన మొట్టమొదటి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం, మొట్టమొదటి నాయకుడు కేసీఆర్. అయితే రూ.72 వేల కోట్లు రైతుల ఖాతాలో నేరుగా జమ చేయడానికి ప్రేరణ ఏమిటి, ఆ పథకం అసలు ఎందుకు తేవాల్సి వచ్చింది? అది చెప్పకపోతే, ఆనాటి పరిస్థితులు ఆకళింపు చేసుకోకపోతే, బ్యాక్ గ్రౌండ్ అర్థం కాకపోతే, పథకం ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందో దాని నేపథ్యం తెలవకపోతే, మనం ఏం మాట్లాడతాం అధ్యక్షా? ఇంకోటి నేను వారిని కోరతా ఉన్నాను. విప్‌గారు నీతులు మాకే కాదు చెప్పాలి. మీ సభ్యులకు కూడా చెప్పాలి, మేము వడ్లే కొనలేదట, మేము అసలు కొనలే లేదు, మా టైంలో వ్యవసాయమే జరగలేదు. ఇది కాదు. దయచేసి మీరు మీ సభ్యుల దిక్కు చూసుకుని, వారికి నేర్పించండి. ట్రెయినింగ్ ఇచ్చారు అధ్యక్షా రెండు రోజులు. మరి వాళ్లకు ట్రెయినింగు చక్కగిచ్చి ఉంటే బాగుండేది కదా? మేము ఒకటే అంటున్నాం అధ్యక్షా.

11.00 ఉ. ఆరోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు కళ్ళల్లో ధైర్యం లేదు. కల్లంలో ధాన్యం లేదు. చిన్నరైతు, పెద్దరైతు అని తేడా లేదు. 30, 40 ఎకరాలు ఉన్న రైతు కూడా.. తెలంగాణలో నేను చెప్పేది వాస్తవం కాకపోతే రేవంత్‌రెడ్డిని అడగండి. ఎందుకంటే ఆయనది మహబూబ్‌నగర్ జిల్లా, వలసల జిల్లాగా పేరుపడ్డ జిల్లా మహబూబ్‌నగర్ జిల్లా. ప్రతి సంవత్సరం 14 లక్షల మంది వలసపోయే జిల్లా ..

(ముఖ్యమంత్రి గారిని పేరుతో రేవంత్ రెడ్డి అని సంబోధించడంతో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు)

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ సభానాయకుడిని రేవంత్‌రెడ్డి అని ఏకవచనంతో మాట్లాడకండి. రాష్ట్ర ముఖ్యమంత్రి, గౌరవం ఇవ్వండి.

శ్రీ కె. తారక రామారావు :- రైట్. అధ్యక్షా గౌరవం అనేది ఇచ్చిపుచ్చుకోవాలి. ఇస్తే మేము కూడా ఇస్తం. కేసీఆర్ గారిని కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మేము కూడా అట్లే మాట్లాడాల్సి వస్తుంది. దానికి మేమేం చేయలేము. అధ్యక్షా, 20,30.. నేనేం తిట్టలేదు కదా. ఆయన్ని పేరుపెట్టి పిలిచాను, అంతేకదా!

మిస్టర్ స్పీకర్ :- ఏకవచనంతోటి పిలవకండి, మీరు చాలా సౌమ్యులు, సీనియర్ సభ్యులు, మీకు చెప్పాల్సిన అవసరం లేదు.

శ్రీ కె. తారక రామారావు :- రైట్, రైట్ అధ్యక్షా. 20,30 ఎకరాలు ఉన్న రైతులు కూడా పాలమూరు లాంటి జిల్లాలో 20,30,40 ఎకరాలు ఉన్న రైతులు కూడా హైదరాబాదు వచ్చి కూలిచేసుకునే పరిస్థితి. ఇది వాస్తవం. ఎందుకంటే నీళ్ళు లేవు, కరెంటు లేదు. అలాంటి పరిస్థితుల్లో రైతులు కూలీలుగా మారి అడ్డామీద కూలీలుగా మారి హైదరాబాదులో పనిచేసిన దుస్థితి. అందుకే మేము 20 ఎకరాలు, 10 ఎకరాలు, 2 ఎకరాలు అని కోతలు పెట్టలేదు అధ్యక్షా. తెలంగాణ రాష్ట్రంలో నీళ్ళు లేక రైతు కూలీగా మారిపోయిన దయనీయమైన పరిస్థితి ఉంది కాబట్టే మేము ఆలోచన చేశాము అధ్యక్షా.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆనాడు మొట్టమొదటి ప్రాధాన్యతగా వ్యవసాయ రంగాన్ని తీసుకున్నాము. వ్యవసాయ రంగం సాగునీటి రంగం. ఎందుకంటే నీళ్ళు, నిధులు, నియామకాలని ఉద్యమ కాలంలో మేమే చెప్పాము అధ్యక్షా. అందుకే నీటి విషయంలో ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టి గోదావరి కానీ కృష్ణ కానీ సాగునీటిని అందించాలి ఖచ్చితంగా రైతులకు నీళ్ళు ఇవ్వాలని ఒక అజెండాతో పనిచేసాము. ఆ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని తీసుకున్నాము.

అందులో భాగంగానే రైతు ఒక్కడు చల్లగా ఉంటే పల్లె చల్లగా ఉంటుంది, పల్లెల్లో అందరూ కూడా బాగుంటారు. ఎందుకంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రైతు కేంద్రబిందువు. ఆ రైతు బాగుంటే రైతు చుట్టూ అల్లుకుని ఉన్న అన్ని కులవృత్తులు బాగుంటాయి అధ్యక్షా. ఆ ఉద్దేశ్యంతోనే వ్యవసాయాన్ని స్థిరీకరించాలి అనుకున్నాము. మేము రైతుబంధు ఊరికనే పెట్టలేదు అధ్యక్షా. మా ఉద్దేశ్యం వ్యవసాయ స్థిరీకరణ, వ్యవసాయ స్టెబిలైజేషన్, అగ్రికల్చర్ స్టెబిలైజేషన్. ఆ కార్యక్రమంలోనే చిన్న విప్లవాత్మకమైన కార్యక్రమాలను తీసుకున్నాం అధ్యక్షా. అందులో ముఖ్యమైనది 24 గంటల నిరంతర విద్యుత్. తెలంగాణ వచ్చిన నాడు కరెంటు లేదు. ఆనాడు పొద్దున మూడు గంటలు, రాత్రి నాలుగు గంటలు అధ్యక్షా కరెంటు. దొంగ రాత్రి, అర్ధరాత్రి కరెంటు కోసం కాపలా కాసే దుస్థితి, దాన్ని సమూలంగా మార్చాలి అనుకున్నాం. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను రైతులకు అందించిన ఒకే ఒక్క నాయకుడు భారతదేశంలో కేసీఆర్ గారు అధ్యక్షా. ఆదేవిధంగా..

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (గౌరవ రహదారులు, మరియు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు):- సార్ ఒక్క నిమిషం. సార్ మీ అనుమతితో వారి పర్మిషనుతో.. సభను ఎప్పుడూ

కూడా తప్పుదోవపట్టించే విధంగా.. 10 ఏళ్ళు మంత్రిగా పనిచేసిన సీనియర్ శాసన సభ్యుడు. ఆయన 24 గంటలు కరెంటు ఇచ్చినాము అని చెప్పినప్పుడు మధ్యలో మా పిసిసి ప్రెసిడెంటుగా ఉన్న వారు అమెరికాలో ఏదో మాట్లాడితే, నేను ఆ మరుసటిరోజే బండ్లసోమారం అని భువనగిరి మండలం ఒక సబ్‌స్టేషన్‌కి వెళ్ళి లాగ్‌బుక్ చెక్ చేపించి, నాలుగునెలల లాగ్‌బుక్ చెక్‌చేపించి ఆపరేట్‌తో నేను ఇంటర్వ్యూ తీసుకుని ఎన్నిగంటలు కరెంటు వస్తుంది అంటే పది, పదకొండు గంటలు సార్.. రికార్డు ఉన్నది సార్ నేను మీకు పంపిస్తాను. మాగ్జిమం అంటే 14 గంటలు అందులో ఐదారుసార్లు పోతది కరెంటు అని ఐలయ్య అనే ఆపరేటర్ రిటైర్డ్ లైన్‌మెన్‌ని మళ్ళీ వీళ్ళు పెట్టుకున్నారు. గతంలో లైన్‌మెన్లు రిటైర్ అయిన తరువాత ఐ.టి.ఐ చేసిన వాళ్ళని పెట్టేది. ఎక్స్‌పీరియన్స్ లైన్‌మెన్ ఉండాలి. ఆయన చెప్పినది రికార్డు పంపిస్తాను. సబ్జెక్టు టు కరెక్షన్.

ఎందుకంటే వాళ్ళు తెలంగాణ ప్రజలను మిస్‌గైడ్ చేశారు. 24 గంటలు ఎప్పుడూ ఇవ్వలేదు. ఐదేళ్ళు ఎం.ఎల్.ఏగా ఉన్నా, ఐదేళ్ళు ఎం.పిగా ఉన్నా వేల గ్రామాలు తిరిగాను. ఆమాటను వారు విత్‌డ్రా చేసుకోవాలి. ఆ లాగ్‌బుక్స్ సాయంత్రం వరకు ఆదిలాబాద్, నల్గొండ, ఆలంపూర్ కెళ్లి రాత్రి వరకల్లా మొత్తం తీసుకువచ్చి హైదరాబాదులో ఒక లాకర్లో పెట్టి తాళం వేశారు. ఎందుకంటే దానితో ప్రూవ్ అయితది కదా అధ్యక్షా. నేను వీడియో మీకు పంపిస్తా, మీరు వీడియో ప్లే చేయండి అసెంబ్లీలో. అందుకనే దయచేసి గౌరవ సభ్యులకు .. మీమీద గౌరవం ఉన్నది, మీరు దాన్ని విత్‌డ్రా చేసుకోండి.

రెండవది అధ్యక్షా, రైతుబంధు గురించి వాళ్ళు మాట్లాడుతున్నారు. ఈ సబ్జెక్టు గురించి నేను తరువాత మాట్లాడదాం అనుకున్నాను. కానీ వారు రైతుబంధు గురించి మిస్‌గైడ్ చేశారు. మాట్లాడుతున్నాను. ఎలక్షన్ల ముందు ఓ.ఆర్.ఆర్ అమ్మిన డబ్బులతో వచ్చిన ఏడువేల కోట్లతోని ఒక ఇన్వాల్‌మెంట్స్ వేశారు.

శ్రీ టి. హరీష్ రావు(మైకులేకుండా) :- సార్ ఏంటి ఇది, సబ్జెక్టు మాట్లాడమనండి.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- సబ్జెక్టు గురించే మాట్లాడుతున్నాను. రెండవది ఎక్సైజ్ టెండర్లు ఒక సంవత్సరం తరువాత పెట్టే టెండర్లని రెండువేల కోట్లు అన్‌ఎంప్లాయిమెంట్ యూత్ దగ్గర నిరుద్యోగులకు వేరే దారి లేక రెండులక్షల ఫీజు పెట్టి రెండువేల కోట్లు నాన్ రిఫండబుల్‌ఫీజు వసూలు చేశారు. ఎక్సైజ్ టెండర్లు పైరవీలు చేశారు. ఆ డబ్బులు ఏమి చేశారో తెలియదు.

నేను వాస్తవం చెపుతున్నాను. రైతుల గురించి మాట్లాడుతున్నాను. మధ్యలో గౌరవ సభ్యులు నా పేరు కూడా తీసుకున్నారు. సార్ ఇంకొకటి. మొన్న గోరంటి వెంకన్న గారు చెప్పారు. ఒకటే ఉదాహరణ: నల్గొండ జిల్లాకు వెళ్తాము. ఇక్కడ నుంచి సభ ముగిసిన తరువాత అందరం కలిసి బస్సులో నల్గొండ జిల్లా మొత్తం తిరిగి వద్దాము సార్. నల్గొండ జిల్లాలో ఒక కొత్త ఎకరానికి ఆయకట్టు పదేళ్ళల్లో ఇచ్చినట్టు రుజువు చేస్తే నేను ఇక్కడ నుంచి రాజీనామా చేసి, రాజకీయాలు బందు చేసుకుని అంటే నల్గొండ జిల్లా కూడా తెలంగాణాలోనే ఉంది. నేను చాలా సీరియస్‌గా చెపుతున్నాను. ఎందుకంటే నేను జిల్లాలో ప్రజల మధ్య నుండే అందరిలాగే నేను కూడా. ఒక్క జిల్లా, ఒక్క ఎకరానికి. సార్ ఒక్క ఉదాహరణ సార్. మా కొండపోచమ్మ, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కడుపు నిండా నీళ్ళు ఉంటాయి. ఆడనుంచి ఒక రెండు, మూడొందల కోట్లు పెడితే ఆలేరులో గంధమల్ల రిజర్వాయర్‌కు మీరే టెండర్లకు పిలిచారు, మీరే కాన్సిల్ చేశారు. 16,20 కిలోమీటర్లు లైను వేస్తే .. లక్షన్నర ఎకరాలు ఉంది సార్. నీళ్ళు లేక ఎండిపోతే .. మా ఐలయ్యగారు నిన్న మొన్న 90 చెరువులు నింపుకున్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ సార్ కొండపోచమ్మ క్రిందనే ఉంటది. వీళ్లకి తెలియాలని చెపుతున్నా సార్. ఆఫీసర్లను మిస్‌గైడ్ చేశారా.. వీళ్ళకు తప్పుడు సమాచారం. బస్వాపూర్ నుంచి భువనగిరి నియోజకవర్గంలో..

శ్రీ టి. హరీష్ రావు(మైకులేకుండా) :- సార్ సబ్జెక్టు డీవియేట్ అవుతున్నారు.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి: :- సార్ నేను సబ్జెక్టు డీవియేట్ అవడం లేదు. నేను రైతుల గురించి మాట్లాడుతున్నాను. వాళ్ళు ఒకప్పుడు తెలంగాణ ఎట్లుంది అన్నారు.. మా గౌరవ సభ్యులు కేటీఆర్‌గారు ఒకప్పుడు తెలంగాణ ఎట్లుంది, తెలంగాణ వచ్చినాక ఎట్లుంది అంటే, తెలంగాణ వచ్చినాక మొత్తంగా నష్టపోయింది మొట్టమొదట నల్గొండ జిల్లా సార్. జగన్మోహన్‌రెడ్డిగారితో ఒప్పందం పెట్టి నువ్వు పోతిరెడ్డిపాడు తీసుకుపో, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకుపో అని చెపుతే రెండు పంటలకు క్రాప్ హాలీడే ఇచ్చారు అధ్యక్షా. అదిపోయింది. మల్లన్న సాగర్ 50 టి.ఎం.సిని క్రిందకు ఇస్తే మా భువనగిరి, ఆలేరు, చిట్యాల వరకు అలైన్మెంటు చేశారు. దాన్ని టేకప్ చెయ్యలేదు. నేను ఎందుకు చెపుతున్నానంటే కరెంటు విషయంలో.. ఉచిత కరెంటు విషయంలో భారతదేశంలో ధైర్యంగా చెప్పే ఆ హక్కు, ఆ పేటెంట్ ఎవరిదంటే కాంగ్రెస్ పార్టీదని ముమ్మాటిగా చెపుతున్నా అధ్యక్షా.

ఆరోజు రాజశేఖర రెడ్డిగారు ప్రతిపక్ష నాయకుడిగా మ్యానిఫెస్టోలో పెడతామంటే ముందుగా మా నాయకురాలు సోనియాగాంధీగారు ఒప్పుకోలేదు, అది ఇంపాజిబుల్, రైతులకు ఇవ్వలేము అంటే వారిని రాజశేఖర రెడ్డిగారు ఒప్పించి ఉచిత కరెంటు అనే పథకాన్ని ప్రవేశ పెట్టి ఆరోజు తొమ్మిది గంటలు కరెంటు ఇచ్చాము అధ్యక్షా.

నిన్న హరీష్‌రావు గారు కానీ, కేటీఆర్‌గారు గానీ మాట్లాడుతున్నారు,50 ఏళ్ళు మీరే పాలించారు అన్నారు. 50 ఏళ్ళ సమైక్య పాలనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండి పారపాటున మధ్యలో రెండు సార్లు తెలంగాణలో ముఖ్యమంత్రి అయితే సంఖ్యాబలంతో వాళ్లని పదవి నుంచి దింపితే మా నిధులు, నీళ్ళు, నియామకాలు లేక అందరూ సొంత పార్టీ మీదనే పోరాటం చేసి తెలంగాణ తెచ్చుకుంది ఎందుకు? మాకు అన్యాయం జరుగుతుందనే కదా! దాన్ని అన్యాయంగా దళితుడిని ముఖ్యమంత్రి చేస్తా, మూడెకరాలు ఇస్తా, మీ బిడ్డలను ఆదుకుంటా అని మోసం చేసి పదేళ్ళు పాలిస్తివి. ఈరోజు మీరు, పదేళ్ళ కాలం మీది. 50 ఏళ్ళలో నాగార్జునసాగర్ కానీ, శ్రీశైలం కానీ, సాగర్ కానీ, శ్రీరాంసాగర్ కానీ, వరదకాలువలు గానీ ఇవన్నీ పూర్తి చేసింది మేము. ఆ 50 ఏళ్ళలో. అవునా?కాదా. అయినా ఆంధ్రులు మాకు సరైన నిధులు ఇస్తలేరు, మా ఉద్యోగాలు తీసుకుపోతున్నారు అని కొట్లాడి తీసుకొచ్చిన తెలంగాణలో మోసంతోని అధికారంలోకి వచ్చి పదేళ్ళలో 40 కుటుంబాలు బాగుపడ్డాయి అధ్యక్షా. వీళ్ళు అంటున్నారు కరెంటు ఇచ్చాము, నీళ్లు ఇచ్చాము అని. ఏమీ ఇవ్వలేదు అధ్యక్షా. ఏమీ ఇవ్వలేదు. ఈరోజు వందేళ్ళు వెనుకకు తీసుకుపోయి., ఊర్లల్లోకి పోతే కళ్ళెమ్మటి నీళ్ళు పెట్టుకుంటున్నారు. మనం పైసా పైసా జమచేసి 25 లక్షల మంది రెండు లక్షల లెక్క నువ్వు లక్ష ఇస్తున్నావు.

శ్రీ టి. హరీష్ రావు (మైకు లేకుండా) :- అధ్యక్షా, ఒక్క సారి మైకు ఇవ్వండి.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- హరీష్ రావు గారు, కూర్చోండి. ఆరు ముక్కలు చేశావు. ఆరు ముక్కలు చేస్తే బ్యాంకు వాళ్ళ వడ్డీ క్రిందకే పోయింది. లక్షన్నర కోట్లు అప్పుతీసుకొస్తే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ కడితే ఈ రోజు ఇచ్చాడు రేపో మాపో అవికూడా కూలిపోతాయని చెప్పారు. ఏమి చేశారు మీరు? కూలిపోయే ప్రాజెక్టులు కట్టావు. మొత్తం మోసం చేశావు. నీ కుటుంబాలు బాగుపడ్డాయి. పోదాం పదా తెలంగాణాలో ఊర్లకి.

అధ్యక్షా, 50 వేల కోట్లు మిషన్ భగీరథ. ఇంటింటికి నల్లా ఇవ్వకపోతే ఓట్లు అడగొద్దు అన్నావు. పోదాం పా. సిరిసిల్లలో మీ ఊరికి పోదాం. సిరిసిల్ల గానీ, సిద్ధిపేట కానీ ఒక ఊరికి పోదాం నల్లా ఇప్పుదాం. నీళ్ళు వచ్చాయంటే మళ్ళొకసారి మేము ఓట్లు అడగం. మళ్ళొకసారి మేము ఓట్లు అడగం.

మిస్టర్ స్పీకర్ :- మంత్రిగారూ, ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- అధ్యక్షా, ఒక్క నల్లా లేదు. 50 వేల కోట్లు తినేసారు. మిషన్ భగీరథ మీద 50 వేల కోట్లు తినేసారు. తినుడు, తినుడు తినుడు తప్ప అన్నీ తినీ తినీ ఈరోజు సంవత్సరంలోనే మేమొక గాడిన పెడతావుంటే గౌరవ సభ్యులు కేటీఆర్ గారికి నేను ఒకటే చెపుతున్నాను. హరీష్‌రావుగారికి నేను సమాధానం చెప్పడం లేదు, వారికి మాట్లాడే హక్కు లేదు, ఆయన డెప్యూటీ లీడరు కాదు, ఆయన బీఆర్ఎస్ ఎల్.పి సెక్రటరీ కాదు, ఒక ఎం.ఎల్.ఎ., ఆయనకు చెప్పడం లేదు. సబ్జెక్టు మాట్లాడుతున్న కేటీఆర్ గారికి నేను సమాధానం చెపుతున్నాను. నేను ఒక్కటే చెపుతున్నాను, క్రైమ్ రికార్డు తీయండి. ఆత్మహత్యలు 2013వ సంవత్సరం వరకు ఎన్ని ఉండేవి, 2024వ సంవత్సరం వరకు ఈరోజు మా ఒక సంవత్సర కాలంలో తగ్గినాయా? లేదా? నేషనల్ క్రైమ్ రికార్డు తెప్పిద్దాము. ఎందుకు అబద్ధాలు చెపుతారు? సభను ఎందుకు తప్పుద్రోవ పట్టిస్తారు. ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తారు. దయచేసి వాస్తవాలు రైతు భరోసా మీద మేము మా మంత్రిగారు చెప్పే సమాధానం వినండి, ఆ తరువాత మీరు చెప్పండి. మీ లీడరు వస్తలేడు. ఎల్.ఒ.పి గారు సభకు వస్తలేరు. వచ్చే సమావేశాల నుండి మీరెవ్వరూ కూడా సభకు రారు..

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- అధ్యక్షా, గౌరవ సభ్యులకు వినమ్రపూర్వకమైన విజ్ఞప్తి, ఆయనగారికే చెప్తున్నా, అందరి సభ్యులకి చెపుతున్నా..అందరు సభ్యులు అంటే ఆయన ఉండరాండీ? ఆయన కూడా ఉంటారు కదా! ఇది కేవలం రైతు భరోసామీద గౌరవ సభ్యుల యొక్క సూచనలు., ఈ పథకం భవిష్యత్తులో ఏ రకంగా అమలు చేయాలనే విషయం మీద చర్చ జరుగుతుంది. మిగతా విషయాలు చర్చించుకోవడానికి మనకు చాలా సమయం ఉంది. ఇంకా నాలుగు సంవత్సరాలు మాట్లాడుకోవచ్చు. ఇప్పుడు మాట్లాడే విషయాలు ఇటునుంచి మాట్లాడినా, అటునుంచి మాట్లాడినా గత 15 సంవత్సరాలుగా మాట్లాడినటువంటి అంశాలే. తెలంగాణ రాక ముందు ఉన్నటువంటి పరిస్థితి తెలంగాణ ప్రజలకు తెలుసు. వచ్చిన తరువాత జరిగినటువంటి పరిస్థితులు కూడా తెలంగాణ ప్రజలకు తెలుసు. కాబట్టి దయచేసి ఈ పథకం యొక్క రూపకల్పనలో మీ భాగస్వామ్యం కోసం ప్రజాస్వామ్యయుతంగా శాసనసభ సభ్యుల యొక్క అభిప్రాయం తీసుకోవాలని మీ ముందు పెట్టాము. దయచేసి ఆ పథకం యొక్క రూపకల్పనలో మీ యొక్క అమూల్యమైన సూచనలు ఇవ్వమని నా ప్రార్థన.

శ్రీ టి. హరీష్ రావు :- అధ్యక్షా, గౌరవనీయులు తుమ్మల నాగేశ్వరరావు గారంటే మాకు చాలా గౌరవం. వారి మాటలతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. ఈ చర్చ సభలో నిజంగా కూడా రైతుల గురించే జరగాలి. రాష్ట్రంలో కోట్లాదిమంది రైతులు ఏమి జరుగుతది, రైతు బంధు భవిష్యత్తులో ఏంటి అని ఎంతో ఆశతో ఎదురుచూస్తూ ఉన్నారు. తప్పకుండా దానిమీద కేటీఆర్‌గారు మాట్లాడతారు. దయచేసి నేను స్పీకరుగారిని కోరేది, కేటీఆర్‌గారు ఐదు నిమిషాలు మాట్లాడితే తుమ్మల నాగేశ్వరరావు గారు మూడుసార్లు లేశారు, దాదాపు 10 నుంచి 15 నిమిషాలు వెంకటరెడ్డిగారు మాట్లాడారు. విప్‌గారు రెండుసార్లు లేశారు. ఇట్లా ఇంటరప్ట్ చేస్తే ఫ్లో పోతది. దయచేసి మీరు ఇంటరప్ట్ చేయొద్దని ఒక మనవి.

ఇక వెంకటరెడ్డిగారు నా పేరు తీసుకున్నారు కనుక నేను దానికే పరిమితంగా చెప్పే ప్రయత్నం చేస్తాను. ఎందుకంటే సభను తప్పుద్రోవ పట్టించే ప్రయత్నం చేసినారు. ఒకటి మిషన్ భగీరథలో 50 వేల కోట్లు తినేశారు అన్నారు. అసలు మిషన్ భగీరథకు అయిన ఖర్చే 28 వేల కోట్లు అయితే, 50 వేల కోట్లు తినేశారు అని మాట్లాడటం సబబు కాదు, అది సభ రికార్డుల నుంచి తొలగించాలి. రెండవది మా నల్గొండ జిల్లాకు అన్యాయం జరిగిందని వారు అన్నారు. నేను నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. సభ అయిపోయిన తరువాత నేను, ఆయన ఇద్దరం కలిసి సీదా పోదాం పాండ్రి. ఏడకి పోదాం? తుంగతుర్తికి పోదాం, సూర్యాపేటకి పోదాం, కోదాడ పోదాం. నాటి కాంగ్రెసు

పాలనలో ఒక్క ఎకరానికి నీళ్ళు రాకపోతే కాళేశ్వరం నీళ్లతో రెండు లక్షల ఎకరాలకు గోదావరి నీళ్ళు పారిచ్చినమా? లేదా? పోయి సీదా ఆ కాలువల మీద నడుచుకుంటూ ఈ నీళ్ళు ఎప్పుడు వచ్చాయి? కేసీఆర్ గారు అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చాయా? అంతకుముందు వచ్చాయా? అడుగుదామంటే, అడుగుదాము.

మూడవది, నల్గొండకి ఏమీ చేయలేదని మాట్లాడటం కూడా కరెక్టు కాదు. నల్గొండలో మూడు మెడికల్ కాలేజీలు పెట్టింది కేసీఆర్ గారు. నల్గొండ పట్టణంలో గతంలో మీరు మంత్రిగా ఉన్నప్పుడు ఎట్లా ఉంది, కేసీఆర్ గారు నల్గొండ పట్టణాన్ని గత ఐదేళ్ళలో ఎంత అభివృద్ధి చేశారో నల్గొండ పట్టణ ప్రజలను అడిగితే కూడా చెపుతారు అధ్యక్షా. యాదాద్రి పవర్‌ప్లాంట్ ఇచ్చాము. ఈరోజు నల్గొండను అన్ని రకాలుగా, ఆ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసింది బీ.ఆర్.ఎస్ పార్టీ. ఇంకా చాలా చెప్పగలుగుతా కానీ చర్చ రైతు బంధు మీద జరగాలి కనుక మీమీద గౌరవం కొద్దీ మీ సూచనల మేరకు కూర్చుంటున్నాం. దయచేసి చర్చ రైతు బంధు మీద జరిగే విధంగా కేటీఆర్ గారికి అవకాశం ఇవ్వాలి. చర్చను డైవర్ట్ చేయొద్దని కోరుతున్నాను.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- సార్, గౌరవ సభ్యులు కేటీఆర్‌గారు 24 గంటల కరెంటు విషయంలో మాట్లాడారని లేచాను. రైతు భరోసామీద మాట్లాడిస్తున్నప్పుడు నేను లేవలేదు. రైతు భరోసా మీద.. రైతు భరోసామీద మాట్లాడినప్పుడు, నేను కేటీఆర్‌గారికి చెపుతున్నా, రైతు భరోసా మీద నేను లేవలేదు సార్. ఇంకొకటి హరీష్ రావు గారు సభను తప్పుద్రోవ పట్టించే విధంగా నల్గొండ జిల్లా గురించి మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎవరు కట్టారు సార్? కేసీఆర్ కట్టిండా? వాళ్ళ నాయన కట్టిండా?

11.10 ఉ. అధ్యక్షా, నాగార్జునసాగర్ కేసీఆర్ కట్టారా, వాళ్ళ నాయన కట్టారా ఎవరు? ఎవరు కట్టారు సార్? ఏఎంఆర్‌పి కెనాల్స్ ఎవరూ కట్టారు? సూర్యాపేట రెండు లక్షలు అంటున్నాడు. మొత్తం అబద్ధం సార్. సూర్యాపేటకు వెళదాం. రైతు భరోసాకు కన్ఫైన్ అవ్వండి. రైతు భరోసా ఏ విధంగా ఇవ్వాల్లో కేటీఆర్ గారిని సలహా ఇవ్వమంటున్నాను. 24 గంటల కరెంట్ అని అనేటప్పుడు మాత్రం నేను లేచాను. వారిని కూడా సబ్జెక్ట్ డీవియేట్ కావొద్దని చెప్పండి. మేము మధ్యలో అడగము.

మిస్టర్ స్పీకర్ :- ఇది రైతులకు సంబంధించిన చర్చ. ముఖ్యమైన చర్చ డైవర్ట్ అవుతుంది. ప్లీజ్ కూర్చోండి.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- కరెంట్ మీద వేరే చర్చ పెట్టండి. లాగ్‌బుక్ గురించి మొత్తం బయట పెడతాను.

మిస్టర్ స్పీకర్ :- పెడదాము. ప్లీజ్ కూర్చోండి.

శ్రీ కె. తారక రామారావు :- స్పీకర్ సార్, మీ ద్వారా వినయ పూర్వక విజ్ఞప్తిని తెలియజేసేది ఏమనగా, ఒక పది రోజులు హౌస్‌ను పొడిగించి మంత్రిగారు కోరిన విధంగా ఒక రోజు ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాల మీద చర్చ పెట్టండి. వీటితోపాటు నల్గొండ జిల్లా అభివృద్ధి మీద కూడా స్పెషల్‌గా చర్చ పెట్టండి. కానీ, ఈ రకంగా మధ్య, మధ్యలో లేచి అంతరాయం కలిగించడం కరెక్ట్ కాదు. రెండవ అంశంగా మంత్రిగారు వెంకన్న వైఖరి ఏ విధంగా ఉందంటే, మా ఇంటికొస్తే ఏం తెస్తావు, మీ ఇంటికి వస్తే ఏం ఇస్తావు అనే విధంగా ఉంది. ఆయన ఏమంటున్నాడు అధ్యక్షా, నాగార్జున సాగర్ కట్టింది ఎవరు? ఇది కట్టింది ఎవరు? అది కట్టింది ఎవరు? ఆయన చెప్పవచ్చు, ఆయనేమో డబ్బా కొట్టుకోవచ్చు. కానీ సమైక్య ఆంధ్రలో అన్యాయం జరిగింది కాబట్టే, 2014 గురించే మీరు మాట్లాండండి. అప్పుడు జరిగిన తప్పులు ఎత్తిచూపితే ఇబ్బంది అవుతుంది, కానీ అప్పుడు కట్టిన ప్రాజెక్టుల గురించి మాత్రం డబ్బా కొట్టుకోవడం, డప్పు కొట్టుకోవడం మాత్రం ఆయన చేస్తాడంట. మంత్రిగారిని ఇంకొక మాట కూడా కోరేదేమంటే, గత సెషన్‌లో మీరు హౌస్‌లో ఉన్నారు.

విద్యుత్తు శాఖ శ్వేతపత్రం ప్రచురించింది. విద్యుత్తు శాఖ వైట్‌పేపర్ మీద....., అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన దాని గురించే మాట్లాడుతున్నాను. ఆయన ప్రజలను తప్పు దోవ పట్టిస్తే మంచిది కాదు అధ్యక్షా. 24 గంటల కరెంట్ ఇవ్వలేదని మాట్లాడిండు. ఇదే హౌస్‌లో మీ డెప్యూటీ సిఎం చెప్పాడు, కొంచెం ఓపికగా వినండి. మీ డెప్యూటీ సిఎం గారు ప్రవేశపెట్టిన శ్వేత పత్రంలో నుండే కోట్ చేస్తున్నాను. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా 24 గంటలకు యావరేజ్‌గా 19.2 గంటలు కరెంట్ ఇచ్చారని మీ డెప్యూటీ సిఎం చెప్పారు. కావాలంటే మీ డెప్యూటీ సిఎంతో పంచాయితీ పెట్టుకోండి, ఆయన అట్ల ఎందుకు చెప్పారో అడుక్కోండి.

ఇంకొక మాట లాగ్‌బుక్ అన్నారు అధ్యక్షా. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ చూసినా ప్రకటనలు గుప్పిస్తున్నదని, ఎక్కడ చూసినా కాంగ్రెస్ ప్రకటనలే కనపడుతున్నాయని మేము అంటున్నాము. అందులో ఏం చెబుతున్నారంటే 24 గంటల కరెంట్...., నేను వెంకటరెడ్డిగారిని అడుగుతున్నదేమంటే, ఇక్కడ నుండి సభను వాయిదా వేసి బస్సులో అందరం నల్గొండ జిల్లాకు వెళ్లి, ఈరోజు ఎక్కడన్నా లాగ్‌బుక్‌లో 24 గంటల కరెంట్ వస్తున్నట్లు చూపిస్తే మేము శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేస్తామని ఆయనని అడుగుతున్నాను. వాళ్లేమో ప్రచారం చేయవచ్చు. పద్ధతి కాదు అధ్యక్షా. మాట్లాడేది ఒకటి వారు చెప్పేది ఇంకొకటి.

మిస్టర్ స్పీకర్ :- ఇది రైతులకు సంబంధించిన ముఖ్యమైన చర్చ. కేటీఆర్‌గారు సబ్జెక్ట్ మాట్లాడండి.

శ్రీ కె. తారక రామారావు :- అన్నదాతల గురించే మాట్లాడుతున్నాను. ముఖ్యంగా నల్గొండ జిల్లా మంత్రిగారు తప్పకుండా ఈ విషయం గురించి తెలుసుకోవాలి. కేసీఆర్‌గారి ప్రభుత్వంలో నల్గొండ జిల్లాలో జరిగిన దానిగురించి ఒక్క నిమిషంలో చెప్పాలంటే, భారతదేశం మొత్తంలో తెలంగాణ రాష్ట్రం ధాన్యం ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థాయికి చేరుకుంటే, అందులో తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లో అత్యధికంగా వరి ధాన్యం పండించడంలో నెంబర్ వన్ జిల్లా నల్గొండ జిల్లా అని గౌరవ మంత్రిగారికి చెప్తున్నాను. ఇది వారు తెలుసుకోవాలి, తెలుసుకొని మాట్లాడాలని వారిని నేను కోరుతున్నాను. మీరు దాని మీద ప్రత్యేకంగా చర్చకు అవకాశం ఇస్తానంటే మేము సిద్ధంగా ఉన్నాము.

10 సంవత్సరాలలో రైతు బంధు కార్యక్రమమే కాకుండా, సకాలంలో ఎరువులు, విత్తనాలు, 2603 వ్యవసాయ రైతు వేదికలను పెట్టడంతోపాటు, వ్యవసాయ స్థిరీకరణ జరగాలంటే వ్యవసాయ విస్తరణ జరగాలని వీటన్నింటిని తీసుకున్నాము. అందులో భాగంగా వచ్చిందే రైతు బంధు కార్యక్రమం. రైతుల విషయంలో మా కమిట్‌మెంట్ గురించి చెప్పాలంటే వ్యవసాయ మోటర్లకు మీటర్లను పెడతారా? పెట్టరా? అని ఆనాడు మా మెడ మీద కత్తి పెడితే దాదాపు రూ. 30 వేల కోట్ల అదనపు రుణ పరిమితిని కూడా వదులుకున్నాము కానీ, ఎట్టి పరిస్థితుల్లో మోటర్లకు మీటర్లు పెట్టమని చెప్పిన కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు కేసీఆర్ గారు. ఇప్పుడు పెడ్తారా? పెట్టరా? పైన ఉన్న వాళ్లు చెప్పినట్లు వింటారా, వినరా అని రైతులు కూడా చూస్తున్నారు. రైతుబంధు గురించి ఒక మాటలో చెప్పాలంటే..., మళ్లీ మళ్లీ అదే...,

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- అధ్యక్షా, మీద్వారా గౌరవ కేటీఆర్‌గారిని రిక్వెస్ట్ చేసేదేమంటే గత పది సంవత్సరాలలో నల్గొండ జిల్లాలోని ఒక ఎకరానికి ఇరిగేషన్ ద్వారా అదనంగా నీరు వచ్చి ఉంటే బునాదిగాని కాలువ, ధర్మారెడ్డి, బ్రాహ్మణవెల్లంల, సారంగం, గంధమల, బసవాపూర్.. ఏ ఒక్కప్రాజెక్టు కాదు కదా, మూసీ కాలువల నీళ్లను వ్యవసాయానికి వాడుకోవడానికి కూడా వంద కోట్లు ఇవ్వలేదు. వేరే అనడం కాదు అధ్యక్షా. మిస్ గైడ్ చేస్తున్నాడు. నల్గొండ జిల్లాలో ఎక్కువ ధాన్యం పండింది అన్నారు. ఎట్ల పండింది ? ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూగారు,

ఇందిరాగాంధీ గారు పూర్తి చేసిన బ్రాహ్మణవెల్లంల, సాగర్ డ్యామ్‌తో 8 లక్షల ఎకరాలు, యన్.టి.రామారావుగారు ఎఎమ్ఆర్ ప్రాజెక్టును మొదలుపెడితే, ఆ తరువాత రాజశేఖర్ రెడ్డిగారు సిఎం ఉన్నప్పుడు నేను డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్‌ను దాదాపు రూ.400 కోట్లతో పూర్తి చేస్తే వచ్చిన పంట అధ్యక్షా అది. పోయినసారి క్రాప్ హాలిడే. ఎందుకు క్రాప్ హాలిడ్ అంటే..., జగన్‌మోహన్‌రెడ్డిగారు వీళ్లకు బిర్యాని పెట్టి....., వీళ్లప్రెండ్‌షిప్ వేరే.., రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్.....,

(బీ.ఆర్.ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

అరే ఆగవయ్యా బాబు నా బాధ చెప్తాను. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పోతిరెడ్డిపాడు 88 వేలు డిఎస్‌కెని 44 వేలు పెంచితేనే, సొంత పార్టీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారితో నేను కొట్లాడాను. పులిచింతల 3వపంటకు ఇస్తే కొట్లాడాను. నా సొరంగం ఇవ్వకుండా, నా బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు ఇవ్వకుండా మూడవ పంటకు నీళ్లు ఇస్తున్నావని కొట్లాడాను. వీళ్లు సార్ నల్గొండ జిల్లాలో అంత బ్రహ్మాండంగా పంట పెరిగి నీళ్లు ఇచ్చి ఉంటే, ఏకలింగం కెళ్లి అందరం 60,70 వేల మెజారిటీతో గెలిచాము. వీళ్లకు ఓట్లు వేసేవారు కదా? ఓటర్లను మోసం చేశారు. ముఖ్యమంత్రిగారు మూసీని క్లీన్‌చేసి మమ్మల్ని బ్రతుకునిద్దామంటే దానికి అడ్డం పడుతున్నారు సార్. వీళ్లకు మేము బ్రతకాలని లేదు. ఇంత విషం ఇచ్చి నల్గొండని చంపండి. బావా, బామ్మర్దులు కలిసి నల్గొండ ప్రజలను చంపండి. మా ఊరికి వచ్చి పండుకోండి. బ్రాహ్మణవెల్లంల ప్రక్కన మూసీ పోతుంది. చూస్తే ఏడుపొస్తుంది అధ్యక్షా. ఈరోజు ఈ అజ్ఞానులు ఎట్లా ఈ సభకు వస్తున్నారు? ప్రపంచ దేశాలన్నీ ఎంత ఖర్చు పెట్టాయో..... ఆరోగ్యం ముఖ్యం సార్. వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేదు. మిషన్ భగీరథ కార్యక్రమానికి రూ. 6000 కోట్లుకు టెండర్ పెట్టి డ్రా చేసుకున్నారు. వీటికి సంబంధించిన లెక్కలన్ని నా దగ్గర ఉన్నాయి. కానీ కేటీఆర్ చెబుతున్నారు, తప్పులేదు. ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. యన్టీఆర్‌గారి పుణ్యమా అని ఏఎంఆర్‌పి, రాజశేఖర్ రెడ్డి గారి వల్ల డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్‌ను పూర్తి చేసుకున్నాము. మా రేవంత్ రెడ్డి గారి పుణ్యాన రెండు నెలల్లో సొరంగం, బ్రాహ్మణవెల్మల, గంధమల, బస్వాపూర్‌లను పూర్తి చేసుకుని, జిల్లా మొత్తాన్ని సస్యశ్యామలం చేసుకుంటాము. మీరు అడ్డుపడ్డా, బీజేపి వాళ్లు అడ్డుపడ్డా, మూసీని క్లీన్ చేయించుకొని మేము బ్రతకాలి, బ్రతుకుతాము. వారికి జ్ఞానోదయం కలగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ, మూసీ ప్రక్షాళన చేపట్టినందుకు మీద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- స్పీకర్ సార్ సబ్జెక్ట్ ఏమిటి, ఆయన ఏం మాట్లాడుతున్నాడు సార్.? సార్ మీరు మమ్మల్ని కంట్రోల్ చేస్తే కాదు సార్, ఆయనని నియంత్రించాలి. నల్గొండ ఇరిగేషన్ మీద మీరు చర్చ పెట్టండి, మేము ఎన్ని లక్షల ఎకరాలకు మేము నీళ్లు ఇచ్చామన్న దాని గురించి హరీష్‌రావుగారు చెప్పారు. రేపు చర్చ పెడితే సావధానంగా మొత్తం చెబుతాము. మీరు మాతో వస్తే, తుంగతుర్తికి పోదాము, సూర్యాపేటకు పోదావు, కోదాడ పోదావని మంత్రిగారిని అడుగుతున్నాను. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నడన్నా అక్కడ నీళ్లు వచ్చాయా? రెండు లక్షల ఎకరాలకు అదనంగా కేసీఆర్‌గారు కాళేశ్వరంకు నీళ్లు ఇచ్చిన మాట వాస్తవమా? కాదా? పోయి రుజువు చేస్తాము. ఎందుకు అధ్యక్షా, అంత భేషజం ఆయనకి? నల్గొండ జిల్లాలో అన్ని వీళ్లు చేసినవే ఉంటే, ఆనాడు వరి ధాన్యం ఉత్పత్తిలో నల్గొండ జిల్లా మొత్తం దేశంలోనే నెంబర్ 1 జిల్లా ఎందుకు కాలేదు అధ్యక్షా. మంత్రిగారు దయచేసి మీ సెబ్జెక్ట్ వచ్చినప్పుడు మాట్లాడండి. ఎవరన్నా వద్దన్నారా? మీ ముఖ్యమంత్రిగారు మాట్లాడనీయకపోతే నేను ఏం చేస్తాను నాకు అర్థం కాదు. అప్పుడప్పుడు మీ సబ్జెక్ట్ కూడా తీసుకోమ్మని చెప్పు.

నేను రైతు బంధు కార్యక్రమం గురించి మాట్లాడుతున్నాను. వారిని కంట్రోల్ చేయండి అధ్యక్షా,

ఇదేం పద్ధతి అధ్యక్షా? ఆ రోజు రుణగ్రస్తులైన రైతులకు తెలంగాణ వచ్చిన నాడు రుణమాఫీ చేస్తామని చెప్పాము. చెప్పడమే కాకుండా రెండు దఫాలుగా రూ.30 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కూడా కేసీఆర్ గారి ప్రభుత్వానికే దక్కుతుందనే మాట కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. దానితోపాటు మొత్తం దేశంలోనే రైతు రుణగ్రస్తుడు కాకుండా ఉండాలంటే, మొత్తం దేశంలోనే అతి పెద్ద నగదు బదిలీ పథకం రైతు బంధు పథకాన్ని మా ప్రభుత్వం కేసీఆర్‌గారు ప్రవేశపెట్టారు. ఈ రైతు బంధు పథకం మీద కాంగ్రెస్ పార్టీ విపరీతమైన దుష్ప్రచారం చేశారు. పెద్దవాళ్లకి ఇస్తున్నారు, పెద్ద పెద్ద వాళ్లకి ఇస్తున్నారు, భూస్వాములకు ఇస్తున్నారని మాట్లాడారు. మంత్రిగారు ఈరోజు మీరు అధికారంలో ఉన్నారు. డేటా మీ దగ్గర ఉంది. మీ రెవెన్యూ మంత్రిగారి దగ్గర ఉంది తీసుకోండి, ఈ రైతు బంధు పథకంలో లబ్ధిదారులు నూటికి 98 శాతం మంది బక్కచిక్కిన సన్నకారు, చిన్నకారు రైతులున్నారు. అందుకే చిన్నా, పెద్దా తేడా చూడలేదు. ఇందాక రేవంత్ రెడ్డిగారు రాకముందు చెప్పాను, మళ్ల కూడా చెబుతున్నాను. మహబూబ్ నగర్ జిల్లాలో 30, 40 ఎకరాలున్న రైతులు కూడా రైతు కూలీలుగా మారిన పరిస్థితి ఉంది కాబట్టి, మేము పరిమితి పెట్టలేదు, అట్లాంటి ఆలోచన కూడా చేయలేదు. ఎగబెట్టాలన్న ఆలోచన కుడా చేయలేదు. వ్యవసాయరంగం గాడిన పడేదాకా, వ్యవసాయం స్థిరీకరించబడే దాకా కోటి ఆశలతో తెలంగాణను సాధించుకున్న తెలంగాణ రైతుల కళ్లలో వెలుగు నిండేదాకా ఖచ్చితంగా రైతుల మీద కోతలు పెట్టకుండా, పాబంది పెట్టకుండా మేము ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాము.

11.20 ఉ. భవిష్యత్తులో కూడా అదే విధంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అశోక్ గులాటి, అరవింద్ సుబ్రహ్మణ్యం, రఘురాం రాజన్, అబిజిత్ బెనర్జీ లాంటి నోబెల్ గ్రహీతలు.., అదేవిధంగా ఐక్యరాజ్య సమితి FAO(Food and Agriculture Organisation) వారు కూడా రైతుబంధు పథకాన్ని అభినందించారు. రైతును ఆదుకోవడానికి, వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి ఈ తరహా పథకమే మేలని ఆర్థికవేత్తలు చెబితే, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కృషిబంధు పథకం, ఒరిస్సా రాష్ట్రం కాలియా పథకం మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రవేశ పెట్టడం జరిగింది. ఆఖరికి బీజేపీ వాళ్ళు బయటకు చెప్పరు కాని, రైతు బంధును కాపీ కొట్టి పెట్టిన పథకమే పీఎం కిసాన్ పథకం అధ్యక్షా. కానీ, అందులో కటింగ్‌లు పెట్టుకున్నారు. ఇప్పుడే మంత్రి గారు చెప్పారు. 11 కాలాల పాటు రూ.73 వేల కోట్లు రైతు ఖాతాలో జమ చేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని, ఆకలి కేకల నేలను అన్నపూర్ణగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలుపుతున్నాను. రైతు విలువ పెరిగి, రైతు భూముల విలువ పెరిగి, సాగు సంబరమైంది. రైతు రందీని మార్చిన గేమ్ ఛేంజర్ రైతు బంధు పథకం. అదే విధంగా ఒక్క మాటలో చెప్పాలంటే, అసలు ఏం జరిగిదంటే, ఆనాడు 2014లో ఇది నేను చేబుతున్న నా లెక్కకాదు (ఒక పేపర్‌ను చూపిస్తూ) అధ్యక్షా. ఆర్‌బిఐ చెబుతున్న లెక్క 2013-14లో 34 లక్షల 30 వేల ఎకరాల్లో సాగు చేస్తుంటే, ఆనాటి ప్రొడక్షన్ ఒక వంద ఆరు లక్షల ఎనభై ఆరు వేల టన్నులు. అక్కడి నుండి మేము దిగిపోయే నాటికి చూస్తే, 34లక్షల ఎకరాల్లో సాగవుతున్న తెలంగాణ పంటలు 59.89 లక్షలకు చేర్చాము. అదే మాదిరిగా భారతదేశంలోనే అగ్రగామిగా పంజాబ్, హర్యానా రాష్ట్రాలను దాటి ధాన్యం ఉత్పత్తిలో నెంబర్‌వన్‌గా చేసిన ఘనత కూడా ఖచ్చితంగా కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆహార పంటల ఉత్పత్తి 71 లక్షల టన్నుల నుండి 2 కోట్ల టన్నులకు పెరిగింది. 185 శాతం అభివృద్ధి చెందింది. పంటల సాగు నాడు రెండు పంటలు కలిపి కోటి 31 లక్షల ఎకరాలు. ఈరోజు 2 కోట్ల 29 లక్షల ఎకరాలకు చేరుకున్నదంటే, పదేళ్ళ కాలంలో ఇది పురోగతి కాదా? ఇది ప్రోగ్రెస్ కాదా? వ్యవసాయ విస్తీర్ణం జరగలేదా? వ్యవసాయ స్థిరీకరణ జరగలేదా? దీని వెనక ఉన్న ప్రేరణ,

బ్యాక్ బోన్ రైతు బంధు కాదా? అందుకే మేము అంటున్నాము. నీరు పల్లం ఎరుగు, నిజం దేవుడెరుగు అంటారు. కానీ, సంకల్ప బలం ఉంటే, పల్లానికి పోయే నీటిని కూడా పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అధ్యక్షా. అదే విధంగా పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తప్పకుండా చెప్పాలి. కాళేశ్వరం తెలియనోళ్ళు ఏదో మాట్లాడుతున్నారు. కాళేశ్వరం అంటే ఒక బ్యారేజ్ కాదు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 203 కి.మీ.ల సొరంగ మార్గం, 1531 కి.మీ.ల గ్రావిటీ కెనాల్, 98 కి.మీ.ల ప్రెషర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్లకు నీళ్ళు ఎత్తిపోసే బృహత్ పథకం కాళేశ్వరం, మల్టీ పర్పస్ ప్రాజెక్ట్ కాళేశ్వరం. తెలియని వాళ్ళు ఏదేదో మాట్లాడతారు. వాస్తవాలు ఈ విధంగా ఉన్నాయి.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, ప్లీజ్ సబ్జెక్ట్ డీవియేట్ కాకుండా రైతు బంధు, రైతు భరోసా మీద సూచనలు, సలహాలు ఇవ్వండి.

శ్రీ కె.తారక రామారావు :- ఎక్కడ డీవియట్ అయ్యాను సార్. కాళేశ్వరం వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందని అంటున్నాను. పెరగలేదని అంటే వాళ్ళను చెప్పమనండి మేమేమి వద్దని అంటున్నామా? అధ్యక్షా, ఈ విధంగా పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, అదే విధంగా ఖమ్మం జిల్లాలో వ్యవసాయ శాఖా మంత్రి గారి నియోజకవర్గంలో భక్తరామదాసు పథకం, సీతారామ ప్రాజెక్ట్ దశాబ్దాలు కరవుతో అల్లాడిన తెలంగాణను మా పదేళ్ళ పాలనలో సుభిక్ష తెలంగాణగా, పాడి పంటల తెలంగాణగా చేసింది ఖచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమని బల్ల గుద్ది చెబుతున్నాము. సాగునీటి పారకం 2014లో 62 లక్షల 50వేల ఎకరాలుంటే, ఈనాడు కోటి 60 లక్షల ఎకరానికి చేరింది. 150 శాతం పెరిగిందంటే ఇది వ్యవసాయ విస్తీర్ణం కాదా అధ్యక్షా. రైతు బంధు దీనికి వెన్ను దన్నుగా నిలబడలేదా. అదనంగా సుమారు కోటి ఎకరాలు సాగులోకి తెచ్చామంటే, ఆ సాగు చేయని రైతులకు కూడా ప్రోత్సాహం ఇచ్చామంటే, సాగు చేయని రైతులకు కూడా రైతు బంధు ఇవ్వడం వల్లనే వారికి కూడా మీరు చెప్పిన లెక్క ప్రకారమే మంత్రి గారు 2019-20లో సాగైన విస్తీర్ణం ఒక కోటి నలభై ఒక లక్షల ఎకరాలు. అదే 2020-21కి రెండు కోట్ల నాలుగు లక్షల ఎకరాలకు పెరిగింది. 2021-22కు రెండు కోట్ల పన్నెండు లక్షల ఎకరాలకు పెరిగింది. 2022-23కు రెండు కోట్ల ఆరు లక్షలకు పెరిగింది. 2023-24కు రెండు కోట్ల ఏడు లక్షలకు పెరిగిందంటే, సాగు చేయని వారికి కూడా ప్రోత్సాహం ఇచ్చి సాగు చెయ్యి అంటే, రైతుకు వెన్నుదండుగా నిలబడితేనే పెరిగింది తప్ప, మాటలతో పెరగలేదు అధ్యక్షా. బియ్యం ఉత్పతి తీసుకుంటే తెలంగాణ రైతులు మనమందరం గర్వపడే విధంగా వారు కూడా వ్యవసాయం చేశారు. 2013-14లో తెలంగాణ రాష్ట్రం బియ్యం ఉత్పతి 57 లక్షల టన్నులు. అది 2023-24 నాటికి కోటి 62 లక్షల టన్నులకు పెరిగింది. ఆనాటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 2013-14లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు కలిపి కూడా FCI కి మొత్తం జోకిన ధాన్యం 81 లక్షల టన్నులు అధ్యక్షా. కాని, అక్కడి నుండి 2021కి వస్తే, కేవలం ఆరేండ్లలోనే 95 లక్షల టన్నులు ఒక్క తెలంగాణ రైతులు పండించిన ధాన్యమే FCI కొనలేక చేతులెత్తేసే పరిస్థితి వచ్చిన మాట వాస్తవమా కాదా గౌరవ వ్యవసాయ మంత్రి గారిని అడుగుతున్నాను. అధ్యక్షా, పదేళ్ళలో కేసీఆర్ గారి ప్రభుత్వంలో రైతన్నల నుండి మా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం విలువ లక్షా ముప్పై నాలుగు వేల కోట్లు అనే మాట నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆనాడు 2014-15లో 24 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తే..

(ఈ సందర్భంగా శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్ గారిని కోరడం జరిగింది)

వారికేం సంబంధం సార్, నా తరువాత వారికి ఇవ్వండి. Iam not yeilding sir. నా తరువాత వారే మాట్లాడతారు I am not yeilding sir. 2022-23లో మొత్తం ధాన్యం

కొనుగోలు కోటి ముప్పై లక్షల టన్నులకు పెరిగింది. అధ్యక్షా, కల్లం నిండా ధాన్యం వచ్చింది, కళ్ళ నిండా ధైర్యం వచ్చింది. తెలంగాణలో ఎటు చూసినా పచ్చని పొలాలు, పంట రాసులు కనపడుతున్నాయి. పంజాబ్, హర్యాన రాష్ట్రాలను తలదన్నే విధంగా దేశనికే ధాన్యాభాండాగారంగా మార్చింది తెలంగాణను ఖచ్చితంగా కేసీఆర్ ప్రభుత్వమే. ఈ విషయంలో ఎవరికి ఎటువంటి అనుమానాలు అవసరం లేదు.

ఒకప్పుడు తెలంగాణ నుండి రైతులు వలసలు పోయేవారు. కాని, ఈనాడు మన తెలంగాణకు వలసలు వస్తున్నారు. ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒరిస్సా, బీహార్ నుండి పక్క రాష్ట్రాల కూలీలు మన రాష్ట్రానికి వస్తున్న మాట వాస్తవం కాదా అధ్యక్షా? ఆ కూలీలు పత్తి చేళ్ళలో పత్తి ఏరుతున్న మాట వాస్తవం కాదా అధ్యక్షా? ఈనాడు వలసలు వాపస్ అయ్యాయి. పల్లెలు కళకళలాడుతున్నాయి. అదే విధంగా పాత ఇండ్లు సర్దుకుంటున్నారు, కొత్త ఇండ్లు కట్టుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇమ్మీ కూడా వ్యవసాయం పండగగా మారిందని చెప్పడానికి ఒక సంకేతం అని తెలుపుతున్నాను. ఒక్కొక్క ఊరిలో బోడ్రాయి పండుగను లక్షలు ఖర్చు పెట్టి చేస్తున్నారు. ఎందుకంటే, వ్యవసాయం బాగైంది, సాగు బాగైంది, రైతు బాగవడం వల్లే లక్షలు ఖర్చు పెట్టి చేస్తున్నారు అధ్యక్షా. మేము ఢిల్లీకి పోయి కేంద్ర మంత్రి గారిని అడిగాము. బియ్యం కొంటామని అంటున్నారు కాని, ఎందుకు కొనట్లేదని అడిగాము. ఆయన అన్నాడు, ఇంత ఎట్లా పెరుగుతుంది ఏం చమత్కారం చేశారని వారు అన్నారు. చమత్కారం కాదు, బృహత్కార్యం చేసినం కాబట్టే, బ్రహ్మాండంగా అల్టిమేట్‌గా ధాన్యం కొనుగోలు పెరిగాయి.

రైతు ఆత్మహత్యలు తగ్గాయి. 2014లో 1347 రైతు ఆత్మహత్యలుంటే, ఈరోజు 215కి తగ్గాయి. ఇమ్మీ కూడా వాస్తవాలు. రైతు పచ్చ బడితే, కొందరికి కళ్ళు ఎర్రబడుతున్నాయి. అన్నదాత బాగుపడితే కొంతమంది ఓర్వలేకపోయారు. వందల ఎకరాల పేద రైతులకు లాభం చేసే రైతు బంధు మీద దుష్ప్రచారం చేశారు. తెలంగాణ బడుగు బలహీన వర్గాల రాష్ట్రం. నూటికి 95 శాతం మంది బక్క రైతులు, చిన్న సన్నకారు రైతులే అధ్యక్షా. వారికి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం, మా దగ్గర ఉన్న లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ లెక్కలు మీరు, సభ్యులు కూడా వినాలి. తెలంగాణాలో రైతాంగం లెక్కలు తీస్తే, 91.33 శాతం లబ్ధిదారులు ఐదెకరాల కంటే తక్కువ ఉన్నవారు. 5 నుండి 10 ఎకరాల భూమి ఉన్నవారు 7.28 శాతం, 10 ఎకరాల పైబడి ఉన్నవారు ఎంత మంది ఉన్నారంటే 1.39 శాతం మాత్రమే. 25 ఎకరాలు ఉన్నవారు 0.09 శాతం. అంటే, రూ. 72 వేల కోట్లు రైతు బంధులో పెద్దాళ్లకు ఇచ్చారని ప్రచారం చేశారు. 1.39 శాతం మాత్రమే 10 ఎకరాల పైబడి ఉన్నవారికి పోయింది. 80 శాతం లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారు. అందులో బీసీలు 54 శాతం, ఎస్సీలు 13 శాతం, ఎస్టీలు 13 శాతం, 70 శాతం రైతు బంధు నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల ఖాతాలో పడ్డాయి. మేము ఇందాక మంత్రి గారికి చెప్పాను. మళ్ళీ ఇప్పుడు కూడా చెబుతున్నాను. నాలుగన్నర ఎకరాలకు ROFR పట్టాలిచ్చాము. పోడు భూమిలో ఒక పంట మాత్రమే పండుతుంది. దయచేసి నేను మంత్రి గారిని అడుగుతున్నాను. తప్పు చేయకండి. కేవలం ఒకే పంట పండుతుంది కాబట్టి గిరిజన రైతులకు కోత పెడతాము, రేపటి రోజున రెండో పంటకు ఇవ్వము, ఒకటే పంట పండే పరిస్థితి ఉంటే మంచిది కాదని విజ్ఞప్తి చేస్తున్నాను. మట్టిని నమ్ముకున్న రైతుకు ఎంత చేసినా, ఎంత ఇచ్చినా తక్కువేనని నేను సూచన చేస్తున్నాను అధ్యక్షా. కానీ, అన్నదాతల విషయంలో కోతలు ఎగవేతలు పెట్టుకుందామని చూస్తున్నారు. రైతుకు చేసిన సహాయాన్ని దాన ధర్మం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అన్నదాతకు ఇచ్చే భరోసాను భారంగా చూడకండి, బాధ్యతగా చూడండి. ప్రత్యక్షంగా 47 శాతం మందికి వ్యవసాయం ఉపాధి కల్పిస్తుంది. పరోక్షంగా కూడా కలుపుకుంటే 65 శాతం ప్రజలకు ఈ రాష్ట్రంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ

రంగాల మీదే వాళ్ళ బ్రతుకుదెరువు ఉన్నది. పరిశ్రమల మంత్రిగా చేసిన నాకు తెలుసు. పరిశ్రమలకు రెడ్ కార్పెట్ వేసి పెద్ద పెద్ద ప్రోత్సాహకాలు ఇస్తాము. కానీ రైతు విషయానికి వస్తే, కటింగులు పెట్టే ప్రయత్నం చేస్తున్నాము. ఇది మంచిది కాదనే మాట వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

11.30 ఉ. అధ్యక్షా, కొంతమంది ఎన్నికలకు ముందు ముష్టి 10వేల రూపాయలు ఎందుకు, ఎకరానికి 15వేల రూపాయలు ఇస్తాం, వెంటనే ఇస్తాం అని చెప్పారు. మీరు డిసెంబర్ 3వ తేదికి ముందు తీసుకుంటే 7వేల 500 రూపాయలు వస్తాయి తరువాత అయితే 15వేల రూపాయలు ఇస్తామని చెప్పిన వారు ఉన్నారు. రెండు పంటలకు కాదు, మూడు పంటలకు ఇవ్వాలని మాట్లాడారు అధ్యక్షా. దానితో పాటు ఇప్పుడు తీసుకుంటే 5వేల రూపాయలు, డిసెంబర్ 3వ తేది తరువాత తీసుకుంటే 7వేల 500 రూపాయలు వస్తాయని అన్నారు. యాసంగి రైతు బంధుకు పైసలు ఆపాలని ఉత్తరాలు రాశారు. ఉత్తరాలు కూడా మా దగ్గర ఉన్నాయి అధ్యక్షా. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇప్పటి వరకు రైతు బంధు లేదు, భరోసా లేదు. నేను విమర్శ చేయను అధ్యక్షా కానీ, వాస్తవం అధ్యక్షా. ఒక్కొక్క రైతుకు ...,

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- గౌరవ రామారావు గారికి ఇందాక చెప్పాను అధ్యక్షా, మళ్ళీ చెబుతున్నాను. ఆర్ఓఎఫ్ఆర్ వారికి కట్ చేస్తామని గానీ, లేదు రైతు భరోసాలో కట్టింగులు పెడ్తామని గానీ, ఈ ప్రభుత్వం ఇంతవరకు చెప్పలేదు. గౌరవ సభ్యుల సూచనల మేరకు మేము వెళ్తామని చెప్పడం జరిగింది. ఏమి కావాలో చెప్పండి, ఏ రకంగా ఇవ్వాలో చెప్పండి. చిన్న కారు రైతులు, పెద్ద కారు రైతులని చెప్తున్నారు. మనమిచ్చిన జి.ఓ నెం. 231 ప్రకారంగా ఈ యొక్క రైతు బంధు పంట వేసిన రైతులకు ఇవ్వమని ఉన్నది. అంతే తప్ప పంట వేయని రైతులకు ఇచ్చారు, దాని వల్ల 20వేల కోట్ల రూపాయలు పంట వేయని రైతుల జేబుల్లోకి పోయాయని మీ ముందు సమాచారం పెట్టాము తప్ప, పంట వేసిన రైతుకు ఒక ఎకరానికి కూడా తగ్గించలేదు. అయినా సరే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గత మార్చి, ఏప్రిల్ నెలలో మీరివ్వని రైతు బంధు పథకాన్ని 7వేల 625 కోట్ల రూపాయలు ఒకే ఒక రాత్రి రిలీజ్ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం, మా రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కాబట్టి మేము మీరివ్వని పంటను మార్చి, ఏప్రిల్‌లో ఇచ్చి మళ్ళీ కొత్త విధి విధానాల కోసం, గతంలో జరిగిన చరిత్రను మీముందు పెట్టాము తప్ప ఈ ప్రభుత్వం ఇంతవరకు ఏ నిర్ణయం చేయలేదు. ఈ సభలో సభ్యుల యొక్క నిర్ణయం తీసుకున్న తరవాతనే క్యాబినెట్ ద్వారా మా అభిప్రాయం ప్రకటిస్తాము. గౌరవ సభ్యులు దానిని గమనంలోకి తీసుకోవాలని చెప్పి విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :- కంక్లూడ్ చేయండి కేటీఆర్ గారూ..,

శ్రీ కె. తారక రామారావు :- ఎక్కడ కంక్లూడ్ చేయాలి అధ్యక్షా, వారింత సేపు డిస్టర్బ్ చేశారు. ఒక 20 నిమిషాలివ్వండి కంక్లూడ్ చేస్తాను. అధ్యక్షా, ఒక్కొక్క రైతుకు..., మీరు ఆపి పెట్టిపోయారు, మేమిచ్చామని మంత్రి గారు అన్నారు. వారు చెప్పింది వారికి గుర్తు చేస్తున్నాను అధ్యక్షా, ఎన్నికల కోడ్ వచ్చింది కాబట్టి, ఆనాడు రైతు బంధు మా ప్రభుత్వంలో ఉన్నప్పటికీ.., పదకొండు సీజన్లు ఇచ్చాము అధ్యక్షా. పన్నెండవ సీజన్‌కు ఇవ్వకపోతిమా. ఎన్నికల కోడ్ వచ్చింది, ఆగింది. మరి మీరేమన్నారు అధ్యక్షా. డిసెంబర్ 3వ తేదికి ముందు తీసుకుంటే 5వేలు అన్నారు. డిసెంబర్ 3వ తేదికి తరువాత తీసుకుంటే 7వేల 500 రూపాయలన్నారు. ఈ లెక్క ప్రకారం ఇచ్చారా అధ్యక్షా. 7,500 రూపాయలిచ్చారా. మంత్రి గారు చెప్పాలి. ఇవ్వలేదు అధ్యక్షా.

అధ్యక్షా, మార్పు, మార్పు, మార్పు అని ఊదరగొట్టారు అధ్యక్షా. మార్పు అంటే రైతు బంధు పేరు మార్చి, రైతు భరోసా పేరు పెట్టారు. పైసలు మాత్రం అవే. రైతులు 7,500 రూపాయలు అవుతాయని అనుకున్నారు కానీ కాలేదు. అందుకే నేను అంటున్నాను అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఒక్కొక్క

రైతుకు బాకీ పడింది. ఒక్కొక్క రైతుకు ఈ రోజు వరకు మీరు పడ్డ బాకీ..., పోయిన యాసంగికి మీరు రైతు భరోసా అని పేరు మార్చారు కానీ ఎకరానికి 2,500 రూపాయలు అదనంగా ఇవ్వలేదు. నిన్న వానా కాలం మొత్తం రైతు బంధునే ఎగ్గొట్టారు. ఎకరానికి 7,500 రూపాయలు ఇవ్వాల్సి ఉండే, మీరు ఇవ్వలేదు. మొత్తం ఎగ్గొట్టారు. ఇప్పుడు యాసంగి 7,500 రూపాయలు ఇవ్వాలి. రాష్ట్రంలోని రైతుకు ఒక్క ఎకరానికి మీరు 17,500 రూపాయలు బాకీ పడ్డారు. మీరు తిరిగి ఎప్పుడు విధివిధానాల, సబ్‌కమిటీ ఎన్ని చేసినా ఈ 17,500 రూపాయలు మీరు ఖచ్చితంగా రైతుకు బాకీ పడ్డారు. ఇవ్వాలని చెప్పి మేము డిమాండ్ చేస్తున్నాము. అదే విధంగా అధ్యక్షా, రెండు విడుతల రైతు భరోసాతో పాటు ఒక విడత 5,000 రూపాయలిచ్చి ఎగ్గొట్టిన 2,500 రూపాయలు కలిపితే నేనిప్పుడు చెప్పిన లెక్క 17,500 రూపాయలు అధ్యక్షా. మొత్తం 70 లక్షల రైతుల లెక్క తీసుకుంటే మీరు రైతులకు పడ్డ బాకీ 26 వేల 775 కోట్ల రూపాయలు ఖచ్చితంగా వారికి కట్టి ఇవ్వాలని చెప్పి బిఆర్ఎస్ పార్టీ తరఫున మేము మిమ్మల్ని రిక్వెస్టు చేస్తున్నాము అధ్యక్షా.

అధ్యక్షా, మరొక వైపు రుణ మాఫీ గురించి చాలా చెప్పారు. అధ్యక్షా, రైతులు కూడా చాలా చాలా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు మా సోదరులు పెద్దపల్లి ఎమ్మెల్యే గారు కూడా రుణమాఫీ అయిపోయిందని మాట్లాడారు. వాస్తవం ఏంటి అధ్యక్షా..., వీరు ఎన్నికల సమయంలో ఏమి చెప్పారు అధ్యక్షా. ఇప్పటి దాకా రుణాల తెచ్చుకోని వారుంటే కూడా అర్జెంట్ వెళ్ళి తెచ్చుకోమ్మని చెప్పారు. డిసెంబర్ 9వ తేది నాడు సంతకం పెడ్తాము. రెండు లక్షల రుణాలు తెచ్చుకోండి, మేము డిసెంబర్ 9,2023 మొదటి సంతకమే దాని మీద పెడ్తామన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. ఒకటే పెన్ స్ట్రోక్‌తో చేసేస్తామన్నారు. కానీ అధ్యక్షా, ఈ రాష్ట్రంలో జరిగింది ఏంటి. వీరి ప్రభుత్వం రాగానే డిసెంబర్ 7,2023న SLBC (State Level Bankers Committee) మీటింగ్ పెట్టారు. అందులో మొత్తం 2లక్షల వరకు రుణమాఫీ చేయాలంటే 49 వేల 500కోట్ల రూపాయలు కావాలని బ్యాంకర్స్ చెప్పారు. మరి ప్రభుత్వం, ముఖ్యమంత్రి గారు బయట ఎక్కడో మాట్లాడుతూ, చెప్పారు. మైక్‌లో చెప్పారు .. కావాలంటే మీరు అనుమతిస్తే రికార్డు ఉంది ప్లే చేయమంటే చేస్తాను అధ్యక్షా. ముఖ్యమంత్రి గారు చెప్పారు, ఏముంది ఇందులో, మేము ఒక సంవత్సరం కడుపు కట్టుకుంటే 40 వేల కోట్లు కట్టేస్తాం, ఏమున్నది అన్నారు. మరి సంవత్సరం అయిపోయింది 40 వేల కోట్లు పత్తా లేదు అధ్యక్షా. మరి కడుపు కట్టుకున్నారా, కట్టుకోలేదా ఇంకేమి చేశారో మాకు తెలియదు, వారే చెప్పాలి.

అదే విధంగా, ఎస్ఎల్‌బిసి 49 వేల 500 కోట్ల రూపాయలు అన్నారు, ముఖ్యమంత్రి గారు 40 వేల కోట్ల రూపాయలు అన్నారు, మళ్ళీ వెంటనే క్యాబినెట్ దగ్గరకు వచ్చే వరకు 31వేల కోట్ల రూపాయలైంది. మరి లెక్కలు ఎట్లా మాయమవుతాయి? 49 వేల కోట్లు నుంచి 40 వేల కోట్లైంది, క్యాబినెట్ వచ్చే వరకు 31వేల కోట్ల రూపాయలైంది, బడ్జెట్‌కు వచ్చే వరకు ఇది 26 వేల కోట్ల రూపాయలైంది. మొన్న పాలమూరు లో విజయోత్సవం జరిపినప్పుడు మొత్తం జరిగింది 19 వేల కోట్ల రూపాయలని చెప్తున్నారు. ఈ ప్రభుత్వానికి నేను సవాలు చేస్తున్నాను. రాష్ట్రంలోని ఏ ఊరికైనా పోదాం, కొండారెడ్డిపల్లికి పోదామా, కొడంగల్‌కు పోదామా, సిరిసిల్లకు పోదామా, పాలేరు పోదామా వాళ్ళిష్టం. ఖచ్చితంగా ఏ ఒక్క ఊరిలోనైనా 100 శాతం రుణమాఫీ జరిగిందని రైతులు చెప్తే స్పీకర్ ఫార్మాట్‌లో మీకు వెంటనే రాజీనామా ఇచ్చి, రాజకీయ సన్యాసం తీసుకుంటాను అధ్యక్షా. ఏ ఒక్క ఊరిలోనైనా సరే..., ఈ రకమైన బుకాయింపు, ఈ రకమైన మోసం మంచిది కాదు. పావలా కూడా రైతు రుణమాఫీ జరగలేదు. 49 వేల 500 కోట్లని చెప్పి ఇప్పటి వరకు 12 వేల కోట్ల రూపాయలు కూడా చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ రోజు

ముఖ్యమంత్రి గారు ఒక మాటన్నారు, రైతు బంధు ఎందుకు అగిపోతుంది, మీమేన్న దీవాళాగాళ్ళమా, హౌలాగాళ్లమా అని మాట్లాడారు. మరి ఈ రోజు వానా కాలం రైతు బంధు ఎగ్గొట్టిన వాళ్ళను ఏమనాలి అధ్యక్షా ముఖ్యమంత్రి గారి మాటల్లో? అందుకే అంటున్నాం, ఒక పంట కాదు, మూడు పంటలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ మూడు పంటలను ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాం. నిన్న భూభారతి చట్టం తీసుకొచ్చారు. అందులో అనుభవదారుడి కాలం పెట్టారు. నేను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మీరే రైతులకే కాదు, కౌలు రైతులకు కూడా ఇస్తామని చెప్పారు.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ కంక్లూడ్ చేయండి. ఎందుకంటే...,

శ్రీ కె. తారక రామారావు :- నేను వేరే ఏమన్న మాట్లాడుతున్నానా? సబ్జెక్టే మాట్లాడుతున్నాను. రైతు భరోసా మీద మాట్లాడుతున్నాను. అధ్యక్షా, అనుభవదారుడి కాలం పెట్టారు, జమాబందు అని రాశారు, మరి అనుభవదారుడి కాలం పెడితే నేను అడుగుతున్నాను అధ్యక్షా, దయచేసి చెప్పండి, అనుభవదారుడి కాలం పెట్టారు. ముఖ్యమంత్రి గారు ఎన్నికల ముందు చెప్పారు. కౌలు రైతుకు, భూ యజమానికి కూడా ఇస్తామని చెప్పారు. ఈ రోజు ప్రభుత్వం స్పష్టం చేయాలి, రైతుకు ఇస్తామని చెప్పారు, కౌలు రైతుకు ఇస్తామని చెప్పారు, రైతు కూలీలకు ఇస్తామని చెప్పారు, తప్పకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఇంకా చెప్పాలంటే ఈనాడు పేపర్‌లో ఒక ప్రకటన ఉంది, కావాలంటే చూపెడుతాను. మొదటి వంద రోజుల్లోనే ఇస్తామని కూడా చెప్పారు. మాట నిలబెట్టుకోలేదు. ఎన్నికల ప్రచారంలోనేమో అందరికీ అన్ని, ఇప్పుడు మాత్రం కొందరికే కొన్ని అని కోతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అన్నింటికీ మించి బడ్జెట్‌లోనే వీళ్ళ చిత్తశుద్ధి బయటపడింది. మంత్రి గారేమో రైతు భరోసా మీద మేము నిర్ణయం తీసుకోలేదంటున్నారు. కానీ, బడ్జెట్‌లోనే వీళ్ళ చిత్తశుద్ధి బయటపడింది. బడ్జెట్‌లో ఏమి చెప్పారు? రైతు భరోసాకి కేవలం 15వేల కోట్లు కేటాయించింది. మీకు నిజంగా పెంచాలన్న మాట వాస్తవమైతే, నూరు రోజుల్లో రైతు భరోసా పెంచుతామనే మాట వాస్తవమైతే మీరు 15వేల కోట్ల రూపాయలే ఎందుకు కేటాయించారు? ఎకరానికి 7వేల 500 రూపాయలైతే ఎందుకు మీరు 23వేల కోట్ల రూపాయలు కేటాయించలేదు. 70 లక్షల మంది రైతన్నలకు మీరు 15వేలు ఇవ్వాలంటే 23వేల కోట్ల రూపాయలు కావాలి. మీరు పెట్టలేదంటేనే చిత్తశుద్ధి అర్థమవుతున్నది. కోతలకు సిద్ధపడిన తరువాతనే మంత్రివర్గ ఉపసంఘం వేశారు. ఈ రోజు మీరు టైం పాస్ చేస్తున్నారు. ఖచ్చితంగా చెప్తున్నాను. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసి కాలక్షేపం చేస్తున్నారు. మీరు ఇవ్వ దలచుకోలేదు. వానా కాలం రైతు బంధు ఎగ్గొట్టినట్టే, భవిష్యత్తులో రైతు బంధు ఎగ్గొట్టే ప్రయత్నంలో మీరున్నారు. అందుకే ఈ రోజు రైతు మిమ్మల్ని నమ్మడం లేదు. రైతును అవమానించే ప్రయత్నం చేస్తున్నారు. పెద్దవాళ్ళకు ఇస్తున్నారు, పెద్దవాళ్ళకు ఇస్తున్నారు, దుర్వినియోగం అయిపోయింది అని కావాలని ఆంక్షలు పెడ్తాము, అగ్ని పరీక్షలు పెడ్తామని చెప్పి నిందలు వేస్తామని మాట్లాడుతున్నారు. అధ్యక్షా, మేనిఫెస్టోలో పెట్టినప్పుడు ఇవ్వన్ని ఎందుకు చెప్పలేదు? ఆనాడు అందరికీ అన్ని, ఈనాడు కొందరికే కొన్ని, ఇప్పుడు కోతలు పెడ్తామని అప్పుడు ఎందుకు చెప్పలేదు అధ్యక్షా. అందుకే అధ్యక్షా? ఐటి కట్టేవాళ్ళకు..., ఈ రాష్ట్రంలో అధ్యక్షా, పాన్‌కార్డులు ఎన్ని ఉన్నాయో తెలుసా అధ్యక్షా. ఈ రాష్ట్రంలో కోటి పై చిలుకు పాన్ కార్డులున్నాయి.

11.40 ఉ. అధ్యక్షా, ఈ రాష్ట్రంలో పాన్‌కార్డులు ఎన్ని ఉన్నాయో తెలుసా? ఈ రాష్ట్రంలో కోటి పైచిలుకు పాన్‌కార్డ్‌లున్నవి. మరి రేపటిరోజున పాన్‌కార్డ్‌లు ఉన్నవాళ్లందరికి పైసలు కట్ చేస్తామంటే ఐటి కట్టే వారికి కట్ చేస్తామంటే ఎట్లా కుదురతది? లీకులిచ్చి రాయిస్తున్నరు గుట్టలకు, పుట్టలకు రైతుబంధు అని

కట్టుకథనాలు రాయిస్తున్నరు. ఉపసంఘం నివేదికలో సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. రైతుబంధు పథకం ఉసురు తీయబోతున్నరు, ఊరేయబోతున్నరని మా అనుమానం. ఉపసంఘం నివేదికను కచ్చితంగా రాష్ట్రప్రజల ముందు పెట్టాలి, శాసనసభ ముందు పెట్టాలి. నేనొక్కటే అడుగుతున్నాను ప్రభుత్వ ఉద్యోగులకు, ఐటి చెల్లింపుదారులకు వారికి రైతుబంధు కట్ చేస్తారా? గౌరవ మంత్రిగారు చెప్పాలి. ప్రభుత్వ ఉద్యోగులకు భూముకున్న బంధాన్ని తెంపేస్తారా, వారు రైతు బిడ్డలు కారా? వారి భూమి పుత్రులు కారా? రైతు బిడ్డ ఉద్యోగైతే వారికి కటింగ్ పెడుతారా తప్పకుండా చెప్పాలి. తరతరాలుగా సాగుతున్న భూమిని, సాదుకున్న భూమిని,సాగు చేస్తున్న వ్యవసాయాన్ని మరి వ్యాపారంగా చూస్తారా?

ఈ రోజుల్లో ఉన్న రుణ వ్యవస్థ ప్రకారం, అర్హతల ప్రకారం, గ్రామాలలో ఐటి చెల్లించేవారున్నారు,పాన్‌కార్డులు ఉన్న వారున్నారు, రైతులకు కూడా పాన్‌కార్డ్‌లున్నాయి పాన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకుంటే వారందరికి కూడా రైతుబంధు కట్ అయ్యే ప్రమాదం ఉందని వారు భయపడుతున్నరు. ఖజానాలో సొమ్మంతా కర్షకుడే మింగేసినట్టు గోరంతలు కొండంతలు చేసి ప్రాపగాండా చేస్తున్నారు ఇది మంచిది కాదు అధ్యక్షా. ఒక పక్క ఈ బీజేపి పార్టీ వారు దేశంలో పద్నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు పెద్ద పెద్ద బడా వ్యాపారవేత్తలకు మాఫీ చేశారు. వారేమో సొమ్ము ఎగవేసి, బ్యాంకులను లూటీ చేసి పారిపోతరు, వారిని పట్టుకొనేవారు లేరు, అడిగేవారు లేరు, కానీ రైతులకాడికొచ్చేసరికి రైతులు మొత్తం ఖజానా మింగేసినట్టు, వారి వల్లనే రాష్ట్ర ఖజాన దివాళ తీసినట్టు, అప్పులపాలు అయినట్లు, ఇవాళ మాట్లాడుతున్నరు. అప్పులు ఎగ్గొటి బ్యాంకులను నిండా ముంచేస్తుంటే వారిని ఏమీ అనలేని ధైర్యం లేని ప్రభుత్వం. పోయి పోయి రైతులే దొరికారా అప్పులు రికవరీ చేసుకోవడానికి.....

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి :- ధన్యవాదాలు అధ్యక్షా, కేటిఆర్ గారు పదే పదే కావాలని చెప్పి ప్రొవెకేట్ చేసుకుంటూ మాట్లాడుతున్నరు కదా? నిజంగా వారు మాట్లాడలనుకుంటే ఒక చర్చ పెట్టండి, అన్నింటి మీద మేము చర్చకు సిద్ధంగా ఉన్నము. ఈ రోజు సివిల్ సప్లయ్స్ గురించి మాట్లాడారు, ఎఫ్‌సిఐ గురించి మాట్లాడారు. అతి పెద్ద స్కామ్ వారి హయాంలోనే మొదలైంది అధ్యక్షా. రైస్ మిల్లర్ల దగ్గర వేల కోట్ల రూపాయల ప్యాడీని ప్రొక్యూర్‌మెంట్ చేయించి వారి దగ్గర లంచాలు తీసుకొని వేలకోట్ల రూపాయల ప్రొక్యూర్‌మెంట్ వారి దగ్గర రికవరీ చేయకుండా వారు చేసిన స్కామ్‌ల గురించి మాట్లాడుదామంటే మాట్లాడుదాం అధ్యక్షా. ఇరిగేషన్ గురించి మాట్లాడదామంటే మాట్లాడదాం. కాళేశ్వరం గురించి అన్నారు, కాళేశ్వరం అనేది ఈ భారతదేశంలోనే అతి పెద్ద స్కాం, దాని గురించి మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నాం గనుక మీరు అనుమతిస్తే తప్పకుండా మాట్లాడతాం. సమావేశాలను ఇంకొక వారం పెంచమన్నారు, అలాగే పెంచండి. వారం రోజులపాటు ఏ సబ్జెక్టు మీద అంటే దాని మీద మేం మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నాము. ఈ రకంగా అన్యాయంగా కేంద్ర ప్రభుత్వం గురించి గాని, ఇంక దేని గురించి గాని మాట్లాడినా మేం ఊరుకునే సమస్యనే లేదు. దాని మీద చర్చ పెడితే మేం మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నాము. ఈ రకంగా మా మీద అభాండాలు వేయడం మంచి పద్ధతి కాదు. వారు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు గనుక నేను ఎక్కువ మాట్లాడదల్చుకోలేదు.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, కంక్లూడ్ చేయండి.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్షా, మధ్య మధ్యలో ఇంటరప్షన్స్ ఉంటే ఎలా కంక్లూడ్ చేస్తాము? ఎంత మంది మంత్రులు మధ్యలో లేచి మాట్లాడుతున్నారు? చివరికి బిజెపి సభ్యులకు కూడా మధ్యలో మాట్లాడే అవకాశమిస్తున్నారు.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, మీరు 10.30 గంటలకు మీ ప్రసంగాన్ని మొదలు పెట్టారు. ఇప్పుడు 11.45 అవుతున్నది. 22 నిమిషాలు డిస్టర్బెన్స్ అయింది. దయచేసి కంక్లూడ్ చేయండి.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్షా, మీరు హౌస్‌ను ఆర్డర్‌లో పెట్టండి. అప్పులు ఎగ్గొట్టి బ్యాంకులను నిండా ముంచేస్తుంటేనేమో బడా .....

శ్రీ జూపల్లి కృష్ణారావు :- అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు కేటీఆర్ గారు మాట్లాడుతూ ప్రధానంగా రెండు, మూడు విషయాలను ప్రస్తావించారు. ఒకటి పాలమూరు జిల్లాను వారి హయాంలో సస్యశ్యామలం చేశామని చెప్పారు. రెండవది ఈనాడు రైతు భరోసా గురించి ఈ ప్రభుత్వం ఇదెందుకు చేయలేదు, అదెందుకు చేయలేదని మాట్లాడారు. పాలమూరు జిల్లాను వారు సస్యశ్యామలం చేశామని అంటే..... ఎన్నికల ముందు ఒక పంపును ఆన్ చేసి నార్లాపూర్ రిజర్వాయర్‌లో పోసి ప్రాజెక్టు పూర్తయింది, జాతికి అంకితం చేస్తున్నామని చెప్పారు. ఇది నిజమా అబద్ధమా? ఈరోజుకు కూడా ఒక సెంటుకు గాని ఒక గుంటకు గాని ఏ రిజర్వాయరుకు మొత్తం అయిదు లిఫ్టులుంటే రెండవ లిఫ్టు వరకే నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. రెండవది ఈనాటికి కూడా కాలువలకు గాని మిగతా దానికి గాని ఇప్పటివరకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ లేదు. ఇంకా 40, 50వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే తప్ప సాగునీరు వచ్చే పరిస్థితి లేదు.

మిషన్ భగీరథ గురించి కూడా వారు మాట్లాడుతుంటే నేను విన్నాను. ఈరోజు నేను ప్రూవ్ చేస్తాను. ఇరిగేషన్‌కు సంబంధించి మొత్తం పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశామని అంటే కాంగ్రెస్ హయాంలోనే ఆనాడు స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్వకుర్తి లిఫ్టు అయినా బీమా అయినా, నెట్టెంపాడు అయినా, కోయిల్ సాగర్ అయినా, 8లక్షల ఎకరాలకు ప్రాజెక్టును మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మొదటి లిఫ్టును పంపింగ్ చేసి ఆనాడు శ్రీవారి సముద్రం నింపి నీళ్లు విడిచే కార్యక్రమం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు పరిపాలన చేసిన తరువాత 8లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిన తరువాత ఈనాటికి కూడా ఇదే బీమాలో ఇదే కల్వకుర్తిలో ఇదే నెట్టెంపాడులో ఈనాటికి కూడా భూసేకరణకు సంబంధించి కూడా పేమెంట్లు కానివి చాలా ఉన్నాయి, పూర్తి గాని ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. ఈనాటికి కూడా పూర్తి ఆయకట్టు కూడా రాలేదు.

లక్ష్మీదేవిపల్లిని రిజర్వాయర్ చేస్తామని గత పాలకులు చాలా మాట్లాడారు. ఆనాడు కెసిఆర్ గారు కుర్చీ వేసుకొని అక్కడ కూర్చుని ప్రాజెక్టును కట్టిస్తానని అన్నారు. సంవత్సరంలో రెండు ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. అంటే పది సంవత్సరాల కాలంలో 8లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నది. మిషన్ భగీరథ గురించి నేను వంద శాతం రుజువు చేస్తాను..... ఈరోజుకు కూడా మెజారిటీ గ్రామాలలో అంటే 60 నుంచి 70శాతం గ్రామాలలో మంచినీళ్లు రావడం లేదు. ఏ పద్ధతిలో ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి దాంట్లో ఏం జరిగిందనేది కూడా నాకు తెలుసు, సమయం వచ్చినప్పుడు చెబుతాం. ఇప్పటికి కూడా ఆ డిజైన్ ప్రకారం ఎక్కడ కూడా నీళ్లు కరెక్టుగా రావడం లేదనేది నేను రుజువు చేస్తాను. ఇందాక రామారావు గారు మాట్లాడుతూ రుజువు చేస్తే నేను ఇప్పుడే నా పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఆ సవాల్‌కు నేను కూడా సిద్ధంగా ఉన్నాను. పాలమూరు ప్రాజెక్టు అయినా ఇతర ప్రాజెక్టుల్లోనైనా చాలా జరిగాయి, చాలా లోపాలున్నాయి.

అంతే కాకుండా సభ్యులు కాళేశ్వరం గురించి మాట్లాడారు. కాళేశ్వరానికి ఆ స్థాయిలో ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అందులో ఏం జరిగిందో తెలియదా అని అడుగుతున్నాను. బిఆర్ఎస్ పార్టీ సభ్యులు ఎందుకు రైతు భరోసాను ఆలస్యం చేస్తున్నారని మాట్లాడుతున్నారు. అసలు ఈ రకంగా కావడానికి కారకులెవరని

అడుగుతున్నాను. రాష్ట్రాన్ని 64 సంవత్సరాలలో సుమారు 16మంది ముఖ్యమంత్రులు పరిపాలన చేస్తే ఆనాడు ఉన్నటువంటి అప్పు 70వేల కోట్ల రూపాయలు. ఈ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి పది సంవత్సరాలలో 7 లక్షల కోట్ల రూపాయల చిల్లర అప్పు ప్లస్ విద్యుత్తు ఛార్జీలు మొత్తం కలిపితే 8 లక్షల కోట్ల రూపాయలు.

గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న హరీష్‌రావును నేను ప్రశ్నిస్తున్నాను. నిజాయితీ చెప్పడానికి కూడా ధైర్యం కావాలి. గత శాసనసభలో ఇక్కడి నుంచే నేను మాట్లాడాను. ఈ మధ్య కాలంలో కూడా నేను పత్రికలలో చూశాను. వారు చేసింది 3 లక్షల కోట్ల రూపాయల అప్పు మాత్రమే అని చెప్పడమంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్‌పైన చేసిన అప్పు ఎంత చేశారో ఆ అప్పుకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినప్పుడు ఈ అప్పు కట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందా అని అడుగుతున్నాను. రైతుల దగ్గర మీరు ఆ డబ్బులను వసూలు చేసి కడతారా అనేది చెప్పండి. అలాగే మిషన్ భగీరథలో అప్పు చేశారా లేదా అనేది చెప్పండి. ఇవ్వాళ రైతుల నుంచి ఆ 50వేల కోట్ల రూపాయలను వసూలు చేసి కడతారా? ప్రభుత్వం వాటిని కట్టొద్దా? అందువల్ల మనం చాలా నిజాయితీగా మాట్లాడాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దు. మాట్లాడిన నాలుగు ముక్కలైనా నిజాయితీగా మాట్లాడాలని నేను ఈ సభ ద్వారా కోరుతున్నాను. ఈరోజు ఈ ఆర్థిక ఇబ్బందులకు కారణం ఎవరు? నెలకు 6వేలా 500 కోట్ల రూపాయలను వడ్డీ మరియు అసలుకు ప్రభుత్వం చెల్లించాల్సి వస్తున్నది. మీరు ఈ అప్పు చేయకపోయి ఉంటే ప్రతి నెలా రైతు భరోసా ఇచ్చేవాళ్లం. దీనికి మొత్తానికి కారకులు గత ప్రభుత్వమై ఉండి మళ్లీ తగుదునమ్మా అని మా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు న్యాయమనేది గౌరవసభ్యులు దయచేసి గమనించాలని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్షా, మంత్రిగారేదో నిజాయితీ గురించి మాట్లాడారు. నిజాయితీ గురించి మాట్లాడాలంటే ఇదే మంత్రిగారు గతంలో కేసీఆర్ గారు గొప్పగా పరిపాలించారని చెప్పిన మాటలు ఉన్నాయి, వాటిని ప్లే చెయ్యమంటే చేస్తాను. రెండవది – హరీష్‌రావు గారు ఇంత స్పష్టంగా శాసనసభలో నిన్న గాక మొన్ననే మొత్తం ఆర్‌బిఐ లెక్కలు వివరిస్తూ సావధానంగా ఏం చెప్పారంటే సంవత్సరానికి మా ప్రభుత్వం కెసిఆర్ గారి ప్రభుత్వం చేసిన అప్పు 40వేల కోట్ల రూపాయలైతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంలోనే చేసిన అప్పు ఒక లక్షా 27వేల కోట్ల రూపాయలు. ఇది ఆర్‌బిఐ లెక్క, రేవంత్‌రెడ్డి లెక్కనో, జూపల్లి కృష్ణారావు గారి లెక్కనో చెల్లదు. ఆర్‌బిఐ లెక్కనే చెల్లుతుంది. వాళ్లు ఒకటే అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేద్దామని అనుకుంటే ప్రజలు నమ్మరు. మంత్రిగారు మాట్లాడుతూ రాజీనామా చేస్తా, ఇది చేస్తా, అది చేస్తా అన్నారు. ఇది మహబూబ్‌నగర్ జిల్లా లెక్క, మహబూబ్‌నగర్‌లో ఆనాడు పెండింగు ప్రాజెక్టులుగా వదిలిపెట్టి పోయిన కెఎల్ఐ, బీమా, నెట్టెంపాడును 4వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన మాట వాస్తవమా కాదా అనేది మంత్రిగారు గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పాలి.

11.50 ఉ. అధ్యక్షా, పాలమూరులో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిన మాట వాస్తవం కాదా? వారు ఏదేదో మాట్లాడుతున్నారు. ఎనిమిది లక్షల కోట్లు అని ఒకాయన, ఏడు లక్షల కోట్లు అని ఒకాయన, పది అని ఒకాయన. నోటికి ఎంత వస్తే అంతేనా మంత్రులు? మంత్రులంటే చదువుకొని రావాలి. ఎటువటిదే అటు మాట్లాడుతాం, ఇష్టం వచ్చినట్లు అంటే ఎట్లా? సార్. అధ్యక్షా, ఏంసార్ ఇది.

శ్రీ జూపల్లి కృష్ణారావు :- అధ్యక్షా, గౌరవ సభ్యులు ఛాలెంజ్ చేస్తున్నారు. స్వయంగా మీరు అరగంట సమయం ఇచ్చి రికార్డు తెప్పించండి. వాళ్లు రెండింటికి

ఒప్పుకోవాలి. వాళ్లు మిషన్ భగీరథకు మరియు సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పును రైతులు భరిస్తరు, వీళ్లు కాదు, ప్రజలు భరిస్తారని చెప్పండి. లేదంటే, తప్పని ఒప్పుకోండి. ఈ రెండు నిజం కాదంటే నేను సిద్ధంగా ఉన్నాను. నేను మాటకు కట్టుబడి ఉంటాను. అందుకనే అంటున్నాను. నిజం చెప్పడానికి ధైర్యం ఉండాలి. సభ ద్వారా ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దు.

మిస్టర్ స్పీకర్ :- కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ కె. తారక రామారావు :- ఎట్లా సార్. ఇన్నిసార్లు డిస్టర్బ్ చేసి కన్‌క్లూడ్ అంటే? మధ్యలో లేవనెత్తిన ప్రశ్నలకు క్లారిఫికేషన్ ఇవ్వవద్దా సార్? మధ్యలో డిస్టర్బ్ చేయవద్దని వారికి చెప్పండి సార్. మధ్యలో ఒకరి తరువాత ఒకరు లేస్తే ఏం చేస్తం? అధ్యక్షా, వారు అడిగిన ప్రశ్నకే సమాధానం చెబుతున్నాను.

(పాలకపక్ష సభ్యుల నుండి అంతరాయం)

ఆర్డర్‌లో పెట్టండి సార్. ఇదేం పద్ధతి సార్. రైతులకు మీరు ఉచితంగా ఇచ్చారా? అని అడిగారు. ఎస్, తొమ్మిదున్నర ఏండ్లు రైతులకు నీళ్లు ఉచితంగానే ఇచ్చాం. భూమి శిస్తు, నీటి తీరువా రద్దు చేశాం. ఎస్, రైతులకు ఉచితంగా నీళ్లు ఇచ్చేందుకు వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు కట్టాం. భవిష్యత్తులో మా ప్రభుత్వం మళ్లీ వచ్చిన తరువాత కూడా అదే పాలసీ కంటిన్యూ చేస్తుంది. తాగునీరు ఉచితంగానే ఇచ్చినాం. బరాబర్ రేపు మళ్లీ వచ్చిన తరువాత కూడా అట్లాగే ఇస్తాం, అందులో అనుమానం అక్కర లేదు. నిజాయితీగానే చెబుతున్నాము. మేము ఎన్నడుకూడా రైతుల మీద గానీ, రైతుల మీదనే కాకుండా తాగునీరు ఇచ్చినా కుటుంబాల మీద ఎన్నడూ అదనపు భారం వేయలేదు. భవిష్యత్తులో కూడా వేయబోం. అదేవిధంగా ఇంకొక్కమాట. వారు చెప్పింది వాస్తవమా సార్. ఎనిమిది లక్షల కోట్ల రూపాయలని ఒకాయన అంటారు. పది లక్షల కోట్ల రూపాయలని ఒకాయన అంటారు. ఆర్థిక మంత్రి గారు ఆరు లక్షల డెబ్భై ఒకకోటి అని అంటారు. ఏం చెప్పాలో మంత్రుల మధ్యనే సమన్వయం లేదు. ముఖ్యమంత్రి గారు కరెక్ట్‌గా బ్రెయినింగ్ ఇవ్వండి. నేను సబ్జెక్ట్ మాట్లాడుతున్నాను. విత్తనం వేసిన నాటి నుండి పంట అమ్మేదాక రైతుకు ఎన్ని గండాలున్నాయో, ఎన్ని కష్టాలున్నాయో మనందరికీ తెలుసు. అందుకనే, పారిశ్రామిక వేత్తలకు ఇచ్చినట్లు రైతులకు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఆనాడు ఎప్పుడో మహాకవి శ్రీ శ్రీ గారు చెప్పినట్లు. "పొలాలనన్నీ హలాల దున్ని బలం ధరిత్రికి బలికావించే కర్షక వీరుల కాయం నిండా కాలువ కట్టే ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్" అన్నాడు శ్రీ శ్రీ. ఘర్మ జలం అంటే చెమట. ఆ చెమటకు ఖరీదు ఎట్ల కడతాము? రైతు రైతే. కులం ఏదైనా, ఆయనకు ఉన్న విస్తీర్ణం ఎంతైనా తెలంగాణలో రైతు, రైతే. కాబట్టే, ఆనాడు పరిమితి పెట్టకుండా వ్యవసాయ స్థిరీకరణ కోసం అందరికీ ఇచ్చే ప్రయత్నం చేశాం. ఐటి అని, పాన్ కార్డు అని, ఐటి ఉద్యోగులు అని, పోడు పట్టాలని, ఒక పంట అని, తప్పించుకునే ప్రయత్నం చేయలేదు.

ముఖ్యమంత్రి గారూ, కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు. కౌలు రైతుకు కూడా ఇస్తామని ముఖ్యమంత్రి గారు చెప్పారు. మాకు అసలు రైతులతో సమానంగా పైసలు వస్తాయని, కౌలు రైతులు కండ్లల్లో వొత్తులేసుకొని చూస్తున్నారు. తప్పకుండా ఇవ్వాలని కోరుతున్నాను. నాడు రేవంత్‌రెడ్డిగారే చెప్పినారు. 22లక్షల మంది కౌలు రైతులున్నారని నాడు బహిరంగ లెటర్ వ్రాశారు రేవంత్‌రెడ్డి గారు. నిన్న తీసుకొచ్చిన భూభారతి చట్టంలో అనుభవదారుడి కాలం పెట్టారు. అనుభవదారుడి కాలం వచ్చిందంటేనే కౌలు రైతులెవరో మీకు తెలుసు. ఎవరైతే 22 లక్షల మంది కౌలు రైతులున్నారని బహిరంగ లెటర్ వ్రాశారో వారికి భూ యజమానితో సమానంగా రైతు భరోసా ఇవ్వాలని కోరుతున్నాను.

ఇందాక మా మిత్రుడు విజయరమణారావు గారు మాట్లాడుతూ, బోనస్ ఇచ్చినామని చెప్పారు. ఇది ఎఫ్‌సిఐ

(Food Corporation of India వాళ్లు ఇచ్చిన రిపోర్టును స్పీకర్ గారికి చూపిస్తూ) వాళ్లు ఇచ్చిన రిపోర్ట్.

శ్రీ జి. వివేక్ వెంకటస్వామి :- అధ్యక్షా, అప్పుడు కౌలు రైతులకు ఇవ్వాలని చెప్పి నేను కూడా చాలాసార్లు వారిని కోరడం జరిగింది. అప్పుడు సాధ్యం కాదని, నిజంగానే కౌలు రైతులుగా ఎవరైతే ఉన్నారో, వాళ్లందరు 90శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, బీదప్రజలే ఉన్నారు. వాళ్లు అప్పుడు వారికి ఇవ్వకుండా..... పంట వేయని వాళ్లకు కూడా రైతుబంధు ఇచ్చావని ఇప్పుడే వారు ఒప్పుకున్నారు. కౌలు రైతుల మీద ఈరోజు వీళ్లు కన్నీళ్లు ఎందుకు చూపిస్తున్నారు? వారికి అధికారం ఉన్నప్పుడు నిజంగానే ఇవ్వలేదు. అప్పటినుండే ప్రారంభమైంది. దేయింగే, జరూర్ దేయింగే. నహీ దేనేకా సవాల్ నహీ హై. కానీ, ఆ సమయంలో కౌలు రైతులకు వారు ఏదైతే అన్యాయం చేశారో ఆ విషయం ప్రజలందరూ గుర్తు పెట్టుకున్నారు.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, ప్లీజ్ కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ కె. తారక రామారావు :- ఇంతమంది డిస్టర్బ్ చేస్తే, ఎట్ల కన్‌క్లూడ్ చేస్తాను సార్? సార్ వివేక్ గారికి ఇచ్చారు. వారు మంత్రి కాలేదు, అయినా వారికి మైకు ఇచ్చారు. వారు మా సోదరుడు, మాదోస్త్ ఆయన. ఆయన మంత్రి కావాలని కోరుకుంటున్నాను. అధ్యక్షా, ఇంతమంది సభ్యులు అడుగుతున్నారు. ముఖ్యమంత్రి గారు స్వయంగా ఉత్తరం వ్రాశారు. 22లక్షల మంది కౌలు రైతులున్నారని ఉత్తరం వ్రాశారు రేవంత్ రెడ్డి గారు. రేవంత్ రెడ్డి గారు తప్పకుండా రైతు భరోసా ఇస్తాడని వారందరు కండ్లల్లో వొత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. వారందరికీ ఇవ్వాలని కోరుతున్నాను.

అధ్యక్షా, దాంతోపాటు, బోనస్ గురించి ప్రభుత్వమే చెప్పింది. Department of Food and Public Distribution, Government of India వాళ్లు రిలీజ్‌చేసిన MSP. ఆనాడు 2023-24 సంవత్సరానికి గానూ, ఇది కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చిన ఎమ్ఎస్‌పి పట్టిక. ఈ పట్టికలో దొడ్డు వడ్లకు రూ.2,183/- ఎమ్ఎస్‌పి అని ఉంది. సన్న వడ్లకు రూ.2,203/- అని ఉంది. అంటే సన్న వడ్లకు రూ.20/- ఎక్కువ. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఏమి చెప్పారంటే, ఆనాడు రూ.2,183/- వరి ధాన్యం.....

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, వ్యవసాయ శాఖ మంత్రి గారు మళ్లీ, మళ్లీ, మళ్లీ ఒకటే రిక్వెస్ట్ చేస్తున్నారు. ఈరోజు చర్చ రైతు భరోసాపై జరుగుతోంది. దానిపై మీరు ఏమైనా సూచనలు ఇస్తే ఇవ్వండి.

శ్రీ చింతకుంట విజయరమణారావు :- అధ్యక్షా, ఇంతకుముందు కేటీఆర్ గారు మాట్లాడుతూ, రైతులకు సంబంధించిన రుణమాఫీ గురించి వారు ఛాలెంజ్ చేశారు. వారు రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ అని చెప్పి 2014లో చెప్పడం జరిగింది. అధికారంలోకి వచ్చారు, పదేండ్లు అధికారంలో ఉండి, వారు నాలుగు విడతల్లో రైతులకు రుణమాఫీ చేస్తే, వాళ్లిచ్చిన రుణమాఫీ రైతులకు వడ్డీకింద కూడా సరిపోలేదు. రైతు రుణమాఫీ అని చెప్పి 2018లో చెప్పారు. డిసెంబర్, 2018లో ఎన్నికలైతే 2019లోనే రుణమాఫీ చేస్తామని చెప్పారు వారు. కానీ, 2019లో రుణమాఫీ చేయలేదు. 2021, 2022 సంవత్సరాల్లో లాస్ట్ రెండు నెలలు చేస్తే, రైతుల వడ్డీలకు సరిపోలేదు. నేను ఛాలెంజ్ చేస్తున్నాను, రైతు రుణమాఫీ జరగలేదు, ఆరేడు వేల కోట్ల కన్నా ఎక్కువ ఇవ్వలేదని వారు చెబుతున్నారు. దగ్గర, దగ్గర ఇరవై నుండి, ఇరవై ఒక్కవేల కోట్లు రైతులకు రుణమాఫీ చేసినటువంటి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. వారికి దమ్ము, ధైర్యం, చీము, నెత్తురు ఉంటే వారు నా నియోజకవర్గం రావాలి. 70శాతం మంది రైతులకు రుణమాఫీ జరగకపోతే నేను రాజీనామా చేస్తాను. నువ్వు రాజీనామా చేస్తావా? కెటిఆర్, నువ్వు చెప్పు. కానీ, వట్టిగానే నువ్వు ఇక్కడికి పోదామా? అక్కడికి పోదామా? అని చెప్పి వారు మాట్లాడుతా ఉన్నారు. ఒక అబద్దాన్ని వంద సార్లు చెప్పి, చెప్పి దానిని నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అంతే తప్ప, మరేమీ లేదు.

అలాగే నీటి విషయంలో కూడా కాళేశ్వరం గురించి చాలా గొప్పగా చెప్పే ప్రయత్నం చేశారు. మా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించారు. మేడిగడ్డ గానీ, అన్నారం గానీ, సుందిళ్ల గానీ. వారు కట్టినటువంటి ప్రాజెక్టులు మూడేండ్లు తిరగకుండా ముచ్చటగా కూలిపోయాయి. అంటే, వారు, వారి ప్రభుత్వం ఏ రకంగా అవినీతికి పాల్పడ్డదో ఇంతకంటే ఎక్కువ నిదర్శనం అవసరం లేదు. ఎస్ఆర్ఎస్పి, ఎల్లంపల్లి శ్రీపాదరావు ప్రాజెక్టు, లోయర్ మానేరు డ్యామ్, అప్పర్ మానేరు డ్యామ్ లాంటి ప్రాజెక్టులను ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం మా జిల్లాలో నిర్మించింది. వరద ఎక్కువగా వస్తే, ఆ ప్రాజెక్టుల గేట్లపైనుండి నీరు పోయింది. కానీ, ప్రాజెక్టులు ఎక్కడ కూడా చెక్కు చెదరలేదు. కానీ, ఈరోజు గేట్లపైనుండి నీళ్లు పోవడం దేవుడెరుగు. వారు కట్టినటువంటి ప్రాజెక్టులు వరద రాకముందే కూలిపోయాయి. వాళ్లు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కనీసం ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? అని అడుగుతున్నాను. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల పొట్టకొట్టికెసిఆర్ గారు, కేటీఆర్ గారు, హరీష్ రావు గారు వారి ప్రాంతాలకు నీళ్లు తీసుకొనిపోయే ప్రయత్నం చేశారు.

12.00 ప.మ. మీరు కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనీసం ఒక్క ఎకరాకైనా నీళ్ళిచ్చారా అని అడుగుతున్నాను. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల పొట్టకొట్టికేసీఆర్ గారూ, హరీష్‌రావు గారు, కేటీఆర్ గారు, మీ ప్రాంతాలకు నీళ్ళు తీసుకపోయే ప్రయత్నం చేశారు. కనీసం ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలువలు తవ్వి, లైనింగ్ వేసి, ప్రాజెక్టులు కట్టినటువంటి వాటికి కనీసం, లైనింగ్ పోతే ఆ లైనింగ్ రిపేరు చేయలేదు. షట్టర్ పోతే, షట్టర్ పెట్టలేదు. మీరా ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడేది. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు. చిత్తశుద్ధి లేదు. మీరు అబద్ధాలు చెప్పి, ప్రజలను రైతులను నమ్మించి మోసం చేసేటువంటి ప్రయత్నం చేస్తున్నారు.

శ్రీ టి. హరీష్ రావు :- (మైకు లేకుండా) అధ్యక్షా, ఎంత సేపు సార్, ఏంటి సార్ ఇదీ...

శ్రీ చింతకుంట విజయరమణారావు :- రైతులకు బోనస్ ఇస్తే, బోనస్ ఇయ్యలేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఇవాళ నా ఒక్క నియోజకవర్గంలో, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.51 కోట్లు దాదాపు అయితే, నిన్నటి వరకు రూ.46 కోట్ల బోనస్ రైతుల అకౌంట్లలో జమ అయ్యాయి. అదీ, ఇవాళ కాంగ్రెస్ పార్టీ. ఆనాడు మీరు రైతు బోనస్ ఇస్తామని చెప్పి, ఒక్కరైతుకన్నా ఒక్క క్వింటాల్ వడ్లకన్నా మీరు బోనస్ ఇచ్చారా అని నేనడుగుతున్నాను. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు. మీరు రైస్ మిల్లర్లను పెట్టి, వాళ్ళతో కుమ్మక్కై కిలోలు కిలోలు కటింగులు పెట్టిన చరిత్ర ఆనాడు మీ ప్రభుత్వానిది. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు. మీరు మాట్లాడడానికి కనీసం కూడా అర్హత లేదు.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :- కేటీఆర్ గారూ మా ఎల్.ఏ. మినిష్టరు లేరు కాబట్టి, నేను కేటీఆర్ గారిని రిక్వెస్ట్ చేస్తున్నాను. మా గౌరవ వ్యవసాయ శాఖామాత్యులు రైతు భరోసాపై ఈరోజు ప్రవేశపెట్టిన అంశంపై చర్చిద్దామనీ, మా ముఖ్యమంత్రి గారు దీనిపై మీ అభిప్రాయాలు కూడా తీసుకోవాలని పెట్టారు. వారు ఎన్నిసార్లు ఎలక్ట్రిసిటీకి పోయిన్రు, ఇరిగేషన్‌కు పోయిన్రు, మేనిఫెస్టోకి పోయిన్రు... ఇవన్నీ మీరు మాట్లాడితే..., నేను ముందే చెప్పాను. మా దానిలో కూడా చాలామంది సభ్యులు మాట్లాడాలి. సీపిఐ వారు మాట్లాడాలి, బీజేపీ వాళ్ళు మాట్లాడాలి. వారొక్కరే గంటున్నర మాట్లాడారు.

(బీఆర్ఎస్ సభ్యులు శ్రీ కె. తారక రామారావు గారి నుండి అభ్యంతరం వ్యక్తం చేయబడింది)

కేటీఆర్ గారూ, ఒక్కటే విషయం. నీ గుండె ధైర్యం చేసుకొని విను. మీ మేనిఫెస్టోలో... కాంగ్రెస్ పార్టీకి మేనిఫెస్టో అంటే భగవద్గీత, బైబుల్, ఖురాన్ లాంటిది. చెప్పింది చేస్తాం. మీ మేనిఫెస్టోలో ఏమి చెప్పినావ్? దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాలు, రెండుంటే ఒకటి యాడ్ చేస్తా, బోరేస్తాం, బోర్డరేస్తాం, రైతుని చేస్తా, కేజి టు పిజి, మీ బిడ్డ వస్తే, అల్లుడొస్తే ఏడ పడుకుంటావ్, గొర్రెలు మేకలు యాడ కట్టేస్తావ్, ఒకటి కాదు రెండు కాదు లక్షల అబద్ధాలు... ప్రపంచంలో ఏ నాయకుడు, ఏ పార్టీ కూడా అంత బోగస్ మేనిఫెస్టో ఇయ్యదు. 2001లో అధ్యక్షా, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ దగ్గర ఆఫీసు పెట్టినప్పుడు, ఒక మాటన్నాడు.. ఆ రికార్డు తీద్దాం. దళితుడిని ముఖ్యమంత్రిని చేయకపోతే నా మెడ మీద తల ఉండదన్నాడు. ఏం మాట్లాడావయ్యా నీవ్వు? మీరు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లు. నీవ్వు మాట్లాడితే, రైతు భరోసా గురించి మాట్లాడు. నీవ్వు అడగకుండానే ఇవాళ రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ 25 లక్షల మందికి, భారత దేశంలో చిన్న రాష్ట్రమైనా, మీరు అప్పులు చేసినా, ఇవాళ ఒక్కొక్క పైసా కాపాడుకుంటూ 25 లక్షల మంది రైతులకు మా ముఖ్యమంత్రి గారు ఒక్కసారే రుణ విముక్తులను చేశారు. ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. మీకు తెలుసు. మీరు ఏమీ చేయలేదు కాబట్టి, ఆయన కూలేశ్వరం కట్టారంట, అది కాళేశ్వరం కాదు కూలేశ్వరం. అధ్యక్షా, ఆ కూలేశ్వరం నీళ్ళు వాడకుండా ఒక కోటి 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన చరిత్ర, తెలంగాణ రైతులది. అందుకనే, తక్కువ మాట్లాడు. అయిపోయింది. పదేళ్ళు నమ్మిన్రు. ఇంక చాలు. సలహాలుంటే సలహాలియ్. వేరే సభ్యులున్నారు. సమయం వృధా చేయకండి. ఇవాళ ఇంపార్టెంటు. మా ముఖ్యమంత్రి గారు చెప్తారు. చెప్పిందల్లా చేస్తాం. అసరముంటే, ప్రాణం తీసుకుంటాం తప్ప అబద్ధాలాడం. మీలాగా మోసం చేయం. ఇవాళ 40 మంది బాగుపడ్డారు జైళ్ళలో... ఈరోజు 50 లక్షల మంది మహిళలకు నెలకు ఉచితంగా 200ల యూనిట్ల కరెంటునిచ్చి నెలకు వెయ్యి రూపాయలు సేవ్ చేస్తున్నారు. 50 లక్షల మంది కుటుంబాలకు, పేదలకి చీకట్లో మగ్గుతుంటే, ఈరోజు వారికి 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇచ్చి సేవ్ చేస్తున్నాం. అలాంటివి ఇచ్చుకోవాలి. మీరు ఒక్కమంచి పని చేయలేదు. Don't waste the time. కానీ, అధ్యక్షా, మీరు కూడా ఒక లిమిటెడ్ టైమ్ పెట్టండి. చాలామంది మెంబర్స్ ఉన్నారు. I request the Hon'ble KTR garu, మేనిఫెస్టోపై మళ్ళీ మాట్లాడదాం. మళ్ళీ సెషన్ ఉంది. మీ నాయకుడిని రమ్మను. అబద్ధాల మేనిఫెస్టో రచయిత, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్, ప్రపంచ ఖ్యాతి గాంచిన కేసీఆర్ గారిని రమ్మను. మాట్లాడదాం, మేనిఫెస్టో మీద.

మిస్టర్ స్పీకర్ :- పాయల్ శంకర్ గారూ...

(తమకు మైకివ్వవలసిందిగా బీ.ఆర్.ఎస్ సభ్యులు శ్రీ కె. తారక రామారావు గారు గౌరవ సభాపతి గారిని కోరారు.)

5 మినిట్స్‌లో కంప్లీట్ చేయండి. లేదంటే మైకు కట్ చేస్తాను.

శ్రీ కె. తారక రామారావు :- స్పీకర్ సార్, నిజంగా వాళ్ళకు ఇంట్రెస్ట్ ఉంటే..

మిస్టర్ స్పీకర్ :- మళ్ళీ డైవర్ట్ కాకండి..

శ్రీ కె. తారక రామారావు :- స్పీకర్ సార్, నిజంగా వాళ్ళకు ఇంట్రెస్ట్ ఉంటే పది రోజులు హౌస్‌ను పొడిగించండి. అన్ని అంశాలమీద చర్చ పెట్టండి. నిజంగా ప్రభుత్వానికి ఇంట్రెస్ట్ ఉంటే, చర్చ పెట్టండి. మాకు అభ్యంతరం లేదు సార్. నేను ఓన్లీ నా సబ్జెక్ట్ మాట్లాడి కంక్లూడ్ చేస్తాను సార్. పది నిమిషాలు టైమియ్యండి. నేను నా సబ్జెక్ట్ మాట్లాడి కంక్లూడ్ చేస్తాను.

మిస్టర్ స్పీకర్ :- 5 నిమిషాలలో కంక్లూడ్ చేయండి..

శ్రీ కె. తారక రామారావు :- ఇంతమంది డిస్టర్బ్ చేస్తే ఎట్లా సార్? సభ్యులు లేస్తారు, మంత్రులు లేస్తారు.

అధ్యక్షా, మేము అందుకే అంటున్నాం. మాకు అన్ని విషయాలలో స్పష్టత ఉంది. నిజాయితీ ఉంది కాబట్టే నిజాయితీగా చెప్తున్నాం. చాలా పని చేశాం.

(అధికార పక్ష సభ్యులచే సభకు అంతరాయం)

కంక్లూడ్ చేస్తున్నా సార్, ఇదేం పద్ధతి? నా విజ్ఞప్తి సార్, మీరే చెప్పినారు, బోనస్ ప్రస్తావన నేను చేయలేదు. మీరే చేసినారు, మీ సభ్యులే చేసినారు. ఇరవై ఒక్క వందల ఎనభై మూడు రూపాయల బోనస్ అని చెప్పి మేనిఫెస్టోలో పెట్టింది మీరు. ఇరవై ఒక్క వందల ఎనభై మూడు రూపాయల బోనస్ అనేది దొడ్డు వడ్లకు సంబంధించినదని కేంద్ర ప్రభుత్వం యొక్క ఎంఎస్పి లెక్క ఉన్నది. బోనస్ ఇస్తమని చెప్పింది దొడ్డు వడ్లకు. ఇవాళ మాట్లాడుతున్నది, మాట చెప్పి తప్పుతున్నది సన్న వడ్లకని. ఇచ్చిన బోనస్ రూ.700 కోట్లు.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ, మీరు మళ్ళీ.. నేను రిక్వెస్ట్ చేస్తున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అదే చెప్తున్నాను సార్, నేను... వాళ్ళు అడ్డమైన మాటలు మాట్లాడొచ్చు, మేము మాట్లాడొద్దా సార్.

(అధికార పక్ష సభ్యులచే సభకు అంతరాయం)

వాళ్ళు ఏది పడితే అది మాట్లాడొచ్చు, మంత్రులు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడొచ్చు, మేము వివరణ కూడా ఇయ్యొద్దా, ఇదేం పద్ధతి?

(అధికార పక్ష సభ్యులచే సభకు అంతరాయం)

అధ్యక్షా, బోనస్ బోగస్ అయ్యింది. రూ.700 కోట్ల బోనస్ ఇచ్చి, రూ.7600 కోట్ల రైతు బంధు ఎగ్గొట్టిన మాట వాస్తవం. ఇది ఖచ్చితంగా రైతులకు తెలుసు. అందుకే అంటున్నా అధ్యక్షా, రుణమాఫీ ఉత్తదయ్యింది, బోనస్ బోగస్ అయ్యింది. రైతు బంధు, రైతు బంధు కాదధ్యక్షా, దాని పేరు మార్చి రైతు భరోసా అని పెట్టి ఏదో మారుస్తామన్నారు. మీరు రైతులను ఏమారుస్తున్నారు తప్ప, ఏదీ కూడా చేస్తలేరు. అధికారంలోకి వస్తే, తొలి కేబినెట్‌లోనే రైతు భరోసాకు చట్ట బద్ధత, 6 గ్యారెంటీలకు చట్టబద్ధత అన్నారు. తొలి కేబినెట్ జరగలేదా, ఇంకా? లేకపోతే తొలి సంవత్సరం గడిచినా కూడా అది యాదికి వస్తలేదా? మీ రాహుల్ గాంధీగారు చెప్పిన్రు. ఏడబోయిందామాట అనడుగుతున్నా. అధ్యక్షా, ఇంకొక్క మాట ఈ కాంగ్రెస్ పరిపాలనలో గతసంవత్సరకాలంగా రైతు బతుకుకు భరోసా లేదు. రైతు భూమికి భరోసా లేదు. పొలంలో ఉండాల్సిన రైతులు ఇవాళ జైళ్ళలో ఉండే పరిస్థితి. ఎప్పుడూ ముఖ్యమంత్రి గారు గద్దరన్నను యాది చేస్తా ఉంటారు. గద్దరన్న ఒక మాట చెప్పిండు. దుక్కులు దున్నే రైతులకు బేడీ లెందుకురో అని పాట పాడారు. ఇయాల గద్దరన్న బతికుంటే ఖచ్చితంగా ఆ పాట మళ్ళీ గజ్జెకట్టి పాడుతుండె. చివరిగా నేను ఈ ప్రభుత్వానికి చేసే విజ్ఞప్తి ఒక్కటే. రైతు బంధును యథాతథంగా కంటిన్యూ చేయండి. ప్రజలకిచ్చిన మాట తప్పకండి. (మైకు కట్ చేయబడింది)

శ్రీమతి డి.అనసూయ :- అధ్యక్షా, ఈ రాష్ట్రంలో రైతులకు బేడీలేసిన చరిత్ర, ఈ బీఆర్ఎస్ పార్టీకి ఉంది. ఆరోజు సన్న వడ్లు వేస్తే ఉరే అన్నది మీరు. ఇవాళ కౌలు రైతుల గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కౌలు రైతులకి ఎందుకీయాలి భరోసా, అద్దె ఇళ్ళలో ఉన్నోడు ఓనరైతడా, కౌలు రైతు ఓనరైతడా అని ఆరోజు మీరు మాట్లాడారు.

12.10 మ. ఇవాళ రైతుల మీద ఏదో గొప్పగా మాట్లాడుతున్నారు. నేను సవాల్ చేస్తున్నా అధ్యక్షా. రాష్ట్రంలో ఉన్న అందరి భూముల మీద క్లీన్‌గా.. అక్కడ వంద ఎకరాల ఫామ్ హౌజ్ ఉంటది, కానీ పది మంది పేర్లుంటున్నాయి. అది బయటకు తీయండి. 5, 6 లక్షల జీతాలెత్తుకునేటోళ్ళు కూడా మీ హయాంలో రైతు ముసుగులో రైతు బంధు తీసుకున్నారు. గుట్టలలో..సాగులో లేకున్నా తీసుకున్నారు. మా లాంటి ప్రాంతాలల్లో మోకాళ్ళ మీదుండి సాగు చేసినా కూడా పట్టాలు లేకుంటే వాళ్ళకు మీ హయాంలో ఒక్క రూపాయి కూడా రాలేదు. కానీ, వాళ్ళు వంట వండిచ్చారు. మీరిచ్చింది రైతు బంధు, రైతు పెట్టుబడి కాదు, పట్టా పెట్టుబడి ఇచ్చారు. పట్టా ఉంటేనే ఆరోజు ఇచ్చారు. కానీ కౌలు రైతులకివ్వలేదు, చిన్న, సన్నకారు రైతులు, పట్టాలు లేని వారికివ్వలేదు.

రైతు ఋణమాఫీ గురించి గొప్పగా చెబుతున్నారు. మీరు చేసిన ఋణ మాఫీ వడ్డీ మాఫీ అయింది, ఋణ మాఫీ కాదు. ఋణ మాఫీ కాదది, వడ్డీ మాఫీ. ఆ వడ్డీ మాఫీలో కూడా మీరు అనేక మంది రైతులకు నిబంధనలు పెట్టడం తోటి చాలా మంది ఈ నిబంధనల మూలంగా మేమిచ్చినటువంటి ఋణ మాఫీలో కూడా కొంతమందివి రెన్యువల్ కానటువంటి పరిస్థితి వాస్తవం. అలాంటి వాళ్ళది ఆగింది. అది 2014 నుంచి కొనసాగుతూ వస్తుంది, మీరు చేసిన ఋణ మాఫీ. నిబంధనలు కొనసాగుతూ వస్తున్నాయి. కాబట్టి, అది గురుపెట్టుకోండి. మీరన్నీ బాగా చేసినాక 30 వేల కోట్ల రైతుల ఋణ మాఫీ కాకుండా ఎట్లా ఉన్నాయి? మీరన్నీ రైతులను రాజులను చేశారు. రైతు బంధు ఇచ్చారు, అన్నీ చేసినాక మళ్ళీ 30 వేల కోట్ల రూపాయలు వాళ్ళ మీద ఎందుకు భారమైంది? ఎందుకు ఋణాలు మిగిలినాయి? అది చెప్పండి. కాబట్టి కేటీఆర్‌గారికి ఒకటే అడుగుతున్నాను. మీరు పదేండ్లలో భూమి లేనటువంటి ఒక పేదింటి బిడ్డలకు మీరేమిచ్చారు? వందల ఎకరాలున్నావారి గురించి అన్ని ఇవాలి, లక్షల జీతాలొచ్చినా అన్నీ ఇవ్వాలె అని అంటున్నారు, మరి పేదవాడికి మీరు ఈ పదేండ్లల్లో కనీసం ఖచ్చితంగా కరెంటు ఇవ్వలేదు. కనీసం ఉచితంగా ఎర్ర బస్సు ఇస్తే కూడా మీరు ఓర్వలేకపోతున్నారు. అదేవిధంగా, పదేండ్లల్లో ఏమిచ్చారు? భూమి లేని వారికేమిచ్చారు? మేమిప్పుడు భరోసా క్రింద రూ. 12,000/- పెట్టినాం. ఉచితంగా కరెంటు ఇస్తున్నాం. వాళ్ళ ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసం, కుటుంబ భారాన్ని తగ్గించడం కోసం పేదింటి ఆడ బిడ్డలకు రూ. 500/- గ్యాస్ చేసినాం. మీరెందుకు చేయలేదు వరి? మేము ఉచితంగా బస్సు పెడితే గగ్గోలు పెడుతున్నారు. ఉచితంగా 200 యూనిట్ల కరెంటు ఇస్తే గగ్గోలు పెడుతున్నారు. కాబట్టి, మీ వైఖరేమిటో స్పష్టం చేయండి. అందరికీ వందలెకరాల ఫామ్ హౌజులున్నా కూడా ఇవ్వండని అంటారా? అదే చెప్పండి? నేనీ సందర్భంగా వ్యవసాయ శాఖా మంత్రిగారిని కోరుతున్నాను. దయచేసి, ఎవరెవరికి ఎంతెంత పోతుందో, వివరాలు మొత్తం గ్రామాలలో పెట్టాలి. ఏ కుటుంబానికి ఎంతెంత రైతు బంధు పోతుంది? ఎవరెవరిది ఎంత? అనే వివరాలు బయట పెట్టాలి. పేద వాళ్ళకి ఆ ఊర్లల్లో ఏమేమి వచ్చాయో కూడా బయటపెట్టాలని నేను కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ :- కేటీఆర్ గారూ...కన్‌క్లూడ్ చేయండి ప్లీజ్..

శ్రీ కె. తారక రామారావు :- కన్‌క్లూడ్ చేస్తానంటే కూడా చేయనిస్తలేరు సార్. వారు చెప్పిన దానికి, మేము చెప్పిన దానికి తేడా ఏముంది? మంత్రిగారన్నారు రూ. 30,000 కోట్లు ఋణం ఎందుకు వచ్చిందన్నారు. ఎందుకు వచ్చిందంటే, మీ ముఖ్యమంత్రిగారు చెప్పారు. ఏం చెప్పారు? స్పష్టంగా చెప్పారు. కేసీఆర్‌గారు ఏం అనుకుంటున్నారంటే లక్ష రూపాయల ఋణ మాఫీ చేశాను కదా, వాళ్ళంతా నాకే ఇస్తారనుకుంటుండు, కానీ ఆ లక్ష రూపాయల ఋణ మాఫీ అయిన వాళ్ళకు కూడా మీరు అర్జెంటుగా బ్యాంకుకు ఉరకండి, రెండు లక్షలు తెచ్చుకోండి, నేను రాగానే 9 డిసెంబరు నాడు సంతకం పెడుతా అని చెప్పిందే రేవంత్ రెడ్డిగారు. నేనేమి వేరే చెబుతున్నానా, వీడియో చూపమంటే చూపెడుతా, ఆయన వల్లనే జరిగింది.

ఇంకొక్కమాట అధ్యక్షా. మీరు ట్రైనింగ్ సరిగా ఇవ్వాలి మీ ఎమ్మెల్యేలకు. నేను ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను, మీరేమో వంద శాతం ఋణమాఫీ జరిగిందని మీరు చెబుతారు. వెనుకకెళ్ళి మీ ఎమ్మెల్యే లేసి నాకు 70 శాతం అయిందంటారు. బయటనేమో చారాణా కూడా కాలేదని రైతులంటున్నారు. ఏది కరెక్టో మీరు ముందు తేల్చుకోండి. 25 శాతమైందా? 30, 40, 70 శాతమైందా, వంద అయిందా? చివరికి అధ్యక్షా నేనొకటే చెప్పి ముగిస్తాను. మేమీ ప్రభుత్వాన్ని ఒక్కటే

కోరుతా ఉన్నాం. రైతు బంధు విషయంలో నేను నేపథ్యం చెప్పాను. తెలంగాణలో పెద్ద రైతు, చిన్న రైతు అనే తేడా లేకుండే. ఉద్యోగస్తుడు లేదా ప్రైవేటు ఉద్యోగన్న వ్యత్యాసం లేకుండా భూ యజమాని ఎవరుంటే వారికి వ్యవసాయ స్థిరీకరణ కోసం ఆనాడు తెలంగాణలో సాగు బాగు కావాలనే ఉద్దేశ్యంతో మేము పని చేశాం. అందరికీ రైతు బంధు ఇచ్చినాం. మీరు కటింగులు పెట్టదలచుకుంటే అది మీ ఇష్టం, మీ విజ్ఞత. మేము ఆనాడు అందరికీ ఇచ్చే ప్రయత్నం చేశాం. మీరు కూడా ఎలక్షన్లకు ముందు స్పష్టంగా అందరికీ అన్నీ అన్నారు, ఇవాళ కొందరికి కొన్ని అంటున్నారు. నేను ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను, మీరు దయచేసి రైతులకిచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకోండి. అన్నదాత కోసం పని చేయండి. కొడంగల్‌లో రైతులను జైల్లో పెట్టినరు. అదానీ కోసం అట్లాంటి పనులు మాత్రం చేయకండి. అదే విధంగా కేవలం కుటుంబం కోసం, ఎనుముల కుటుంబం కోసం, బావ మరిదికి అమృతం కోసం పని చేయవద్దని ముఖ్యమంత్రిని కోరుతున్నాను.

(అంతరాయం)

శ్రీ పాయల్ శంకర్ (ఆదిలాబాద్) :- రైతు భరోసాపై చర్చలో నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు స్పీకర్‌గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.

సభ ప్రారంభమై దాదాపు రెండు గంటలవుతోంది. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల నాయకుల మాటలింటే 2014కన్నా ముందు ఈ రాష్ట్రంలో వ్యవసాయమే లేనట్టు, 2014 కన్నా ముందు తెలంగాణ రాష్ట్రంలో రైతులే లేనట్టు, అసలు తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయమనేదే మేము నేర్పినాం, అసలు రైతులను సృష్టించినదే మేమనే విధంగా కాంగ్రెస్, టీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాయి.

ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది, మొన్న టీఆర్ఎస్ ఉండే, అంతకు ముందు కాంగ్రెస్ ఉండే. అంతకన్నా ముందు తెలుగుదేశం పార్టీ ఉండే. ఈ రాష్ట్రంలో గతంలో పరిపాలించినటువంటి పాలకులంతా కూడా ఆనాటి ఆదాయాన్నిబట్టి, ఆరోజున్నటువంటి సంపాదనను బట్టి ..ఒక పార్టీ మాట్లాడుతది మేము భూమి శిస్తు రద్దు చేసినాం కదా, మాది గొప్ప పార్టీ అని. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజుల కాలంలో జుట్లకు కూడా శిస్తు ఉండే అధ్యక్షా. ఆరోజు భూమి శిస్తు మీదనే ఆధారపడి మిగతా అడ్మినిస్ట్రేషన్ అంతా కూడా నడిచే పరిస్థితి ఉండేది. కానీ, పాతరోజులకు ఈరోజు మీరు కంపేర్ చేసుకొని, మేమేదో గొప్పగా చేసినామని రెండు పార్టీలు మాట్లాడే ప్రయత్నం చేసినాయి. నేను వాటి జోలికి పోదలచుకోలేదు. చివరికి వ్యవసాయం రాష్ట్రానికి సంబంధించిన అంశం. దానిలో ఎవరికీ, ఎక్కడ, ఎటువంటి అనుమానాలు లేవు. కష్టం వచ్చినా, నష్టం వచ్చిన, ఇబ్బంది వచ్చినా కూడా మన రాష్ట్రంలో ఉన్నటువంటి సంపాదన, మన ఆలోచనలకు అనుగుణంగా మనం మార్పులు, చేర్పులు చేసుకొని, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి వ్యవసాయదారులని ఆదుకోవాల్సినటువంటి అవసరముంది. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల నాయకులు మాట్లాడేటప్పుడు మేము చేశామంటే, మేము చేశామని గొప్పగా మాట్లాడే ప్రయత్నం చేశారు తప్పితే, ఢిల్లీలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం రాష్ట్రానికి సంబంధించిన సబ్జెక్ట్ అయినప్పటికీ, ఇంత గొప్పగా మాకు సహాయం చేసిందని, గతంలో పరిపాలించిన టీఆర్ఎస్ పార్టీ మాట వరుసకు కూడా మాట్లాడే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడొచ్చినటువంటి ఈ ప్రభుత్వం కూడా కేంద్రం నుంచి మనకు గొప్పగా సహాయం వచ్చే అవకాశమున్నది, సహాయం చేస్తున్నదని ఈ ప్రభుత్వం కూడా మాట్లాడినటువంటి ప్రయత్నం చేయలేదు.

కొన్ని సార్లు అనిపిస్తుంది, రాజకీయాలంటే కేవలం విమర్శలు మాత్రమే చేయాలేమో, ప్రతిపక్ష పార్టీ అంటే అధికార పక్షాన్ని కేవలం తిడితేనే కానీ మీ పనితనం బయటపడదేమో అనే విధంగా ఆలోచిస్తుండచ్చు. కానీ, మంచిని మంచే అనాల, చెడును చెడే అనాల.

వ్యవసాయశాఖామంత్రి గారికి అదిలాబాదు నుండి నేనొక ఫోన్ చేశాను.. మార్కెట్ యార్డ్‌లో ఉన్నాను, మొత్తం తిరుమలనాథ్ రైతులున్నారు. ప్రభుత్వం గత పది సంవత్సరాలు ఎకరానికి సోయాబీన్ ఆరు క్వింటాలు మాత్రమే కొంటుండేది. రైతుకు పది క్వింటాలు, 12 క్వింటాలు ఎకరానికి పడ్డది, మేము మిగతా ధాన్యం ఎక్కడ వమ్ముకోవాల? మిగతా సోయాబీన్ ఎక్కడమ్ముకోవాలని అంటే గతంలో పెద్దలు తుమ్మల నాగేశ్వరరావుగారికి, నాకు పాతపరిచయమున్న కారణంగా నేను చనువు తీసుకొని మార్కెటు యార్డు నుండి ఒక ఫోన్ చేశాను. ఫోన్ చేయగానే వారు మాట్లాడితే నేను మంత్రిగారికి చెప్పాను, అన్నా నేను స్పీకర్ ఆన్ చేశాను, రైతులంతా మీ మాట వింటున్నారు, ఆరు క్వింటాలు మాత్రమే ప్రభుత్వం కొంటున్నది, పది క్వింటాలు కొంటే బాగుంటది అని నేను అనగానే, మంత్రిగారు తిరిగి ఒక్క మాట మాట్లాడకుండా, నేను పది క్వింటాలు కొంటున్నానని మంత్రిగారు చెప్పినారు, రెండవ రోజే ఆర్డరిచ్చారు. నేనా విషయాన్ని రైతులకు చెప్పిన తరువాత మూడవ రోజు నాకు మిగతా పనేమీ లేకపోయినా, ఆదిలాబాదు నుండి హైదరాబాదుకు శాలువా మరియు పూలమాలు తీసుకొని మంత్రిగారి దగ్గరకు వెళ్ళి పూలమాల వేసి శాలువాతో సత్కరించి ప్రజల తరఫున, రైతుల తరఫున ధన్యవాదాలు చెప్పాను. నేనీ మాట ఎందుకు చెబుతున్నానంటే, మీరు మంచి చేస్తే మంచేనని చెబుతాము లేదా ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోకుంటే, అది నిలుపుకుంటలేరు, ఇది తప్పే అని మాట్లాడుతాం. మీరు మంచి చేసిన దానికి మంచి అని మేమంటే మీరు సంతోషపడి, పూర్తి చేయనటువంటి హామీలను మీరింకా చేస్తలేరు, ఎన్నికలలో మీరు మాటిచ్చారు కదా అని అంటే, లేదు లేదు కేంద్రం ఏం చేస్తున్నదనే విధంగా ఎదురుదాడి చేస్తే, మాకింకో మార్గమేమీ లేదు.

ఈరోజు నరేంద్రమోడీగారు, కేంద్ర ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత గొప్పగా ఆలోచించలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 కోటి 20 లక్షల పత్తి.. ఈరోజు పత్తికి మార్కెట్‌లో ధరలేదు. CCI అనే సంస్థ కొనకుంటే ఈరోజు లక్షల మంది రైతులు చాలా ఇబ్బందులలో ఉండేవారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో కోఆర్డినేట్ చేసుకొని ఈరోజు CCI వేల కోట్ల రూపాయలు పెట్టి ఇప్పటికే 1 కోటి 20 లక్షల క్వింటాళ్ళ పత్తిని 9 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఈరోజు కేంద్ర ప్రభుత్వం కొన్నది. దాంట్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా లేదు.

12.20 మ. దాంట్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఒక్క రూపాయి కూడా లేదు అధ్యక్షా. పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్న విషయం మాత్రమే చెప్పదలచుకున్నాను. అదేవిధంగా సోయాబీన్. మంత్రిగారు ఒక మాట అన్నారు. మొత్తం కూడా రాష్ట్రమే కొంటున్నదని. అన్నా రాష్ట్రం కొంటలేదు 85,508 మెట్రిక్ టన్నులకు కేంద్ర ప్రభుత్వం మీకు అనుమతి ఇచ్చింది. కేంద్రప్రభుత్వం కొంటా అని చెప్పింది. 8 లక్షల 50 వేల క్వింటాళ్ళు కేంద్ర ప్రభుత్వమే కొంటున్నది. మీకు ఏమీ భారం లేదు. మీరు కొనాలి అని చెప్పినా ఇది కూడా కేంద్రప్రభుత్వమే కొంటున్నది అధ్యక్షా.

అధ్యక్షా పి.ఎం.కె.ఎస్.వైలో వేల కోట్ల రూపాయలు ఠంచనుగా ఈరోజు రైతు ఖాతాలో కేంద్ర ప్రభుత్వం వేస్తున్నది. గ్రామాలల్లో ఒక చర్చ ఉన్నది. నరేంద్రమోడీగారి పైసలు వచ్చినాయి, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పైసలు రాలేదని. కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీగారు రైతులకు ఏమీ చేయకుండానే గ్రామాలల్లో చర్చ ఉంటదా అధ్యక్షా? ఈరోజు ఏ ఊరికి వెళ్ళినా మాట్లాడుతున్నారు. మోడీగారి పైసలు వచ్చాయి ఇంకా రాష్ట్ర ప్రభుత్వం పైసలు ఇస్తలేరని రైతులు మాట్లాడుకుంటున్నారు. సరే మీరొక గొప్ప ఆలోచనతోని ఉన్నారేమో. మీకు ఉన్నటువంటి పరిస్థితి చూస్తే మొత్తం అంతా జమచేసుకుని ఉన్నాము, మేము జనవరిలో వేస్తాము అనే విధంగా మాట్లాడుతున్నారు. దానికి చాలా సంతోషం.

అధ్యక్షా, రైతు భరోసా అంటే ఎకరానికి ఇంత మేము ఇచ్చేసి మా బాధ్యత తీరిపోయింది అంటే కాదు. రైతుకు అన్ని రకాలుగా మీరు భరోసా ఇవ్వాల్సినటువంటి అవసరం ఉంది. అధ్యక్షా, రైతు మనందరికీ అన్నం పెడుతున్నాడు. దాన్ని మనం ఎవరూ కూడా కాదు అనం. అందరం ఏకీభవిస్తాం. హోటళ్ళకు పోయి టిఫిను చేస్తే, చాయ్ తాగితే హోటలు బిల్లు కట్టిన తరువాత సర్వ్ చేసిన సర్వర్‌కు వందో రెండు వందల రూపాయలో నాకు తీసుకొచ్చి అన్నం పెట్టావన్న కృతజ్ఞతతో అక్కడ టిప్ ఇచ్చే ప్రయత్నం చేస్తాము. కానీ రైతు పరిస్థితి ఎంత ఘోరం ఉన్నదంటే, రైతు తన చేనులో పండించిన కూరగాయలని తీసుకొచ్చి మార్కెట్‌లో కూర్చొని కిలో టమాట ఎంతకి అమ్ముతావు అంటే 15 రూపాయలు అంటే 10 రూపాయలకు ఇస్తావా, లేదా? అంటాము.

ఇక్కడేమో టిఫిన్ చేస్తే 200 రూపాయల బిల్లు కట్టి, 100, 200 రూపాయలు టిప్ ఇవ్వడానికి మనసొప్పుతది కానీ, అక్కడ 15 రూపాయలకు కిలో టమాటాలు అమ్మితే 10 రూపాయలకు ఇస్తే తీసుకుంటా లేకపోతే లేదు అనే విధంగా ఆ రకమైన అవమానాలను రైతు భరిస్తున్నాడు అధ్యక్షా.

నేనెందుకు ఈ మాట చెపుతున్నానంటే, కళ్ళవెంట నీళ్ళు వస్తున్నాయి. ఈరోజు ఏ రైతు కూడా సంతోషంగా లేడు. మీరు రైతు బంధు ఇచ్చినా, రుణమాఫీ చేసినా కేవలం ఎన్నికలప్పుడు రాజకీయ మాటలు మాట్లాడుతున్నాం. కానీ రైతు ఈరోజు కూడా సంతోషంగా లేడు అధ్యక్షా. ఐదెకరాలు ఉన్నటువంటి రైతు తను పండించిన పంటని కుటుంబమంతా కష్టపడ్డ తర్వాత మార్కెట్‌కెళ్ళి అమ్ముకుని సంవత్సరం తరువాత లెక్కచూస్తే 50 వేల రూపాయలు కూడా లాభం వస్తలేదు.

రైతు భార్యాభర్తలిద్దరూ వ్యవసాయం విడచిపెట్టి, హైదరాబాదు వచ్చి ఎక్కడనో వాచ్‌మెన్ లాగానో ఏ ఇంట్లోనో పనిచేస్తే నెలకు 30 వేల రూపాయలు సంపాదించే అవకాశం ఉన్నది. కానీ ఐదెకరాలు ఉన్నటువంటి ఆసామి ఊర్లో వ్యవసాయం చేస్తే భార్య, భర్త పిల్లలు కూడా సెలవులు ఉన్నప్పుడు చేనులో పనిచేస్తే సంవత్సరం తరువాత 50 వేల రూపాయలు కూడా మిగలడం లేదు. ఇది రైతుకు ఉన్నటువంటి బాధ అధ్యక్షా. మనకీ, రైతుకీ పోలికలు ఉంటాయి. ఒక రైతు నా పిల్లలు కూడా కార్పొరేటు స్కూళ్ళల్లో చదవాలి అనుకుంటాడు. నా పిల్లలు కూడా కార్పొరేటు కాలేజీలలో చదవాలి అనుకుంటాడు. నా ఇంట్లో వాళ్ళకి కూడా కార్పొరేటు ఆసుపత్రులల్లో వైద్యం చేయించాలి అనుకుంటాడు.

అధ్యక్షా, 50 వేల రూపాయలు కూడా లెక్కచేస్తే మిగులుతలేవు. రైతు కార్పొరేటు స్కూల్లో, కార్పొరేటు కాలేజీలో చదివే పరిస్థితి కానీ, కార్పొరేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే పరిస్థితి కానీ లేదు. రైతు మనందరికీ అన్నం పెడుతున్నాడు అధ్యక్షా. ముఖ్యమంత్రిగారు సభలో ఉన్నారు. పెద్ద మనసుతో ఈ విషయాన్ని ఆలోచించాలన్న ఆలోచనతోనే నేను చెప్తున్నా. రైతు పిల్లలు ఏ కార్పొరేటు స్కూల్లో చదివినా, ఏ కార్పొరేటు ఆసుపత్రికి ట్రీట్మెంటుకు వెళ్ళినా, 90 శాతం సబ్సిడీతో చదవులు, 90 శాతం సబ్సిడీతో వాళ్ళకు ట్రీట్మెంటు జరగాలి.

ప్రభుత్వం తరఫున ఒక మాట వస్తది. ఈ కార్పొరేటు ఆసుపత్రిలో చదివినా మేము ఫీజు రీయింబర్సుమెంట్ ఇస్తున్నాం కదా? ఏ కార్పొరేటు ఆసుపత్రికి వెళ్ళినా ట్రీట్మెంటు కొరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ఉన్నది కదా అని ప్రభుత్వం మాట్లాడొచ్చు. అధ్యక్షా, నేను ప్రభుత్వానికి మీద్వారా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. కార్పొరేటు ఆసుపత్రుల్లో రైతు బిడ్డలే కావచ్చు, మిగత వాళ్ళే కావచ్చు ఈ ఫీజు రీయింబర్సుమెంటు మీద పోయే వాళ్లను ఎట్లా చూస్తున్నారంటే ఎందుకు వస్తున్నారు మీరు? మా కాలేజీలలో మిమ్మల్ని అడ్మిట్ చేసుకుంటే రూపాయి వచ్చేది లేదు, చచ్చేది లేదు. కానీ మీ పేర్లమీద సీట్లు ఇవ్వబడతాయి, ప్రభుత్వమేమో రూపాయి ఇస్తలేదు. మీరు చదివినా ఒకటే, చదువుకోకపోయినా ఒకటే అనే విధంగా అవహేళనగా ఆ కార్పొరేటు కాలేజీలు మాట్లాడుతున్నాయి అధ్యక్షా.

అలాగే కార్పొరేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పేషెంట్లు అంటే.. నేను ఉదాహరణ చెపుతున్నాను. రైతు ఆదిలాబాద్ నుంచి హైదరాబాదుకు ట్రీట్మెంటు కొరకు వచ్చాడు. నిమ్స్‌కు తప్ప వేరే ఆసుపత్రులకు వెళితే ఆరోగ్యశ్రీ లేదు అని బయటకు వెళ్ళగొట్టారు సార్. రైతు దగ్గర చిల్లి గవ్వ లేకుండే. ఆరోగ్యశ్రీ కూడా పాపం కార్పొరేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ అంటే చాలు వీళ్లకు ట్రీట్మెంటు ఇస్తే మనకేమొస్తది అనే విధంగా కార్పొరేటు ఆసుపత్రులు వ్యవహారం చేస్తున్నాయి కాబట్టి రైతుకు ఈ సమాజంలో ప్రత్యేక గుర్తింపు రావాలి.

భరోసా అంటే కేవలం డబ్బు మాత్రమే ఇవ్వడం భరోసా కాదు. రైతు అంటే ఈ సమాజం గౌరవించే పరిస్థితి రావాలి. ఆ రకమైన ఆలోచన వచ్చినప్పుడే రైతు ఏమన్నా బాగుపడే అవకాశం ఉంటుంది.

అధ్యక్షా, వ్యవసాయం చేయాలంటే ఎంత కష్టం ఉంటదంటే నేను వర్షాకాలం నేను నా చేన్లకు, మిగతా వాళ్ళ చేన్లకు కూడా పోయినాను. గౌరవ ముఖ్యమంత్రిగారికి మొన్న కూడా నేనొక విజ్ఞప్తి చేశాను. మన గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే దాదాపు 95 శాతం మంది శాసనసభ్యులు ఇక్కడ ఉన్నారు. సార్, వర్షాకాలం వ్యవసాయం చేయడానికి చేన్లల్లకు పోవాలంటే రోడ్లు వుండవు. ఎరువులను నెత్తిమీదకు ఎత్తుకుని పోవాలి. ట్రాక్టరులో గానీ ఆటోలో గానీ నాలుగు ఎరువుల బస్తాలు వేసుకుని వ్యవసాయం చేయడానికి చేన్లల్లకు తీసుకువద్దామంటే పోలేనటువంటి పరిస్థితులు ఉంటాయి. కాబట్టి నేను మీద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను, వచ్చేటటువంటి బడ్జెట్‌లో వ్యవసాయ పొలాలకు, చేన్లకు రోడ్లు అనే విధంగా మీరు ఈ కార్యక్రమాని తీసుకురండి. రైతులంతా సంతోషపడతారు. వర్షాకాలం వాళ్ళు చేన్లకు పోవాలంటే విపరీతమైన కష్టం ఉంటది. ఎంత బురద ఉంటదంటే ఎడ్లు దిగబడతాయి, బండ్లు దిగబడతాయి, ఎవరినైనా చేన్లకు పనికి పిలిస్తే ఎవరూ రారు. రైతులు గ్రామానికి పోవడానికి, రైతులు చేన్లకు పోవడానికి రోడ్లు అంత ఇంపార్టెంటు. కాబట్టి వచ్చే బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేసి మీ నాలుగు సంవత్సరాల ఈ కాలంలో ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రైతులందరికీ వారి చేన్లకు, పొలాలకు పోవడానికి రోడ్లు వేసే విధంగా మీరు చర్యలు తీసుకోవాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, పెద్దపెద్ద కంపెనీలు ఏ లోను తీసుకున్నా కొలాటెల్ గ్యారెంటీ లేకుండా వారికి లోను ఇస్తారు. వ్యవసాయం చేసుకునే రైతులకు కూడా తన సొంత ఇల్లు కట్టుకోవాలనే కోరిక ఉంటది. ఈ గడచిన పది సంవత్సరాలల్లో ఏ రైతు ఇల్లు కట్టుకుందామన్నా కూడా ప్రభుత్వం ఇల్లు ఇవ్వలేదు. పోనీ తనకు తాను సొంతంగా ఇల్లు కట్టుకుందామంటే బ్యాంకుకు వెళితే అధ్యక్షా గ్యారెంటీ ఏమి ఇస్తావు అంటున్నారు. రైతు దగ్గర ఏముంటది. తాను చేసుకుంటున్న పొలం/చేను ఉంటది. కానీ బ్యాంకులు ఏమంటాయి. మీ వ్యవసాయ భూమిని మేము తాకట్టు పెట్టుకుని మీ ఇల్లు కొరకు లోను ఇవ్వము అంటారు. మరి రైతు ఇల్లు ఎట్లా కట్టుకుంటాడు. మిగతా వాళ్లకేమో వందల వేల కోట్ల రూపాయలు ఎటువంటి గ్యారెంటీ లేకుండా బ్యాంకులు లోను ఇస్తాయి. ఎందుకంటే సమాజ హితం కొరకట, ఎంప్లాయిమెంటు జనరేట్ చేయడం కొరకట.

రైతు కూడా మనకు తెలవకుండానే, 10 ఎకరాలు ఉన్నటువంటి రైతు రోజుకు ఎనిమిది నుంచి పది మందికి కూలీగా ఉపాధినిస్తాడు. రైతుకు ఏమీ మిగలడం లేదు. కానీ పదెకరాలు ఉన్నటువంటి ఆసామి ఆరువందల నుంచి ఏడు వందల మందికి సంవత్సరం కూలీ ఇస్తాడు. రైతు కూడ ఒక ఇండస్ట్రియలిస్ట్ కన్నా ఎక్కువ ఈ సమాజానికి ఉపయోగపడుతున్నాడు. తనకేమీ మిగలడం లేదు. కానీ తను మాత్రం మిగతా వాళ్ళకి ఉపాధి ఇస్తున్నాడు. కాబట్టి నేను గౌరవ ముఖ్యమంత్రిగారికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రాష్ట్రంలో ఏ రైతు అయినా సరే, పది లక్షల రూపాయల వరకు ఇల్లు కట్టుకుంటానంటే.. ఎందుకంటే ప్రభుత్వం

ఇచ్చే ఇళ్ళల్లో నూటికి నూరు శాతం మందికి మనం ఇవ్వలేము. అది సాధ్యమయ్యే పని కాదు. కానీ రైతు బ్యాంకుకు వెళ్ళి నేను ఇల్లు కట్టుకుంటాను లోను కావాలి అంటే ఎటువంటి గ్యారెంటీ లేకుండా లోను ఇచ్చే విధంగా బ్యాంకర్లతోని ఏదైనా సమన్వయం చేసి అవసరమైతే ఢిల్లీకి వెళ్ళినపుడు మీరొక రిప్రజెంటేషన్ ఇచ్చి రైతులకు సహాయం వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని మీద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

12.30 మ. అధ్యక్షా, అలాగే NREGS పథకం. ఇది మీ కేంద్ర ప్రభుత్వ పథకమే కదా అక్కడున్నది మీ ప్రభుత్వమే కదా, తెచ్చుకుంటే అయిపోతుందని అంటున్నారు.

మిస్టర్ స్పీకర్ :- శంకర్‌గారూ, కంక్లూడ్ చెయ్యండి. రైతు భరోసాకు పరిమితమై మాట్లాడండి.

శ్రీ పాయల్ శంకర్ :- ఓ.కే. సార్. నేను చెప్పేది ఏమిటంటే ఎకరానికి ఇంతని ఇస్తే అయిపోదు. NREGS అనే దానిని ఈ వ్యవసాయానికి అనుసంధానం చెయ్యాలి. మేము గతంలో కూడా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగారికి ఒక రిప్రజంటేషన్ ఇచ్చాము. వాళ్లు ఏమన్నారంటే మీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ఆలోచన చెయ్యమని చెప్పండి. మేము త్వరలోనే దీనికి సంబంధించిన అధికారాలన్నీ రాష్ట్రప్రభుత్వానికి ఇస్తున్నం. వ్యవసాయానికి ఏ రకంగా అనుసంధానం చేస్తే బాగుంటదో, రైతుకి ఏ రకంగా మద్దతు కాలుగుతదో దానికి ఒక మీటింగుఏర్పాటు చేసి, ఈ రాష్ట్రప్రభుత్వం సలహాలు, సూచనలు పంపితే మేము ఆలోచిస్తామని వారు చెప్పారు కాబట్టి ఈ NREGS ను వ్యవసాయానికి అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నా.

అధ్యక్షా చాలా ముఖ్యమైన మరొక విషయం. గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ మాటని వినాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు రావలసిన అవసరం ఉంది. ఎందుకు అనంటే రైతు మిర్చిని అమ్మితే కిలోకి అరవై రూపాయలు వస్తే, అదే కారంపొడి చేసి అమ్మితే కిలోకి రూ.110 వస్తుంది. మిర్చిని డైరెక్టుగా రైతు అమ్మితే అరవై రూపాయలే, కాని కారంపొడి చేసి అమ్మితే రూ.110 వస్తుంది. అంటే కిలోకి యాభై రూపాయల తేడా వస్తున్నది. అందుకే నేనేమంటున్నానంటే వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు గ్రామాల్లో రావాలి. ఇవ్వాళ కేంద్ర ప్రభుత్వం గొప్ప ఆలోచన చేస్తున్నది. ఈ నేచురల్ గ్యాస్‌కి సంబంధించి, బయో గ్యాస్‌కి సంబంధించి కొన్ని విషయాల మీద రైతులకి ఎటువంటి గ్యారెంటీ అవసరం లేకుండా, ఒక గ్రూప్ ఉంటే, ఆర్‌బిఐ ఎటువంటి గ్యారెంటీ లేకుండా, రూ.25 కోట్లు ఇవ్వాలని ఆలోచిస్తున్నది కాబట్టి కనీసం పైలెట్ ప్రాజెక్టుగా, మండలానికి ఒకటి అటువంటి ప్రాజెక్టు, ఎటువంటి ఖర్చు లేకుండా, రైతుకి ఉపయోగపడుతుంది. ఎందుకంటే రైతు గడ్డిని పండిస్తాడు, ఆ గడ్డిని ఫ్యాక్టరీకి అందిస్తే, ఎకరానికి రెండున్నర లక్షల రూపాయల లాభం వస్తుందని చెబుతున్నారు. నేను మొన్న మహారాష్ట్రలో ఇటువంటి ఒక ప్రాజెక్టుని చూసొచ్చాను. గౌరవ ముఖ్యమంత్రిగారికి, వ్యవసాయ శాఖ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఒక టీమ్‌ని అక్కడికి వెంటనే పంపించి, అధ్యయనం చేయించండి. ఎందుకంటే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రైతులు అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

అదే విధంగా పంటల బీమా పథకం. దీని గురించి నేను చెప్పే ప్రయత్నం ఎందుకు చేస్తున్నానంటే అధ్యక్షా, నేను గతంలో ఆదిలాబాద్ నుండి 150 మంది రైతులని అప్పటి ముఖ్యమంత్రిగారి ఇల్లు ముట్టడికి తీసుకొచ్చాను. అప్పుడెట్లుండె పరిస్థితి, కంచెలేసి ఉండేది. హైదరాబాద్‌కి రావాలన్నా కష్టంగా ఉండేది. కాని నేను ఆదిలాబాద్ నుండి రైతులని, తిరుపతి పోతున్నామని చెప్పాను. పోలీసులోళ్ల నిఘా ఇంతమంది రైతులు ఎటుపోతున్నారని. మేము తిరుపతి పోతున్నామని ఇక్కడికొచ్చాము. ప్రగతి భవన్ ముందు ఐటిసి హోటల్ ఉంది. మేము అక్కడ 15 రూములు తీసుకుని, రైతులందరినీ అక్కడ ఉంచి ఉదయం

7 గంటలకు ప్రగతి భవన్ ముట్టడి చేసి, లోపలి దాకా వెళ్లాము. ఎందుకలా వెళ్లామని అంటే, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తలేదు, రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన ప్రీమియం కట్టడం లేదని మేము ధర్నా చేస్తే, ఆరోజు మా మీద పోలీసులు లాఠీఛార్జ్ చేసిన్రు, నా మీద, రైతుల మీద కేసులు పెట్టిన్రు. ఇప్పటిదాకా మేమా కేసులు ఎదుర్కొంటున్నాము. ఈ పంటల బీమా పెడితే, రైతులకు ఎందుకు భరోసా వస్తుందంటే ప్రభుత్వం మీద భారం కూడా తక్కువైతది. రైతులకి భరోసా కూడా వస్తది. గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక మాట అన్నారు. నేను చాలా సంతోషపడ్డా. ఆంధ్రప్రదేశ్‌లో రైతు బీమాకి సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వమే కడుతున్నది, ఈ తెలంగాణ రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వమే కడుతుంది అని చెబితే నేను చాలా సంతోషపడ్డా. నేను అగ్రికల్చర్ కమీషనర్‌గారికి పదేపదే ఫోన్ చేసి, అడుగుతుండేవాడిని. ఫైల్ ముఖ్యమంత్రిగారి కార్యాలయంలో ఉందని చెప్పారు. నేను గౌరవ ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఈ పంటల బీమా పథకం మీరు అమలు చేస్తే, ప్రభుత్వం మీద భారం తక్కువైతది, రైతులకి కూడా కాలం కలిసొచ్చినా, కలిసిరాకపోయినా, వర్షాలు ఎక్కువొచ్చినా, తక్కువొచ్చినా ఆ బీమాలో కవరేజి ఉంది కాబట్టి, పంటల బీమాపథకాన్ని అమలుచేయవలసిందిగా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా ఉన్నా.

అదే విధంగా అధ్యక్షా విత్తనాల చట్టం. రైతుకి చాలా మోసం జరుగుతున్నది. ఎప్పుడో తాతల కాలం నాటి చట్టం అది. ఆ చట్టాన్ని మార్చాలి. విత్తనాల్లో రైతులు మోసపోతే, ఆ రైతు సంవత్సరమంతా కోలుకోలేడు. ఎందుకంటే దానికొక టైం ఉంటుంది. ఆ టైంలో మొలకెత్తకపోతే తిరిగి విత్తనాలు వేసి, మొలకెత్తించాలంటే నెల పైన గ్యాప్ అయిపోతుంది. సరైన రీతిలో పంట దిగుబడి రాదు. విత్తన సమయంలోనే రైతు మోసపోతున్నడు. ఏమయిందంటే చట్టాలున్నయి, కోర్టులున్నయి కాబట్టి చిన్నచిన్న కేసులు పెట్టినా, వాళ్లు కోర్టుకి పోకముందే పోలీస్‌స్టేషన్లలో బెయిల్ వస్తున్నది. నేను అందుకే మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా ఉన్నా. ఎవరైతే డూప్లికేట్ విత్తనాలిచ్చి రైతులను మోసం చేస్తారో వాళ్లు కనీసం ఒక 90 రోజులు బయటకు రాకూడదు. అటువంటి కఠినతరమైనటువంటి చట్టాలు కావాలి. విత్తనాలప్పుడే రైతులు మోసానికి గురైపోతే, రైతు వ్యవసాయం చేసుకోలేని పరిస్థితి ఉంటది కాబట్టి దయచేసి ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు ఆ రకంగా ఆలోచించాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే విధంగా A.E. ల బాధ్యత. వీళ్లు ఎప్పటికప్పుడు రైతులకు సాంకేతికపరంగా సలహాలు ఇచ్చి, ఈ వంగడాలు బాగుంటాయి, ఈ పంటలు బాగుంటాయి అనే విధంగా ఎప్పటికప్పుడు వారిని చైతన్యపరచాలి. కాని ఉన్నటువంటి పరిస్థితి చూస్తే ఆ రకమైన సలహాలు రైతులకు ఎక్కడా కూడా దొరకడం లేదు. అందుకే ప్రపంచంతో రైతు పోటీపడాలి. మిగతా కొన్ని దేశాల్లో ఎకరానికి 30 క్వింటాళ్లు, 40 క్వింటాళ్లు పత్తి వస్తున్నది, మనమింకా 10,12 క్వింటాళ్లలోనే ఉన్నాం. మిగతా దేశాలో బిటీ 7, 8కి వెళ్లిపోయారు. మనమికా బీటీ 2 లోనే ఉన్నాం. 3 అనధికారికంగా నడుస్తా ఉన్నది. క్వాలిటీ విత్తనాలు రైతులకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అటువంటి క్వాలిటి విత్తనాలు మనం రైతులకి ఇవ్వలేకపోతే మీరు ఎన్ని సబ్సిడీలిచ్చినా, ఎన్ని రుణమాఫీలు జరిగినా, ఎంత రైతు భరోసా ఇచ్చినా, రైతు బాగుపడడు. ఒక వింత పరిస్థితి నడుస్తా ఉంది. అదేందంటే ఎన్నికలకు ముందు మాత్రమే రాజకీయ పార్టీలు రైతులవిషయంలో మేనిఫెస్టోలు ఎంత గొప్పగా తయారుచేస్తున్నారంటే, ఏ రాజకీయ పార్టీగాని, అది టిఆర్ఎస్ పార్టీనా, కాంగ్రెస్ పార్టీనా లేక బీజేపి పార్టీనా కాదు. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు రైతుల విషయంలో ఏ రకంగానైతే ఉంటున్నదో అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఇచ్చినటువంటి హామీల మీద గొప్పగా ఆలోచన ఉంటే రైతులు ఎప్పుడూ కూడా వాళ్లని మరిచిపోరు అధ్యక్షా. ఈరోజు రైతుబంధు విషయం మాట్లాడుతూ,

మాట్లాడుతూ మేమింతిచ్చినం, మేమంతిచ్చినం, మీరేం చేసిన్రు, మేమేం చేశామని ఈసభా సమయం అంతా కూడా విమర్శలకే పోతున్నది. సలహాలు ఎవరూ ఇవ్వడం లేదు. వీళ్లు, వాళ్లు గొప్పగా చెప్పుకునే ప్రయత్నమే చేస్తున్నారు. మేం ఇంత చేసినం కదా, మీ నాయకుడు గిట్ల చేసిండు కదా, మీ నాయకుడు ఇది తిన్నాడు కదా ఈ రకమైన మాటలు తప్పితే, ఏం చేస్తే రైతు బాగుపడతాడు అని ఏ రాజకీయ పార్టీ కూడా సలహాలిచ్చే ప్రయత్నం చేయడం లేదు. నేను వ్యవసాయ శాఖ మంత్రిగారి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను తమరి ద్వారా. రైతుకు ఈరోజు పనిముట్లు చాలా అవసరం. గతంలో పదేళ్లు ఈ రాష్ట్రాన్ని పాలించినటువంటి ఒక పార్టీ ప్రభుత్వం ట్రాక్టర్లిచ్చింది అధ్యక్షా. ఎవరికిచ్చిందో తెలుసా అధ్యక్షా, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే. రైతు ఒకపార్టీ కార్యకర్తనో లేక అతనికి ఒక కులమో లేదు. నిజంగా వ్యవసాయ చేసుకునే రైతులకిస్తే బాగుంటుంది కదా. మీ పార్టీ కార్యకర్తలకే వ్యవసాయ పనిముట్లు ఇస్తుంటే అది ఏ రకమైన మంచి జరుగుతుంది? నేను అందుకే మీ ద్వారా వ్యవసాయశాఖ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. కొంత ప్రారంభించనట్లు ప్రారంభించిన్రు, కాని మళ్లీ అది మందగించింది. వ్యవసాయ పనిముట్లు స్ప్రింకర్లు కావచ్చు, డ్రిప్ ఇరిగేషన్ కావచ్చు, సబ్సిడీ మీద ట్రాక్టర్లు కావచ్చు, నాగళ్లు కావచ్చు, ఈ రకమైనటువంటి వ్యవసాయ పనిముట్లు మీరు వెంటనే అందించే ప్రయత్నం చెయ్యాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ రోజు పంటలకు సంబంధించిన విషయాలు మాట్లాడేటప్పుడు ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది అధ్యక్షా. మన దగ్గరున్న దిగుబడితో ప్రపంచంతో మనం పోటీపడలేం. ఈ రోజు కొన్ని దేశాల్లో, నేను థాయ్‌లాండ్‌లో చూశాను. కొరియాలో చూశాను. ఒక చర్చ ఏం జరుగుతుందంటే, ఏ రాష్ట్ర బడ్జెట్‌లో చూసినాగాని, వ్యవసాయం వల్ల జీడిపి ఎంత పెరుగుతున్నది? ఇండస్ట్రీలు తెచ్చుకుంటే బాగుంటుందని ఆలోచిస్తున్నారు. మరి అన్నం ఎక్కడినుంచి తెచ్చుకుంటాం అధ్యక్షా? ఇండస్ట్రీలు తెచ్చుకుంటాం. వాళ్లకు మనం సహాయం చేస్తాం, వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేటోళ్లు, ఈ దేశంలోలేదా ఇతర దేశంల నుండి వస్తుండొచ్చు. కాని అన్నమైతే తెచ్చుకోలేం కదా? మనం అన్నమైతే తినాలి కదా? అందుకే వ్యవసాయానికి అవసరమైన అనుబంధ పరిశ్రమల మీద దృష్టి పెట్టేటటువంటి ప్రయత్నంచెయ్యండి. ఈరోజు ప్రపంచంలో కొన్ని దేశాలున్నాయి. అది చిన్న దేశమే. వ్యవసాయంతోనే వాళ్ల జీడిపిఏ రకంగా ఉన్నదో ఒకసారి ఆలోచించండి. అందులో పాడి పరిశ్రమ ఉంది. National Livestock Mission, NLM, అని కేంద్ర ప్రభుత్వ పథకం ఒకటి ఉంది. వేల కోట్ల రూపాయలు ఈరోజు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగాఉంది. రూపాయి, రెండు రూపాయలు కాదు అధ్యక్షా, యాభై శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు కోట్ల రూపాయలు యూనిట్ పెట్టుకుంటే, నాలుగు కోట్ల రూపాయల యూనిట్ పెట్టుకుంటే ఏ రైతు అయినా సరే, రెండు కోట్ల సబ్సిడీ ఇస్తుంది. కోటి రూపాయల యూనిట్ పెట్టుకుంటే, అది పౌల్ట్రీ కావచ్చు, డెయిరీ కావచ్చు, యాభై లక్షల రూపాయల సబ్సిడి అంటే 50 చొప్పున సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది. గతంలో మన దగ్గరున్న ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చెయ్యలేదు. దురదృష్టం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వ పథకంఅంటే, ఎక్కడ భారతీయ జనతా పార్టీకి పేరొస్తుందోనని, ఎక్కడ నరేంద్ర మోదీ జపం జరుగుతుందోనని ఏ పథకాన్ని రానివ్వకుండా ఆపుతుండె.

12.40 మ. అందుకే మీద్వారా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేదేమంటే, గౌరవ ముఖ్యమంత్రిగారు మొదటి సభలో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమున్నప్పటికీ, మాకు భేషజాలు లేవు, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రం ఇచ్చేటటువంటి ప్రతి రూపాయిని తీసుకొచ్చి ఈ రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా నేను ప్రయత్నం చేస్తానని గొప్పగా ఒక మాట మాట్లాడినందుకు చాలా సంతోషం అధ్యక్షా. నరేంద్రమోదీగారి ఆలోచనలు చాలా గొప్ప ఆలోచనలు. ఇక్కడున్న మంత్రులలో చాలా

మంది సంవత్సర కాలంలో ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ఎక్కడ, ఏ కేంద్ర మంత్రి దగ్గరికి వెళ్లి వచ్చినా, వారి నోటి నుండి మొదలు వచ్చే మాట ఏమిటంటే, మాకు ప్రధానమంత్రిగారు ఒక మాట చెప్పారు, ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కూడా సంబంధం లేదు, మీ రాష్ట్రానికి కావలసిన అన్ని విషయాల్లో పూర్తిగా సహకరిస్తామని ప్రతి కేంద్ర మంత్రి రాష్ట్రం నుండి వెళ్ళే మంత్రులకు చెబుతున్నారు. అంతకన్నా ఎక్కువ ఉదారత, అంతకన్నా గొప్ప మనసు ఇంకా ఏం కావాలి అధ్యక్షా. అందుకే మీద్వారా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేదేమంటే, రాజకీయాలు చేసేటప్పుడు రాజకీయ విమర్శలు చేసుకుందాము, ఇంకొక దురదృష్టమేమంటే...., నేను కొత్తగా వచ్చిన సభ్యుడిని నాకొక విషయం అర్థం కావడం లేదు. నేను ఎంఎల్ఏ కాకముందే కొన్ని కలలు కన్నాను. ఈ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ధర్మాన ప్రసాద్ రావుగారు మాట్లాడిన స్పీచ్‌ను, తుమ్మల నాగేశ్వరరావు గారు మాట్లాడిన మాటలను, నోముల నరసింహయ్యగారు మాట్లాడిన మాటల్ని, విద్యా సాగర్ రావు గారు మాట్లాడిన మాటల్ని, పయ్యావుల కేశవులుగారు మాట్లాడిన మాటల్ని నేను దాదాపు 25 సంవత్సరాల నుంచి బాగా వినే ప్రయత్నం చేస్తూండేవాడిని. నేను యూ ట్యూబ్‌లో ఈ స్పీచ్‌లు పెట్టుకొని వింటున్నప్పుడు నా మిత్రులు ఎందుకు వాళ్ల స్పీచ్‌లను గంటలు, గంటలు వింటూన్నావని అడిగినప్పుడు, వారితో నేను, రేపు అసెంబ్లీకి వెళ్లి ఈ రాష్ట్రంలో ఉన్న సమస్యలను వారు మాట్లాడినట్లే నేను కూడా మాట్లాడాలనే బలమైన కోరిక ఉన్న కారణంగా ఆ స్పీచ్‌లను వింటున్నానని వారితో చెప్పేవాడిని.

నిన్న ఒక విషయం మీద మాట్లాడే అవకాశం వస్తుందని బాగా ప్రిపేర్ అయ్యి వచ్చాను. నిన్న వీళ్ల గొడవ, వాళ్లగొడవ చూస్తే మూడున్నర గంటలు పోయింది. మేము కొత్తగా వచ్చినవాళ్లము, రాత్రి 2, 3 గంటలకు లేచి ఏమేమి ఉన్నాయి, ఎట్లా మాట్లాడాలని ప్రిపేర్ అయ్యి వచ్చాము. కొత్త సభ్యునికి మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు మీరు కొంతమేరకు నేరుగా వారించి, వారిని కంట్రోల్ చేసి మాకు అవకాశం వచ్చేవిధంగా ప్రయత్నం చేయాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

రైతుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు రావలసిన అవసరం ఉంది. రైతుకు ప్రత్యేకమైన గుర్తింపు ఇచ్చాము కదా? ఇంకేమీ కావాలని మీరు అనొచ్చు. ఈ రాష్ట్రంలో అతితొందరగా నమ్మేది రైతు మాత్రమే. ఏ రాజకీయ పార్టీ ఏ మాట ఇచ్చినా రైతు నమ్ముతాడు. రైతు నమ్మినంత తొందరగా ఇంకెవరూ నమ్మరు. రైతు నమ్మి ఓటు వేశాడు, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే రైతు మీ మాటలను బలంగా నమ్మాడు. రైతులు ఓట్లు వేయడం వల్లనే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మీరు ఇచ్చిన ప్రధానమైన హామీలలో రుణమాఫీ ఒకటి. మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారికి మిగతా మంత్రివర్గానికి విజ్ఞప్తి చేసేదేమంటే మీరిచ్చే స్టేట్‌మెంట్‌లో తేడాలు ఉంటున్నాయి. అవి కంట్రోలు కావాలి. ఒక మంత్రిగారు 60 శాతం మాఫీ అయ్యింది, ఇంకో 40 శాతం చేయాలని, ఇంకొక మంత్రిగారు 70 శాతం అయ్యింది 30 శాతం కాలేదని అంటున్నారు. మీరు ఎంత మాఫీ అయ్యింది, ఇంకా ఎంత మాఫీ ఇవ్వాలనే అంశం మీద కన్‌క్లూజన్‌కు రావాలి. రాష్ట్ర ఖజానా మీకు సహకరించకపోయినా, ఇబ్బందులు ఉన్నా కూడా మీరు వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేయండి. మీద్వారా ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. కోఆపరేటివ్ బ్యాంకులలో 65 నుండి 70 శాతం రైతులకు రైతు రుణాలు మాఫీ కాలేదన్న విషయాన్ని గౌరవ మంత్రిగారు నోట్ చేసుకోవాలని కోరుతున్నాను. రెండు లక్షల రూపాయల రుణమాఫీ అది టెక్నికల్ పరంగా సమస్య ఉందా లేదా ఇంకొక విధంగా సమస్య ఉందా అనే విషయాన్ని మీరు వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి ఆర్డర్స్ ఇవ్వాలని కోరుతున్నాను.

గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణ మాఫీ చేసినప్పుడు, వడ్డీకే సరిపోయింది. దానిలో ఎటువంటి

అనుమానం లేదు. కానీ, ఈరోజు వరకు కూడా రెండు లక్షల రూపాయల రుణాలు ఉన్న రైతులున్నారు. మీరు ఎప్పటివరకు క్లియర్ చేస్తారో క్లారిటీ ఇవ్వడం లేదు. మీరేమంటున్నారంటే రెండు లక్షలకు పైగా రుణం ఉన్న రైతు తన డబ్బును బ్యాంకులో జమ చేసిన తరువాత ఆ సమాచారం మాకిస్తే, మేము రెండు లక్షల రూపాయలు చెల్లిస్తామని చెబుతున్నారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్నటువంటి రైతుకు రుణమాఫీ చేయవలసిందే. ఎందుకంటే మీరు 70 శాతం, 80 శాతం మేరకు రుణమాఫీలు చేసినా, మిగిలిన 20 శాతం వారికి చేయకపోతే, 80 శాతం రుణమాఫీ చేసిన వారు ప్రచారం చేస్తారో, లేదో తెలియదు గానీ, ఈ 20 శాతం మంది మాత్రం మిమ్మల్ని జీరో చేస్తారు. మీరు జాగ్రత్తగా ఉండండి. రెండు లక్షల రూపాయల రుణమాఫీని మీరు ఎప్పటిలోగా చేస్తారనే విషయం మీద క్లారిటీ ఇవ్వాలి. ఆర్థిక పరిస్థితి మీకు సహకరించకపోవచ్చు. వాస్తవాలు చెప్పండి. కానీ, బుకాయింపు ద్వారా ప్రజలను నమ్మించలేరు. ఒకప్రక్క ఎస్ఎల్బీసీ లెక్కల ప్రకారం రూ.52 వేల కోట్లను రైతులు రుణాలు తీసుకున్నారు, రూ.21 వేల కోట్లు మాఫీ చేశారని చెబుతున్నారు. మరి అలాంటప్పుడు ఇంకొక రూ.30 వేల కోట్లు రైతులు బాకీ ఉన్నట్లేగా? దానిలో, రూ.10 వేల కోట్లు వేరే అప్పులు ఉన్నా కూడా ఇంకో రూ. 22 కోట్లు అప్పు ఉన్నట్లేగా? క్లియర్‌గా మీరు చెప్పిన స్టేట్‌మెంట్స్ ప్రకారమే రూ. 20 వేల కోట్లు ఇంకా ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు కాబట్టి, దీనిలో క్లారిటీ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ పథకాన్ని కొంత క్యాటగిరీల వారీగా చేసుకుంటూ ముందుకు వెళితే ఆర్థికంగా ఇబ్బంది లేకుండా కొనసాగించవచ్చన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉండి ఉండవచ్చు. సహజంగా ప్రభుత్వాన్ని నడిపేటప్పుడు ఆ ఆలోచన వస్తుంది. దుబారా ఖర్చు చేయకుండా, ఎక్కడ రూపాయి ఖర్చు తక్కువ చేసి అడ్మినిస్ట్రేషన్ ఏ రకంగా చేయగలుగుతామనే ఆలోచన మీకు ఉండి ఉండవచ్చు.

ఈ రాష్ట్రంలో రెండున్నర ఎకరాలు ఉన్న రైతులు 47 లక్షల మంది, రెండున్నర ఎకరాల నుండి 5 ఎకరాలు ఉన్న రైతులు 11 లక్షల మంది, 5 ఎకరాల నుండి 10 ఎకరాలు ఉన్న రైతులు 4లక్షల 72 వేల మంది రైతులు, 10 ఎకరాలకు పైనున్నటువంటి రైతులు ఈ రాష్ట్రంలో కేవలం 64 వేల మంది మాత్రమే ఉన్నారు. నేనేమంటున్నానంటే, గుట్టలకు, పుట్టలకు, లేఅవుట్లు చేసిన స్థలాలకు ఇవ్వకుండా వాటిని తీసివేస్తే తప్పు లేదు. గుట్టలకు ఇవ్వాలని మాట్లాడితే వారు మూర్ఖులు. వ్యవసాయం చేస్తున్న రైతుకు సాయం చేయండి. వెయ్యి కోట్ల రూపాయాల ఫ్యాక్టరీని పెట్టిన వారికి ప్రభుత్వ రాయితీలుస్తున్నాము. రూ. 5 వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి వచ్చిన వారికి కూడా సబ్సిడీలు ఇస్తున్నాము, వారికి ప్రభుత్వ రాయితీలుస్తున్నాము. మన కొరకు అన్నం పెట్టే వ్యవసాయం చేసే రైతుకు పది ఎకరాల పైన ఉండే రైతుకు ఇవ్వడానికి ఆలోచిస్తున్నామంటే కొంత బాధ అనిపిస్తుంది. అటువంటి ఆలోచనను విరమించుకోవాలని కోరుతున్నాను. రైతుకు కులం లేదు. వారు ఏ కులమైనా రైతు రైతే. మీరు మిగతా విషయాలు ఆలోచించకుండా...., అన్ని ఎక్కువ ఎకరాలు ఎవరు వ్యవసాయం చేస్తున్నారు అధ్యక్షా. వ్యవసాయం అంత బాగోలేదు. మనకున్న ఫామ్‌హౌజ్‌ల తీరు లేవు. దురదృష్టమేమంటే నాయకులకు ఈ మధ్యన ఫామ్‌హౌజ్‌లు అయిపోయాయి. ఆ నాయకులకు ఏమనిపిస్తుందంటే నా ఫామ్‌హౌజ్‌లో ఎట్ల ఉన్నదో మిగతా ఊర్లల్లోని రైతుల వ్యవసాయం కూడా అట్లనే ఉంది అనుకుంటారు. కానీ నువ్వు కట్టుకున్నట్లు రూ. 20 కోట్లు పెట్టి రైతులకు ఫామ్‌హౌజ్‌లు లేవు. ఏ రాజకీయ పార్టీ అయినా, ఏ రాజకీయ నాయకుడైనా ఆలోచించాలి. రైతుల గురించి ఈ సభ ఆలోచించకుంటే ఇంకెవరు ఆలోచిస్తారు అధ్యక్షా. 20, 25 ఎకరాల కంటే వ్యవసాయం చేసే రైతులు హాఫ్ పర్సెంట్ కూడా ఉంటారో, ఉండరో. వీరి వల్ల పెద్దగా సేవ్ అయ్యేది కూడా ఏం ఉండదు. ఎక్కువలో ఎక్కువ 5 ,4 ,3 ఎకరాలలో చేసేవాళ్లే ఎక్కువగా ఉంటారు. 64 వేల మంది గురించి మీరు పెద్దగా ఆలోచించి

మీరు చెడ్డ పేరు తెచ్చుకోవద్దని, మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

నరేంద్ర మోదీగారు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు అవుతుంది. కేంద్రం నుండి గొప్ప గొప్ప సాయాలు తీసుకున్నారు. మా నాయకుడు ఒక మాట మాట్లాడబోతుంటే ఆఖరికి బీజేపీ వాళ్లు కూడా మాట్లాడుతున్నారా? ఆఖరికి బీజేపీ వాళ్లకి కూడా మైకు ఇస్తున్నారా? అంటే ఏంది అధ్యక్షా, ఇది. బీజేపీ అంటే ఏమనుకుంటున్నారు అధ్యక్షా? మీరు పాత పది జిల్లాలు, ఈ కొత్త 33 జిల్లాలు పరిపాలించిన మీకే ఇంత ఉంటే 750 జిల్లాలను పరిపాలిస్తున్నాము మాకెంత ఉండాలి. మా అధికారం గురించి మీకు తెలియదా? బిజేపీ గురించి చెడుగా మాట్లాడితే ఏమయ్యిందో మీకు తెలియదా? అంత అవమానపరిచే విధంగా ఆఖరికి బీజేపీ వాళ్లు కూడా మాట్లాడుతారా అంటే ఎట్లా? సాటి సభ్యులను వారు ఆవిధంగా అంటే బాధ అనిపిస్తుంది. మేము మా పార్టీని, మా నాయకుడి గురించి మా ప్రభుత్వాన్ని మాట్లాడుతున్నప్పుడు ఇంటర్ఫియర్ అవ్వడం కరెక్ట్ కాదు. నాకు వారు అన్నటువంటి మాటలకు బాధ అనిపించింది. సీనియర్ సభ్యులు గౌరవించి వారు కొన్ని విషయాలు చెప్పే ప్రయత్నం చేయాలి.

ఈరోజు నాకు జ్వరం వచ్చి లేవలేకపోతున్నప్పటికీ, నేను ఈ మాట ఎందుకు చెబుతున్నానంటే, ఇటువంటి అవకాశం మళ్లీ రాదని రైతులకు సంబంధించిన చర్చ ఉంది, రైతుల సమస్యలు, రైతుల సమస్యలలలో కొన్ని నాకు కూడా ప్రాక్టికల్‌గా తెలుసు కాబట్టి, సభకి వచ్చి వీటన్నింటిని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. వ్యవసాయ శాఖ మంత్రిగారికి మీ ద్వారా విజ్ఞప్తి చేసేదేమంటే, మీకు వ్యవసాయంలో చాలా అనుభవం ఉన్నది. నాకు తెలిసి మీరు క్యాబినెట్‌లో సీనియర్ అనుకుంటా. మీరంటే గౌరవ ముఖ్యమంత్రి గారికి కూడా చాలా మర్యాద ఉంది. బడ్జెట్ రూపకల్పనలో కొంచెం ఎక్కువ కేటాయించే ప్రయత్నం చేసి రైతులకు కొంత న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేయాలని మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను అధ్యక్షా.

12.50 మ. ఒకటే నిమిషం మాట్లాడి పూర్తి చేస్తాను. ఎందుకంటే, ముఖ్యమంత్రి గారు సభలో ఉన్నారు. మా మాటల్ని వింటే కొంత సానుకూలంగా స్పందిస్తే, మా సమస్యలు పరిష్కారం అవుతాయి. రైతులకు కొంత భరోసా వస్తుందనే ఆలోచనతో ఈ విషయాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. మొదలు ప్రస్తావించిన మాటలను తిరిగి మరొక్కసారి ప్రస్తావించే ప్రయత్నం చేస్తున్నాను.

వ్యవసాయం చేసే రైతులకు చేళ్ళలోకి వెళ్ళే తోవలు లేవు. ఇది చాలా ముఖ్యమైన అంశం. వ్యవసాయ శాఖా మంత్రి గారు ఈ అంశాన్ని ఒక ప్రత్యేక అంశంగా చేర్చుకోండి. ఎందకంటే, వ్యవసాయం చేసే రైతు చేనుకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్నారు. గతంలో ఎవరైనా వ్యవసాయం చేసే కూలీలు నడుచుకుంటునే చేనుకు వెళ్ళేవారు. ఈ రోజు కూలీలు నడుచుకుంటూ చేనులోకి వచ్చే పరిస్థితి లేదు. ఆటోలల్లో చేనుకు వెళుతున్నారు. మరి ఆటోలో వెళ్ళాలంటే, రోడ్లు సరిగ్గా ఉండాలి. రోడ్లు లేకుంటే ఎట్లా వెళతారు అధ్యక్షా? ఏ గ్రామానికి వెళ్ళినా రైతులు ఒకటే అడుగుతున్నారు. మీరు మాకు ఏం చేసినా, చేయకున్నా మేము చేళ్ళలో వెళ్ళేందుకు రోడ్లు వేయాలని రైతులు మాట్లాడుతున్నారు. ఈ విషయాన్ని రెండోసారి కూడా చెప్పాను. ఎందుకు చెప్పానంటే, మీకు మరీ మరీ గుర్తు ఉండాలన్న ఆలోచనతోనే ఈ విషయాన్ని చెప్పేటువంటి ప్రయత్నం చేశాను. అందుకు ఎవరికి ఎక్కడా కూడా కటింగులు లేకుండా పూర్తిగా రైతు భరోసా డబ్బును రైతుల ఖాతాలో వేసే విధంగా ప్రయత్నం చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ గురించి ప్రత్యేకంగా మీరు భరోసా ఇచ్చి..,

శ్రీమతి డి.అనసూయ :- (మైకు లేకుండా) ఎన్ని ఎకరాల భూమి ఉన్న వారికి ఇవ్వాలి?

శ్రీ పాయల్ శంకర్ :- తక్కువనే ఉన్నారక్కా ఎక్కువ భూమి ఉన్న వారు బిలో వన్ పర్సంట్ ఉన్నారు.

వ్యవసాయం చేసే వారందరికీ ఇస్తే బాగుంటుందని మా ఆలోచన. గుట్టలకు, పుట్టలకు మాత్రం నేను చెప్పను. 10, 15 ఎకరాలు మీరు అనుకుంటూ ఉండవచ్చు. కాని, వ్యవసాయం చేసే రైతులందరికీ ఇస్తే బాగుంటుంది.

చివరిగా ఒకటే మాట అధ్యక్షా. నేను వ్యవసాయ శాఖా మంత్రి గారికి తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నదేమంటే, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం అనే ఊరి ప్రజలు రైతు బంధు మొదలైన తరువాత, ఆ గ్రామ ప్రజలు రూపాయి కూడా రైతు బంధు నోచుకోలేదు. ఆ ధరణీ వల్ల వీరి పాస్ బుకులు, వీరి భూములు ఏమి రాలేదు. రైతులందరికీ ఇవ్వబడుతుంటే, పాపం వీళ్లు ఊరకనే చూస్తూ ఉండేవారు. ప్రత్యేకంగా వీరి తరఫున ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను. వీరు గతంలో కోల్పోయిన రైతు బంధు అంతా కూడా వీరికి పట్టాలొచ్చిన తరువాతా, వీరికి సహాయం చేసే విధంగా ప్రయత్నం చేయాలి. టెక్నికల్‌గా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ రైతు ఖాతాలో పడకపోతే, తిరిగి ఆ టెక్నికల్ సమస్య పూర్తి అయిన తరువాత నాలుగేళ్ళ క్రింద ఇవ్వాల్సిన రైతు బంధు కావచ్చు, ఈ రోజు ఇచ్చే రైతు భరోసా కావచ్చు తిరిగి రైతు ఖాతాలో వేసే విధంగా ఉత్తర్వులివ్వాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తూ, మాట్లాడేందుకు అవకాశమిచ్చిన మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి డి. అనసూయ :- గతంలో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద 2009-14 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున పంట పొలాలకు మెటల్ రోడ్లు ఇవ్వడం జరిగింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం వాటిని విస్మరించింది. మొన్న మా పంచాయతీ రాజ్ శాఖను మళ్ళీ ఎన్ఆర్ఈజీఎస్ ప్రావిజన్ పెట్టి రైతుల కోసం అక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులు కూర్చొని ఒక్కొక్కనియోజకవర్గానికి అక్కడ ఉండే ఫండ్‌ను బట్టి మీరు ఏర్పాటు చేసుకోవాలని కూడా చెప్పడం జరిగింది. ముఖ్యంగా రైతు భరోసా ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనే విషయం మాత్రం చెప్పకుండా దాటేస్తున్నారు. వారేమో అందరికీ ఇచ్చేయండి అని మాట్లాడుతున్నారు. కానీ, ఎన్ని ఎకరాల భూమి ఉన్న వారికి ఇవ్వాలి? 50 ఎకరాల భూమి ఉన్న వారికి ఇద్దామా, పంద ఎకరాలు ఉన్న వారికి ఇద్దామా? 200 ఎకరాలు ఉన్న వారికి ఇద్దామా? ఏ విధంగా ఇవ్వాలో స్పష్టం చేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- గౌరవ వ్యవసాయ శాఖా మంత్రి గారు రైతు భరోసా మీద..

(ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఓవైసీ గారు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని స్పీకర్ గారిని కోరడం జరిగింది.)

Just I wanted to give clarification, it is not reply. తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన అంశం. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావించిన రైతు భరోసా కార్యక్రమం మీద స్వల్ప కాలిక చర్చను సభ ముందు పెట్టి, ప్రభుత్వం రైతు భరోసా మీద తీసుకోవాలంటున్న నిర్ణయాల్లో ప్రధాన ప్రతిపక్ష సభ్యులందరినీ, శాసన సభ్యుల సలహాలు సూచనలు తీసుకొని ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసుకొని ముందుకు వెళ్ళాలని గతంలోనే సభా సమావేశాలకంటే ముందే ప్రభుత్వపరంగా సంక్రాంతి పండగ తరువాత రైతు భరోసా కార్యక్రమాన్ని కొనసాగించాలని ప్రభుత్వ పక్షాన ప్రకటన కూడా చేయడం జరిగింది.

రైతు భరోసాపై స్వల్ప కాలిక చర్చ సందర్భంగా శాసన సభ్యులు పాయల్ శంకర్ గారు చాలా విషయాలను ప్రస్తావించారు. అందులో ప్రధానంగా రెండు, మూడు విషయాల మీద నేను క్లారిఫికేషన్ ఇవ్వదలచుకున్నాను. ఎందుకంటే, చర్చ అంతఅయ్యాకకూడా ఇవ్వవచ్చు. కాకపోతే ఈ అంశాలకు సంబంధించి కొన్నిసార్లు వెంటనే రిప్లై చేసే వాటి ప్రాధాన్యత ఉంటుంది. సభ్యుల మనసులో ఉన్న అనుమానాలను కూడా మనం నివృత్తి చేసిన వాళ్ళమవుతాము. రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ పార్టీ రైతులను ఆదుకోవడానికి తీసుకోవాలన్న ఆలోచన దీనిని

అమలు చేసే విధానంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు. సంపూర్ణంగా తెలంగాణ రైతు సమాజాన్ని ఆదుకోవడానికే మా ప్రభుత్వం ముందు భాగంలో ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి శ్రీమతి ఇందిరా గాంధీ గారికున్న చరిత్ర ఇక్కడ ప్రతి ఒక్కరికి, తమరికి ప్రత్యేకంగా తెలుసు అధ్యక్షా. భూమి చుట్టూత ఉన్న పేదలు ముఖ్యంగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వ్యవసాయ కుటుంబాలు భూమినే నమ్ముకొని అమ్మగా భావించి, ఈ భూమి చుట్టూతనే వారి జీవితం ముడిపడి ఉన్న విషయంలో ఆ రైతులను ఆదుకోవాలన్నదే ప్రభుత్వం యొక్క ఆలోచన.

గత ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే రైతు బంధు పథకం.. ఈ రైతు బంధు పథకం యొక్కమూల ఉద్దేశం ఏమిటంటే, రైతుకు వ్యవసాయ పెట్టుబడి సహాయం పథకం. పెట్టుబడి సహాయం ఎవరికి అధ్యక్షా? వ్యవసాయం చేసుకునే వారికి సహాయం చేయడం, ఆ సహాయం పెట్టుబడి రూపంలో, నగదు రూపంలో రైతుకు చేరవేయాలన్నదే గత ప్రభుత్వం యొక్క లక్ష్యమని వారు ఇచ్చిన జీఓలో అంశాలను క్రోడీకరించారు. అమలు చేసే క్రమంలో గొప్పల కోసం పోయి, నిర్లక్ష్యం పరంగానో లేకపోతే ఏ మాత్రం బాధ్యత లేకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల సరాసరి ప్రభుత్వం ద్వారా రూ.22 వేల కోట్లు దాదాపుగా అయాచిత లబ్ధి అనర్హులకు చేరిందని ఒక అంచనా అధ్యక్షా. మేము అధికారంలో వచ్చిన తరువాత రూ. 7,625 కోట్లు రైతు భరోసా పథకంలో రైతుల ఖాతాలో వేసినవి తీసేస్తే అంతకంటే ముందు రూ.72,816 కోట్లు గత ప్రభుత్వం రైతులకు రైతు బంధు పథకం ద్వారా అందజేయడం జరిగింది. అందులో ఒక అంచనా సాగులో లేని భూములకు రూ.22,606 కోట్లు.., రాళ్ళకు, రప్పలకు, గుంటలకు, రోడ్లకు లేకపోతే పరిశ్రమలుగా రూపాంతరం చెందిన లేఔట్లు అయి రియల్ ఎస్టేట్‌లో ఎకరాలను గజాలుగా మార్చి, గజాలను లేఔట్లు చేసి, లేఅవుట్ల ద్వారా ఇండ్లను అమ్ముకొని, కాలనీలు వెలసిన వాటికి కూడా రైతు బంధు వచ్చిన దానితో రూ.72 వేల కోట్లలో రూ.22 వేల కోట్లు దాదాపుగా అయాచిత లబ్ధి అనర్హులకు చేరిందని ఒక అంచనా అధ్యక్షా.

1.00 మ. అధ్యక్షా, ఈ రోజు నేను మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. పాయల్ శంకర్ గారిని కూడా అడుగుతున్నాను. రాళ్ళకు, రప్పలకు, గుట్టలకు కూడా మనం ఇద్దామా? అదే విధంగా, రాజీవ్ రహదారిలో పోయిన.., పత్రికల్లో వచ్చిన వార్తలు అధ్యక్షా, నేనేమి కొత్తగా చెప్పడం లేదు. ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో రాజీవ్ రహదారిలో భూమి పోయి, రాజీవ్ రహదారి వేసిన రోడ్డుకు కూడా రైతు బంధు పథకం ద్వారా నిధులు ఇచ్చారు. అదే విధంగా నా ప్రాంతానికి సంబంధించి శ్రీశైలం (మా సొంత ఊరికి వెళ్ళాలంటే ఈ దారిలోనే వెళ్ళాలి)ఆమన్‌గల్ ప్రాంతంలో శ్రీశైలం రోడ్డులో పోయిన భూమికి అక్కడున్న అధికారులు, కొంత మంది రాజకీయ దళారులు కుమ్మక్కై, కొత్త పాస్ పుస్తకాలు ఇస్తే, శ్రీశైలంలో పోయిన రోడ్లకు రైతు బంధు పథకాన్ని ఆ గత ప్రభుత్వం ఇచ్చింది. ఇదే కాకుండా అల్‌రెడీ క్రషర్లు నడుస్తున్న క్రషర్ యూనిట్లకూ రైతు బంధు పథకాన్ని ఇచ్చింది. అదే విధంగా, మైనింగ్ లీజులిచ్చి మైనింగ్ జరుగుతున్న భూములకూ రైతు బంధు పథకాన్ని ఇచ్చింది. అదే విధంగా, టిఆర్ఎస్‌కు సంబంధించిన నాయకులు, అధికారులు పోడు భూములను గిరిజనులు, ఆదివాసీలకు ఇస్తే వాళ్ళ పేరు మీద కూడా నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసి నకిలీ పట్టాల ద్వారా కూడా రైతు బంధు పథకాన్ని ఆయాచిత లబ్ధి పొందారు. ఈ రోజు ఇలా చెప్పుకుంటూ పోతే క్రషర్లు కావచ్చు, శ్రీశైలం నేషనల్ హైవే కావచ్చు లేకపోతే రాజీవ్ రహదారి కావచ్చు, క్రషర్లు నడుస్తున్న క్రషర్ యూనిట్లు కావచ్చు, మైనింగులకు ఇచ్చినవి కావచ్చు, లేదా హైదరాబాద్ చుట్టుముట్టూతా, ముఖ్యంగా హైదరాబాద్ నగరం చుట్టుముట్టూతా ఒకప్పుడు మనందరం చుశాము, కూరగాయలు, ఆకు

కూరలు, వివిధ రకాల ద్రాక్ష తోటలు ఇట్లా చాలా వ్యవసాయం జరిగేది. కానీ ఈ రోజు హైదరాబాద్ నగరం చుట్టుముట్టూతా 50 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 70 నుంచి 80 శాతం వ్యవసాయం ఎవరూ చేయడం లేదు. అవి రియల్ ఎస్టేట్‌లుగా మారి, లేఔట్లుగా మారి, ప్లాట్లుగా విక్రయించి ఈ రోజు మొత్తం వ్యవసాయేతర పనులకో, ఐటి కంపెనీలకో, పరిశ్రమలకో, రియల్ ఎస్టేట్ లేఔట్ల క్రిందనో మారిపోయాయి అధ్యక్షా. గత ప్రభుత్వం యావరేజ్‌గా రెండు సీజన్లకు కలిపి ప్రతి సంవత్సరం మూడు కోట్ల ఎకరాలకు వాళ్ళు డబ్బులిచ్చుకుంటూ వెళ్ళారు. మూడు కోట్ల ఎకరాలకు వాళ్ళు ఎకరానికి 10వేల రూపాయల ప్రకారం చేసుకుంటూ పోతే ప్రతి సంవత్సరం దాదాపు 15వేల కోట్ల రూపాయలు ప్లస్ ఆర్ మైనస్ పది శాతం వాళ్ళు వారి ఖాతాల్లో వేశారు. అట్లా వాళ్ళిచ్చిన 72వేల కోట్ల రూపాయల్లో 22వేల కోట్ల రూపాయలు జాతీయ రహదార్లకు, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు అమ్మినవాళ్ళకు, క్రుర్లకు, మైనింగులకు, రాళ్ళకు, రప్పలకు, కొండలకు, గుట్టలకు దొంగ పాసు పుస్తకాలు తయారు చేసుకొని అధికారంలో ఉన్నాము కాబట్టి, అధికార పార్టీ నాయకుల అనుచరులము, వారి సహచరలము, వారి బంధువులమని వేలాది కోట్ల రూపాయలు కొల్లగొట్టారు అధ్యక్షా. మరి ఈ రోజు నేను తమరి ద్వారా అడుగుతున్నాను. ఈ పథకాన్ని 80వేల పుస్తకాల్లో చదివిన సారాంశంతో దీన్ని తయారు చేసిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వచ్చి కీలకమైన అంశం చర్చకు వచ్చినప్పుడు వారు సూచనలిస్తారని అనుకున్నాము. వారి అనుభవం నుంచి, వారి పరిపాలనలో నేర్చుకున్న అంశాల నుంచి ఈ ప్రభుత్వానికి ఏదైనా సూచన వస్తే నేను తీసుకుందామని అనుకున్నాను.

ఇక్కడ ఒక అంశం చెప్పవచ్చు అధ్యక్షా. ఈ రోజు ఇది ప్రవేశపెట్టిన వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారు వారి కంటే సీనియర్. వారి కంటే ముందు ఎమ్మెల్యే, వారి కంటే ముందు మంత్రి, వారి కంటే ఎక్కువ శాఖలు నిర్వహించారు. అయినా, మా సహచర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గారికి ఎలాంటి భేషజాలు లేవు. ఒక వేళ మొదటిసారి శాసన సభ్యుడైన ..., ఈ రోజు నేనేందుకు రిప్లై ఇస్తున్నాను, మొదటిసారి శాసన సభ్యుడు కొన్ని అంశాలు లేవనేత్తితే, వారు గతంలో స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధిగా పని చేశారు. ఎమ్మెల్యే కాకపోయి ఉండవచ్చు. ఎమ్మెల్యే కంటే ఎక్కువ ప్రజలతో మమేకమై, ప్రజా జీవితంలో సంవత్సరాల కొద్దీ ఉన్న తనకు ఒక అనుభవం ఉంది. అది ముఖ్యంగా అదిలాబాద్ లాంటి వెనకబడిన ప్రాంతం, గిరిజనులు, గిరిజనుల్లో ఆదివాసీలు అత్యధికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం నుంచి వచ్చారంటే డెఫినేట్‌గా out of his experience తన అనుభవం నుంచి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసినప్పుడు ఈ ప్రభుత్వం తప్పకుండా మొదటిసారి సభ్యుడు కాబట్టి మేము విననే వినము, అత్యంత సీనియర్ కాబట్టి వెయ్యి అబద్ధాలు చెప్పినా ప్రభుత్వం స్వీకరించాలి వంటి వాదనలకు తమరి నాయకత్వంలో తావు లేదు. తమరి నాయకత్వంలో అంశానికి ప్రాధాన్యత ఉన్నది, విషయానికి క్షుణ్ణంగా పరిశీలించే విధానం ఉంది. ఎవరికి నిజమైన లబ్దిదారుడికి ఒక్కరికి కూడా అన్యాయం జరగవద్దు, చివరి పేద వాడి వరకు కూడా ప్రభుత్వం యొక్క సంక్షేమం చేరాలన్నదే మా ప్రభుత్వం యొక్క ఉద్దేశం, లక్ష్యం అధ్యక్షా. ఈ లక్ష్యాన్ని చేరుకునే సందర్భంలో అయాచితంగా వేలాది కోట్ల రూపాయలు గడీలలో ఉండే భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్లు, వ్యవసాయం చేయకుండానే వారి ఆధీనంలో ఉన్న రాళ్ళు, రప్పలకు, కొండలకు, వాళ్ళ ఆధీనంలో ఉండి సీలింగ్‌లో ప్రభుత్వానికి సరెండర్ చేసిన భూములకు లేకపోతే రియలే ఎస్టేట్‌లో లే ఔట్లుగా మారిన భూములకు ఈరోజు ఇవ్వాలా? ఇంతకు ముందు ఆ సభ్యుడు మాట్లాడతున్నప్పుడు ఇలాంటి వాళ్ళందరికి మేము ఇచ్చాము కాబట్టే మీరివ్వాల్సిందే, మమ్మల్ని ఆదర్శంగా తీసుకోండి అంటున్నారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటే

ఇక్కడ ఎందుకు కూర్చుంటాము అధ్యక్షా? అక్కడ కూర్చుంటాం, తరువాత బయటకు వెళ్ళిపోతాం. మీకు 2023లో అధికారం పోయింది, 2024లో డిపాజిట్‌లు పోయాయి, ఈసారి ఉన్నది కూడా ఊడ్చుకుపోతుంది. మీరు కాదు కదా ఆదర్శం, ఆదర్శ రైతు ఆదర్శం. వ్యవసాయం చేసే వాళ్ళు ఆదర్శం. అట్లా కాకుండా మేమేదో అద్భుతాలు చేశాము, మీరేదో అద్భుతాలు చేసినందుకు అక్కడ ఉన్నారు. అద్భుతాలు చేసినందుకే ఆయన గారు ఇక్కడికి రాలేకపోతున్నారు. ఎందుకు, ఒకవేళ ఇక్కడికి వస్తే పది సంవత్సరాల్లో ఆయన చేసిన అద్భుతాలను మా సభ్యులందురూ అడగడం మొదలు పెడితే సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుంది, తల దించుకోవాల్సి వస్తుందని వారు రావడం లేదు, అది వారిష్టం. మేమేమీ ఒత్తిడి చేయడం లేదు. సభలోకి సభ్యుడు రావడం, రాకపోవడం అనేది సభ్యుడి ఇష్టం. ఒకవేళ తమరు అనుమతిస్తే మధ్యలో అర్ధాంతరంగా వాళ్ళు వెళ్ళిపోవచ్చు. వాళ్ళకు కావాల్సినట్లుగా చేయవచ్చు. మీరు అనుమతిస్తే అధ్యక్షా. అయితే ఈ రోజు నేను ప్రధాన ప్రతిపక్షాన్ని కూడా సూటిగా అడుగుతున్నాను. రాళ్ళు, రప్పలకు, గుట్టలకు ఇద్దామా? రియల్ ఎస్టేట్‌లో లేఔట్లు చేసుకొని పాట్లు చేసుకున్నవాళ్ళకు ఇద్దామా? హైవేల పేర్లమీద, నేషనల్ హైవేల పేర్లమీద ప్రభుత్వం సేకరణ చేసిన భూములకు కూడా దొంగ పాస్ పుస్తకాలు తయారు చేసుకుంటే ఇద్దామా? మీ అనుచరుల ముసుగులో నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసుకున్న వాళ్ళకు ఇద్దామా? హైదరాబాద్ చుట్టుముట్టూత వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా నాలా కన్వర్షన్ జరిగి ఈ రోజు పరిశ్రమలు నెలకొల్పారు. వీటన్నింటికి కూడా మనం ఇద్దామా? వీటి విషయాలలో మీరు స్పష్టమైన సూచన చేయండి. మీ సూచనలన్నింటిని క్రోడీకరించి ఒక రిపోర్టు తయారు చేసి, ఎందుకంటే ఇప్పటికీ ఈ రైతు భరోసాని అమలు చేయడానికి మా మంత్రివర్గం మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసింది. దానికి బాధ్యతగా ఉప ముఖ్యమంత్రివర్యులు వారి నాయకత్వంలో వ్యవసాయ శాఖామంత్రి, రెవెన్యూ శాఖా మంత్రి, అదే విధంగా సివిల్ సప్లైస్ మినిస్టరు, ఐటి అండ్ ఇండస్ట్రీస్ మినిస్టరు వీళ్ళందరిని అందులో సభ్యులుగా పెట్టి అన్ని జిల్లాలు తిరిగారు అధ్యక్షా. వ్యవసాయ సహకార సంఘాలతో మాట్లాడారు, రైతు సంఘాలతో మాట్లాడారు. రైతు కూలీ సంఘాలతో మాట్లాడారు, రైతులతో మాట్లాడారు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు, సభలో లేని రాజకీయ పార్టీలతో మాట్లాడారు, కొన్ని రాజకీయ పార్టీలు కొన్ని కారణాల చేత సభలోకి రాలేకపోయారు. అంతమాత్రాన సమస్య పట్ల వారికి అవగాహన లేదని మనం అనుకోవడానికి లేదు కదా అధ్యక్షా. వాళ్ళతో బాటు చట్ట సభల్లో కూడా చర్చించి మీరు, మీ అంత మీరే ఊహించుకొని, మీ అంతట మీరే కాయించుకొని, మీ అంతట మీరే దూషించి, మీఅంతట మీరే బయటకు వెళ్ళిపోయి.., ఏంటి అధ్యక్షా ఇది? స్పష్టంగా ఈ ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంది. మీరు చేసే సూచనలలో ఏదైనా సహేతుకత కన్పించి, నిజంగా తెలంగాణ రైతాంగానికి మేలు జరుగుతుందంటే ఈ ప్రభుత్వానికి భేషజాలు లేవు. అందుకే ఈ సభలో మీరేంత అల్లరి చేసినా, మీరేంత చిల్లరగా వ్యవహరించినా, మేము ఓపికతో ఒక్క మాట కూడా అనకుండా మేము వింటున్నాం. మీరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న మీ అసహనం, అధికారం కోల్పోయిన మీ వ్యవహారం సమాజం అంతా గమనిస్తుందని మీమేమి అనలేదు. మీరు చేసే చిత్ర విచిత్రమైన వ్యవహారాలు వీటన్నింటినీ కూడా ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. ప్రజలు ఏ తీర్పు ఇవ్వాలో ఇచ్చినప్పుడు ఇచ్చారు. మళ్ళీసారి కూడా ఇస్తారు. అందుకోసం మేమేమి అనలేదు.

పాయల్ శంకర్ గారు కొన్ని సూచనలు చేశారు. ఖచ్చితంగా సీలింగ్ పెట్టకండి, ఆ కొద్ది మందిని కూడా మీరు ఎందుకు బాధపెడ్తారని కొన్ని సూచనలు చేశారు. అదే విధంగా మీరు మంచిగా అన్ని రకాలుగా, వాళ్ళకు నమ్మకం కలిగించేటట్లు నిర్ణయాలు తీసుకోమన్నారు. తప్పకుండా వాటిని కూడా తీసుకుంటాము. ఒకవేళ వాళ్ళు

మమ్మల్ని తిట్టడానికి సమయాన్ని కేటాయించుకుంటే ప్రాత పూర్వకంగానైనా మీరు ప్రధాన ప్రతిపక్షం నుండి తెప్పించుకోండి అధ్యక్షా. మాకేమి అభ్యంతరం లేదు. రాళ్ళు, రప్పలకు, గుట్టలకు, దొంగ పాస్ పుస్తకాలకు, లేఔట్లకు, రియల్ ఎస్టేట్ వాళ్ళకు ఇవ్వాలా వద్దా మీర్చిచిన జీఓ స్ఫూర్తిగా పంట పెట్టుబడి సహాయం? పంట వేసుకున్న వాళ్ళకే పెట్టుబడి సహాయం చేయలన్నది ఆ జీ.ఓ.యొక్క స్పిరిట్.

1.10 మ. అదేవిధంగా చర్చలో లేకపోయినా కొన్ని విషయాలు ప్రస్తావించారు. రుణమాఫీకి సంబంధించి, లేకపోతే అప్పులకు సంబంధించి, ఒకటి రైతు భరోసా మీద విధివిధానాలలో 1, 2, 3, 4, 5, whatever it is. మీ సూచనలేమిటో క్యాటగారికల్‌గా చెప్పండి ప్రభుత్వం వింటుంది. ప్రజలకు ప్రయోజనం చేకూరితే అమలు చేస్తుంది. పాయింట్ నెంబర్–2, మీరు రైతు ఆత్మహత్యల గురించి ఇతర అంశాల మీద దీంట్లోనే మిక్స్ చేసి మీరు కొంత చెప్పే ప్రయత్నం చేశారు నాకేమీ అభ్యంతరం లేదు. నేను పార్లమెంటలో మొదటిసారి ఎంపీగా అయిన తరువాత వెంటనే అడిగిన ప్రశ్న రిలేటడ్‌గా కోట్ చేసినట్టున్నరు. సేమ్ అదే దాంట్లోకి పోయి చెప్పదల్చుకున్నాను. 2019లో డిసెంబర్,3వతారీఖునాడు నేను అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖమంత్రిగారు ఇచ్చిన సమాధానంలో ఉన్న అంశం ఒక సభలోని డాక్యుమెంట్‌ను మరో సభలో కోట్ చేయడం నార్మల్‌గా ఎలా చేయరు. తమరి ప్రత్యేక అనుమతి తీసుకొని డాక్యుమెంట్‌ను నేను కోట్ చేయదల్చుకున్నాను.

మొత్తం రాష్ట్రాలు, రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలు వీటన్నింటిని 36 ప్రాంతాలలో రైతులకు సంబంధించిన ఆత్మహత్యల మీద 2019లో నేను ప్రశ్న అడిగితే కేంద్రప్రభుత్వం ఇచ్చిన జవాబు 2014, 2015, 2016 ఈ మూడు సంవత్సరాలే National Crime Records Bureau నమోదు చేసిన లెక్కలనే పార్లమెంట్‌లో జవాబు ఇవ్వడం జరిగింది. ఇందులో రైతుల ఆత్మహత్యలు తగ్గినాయనో మేము ఏదో అద్భుతాలు సృష్టించామనో నోరు తెరిస్తే అసత్యాలు అలవాటుండే.. అసత్యాల సంఘానికి అధ్యక్షులు రాలేదు. ఉపాధ్యక్షుడు వచ్చి వర్కింగ్ ప్రెసిడెంట్ వచ్చి మళ్లీ అవే అసత్యాలు చెబుతున్నారు. ఇందులో ఏముంది మొట్టమొదటి ఆంధ్రప్రదేశ్.. 2014లో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు ఆత్మహత్యలు 160, 2015లో రైతుల ఆత్మహత్యలు 516,2016లో రైతుల ఆత్మహత్యలు 239, ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంవత్సరాలు మొత్తం దాదాపు వెయ్యి లోపే. ఎందుకంటే మనతో విడిపోయిన ఆంధ్రప్రదేశ్ వెంటనే మూడు సంవత్సరాలు ఆ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు మళ్లీ చెబుతున్నాను. 2014లో 160, 2015లో 516, 2016లో 239 ఇది ఆంధ్రప్రదేశ్‌లో, అదేవిధంగా సీరియల్ నెం. 15లో మహారాష్ట్ర ఉన్నది. ఎందుకంటే దేశంలో ప్రతి సంవత్సరం అత్యధికంగా రైతు ఆత్మహత్యలలో మొదటి స్థానాన నిలబడుతున్నది మహారాష్ట్రరాష్ట్రం. మహారాష్ట్రలో 2014లో 2568,2015లో 3030, 2016లో 2550, దేశంలో ప్రథమస్థానంలో మహారాష్ట్రఉన్నది.

ఇకఘనత వహించిన 80వేల పుస్తకాలు చదివిన అపర మేధావి గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత ఎంతంటే అది రెండవ స్థానం. జనాభాలో మనం ఎక్కడో ఉంటాము. మనకంటే అయిదింతల జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో 2014లో 898మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2015 వచ్చేసరికి ఆ నెంబర్ 1358కి పెరిగింది. 2016 నాటికి 632మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. దాదాపు మూడువేల పైచిలుకు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే ఆంధ్రప్రదేశ్ మన నుంచి విడిపోయిన తర్వాత వెయ్యిలోపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే తెలంగాణలో వారి నాయకత్వంలో మూడువేల మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే

మొదటిస్థానం మహారాష్ట్ర అయితే రెండవ స్థానం రైతు ఆత్మహత్యలలో తెలంగాణ అని మూడు సంవత్సరాల లెక్కలు చెబుతున్నాయి. పార్లమెంట్‌లో పెడితే.. ఇది కూడా వారి ఘనత మేం తగ్గించాము.. ఏందీ మీరు తగ్గించింది. మీతోపాటు ఉన్న ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం ఎక్కడుంది, నువెక్కడున్నావు?

మిగతా రాష్ట్రాల లెక్కలన్నీ వివరాలు కావాలంటే ఆ లెక్క కూడా చదువుతాను. ఏ రాష్ట్రం కూడా మనకంటే అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 20కోట్ల జనాభా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో 2014లో 63మంది రైతు ఆత్మహత్యలు, 2015లో 145 మంది రైతు ఆత్మహత్యలు, 2016లో 69మంది రైతు ఆత్మహత్యలు జరిగాయి. దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్, పేదరికం ఉన్న ఉత్తరప్రదేశ్ 2014లో 63మంది, 2015లో 145 మంది 2016లో 69మంది రైతు ఆత్మహత్యలు జరిగాయి ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రం..... ఇలాంటి ధనిక రాష్ట్రంలో, మిగులు రాష్ట్రంలో 2014,2015,2016లో దాదాపు మూడువేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే తలదించుకోవాల్సింది పోయి, రైతులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి మా గొప్పలు చూడండి. మా తాతలు నేతులు తాగిండ్రు, మీరు మా మూతి వాసన చూడండి. తినడానికి తిండి లేదు కానీ మేము మీసాలకు సంపంగి నూనె పెట్టుకుంటాం అని ఈ గొప్పలన్నీ ఎమిటి?

అదేవిధంగా రుణమాఫీకి సంబంధించినది. మేము అద్భుతాలు చేశాము. మీరొచ్చి రైతులకు అన్యాయం చేశారు. ఇక మీరు అన్యాయం చేయబట్టే రాష్ట్రం మొత్తం దివాళా తీసిపోయిందని గొప్పలు చెప్పుకున్నారు. నేను వాస్తవాలను తమరి ద్వారా తెలంగాణా సమాజానికి, రైతాంగానికి తెలియజేస్తున్నాను. రైతాంగానికి వాస్తవం తెలుసు. అది తెలుసు కాబట్టే వాళ్లకు తెలిసిన ప్రకారం కర్రు కాల్చి వాత పెట్టారు. ఒకసారి అధికారం తీసి, రెండవసారి డిపాజిట్లు కూడా తీసేశారు. అయినా వాళ్లు మారడం లేదు. మనుషులు మారలేదు, మాట కూడా మారలేదు. కానీ నేను వాస్తవాలను చెప్పాలి కదా. కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందని పదేపదే అంటారు. కాంగ్రెస్ పార్టీ 12నెలలలో ఏమి చేసిందనేది కూడా చెప్పాలి. ఒక్క సంవత్సరంలో మేము ఏమి చేశామని ఇన్ని సార్లు అడుగుతున్నారు కానీ పది సంవత్సరాలు పరిపాలించిన ఘనత మోంచినవారి ప్రభుత్వం ఏమి చేసిందనేది ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలి. గురివిందగింజ గురించి మీకు తెలుసు కదా. క్రిందంతా నల్లగా ఉంటుంది. పైన ఎర్రగా ఉంటుంది. ఎర్రగ ఉన్నది చూసుకొని ఏతులపడుతుంటుందంట, క్రింద చూసుకుంటే తెలుస్తుంది ఎంత నల్లగా ఉందనేది. గత పాలకుల పాలనలో ఏమి జరిగిందనేది వెనక్కి తిరిగి చూసుకుంటేనే కదా తెలిసేది. వాళ్ల గురించే ఒక విషయం చెబుతాను.

2014లో అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టో అప్పుడు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామన్నారు. నాలుగైదు విడతల్లో చేస్తామనలేదు. అయిదేళ్లల్లో చేస్తామనలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామన్నారు. కావాలంటే వాళ్ల మేనిఫెస్టో తీసుకొచ్చి మనం చర్చిద్దాం. కానీ ఐదేళ్లకు దాన్ని స్ప్రెడ్ చేసి ఐదేళ్లలో వాళ్లు కట్టింది ఎంతంటే రూ.16143కోట్లు. ధనిక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం రూ.72వేల కోట్లు మాత్రమే అప్పున్న రాష్ట్రం వాళ్లకు అప్పజెప్పితే లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి ఆపసోపాలు పడి ఆఖరి సంవత్సరం వరకు వాళ్లు చేసిన రుణమాఫీ రూ.16143కోట్లు. అయిదేళ్లు అసలుకు మిత్తి కలిపితే అంతకంత అవుతుంది. మీకు తెలియందేముంది, బ్యాంకులలో మనం డిపాజిట్ చేస్తే అయిదేళ్లకు డబ్బులు ఇస్తారు. దాదాపు లక్ష రూపాయలు ఉన్నవాళ్లకు 80వేల రూపాయలదాకా అప్పు అయింది. నువ్వు చేసిన రుణమాఫీ ఇంతకు ముందు మా సభ్యులు ఎవరో మిత్తికే సరిపోయిందని చెప్పారు. మీరిచ్చింది మిత్తికే

సరిపోయింది. అసలు అలాగే రైతు మీద ఉంది. మళ్లీ 2019లో వారు మళ్లీ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారు. పాపం రైతులు మంచోళ్లు .. రైతులు అమాయకులు, మంచోళ్లు, ఏమి చెప్పినా నమ్ముతారు, నమ్మి మోసపోతుంటారని మా సభ్యులు శంకర్ ఇంతకుముందే చెప్పారు. నిజమే, రెండవసారి అదే జరిగింది. మొదటిసారి మోసం చేసినా పాపం మొదటిసారి ఏమైందోనని రెండవ సారైనా.. మొదటిసారి బార్లల్లో ఉండి మరచిపోయారేమో, రెండవసారి అయినా గుర్తు పెట్టుకొని చేస్తాడేమో అని అనుకొని రెండవసారి నమ్మి మళ్లీ అధికారం ఇచ్చారు. రెండవసారి అధికారం ఇచ్చిన తర్వాత వాళ్లు చేసిన రుణమాఫీ అయిదేళ్లకు కలిపి రూ.11909కోట్లు. ఎంతమంది రైతులకు అంటే 21,35,557మంది రైతులకు రూ.11909.31కోట్లు అయిదేళ్లల్లో వారు చేసిన రుణమాఫీ. ఇందులో రూ.7500 కోట్లు నిన్న మనం విచారణకు ఆదేశించిన అవుటర్‌రింగ్‌రోడ్డు అమ్మి తెచ్చి ఇందులో పోశారు. కాంగ్రెస్ పార్టీ కష్టపడి సంపాదించి లక్షల కోట్ల రూపాయల ఆస్తిని తయారు చేస్తే అర్ధరాత్రిపూట అప్పనంగా అమ్మేసి అవి తెచ్చి ఆఖరి నిమిషంలో ఖాతాలో వేసింది ఎంతంటే రూ.11909.31కోట్లు.ఇందులో మిత్తి ఎంతపోయిందంటే రూ.8515కోట్లు కేవలం మిత్తికి పోయింది. 2018నుంచి 2023 వరకు అయిదు సంవత్సరాలలో 21,35,557మంది రైతులకు నికరంగా వీళ్లు చేసినరైతు రుణమాఫీ రూ.3384కోట్లు. ఇది వాస్తవం, ఇది నిక్కచ్చి లెక్కలు, నిజం చేదుగ ఉంటది.

1.20 మ. ఇది వాస్తవం. ఇవి నిక్కచ్చి లెక్కలు. నిజం చేదుగా ఉంటుంది. ఆ నిజాన్ని మింగడానికి వాళ్లకు ఓపిక కావాలి, ధైర్యం కావాలి. వాళ్లు చేసిన రుణమాఫీ 5 సంవత్సరాల్లో రూ. 11,909 కోట్లు. అయితే, ఇందులో మిత్తికి పోయింది రూ. 8,515 కోట్లు. వాళ్లు అసలు కట్టిందే లేదు. అసలు మాఫీ చేసిందే లేదు. వాళ్ల చరిత్ర ఇది. 2014 నుండి 2018 డిసెంబర్, 2018 నుండి 2019 డిసెంబర్ 7 తారీఖు వరకు. మా ప్రభుత్వం ఏర్పడే వరకు వారు చేసిన రుణమాఫీ ఇది.

ఇక మా వరకు వస్తే. ఎందుకంటే, తెలంగాణ వచ్చిన తరువాత మూడు విడతలుగా రుణమాఫీ జరిగింది. 2014 నుండి 2018 వరకు, 2018 నుండి 2023 వరకు, 2023 నుండి 2024 ఒక సంవత్సరంలో. పదేండ్లల్లో వారు చేసిన రుణమాఫీ మిత్తీలు తీసివేస్తే గుండుసున్న అవుతుంది. మొదటిసారి రూ. 16,000 కోట్లు, రెండవసారి రూ. 11,000 కోట్లు. అంటే, దాదాపుగా పదేండ్లల్లో రూ. 27,000 కోట్లు చేశారు.

మన ప్రభుత్వం ఏమి చేసిందంటే. ఈ లెక్క చెప్పాలి కదా మరి ఇప్పుడు నేను. ఈ లెక్క చెబితేనే కదా వాస్తవాలు వాళ్లకు గానీ, ప్రజలకు గానీ తెలిసేది. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాము. ఎన్నికల తరువాత కూడా చెప్పాం. అదట్లా, ఇదిట్లా అని ఒక సందర్భంలో ఒకాయన సవాలు విసిరిండు. పంద్రాగష్టు లోపల చేస్తామని చెప్పాం.

ఫేజ్–1లో లక్ష రూపాయల లోపు రుణాలు ఉన్న రైతులందరికీ 18–07–2024 నాడు 11,34,412 మంది రైతులకు రూ. 6,034.96 కోట్లు మొదటి విడతగా రుణమాఫీ చేయడం జరిగింది అధ్యక్షా, మళ్లీ చెబుతున్నాను. జూలై 18, 2024 నాడు మొదటి విడతగా 11,34,412 మంది రైతులకు రూ. 6,034.96 కోట్లు రుణమాఫీ చేయడం జరిగింది. లక్ష రూపాయల వరకు ఉన్నోల్లను అందరినీ సింగిల్ స్ట్రోక్‌లో కొట్టేశాము.

ఫేజ్–2లో 30–07–2024 సరిగ్గా 12 రోజుల్లోనే 6,40,823 మంది రైతులకు రూ.6,190కోట్లు రెండవ విడతగా రుణమాఫీ చేయడం జరిగింది. ఫేజ్–3లో మూడవ విడతగా, పంద్రాగష్టు నాడు. నేను విదేశాల్లో ఉంటే కూడా, పంద్రాగష్టుకు మాటిచ్చాము, పంద్రాగష్టుకు ఖచ్చితంగా చేయాలని 13వ తేదీనే భారతదేశానికి వచ్చి ఖమ్మం జిల్లాకు

వెళ్లాను. ఏ దేవుడు భద్రాద్రి రాముడి దగ్గర ఏదైతే చెప్పామో, అదే జిల్లాలో లక్షలాది మంది రైతులతో సమావేశం పెట్టి పంద్రాగష్టు 2024 నాడు 4,46,832 మంది రైతులకు రూ.5,644.24కోట్లు రుణమాఫీ చేయడం జరిగింది.

మూడు విడతలల్లో సరిగ్గా 27 రోజుల్లో రూ. 17,869.21 కోట్లు రెండు లక్షల లోపు రుణాలు కలిగిన రైతులకు రైతు రుణమాఫీ చేసిన చరిత్ర ఈ భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇన్‌క్లూడింగ్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలల్లో కూడా చేయనంత గొప్ప రుణమాఫీ తెలంగాణ రాష్ట్రంలో మన ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం చేసింది. దీనిని అభినందించాలి కదా అధ్యక్షా. మేము చేయలేకపోయాం, మేము వైఫల్యం చెందినం, మీరొక మంచిపని చేశారు, రైతులకు మేలు జరిగిందని అభినందించి వాళ్లు ఏదైనా సూచన చేసి ఉంటే తప్పకుండా ప్రతిపక్షంగా వారికి గౌరవం దక్కేది.

ఇదే కాకుండా కొంతమందికి రాలేదు. కొంతమంది నష్టపోయారు అని అన్నారు. నేను ఆరోజే చెప్పాను. సాంకేతికంగా ఏవైనా లోపాలున్నా, బ్యాంకర్స్ మాకు సమాచారం అందించే దాంట్లో ఏదైనా వ్యత్యాసమున్నా, తప్పకుండా వాటిని కూడా మళ్లీ సరిదిద్దుకుంటాం, మాకు ఎలాంటి భేషజాలు లేవు, రైతులను ఆదుకోవడమే మా లక్ష్యం. రైతులు అడగలేదు, మేము చేస్తామని చెప్పాం, మేము బాధ్యతగా, జిమ్మెదారుగా ఫీలవుతున్నామని చెప్పి 30-11-2024నాడు నా స్వంత జిల్లా మహబూబ్‌నగర్‌లో 3,13,896 మంది రైతులకు రూ.2,747.67కోట్లు మళ్లీ రుణమాఫీ చేశాం. మొత్తంగా మొదటి సంవత్సరంలో 25,35,963 మంది రైతులకు రూ.20,616.89కోట్లు నా ప్రభుత్వం, మా ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకున్నాం.

ఇదీ మా పనితనం, ఇదీ మా రైతులపట్ల చూపించిన ప్రేమ, ఆప్యాయత. ఈ రైతు ఎవరు అధ్యక్షా? మా కుటుంబం. మా తండ్రులు, తాతలు, ముత్తాతలు వ్యవసాయం చేసి భూమిని నమ్ముకొని, ఈ భూమిలోనే పుట్టి, ఈ భూమిలోనే కలిసిన మా కుటుంబాల కోసం మేము చేసిన పని. ఇది మా గొప్పతనం అనుకుంటలేము, మా బాధ్యత అనుకుంటున్నాము. ఇదొక భావోద్వేగం అధ్యక్షా. ఇది ఉద్యోగం లాంటి పని కాదు. వాళ్లకు everything is transactional. వాళ్లకు ప్రతిదీ వ్యాపారం. లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడమే. వచ్చింది ఎంతా? పోయింది ఎంతా? అది వాళ్ల వ్యవహారం. మేము అట్లా కాదు. రైతు అంటే, మాకు ఒక అనుబంధం, ఒక బంధం, మా కుటుంబం, మాది భావోద్వేగం అధ్యక్షా ఈ రైతు రుణమాఫీ.

అందుకే అన్నీ ఆపి. నిజంగానే ఇదే రుణమాఫీ నేను ఐదేండ్ల తరువాత చేస్తే ఈ రూ. 21,000 కోట్లు పెరిగీ రూ. 50,000 కోట్లు అవుతుంది. మొత్తం కడుపు కట్టుకొని, మిగతా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఆపుకొని, ఈ రైతులకు ఎందుకు మొదటి సంవత్సరంలోనే, వస్తా వస్తేనే ఎందుకు రుణమాఫీ మీద పెట్టినాను అంటే, ఇప్పుడు రుణమాఫీ చేస్తే రైతు నెత్తిమీద మిత్తీల భారం పడదు. అందుకోసమే రైతులను మిత్తీల నుండి కాపాడి, రైతును ఆదుకోవాలని, రైతంటే మేమే, మేమంటే రైతని. రైతును రాజుగా చూడాలని, వ్యవసాయం అంటే దండుగ కాదు, వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఉద్దేశంతోటి రూ. 20,616.89 కోట్ల రుణమాఫీ చేసి ఈ సభలో నిటారుగా నిలబడి ఈరోజు మేము ప్రజలకు జవాబు ఇస్తున్నాము.

వీళ్లకు కాదు అధ్యక్షా. ఏందీ వీళ్లకు జవాబు చెప్పేది. వీళ్లకు ఏమైనా బరువుందా? బాధ్యత ఉందా. ఎట్ల వ్యవహరించారో చూశారు కదా అధ్యక్షా పైనుంచి. వీళ్లా, వీళ్లా మమ్మల్ని అడిగేది. వీళ్లకు అర్హత ఉందా? ఇంకా, ఎస్ఎల్‌బిసిలో రూ. 40,000 కోట్లు వచ్చింది. లేకపోతే ఇంతుంది, అంతుందని అంటున్నారు. వారు చేసిన పాపం

పుట్టలాగా పెరిగి అది మా నెత్తిమీదకు వచ్చింది. 2014 నుండి 2023వరకు వాళ్లు ఎగదొబ్బింది అంతా తడిసి మోపెడై, తట్టెడై, అప్పుల భారం నెత్తిమీదపడి అవన్నీ కలిపితే ఇక్కడకు వచ్చింది.

కానీ, మేము ఇచ్చింది ఏ తేదీ నుండి అధ్యక్షా. మేము బాధ్యత తీసుకున్నప్పుడు క్లియర్‌గా ఒక డేట్ మెన్షన్ చేశాము. 11-12-2018 నుండి 09-12-2023 నేను బాధ్యత తీసుకునే వరకు. ఐదు సంవత్సరాలు కరెక్ట్‌గా లెక్కగట్టి, ఈ ఐదు సంవత్సరాలల్లో 12th December, 2018 to 9th December, 2023. సరిగ్గా ఈ ఐదు సంవత్సరాల మధ్యలో రైతులు తీసుకున్న లోన్లను మాత్రమే పరిగణలోకి తీసకున్నాం. జి.ఓ.లో అదే చెప్పాం. వాళ్లు ఎగబెట్టిందీ, ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్ ఉన్నది, 2014 నుండి 2018వరకు తీసుకున్న రుణాలు, పెండింగ్‌లో ఉన్నవి. లేదంటే వాళ్లు మిత్తీలు కట్టకుండా వదిలేసినవి. ఇవన్నీ లెక్కగడితే రైతుల... ఎస్ఎల్‌బిసి బ్యాంకు ఏం చెబుతుంది అధ్యక్షా? టోటల్‌గా రాష్ట్రంలో ఉన్నటువంటి రైతుల ఖాతాల నెంబర్స్ చెప్పి, ఆ రైతుల నుండి మాకు ఎంత బకాయి ఉందో అని టోటల్‌గా చెప్పడం జరిగింది. ఆ టోటల్ నుండి 11-12-2018 నుండి 09-12-2023 వరకు ఈ ఐదు సంవత్సరాల్లో ఎంతమంది రైతులకు, ఎంత బకాయి ఉందో ఆ వివరాలు ఇవ్వండని చెప్పి ఆ వివరాలు తీసుకొని మేము రుణమాఫీ చేశాం.

చంద్రశేఖర్ రావు గారు ఇది మొత్తం ఈ సభలోనే చెప్పాడు అనుకుంటా ఈ మొత్తం. రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేయలేము. ఎనిమిది వేల కోట్ల రూపాయలు కావాలి. మా దగ్గర నల్ల డబ్బు లేదు. అంటే, ప్రభుత్వంలో లేదని. వాళ్ల దగ్గర లేదని అనుకునేరు అధ్యక్షా. స్విస్ బ్యాంకుకు కూడా అప్పు ఇవ్వగలిగినంత శక్తి వచ్చింది అధ్యక్షా. నేను అంతకుముందున్న ఆర్థికమంత్రి గారిని అడిగాను. ఏడ దాస్తవయ్యా, దాచుడు కష్టం కదా, పది పైసల మిత్తి ఇస్తం ప్రభుత్వానికి అప్పు ఇవ్వు, రైతులకు రుణమాఫీ చేస్తామని ఒకసారి అడిగాను. గిట్లనే ఎక్కడో దావత్‌లో ఎదురుపడితే. కొంచెం సానుకూలంగానే తల ఊపిండు గానీ, మళ్లా బామ్మరిదికి గిన కోపం వస్తుందని జర వెనకకు తగ్గినట్లు అనిపించింది. ఈరోజు ఈ రాష్ట్రంలో ఉన్న ఏడు లక్షల కోట్ల అప్పు కూడా కట్టాలంటే, ఏంలేదు అధ్యక్షా. వాళ్లు గిన ఒక్కసారి మన దిక్కు చూశారంటే, రాష్ట్రం అప్పు అంతా కట్టవచ్చు. ఎందుకంటే, అంతా అక్కడికే చేరింది కదా. అలా... రైతులకు ఇవ్వడానికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు కూడా నా దగ్గర లేవు అని చెప్పి. ఈరోజు రైతుల కోసమే మేము బ్రతుకుతున్నాం. రైతుల కోసం మేము ప్రాణాలిస్తాం. రైతుల కోసం మా కిడ్నీలు కూడా ఇస్తాం. ఏంది అధ్యక్షా, ఒకవేళ వాళ్లు ఇచ్చినా కూడా వారికున్న షుగర్ లెవల్స్‌కి అవి పనికి రావు. మీరు ఇద్దామని ముందుకు వచ్చినా తీసుకోవడానికి ఆ పరిస్థితి లేదు.

1.30 మ. సో, మీరు ఏమి చేశారో వెనక్కి తిరిగి చూసుకోకుండా, ఎందుకు అధ్యక్షా నాకీ శిక్ష. మీరు చేసిన పాపాలన్నీ నేను చదవాల్సివస్తోంది. ఇది నాకో శిక్ష లాగా అయిపోయింది. ఈ శిక్ష నాకొద్దు. నేనొక పాజిటివ్ దృక్పథంతో ముందుకు వెళ్ళాలనుకుంటున్నా. కాబట్టి, దయచేసి.... రుణమాఫీ చేస్తే సరిపోతుందా, జీతాలు పెంచండి... ఇవ్వొద్దా.... ఇప్పటిదాకా... ప్రభుత్వ ఉద్యోగస్తులకు కూడా ఇయ్యండి, లక్షల కోట్ల జీతాలొచ్చేటోళ్ళకు కూడా ఇయ్యండి, ఐఏఎస్‌లకు, ఐపిఎస్‌లకు కూడా ఇయ్యండి, టాటాలకు, బిర్లాలకు కూడా ఇయ్యండి, ఆయన దోస్తు అదానీకి, ఆయనకు ప్లేటిచ్చి దావతు చేసుకున్న అదానీకి ఇయ్యమంటాండు...., నిన్న మొన్న యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి వచ్చిండు కదా, ఎఫ్.ఈ.ఓ. సీఈఓకి కూడా ఆయన ఇక్కడ భూమి కొంటే ఆయనకు కూడా ఇయ్యమంటాడు. ఇట్లా ఎట్లా?

(బీ.ఆర్.ఎస్ సభ్యులచే అంతరాయం)

ఇట్లా బాధ్యత లేకుండా... ఇలా మాట్లాడుకుంటా పోతే... ఇది ఏ రకంగా సమంజసం?

అధ్యక్షా, అదేవిధంగా ఈరోజు

(బీ.ఆర్.ఎస్ సభ్యులు శ్రీ కె.పి. వివేకానంద్ గారిచే సభకు అంతరాయం)

నువ్వెంత అరిచినా, ఆయన నీకేమియ్యడిప్పుడు. నువ్వాయన పేరు ఎంత తలచుకున్నా నీకిప్పుడు ఏ వరమూ ఇచ్చేటట్టు లేడు. సో, ఈరోజు రాష్ట్రానికి వచ్చిన వంద కూడా, మన స్కిల్స్ యూనివర్శిటీ కోసం వంద కోట్లు, తెలంగాణ యువత కోసం తెచ్చుకుంటే కడుపు మండి, మాకు రాలేదనే అక్కసుతో, నానాయాగీ చేస్తే, ఆ పిల్లల స్కిల్స్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీకి తీసుకున్న వంద కోట్లను కూడా వాపసు ఇయ్యాల్సి వచ్చింది అధ్యక్షా. ఇది రాష్ట్రానికి నష్టం. నాకేం నష్టం. నేను చెప్పినా... ఇది రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతుందని, రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతుందని చెప్పాను. అందుకోసమని ఇయాల వీళ్ళు ఈ రకంగా మాట్లాడిన్రు.

ఈరోజు మిగతా 2 లక్షల పైన ఉన్న వాళ్ళ గురించి కూడా వా మిత్రుడు శంకర్ అదిగూడా చేస్తే బాగుంటుందని అన్నారు. మేం ముందే చెప్పినాం. అసలు మా ఎన్నికల మేనిఫెస్టోలో ఏముందో ఒక్కసారి చూడమని చెప్తున్నా. నేనేమన్నా, రెండు లక్షల వరకు ఏ రైతులకైతే అప్పుందో, అప్పు తీరుస్తామన్నాం. ఈరోజు ఇంకా ఏదైనా రెండు లక్షల లోపల ఎవ్వరిదైనా తప్పుబడ్డా, ఇంకేదైనా పడ్డా, ఇంకేదైనా సవరించేదున్నా మీ లెక్కలు తీసుకొచ్చి ఇవ్వండి.

(బీ.ఆర్.ఎస్ సభ్యులు శ్రీ టి. హరీష్ రావు గారు 'ఓ, ఒ, ఒ' అనే శబ్దం వచ్చేటట్టు నోరుకొట్టుకోవడంతో సభకు అంతరాయం కలిగింది)

మీ లెక్కలియ్యండి. నిజాలు వినడానికి ఓపికుండాలి. నిజం వినడానికి ఓపికుండాలి. నిజమనేది కొంచెం చేదుగా ఉంటుంది. ఈ చేదు గుళికలు కొంచెం మింగాల్సి వస్తుంది. ఎందుకంటే, పదేళ్ళు చేసిన పాపాలకు ఇది తప్పదు. ఇది చాలా చిన్న శిక్ష అధ్యక్షా. ప్రజలు విధించిన శిక్ష ముందు చాలా చిన్నది. వినాలి వాళ్ళు. ఎందుకంటే, మంచి చెప్తున్నప్పుడు నేర్చుకోవాలి.

అధ్యక్షా, వాళ్ళు అప్పుల గురించి... పదే పదే అప్పులు ఇట్లా తెచ్చిన్రు, అప్పులు అట్లా తెచ్చిన్రు, మేము తెచ్చిన అప్పులు..

(బీ.ఆర్.ఎస్ సభ్యులచే సభకు అంతరాయం)

శ్రీ టి. హరీష్ రావు:- (మైకు లేకుండా) రెండు లక్షలకు పైన అప్పులున్న వాళ్ళని కట్టమని మీరే చెప్పారు. మీ మాట నమ్మి వాళ్ళు కట్టారు....

మిస్టర్ స్పీకర్ :- హరీష్‌రావు గారూ, మీకు అవకాశం వచ్చినప్పుడు మాట్లాడండి.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- అధ్యక్షా, నేను మళ్ళీ తమరి ద్వారా చెప్తున్నా. మాట తప్పని మడమ తిప్పని రాజకీయపార్టీ, కాంగ్రెస్ పార్టీ. 2004లో కరీంనగర్ గడ్డ మీద శ్రీమతి సోనియా గాంధీ గారు తెలంగాణ ప్రజల యొక్క ఆకాంక్ష నాకు తెలుసు, మీ ఆకాంక్ష నెరవేరుతుందని చెప్పి, చంద్రశేఖర రావు గారు సభలో లేకపోయినా....

(బీ.ఆర్.ఎస్ సభ్యులచే సభకు అంతరాయం)

అధ్యక్షా, ఇది వినాలి. తెలంగాణ సమాజానికి ఇది తెలవాలి. తెలంగాణ...

(బీ.ఆర్.ఎస్ సభ్యులచే సభకు అంతరాయం)

మిస్టర్ స్పీకర్ :- హరీష్ రావుగారూ, లీడర్ ఆఫ్ ద హౌస్ మాట్లాడేటప్పుడు రన్నింగ్ కామెంట్స్ చేయకండి. లీడర్ ఆఫ్ ద హౌస్ మాట్లాడుతున్నారు.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- ...తెలంగాణ బిల్లు సభలోకి వచ్చినప్పుడు, చంద్రశేఖర రావుగారు సభలో లేకపోయినా, సెంట్రల్ హాల్‌లో వారు గప్పాలు కొడుతున్నా..

శ్రీ కె. తారక రామారావు :- (మైకు లేకుండా) బలి దేవత అన్నదెవరు? బలి దేవత అన్నదెవరు?

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- తెలంగాణ బిల్లు పాస్ చేసి, తెలంగాణ రాష్ట్రమిచ్చిన గొప్ప నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ గారు. ఇది నేను కాదు, ఇక్కడ్నే నిలబడి మాట్లాడింది చంద్రశేఖర రావు గారు. తెలంగాణ రాష్ట్రానికంటే

ముందు వారింటికెళ్ళి ఆడ అరుస్తున్నాయన (ప్రతిపక్ష సభ్యులు శ్రీ కె. తారక రామారావు గారినుద్దేశిస్తూ), బోర్లబొక్కల పడుకొని సోనియాగాంధీ గారి కాళ్ళు పట్టుకుని నమస్కారం పెట్టిన సంగతి అప్పుడే మరచిపోయారు. ఎందుకంటే, కృతజ్ఞత లేని మనుషులు. కృతజ్ఞత లేని మనుషుల నుండి మనమేమీ ఆశించలేము.

ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పూర్తిగా చచ్చిపోయినా, కేంద్రంలో అధికారం కోల్పోయినా, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి శ్రీమతి సోనియాగాంధీ గారు తెలంగాణ రాష్ట్రం ఇచ్చినను కాబట్టే, ఆమె దయతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు ముఖ్యమంత్రై, పది సంవత్సరాలు ఏలి, వంద సంవత్సరాల విధ్వంసం చేసి, వెయ్యి తరాలకు సరిపోయినంత కొల్లగొట్టే అవకాశం మీకు వచ్చిందనంటే, సోనియాగాంధీ గారి దయవల్ల. కాబట్టి, దయచేసి సోనియాగాంధీ గారి గురించి మాట్లాడేటప్పుడు కొంచెం మౌనంగా వింటే, మీకు మర్యాద ఉంటుందని చెప్తున్నా.

(ఓ.... అంటూ అరుస్తున్న బీఆర్ఎస్ సభ్యులచే సభకు అంతరాయం)

అధ్యక్షా, అప్పుల గురించి నిన్నా, మొన్నా చర్చ జరిగింది. మా మిత్రులు, ఆర్థిక మంత్రి, శ్రీ భట్టి విక్రమార్క గారు మొదటి శాసనసభ సమావేశంలోనే ఆర్థిక శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టారు. ఆర్థిక శ్వేతపత్రంపై ఆరోజు చర్చ జరిగింది. మళ్ళీ 10 నెలల తరువాత వారికి ఏమి జ్ఞానోదయం కలిగిందో, లేకపోతే అబద్ధాలు చెప్పాలి, బుకాయించాలి, దబాయించాలి, పాత శ్వేతపత్రం ప్రజలు మరచిపోయారు కాబట్టి, మళ్ళీ కొత్త అబద్ధం చెప్పాలని వాళ్ళేమైనా అనుకున్నారో, ఏమో నాకు తెల్వదు. గానీ....

శ్రీ కె. తారక రామారావు :- (మైకు లేకుండా) ఆర్బీఐ చెప్పింది ముఖ్యమంత్రి గారూ..

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- వస్తున్నా, అక్కడికే వస్తున్నా. ఆరోజు పెట్టిన శ్వేతపత్రంలో స్పష్టంగా రాష్ట్రప్రభుత్వం చేసిన మార్కెట్ రుణాలు రూ. 3,89,673 కోట్లు. అదేవిధంగా, స్పెషల్ పర్పస్ వెహికిల్స్/కార్పొరేషన్స్ గ్యారెంటీలిచ్చి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించే రుణాలు రూ. 1,27,208 కోట్లు... యాక్చువల్‌గా ఆరోజు శ్వేతపత్రంలో పెట్టింది. కానీ, వాస్తవానికి అవి రూ. 1,29,243 కోట్లు. అంటే, దాదాపుగా రూ. 2000 కోట్లు ఇక్కడ లెక్కలోకి రాలేదు. అదేవిధంగా, ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్‌లు తీసుకున్న రుణాలు... కానీ, కార్పొరేషన్లే చెల్లిస్తాయనేది ప్రభుత్వం చెప్పిన మాట. అవొక రూ. 95,462 కోట్లు. అదే విధంగా, ఏ గ్యారెంటీ లేకుండా, వివిధ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు రూ. 59,414 కోట్లు అని పెట్టారు. టోటల్‌గా ఆరోజు శ్వేతపత్రం పెట్టినప్పుడు రూ. 6,71,757 కోట్లు అప్పులు అని భట్టి విక్రమార్క గారు ఆర్థిక శ్వేతపత్రాన్ని ఈ సభలో ప్రవేశ పెట్టారు. దానిమీద సుదీర్ఘమైన చర్చ జరిగింది. అందరు సభ్యులు చెప్పినను. బయట కూడా ప్రసంశలని అందుకున్నాం, సభను బాగా నడిపినను, అందరికీ అవకాశమిచ్చినని. ఎందుకంటే, నిజాలు, వాస్తవాలు ప్రజలకు తెలవాలి కాబట్టి, చర్చ చేసినాం.

ఇవి కాకుండా, ఆరోజు ఈ లెక్కలో చెప్పనివి ఏమిటంటే, వీళ్ళు పనులు చేయించుకుని బకాయిలు పెట్టి, అంటే, ఇప్పుడు సర్వంచులు ధర్నాలు చేస్తున్ను, ఆ సర్వంచులకు ఎన్నికలలో వాళ్ళని ఉపయోగించుకుందామని వాళ్ళకు శాంక్షన్స్ ఇచ్చి, వాళ్ళతో పనులు చేయించి, వాళ్ళకు బిల్లులియ్యకుండా పెండింగు పెట్టినవి..., ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ హాస్టళ్ళలో పిల్లలకు బకాయిలు పెట్టినవి..., ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లలో బకాయిలు పెట్టినవి..., రాజీవ్ ఆరోగ్యశ్రీలో పేదల వైద్యానికి బకాయిలు పెట్టినవి..., ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రిలీజ్ చేయకుండా పెట్టిన బకాయిలు, ఇవేకాకుండా వాళ్ళు కమీషన్లు కొట్టేసి, ఒప్పందాలు చేసి వదిలేసిపోయిన కాళేశ్వరము, పాలమూరు... రకరకాల సాగునీటి ప్రాజెక్టులు..., అదేవిధంగా టిమ్స్, నిమ్స్ హాస్పిటల్స్ కట్టడానికి తీసుకొచ్చిన ఆ కాంట్రాక్టర్ల బకాయిలు... ఇవన్నీ లెక్క కలిపితే రూ.40,154

కోట్లు కాంట్రాక్టర్ల బకాయిలు కూడా మాకిచ్చారు. మొత్తంగా రూ.7,11,911 కోట్లు డిసెంబరు 7, 2023 నాడు మాకిచ్చిపోయారు.

మాజీ ఆర్థికమంత్రి యొక్క వాదనేంది? ఉమ్మడి రాష్ట్రంలో రూ.72,000 కోట్లు, అదేవిధంగా కార్పొరేషన్స్‌కు ఒక రూ.11,000 కోట్లు కౌంటర్ గ్యారెంటీలున్నాయి..., ఈ రూ.83 వేల కోట్లు, 84 వేలకోట్లు మా ఖాతాలో రాయొద్దన్నాడు.

శ్రీ టి. హరీష్ రావు :- (మైకు లేకుండా) కాంగ్రెస్ పార్టీ చేసిన 15 వేల కోట్లు..., మీ ప్రభుత్వం వచ్చినంక...

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- చెప్తా, అదికూడా చెప్తా. అధ్యక్షా, అట్లాంటివి మాట్లాడతారనే వాటిని కూడా తీసుకువచ్చాను. ఇంకా కూడా అబద్ధాలు చెప్పాలని ఎందుకు ప్రయత్నం చేస్తున్రో నాకైతే అర్థం కావడం లేదు. సో, అధ్యక్షా, మేమేమన్నాము. మేము అధికారంలోకి వచ్చేనాటికి ఉమ్మడి రాష్ట్రంలో దాదాపుగా 58 సంవత్సరాలూ, 15, 16 మంది ముఖ్యమంత్రులూ... ఇంతకుముందు మా జూపల్లిగారు చెప్పినట్టు, వాళ్ళందరూ కలిసి దాదాపుగా 60 సంవత్సరాలు పరిపాలన చేసి, 16 మంది ముఖ్యమంత్రులు కలిసి చేసిన అప్పు రూ.72,000 కోట్లయితే, ఒక వ్యక్తి, ఒక కుటుంబము, ఒక పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలు పరిపాలించి, 7 లక్షల... అంటే, ఈ 72 వేల కోట్లను ఆ 7 లక్షల 11 వేల కోట్ల నుండి ఒకవేళ తీసేసినా కూడా 6 లక్షల 30 వేల కోట్లు లేదా 6 లక్షల 40 వేల కోట్ల రూపాయలు వీళ్ళు అప్పులు తీసుకొచ్చారు.

(అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఒక్కసారిగా 'ఫాల్స్, ఫాల్స్ – షేమ్, షేమ్' అంటూ పరస్పరమూ స్పందించడంతో సభకు అంతరాయం కలుగసాగింది)

1.40 మ.

ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతారేంది అధ్యక్షా?..

(బీ.ఆర్.ఎస్ సభ్యుల అంతరాయం)

ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలు పరిపాలించడానికి అవకాశమిస్తే, రూ. 6 లక్షల 30 వేల కోట్ల అప్పు వాళ్ళు చేస్తే, కాంగ్రెస్ పార్టీ పరిపాలించిన 60 ఏండ్లు తెలుగుదేశం కూడా మా ఖాతాలోనే కలుపుతూ 16 మంది ముఖ్యమంత్రులు కలిసి చేసిన అప్పెంత? రూ.72 వేల కోట్లు.. ఆ అప్పులో మేము నిర్మించిన నిర్మాణాలు ఏంటివి? నాగార్జున సాగర్, శ్రీశైలం, బీమా, నెట్టంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, శ్రీరాంసాగర్, జూరాల, దేవాదుల ఎత్తిపోతల, అదే విధంగా ఎల్లంపల్లి శ్రీపాద, ప్రాణహిత చేవెళ్లలో అప్పటికే 10,12 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం జరిగింది. ఇవే కాకుండా హైదరాబాదుకు గోదావరి, కృష్ణా నది జలాలు, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, ఐ.టి. కంపెనీలు.. ఇట్లా ప్రపంచానికే ఆదర్శంగా నిలబడే విధంగా, విశ్వనగరంగా హైదరాబాదును మేము అభివృద్ధి చేశాం.

(హర్షధ్వానాలు)

ఆ అభివృద్ధితోని ఈరోజు ధనిక రాష్ట్రంగా ఎట్లా మారింది అధ్యక్షా? ఆనాడు 16 మంది ముఖ్యమంత్రులు నిబద్ధతతో, చాలా బాధ్యతతో, చాలా జాగ్రత్తగా రోశయ్యగారు 15,16 సార్లు ఆర్థిక మంత్రిగా బడ్జెటును ప్రవేశపెట్టి, రూపాయి, రూపాయి లెక్క గట్టి, గళ్ల పెట్టెను భద్రంగా దాసిండు కాబట్టి, మిగులు రాష్ట్రంగా మీకు అప్పచెబితే, మిగులు రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా తీపించింది మీరు. మౌనంగానైనా ఉండకుండా ఎదురుదాడి చేస్తున్నారు అధ్యక్షా. మీరే ఆలోచన చేయండి, దాదాపుగా 1956 నుంచి 2014 వరకు లెక్కవెసుకుంటే, 58 ఏండ్లు, అంతకు ముందు లెక్క వేసుకుంటే కూడా 60 సంవత్సరాలపైగా 16 మంది ముఖ్యమంత్రులు ఈ ఉమ్మడి రాష్ట్రం లేదా హైదరాబాదు రాష్ట్రం కలిపితే మనకు వచ్చిన అప్పు రూ. 72 వేల కోట్ల రూపాయలు, మనం కట్టినవి..కండ్లముందే ఉన్నాయి కదా.. SLBC Tunnel, 32 కి.మీ ఆరోజు తవ్వారు .. వెంకట్ రెడ్డిగారు తీసుకువచ్చిన ప్రాజెక్టులు. ఇలాంటి ప్రాజెక్టులు చాలా వరకు 50, 60, 70 శాతం దాదాపుగా తెలంగాణలో

ఉండే 12, 13 వేల గ్రామాలకు వేలాది తండాలకు, గూడేలకు కరెంటు ఇచ్చిన్రు, రోడ్లు వేసిన్రు, త్రాగు నీళ్ళిచ్చిన్రు. ప్రతి ఊర్లో బడి కట్టిన్రు, ప్రతి ఊర్లో గుడి కట్టిన్రు, ప్రతి ఊర్లో తలెత్తితే కనిపించే నీళ్ళ ట్యాంకు ఆనాడు మేము కట్టినాం. ఏ గ్రామానికైనా, రోడ్డైనా, గుడైనా, బడైనా, త్రాగడానికి నీళ్ళైనా, నీళ్ళ ట్యాంకైనా, కరెంటైనా, ఏదైనా ఆ 60 ఏండ్లల్లో మేమిచ్చి, మేము మీకు అప్పజెప్పిన రాష్ట్రం రూ. 72 వేల కోట్ల రూపాయల అప్పైతే, ఏమీ ఇవ్వకుండా మీరు చేసిందేమిటి ఈ పదేండ్లలో? కూలేశ్వరం కట్టినారు. మేము 30 ఏండ్లు చేయలేకపోయినామని మేము మొదలుపెడితే రూ. 1 లక్ష 50 వేల కోట్లు చేశారు. అందులో ఇప్పటికే రూ. 1 లక్ష 2 వేల కోట్లు కాంట్రాక్టర్లకు పేమెంట్ ఇచ్చారు. కాళేశ్వరంతో ఎన్ని ఎకరాలకు నీళ్ళిచ్చారో తెలుసా అధ్యక్షా? ఉత్తమ్ కుమార్ రెడ్డిగారు శ్వేత పత్రం ప్రవేశపెట్టారు, 50 వేల ఎకరాలకు నీళ్ళిచ్చారు. రూ.1 లక్ష 2 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, ఘనత వహించిన కూలేశ్వరం, నికరంగా 50 వేల ఎకరాలకు నీరు అందించింది. కరెంటు బిల్లు, రూ. 11 వేల కోట్లో, రూ. 10 వేల కోట్లో అయింది, విద్యుత్ శాఖా మంత్రి వచ్చినాక ఆ లెక్కలు తీస్తాడు. రైతుకు బోనస్, కనీస మద్దతు ధర ఇచ్చుడనేది విడిచిపెట్టు, ఆ 50 వేల ఎకరాలలో పండించిన పంట మొత్తానికి మొత్తం అమ్మి తీసుకు వచ్చి కడితే కూడా లిఫ్ట్‌ల కోసం ఖర్చు పెట్టిన కరెంటు బిల్లుకు కూడా సరిపోదు. ఇది వాళ్ళు సాధించిన ఘనత, గొప్పతనం.

(షేమ్, షేమ్ .. అని అధికార పార్టీ సభ్యులు అన్నారు.)

ఇంకా బుకాయించడం, దబాయించడం, ఎదురుదాడి చేయడం, స్పీకర్ స్థానం మీద దాడి చేయడం, ఈ బెదిరింపు రాజకీయాలెంత కాలం నడుస్తాయి అధ్యక్షా? ఇట్లనే బెదిరిస్తే నిజాం ఏమైండు? ఖాసిం రజ్వీకేమైంది ఇలానే చేస్తే? ఇట్లనే చేస్తే బ్రిటీషర్స్ ఎక్కడికి పోయారు? ఏంది అధ్యక్షా ఇది? మీత్రుడు ఇంకొక మాట చెప్పిండు, మీరొచ్చిన 11 నెలల్లో రూ.1 లక్ష 27 వేల కోట్ల అప్పు చేశారని చెప్పారు. సంతోషం. లెక్కలెక్కడి నుంచైనా తేనీ, ఆయన సోర్స్ ఆయనిష్టం. ఆయన సోర్స్ ఏందని నేను అడుగుతలేను.

(మీరిచ్చిన లెక్కలే.., భట్టిగారు సభలో పెట్టినదే చెబుతున్నాం.. అంటూ బీఆర్ఎస్ సభ్యుల నుండి సభకు అంతరాయం)

నేను వారికి అప్పజెప్పాను. ఓపిక పట్టండి, రోజుల కొద్ది మీరు మాట్లాడారు, ఒక మాట కూడా నేను మాట్లాడలేదు. ఆయన ప్రవేశపెట్టిన కాగితాల స్పిరిట్ అర్థం చేసుకుంటే మీరిట్ల వితండవాదం చేయకపోయేవారు.

రూ. 1 లక్ష 27 వేల కోట్ల అప్పు చేశామని వారు చెప్పారు. వారు చెప్పినదే మనం వాస్తం క్రింద తీసుకుందాం. వారు ఇచ్చిపోయిన అప్పు రూ.7 లక్షల 11 వేల కోట్లు.

(బోగస్ అంటూ బీ.ఆర్.ఎస్ సభ్యుల నుండి సభకు అంతరాయం)

అదే విధంగా, మేము చేసిన అప్పు రూ.1 లక్ష 27 వేల కోట్ల రూపాయలు. రెండు కలిపితే రాష్ట్రం అప్పు ఎంతుండాలి? రూ.8 లక్షల 38 వేల 911 కోట్లుండాలి. 7 డిసెంబరు, 2023 నాడు ప్రభుత్వాన్ని వారు మాకు అప్పజెప్పినప్పటికున్న అప్పు కాంట్రాక్టర్ల బిల్లులు కావచ్చు, కార్పొరేషన్ పేర్ల మీద తీసుకున్న లోన్లు కావచ్చు, FRBM పరిధిలో తెచ్చిన అప్పు కావచ్చు, అన్నీ లెక్క కడితే రూ.7 లక్షల 11 వేల 911 కోట్లు. అదే విధంగా, హరీష్‌రావుగారు మేము చేశామని చెబుతున్న అప్పు రూ.1 లక్ష 27 వేల కోట్ల రూపాయలు. ఈ రెండు కూడితే రూ.8 లక్షల 38 వేల 911 కోట్లు అప్పు కావాలి.

(అంతరాయం)

18.12.2024 నాటికి ఈ రాష్ట్ర ప్రభుత్వం మీదున్న అప్పు రూ.7 లక్షల 22 వేల 788 కోట్లు. నేను అధికారికంగా ఈ సభలో లెక్క చెబుతున్నాను. 18.12.2024 వరకు అంటే రెండు రోజుల క్రితం వరకూ తెలంగాణ రాష్ట్రం

మీదున్న అప్పు రూ.7 లక్షల 22 వేల 788 కోట్లు. నేనిప్పుడు తమరి ద్వారా వారిని అడుగుతున్నాను. మేము రూ.1 లక్షల 27 వేల కోట్లు అప్పు చేసి రాష్ట్రప్రజల నెత్తి మీద మేము మోపితే, ఆ అప్పు రూ.8 లక్షల 38 వేల పైచిలుకు కోట్లు ఉండాలి. రూ.8 లక్షల 38 వేల 911 కోట్లు ఉండాలి. కానీ, ఈరోజు రాష్ట్రప్రభుత్వం మీదున్న అప్పు రూ.7 లక్షల 22 వేల 788 కోట్లు ఉంది. మిగతా దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఎక్కడికి పోయినాయి?

వాళ్ళు చేసిన అప్పు అసలు మిత్తి కట్టడానికి మేము ప్రభుత్వాన్ని అప్పజెప్పినప్పుడు ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికున్న సంవత్సరానికి భారం అప్పులు కట్టాల్సింది రూ.6,500 కోట్లు. ఇవాళ వాళ్ళు మాకు అప్పజెప్పేటప్పటికీ ప్రతి నెల రూ.6,500 కోట్లు. ఆనాడు సంవత్సరానికి చెల్లించాల్సిన కిస్తూ, ఈరోజు ప్రతి నెల చెల్లించాల్సి వస్తుంది. రూ.1 లక్షల 27 వేల కోట్లు అప్పులు తెచ్చి, మేము గజ్వేల్‌లో ఫామ్ హౌజులు కట్టుకోలేదు, జన్వాడలో ఫామ్ హౌజులు కట్టుకోలేదు, మొయినాబాదులో ఫామ్ హౌజులు కట్టుకోలేదు, ధరణిలో మేము భూములను కబ్జా పెట్టుకోలేదు. ఎక్కడికి పోయినాయి? వాళ్ళు చేసిన పాపం..వాళ్ళు పదేండ్లలో బొచ్చెడు తప్పులు, పుట్టెడు అప్పులు. వాళ్ళు చేసిన తప్పులను సరిదిద్దడానికి, వాళ్ళు తెచ్చిపెట్టిన అప్పులను కట్టడానికి మళ్ళీ అప్పులు చేయాల్సి వచ్చింది. వాళ్ళు చేసిన అప్పులకు మిత్తీలు కట్టాలంటే మళ్ళీ బ్యాంకులకు పోయి తేవాల్సి వచ్చింది. ఇవాళమేము లక్ష కోట్ల రూపాయలు తెచ్చినా, రూ.1 లక్ష 27 వేల కోట్లు తెచ్చినా, వాళ్ళు పెట్టిన పాపాల పుట్టను తిరిగి చెల్లించడానికి తల తాకట్టుబెట్టి ఈరోజు మేము పేద రైతులకు రైతు భరోసానో, లేకపోతే వారు కోరుకుంటున్న కౌలు రైతులకో, ఇంకొకరికో, లేకపోతే మహిళలకిస్తున్న డబ్బులెందుకు ఇవ్వలేకపోతున్నాం? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు సమయానికి ఇవ్వలేకపోతున్నాం? హాస్టళ్ల బిల్లులు ఎందుకు సమయానికి మేము కట్టలేకపోతున్నాం? తులం బంగారం షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీలో ఎందుకు ఇవ్వలేకపోతున్నాం? ఇవన్నింటికీ.. ఉన్న ఆదాయం మొత్తం, తెస్తున్న అప్పులు మొత్తం వాళ్ళు చేసిన పాపాలు చెల్లించడానికే పోతోంది. ఇదే రూ.1 లక్ష 27 వేల కోట్లు నా దగ్గర ఉంటే, వాళ్ళు చేసిన పాపాలకు, అప్పులను చెల్లించే భారం నాపై పడకపోయి ఉంటే, ఈ రూ.1 లక్ష 27 వేల కోట్లుతోని తెలంగాణ రాష్ట్రంలో అద్భుతాలు సృష్టించేటోన్ని నేను. ఏ రైతు కూడా అన్ని పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి ఉండేటోన్ని ఇవి ఉండి ఉంటే. ఏ పిల్లవానికి కూడా ఒక్కరోజు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేకుండా చెల్లించేటోడిని. ఏ ఆరోగ్యశ్రీ ...హాస్పిటళ్ళకు.. అక్బరుద్దీన్ ఓవైసీగారు పదే పదే కలిసి ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించండి, కార్పొరేట్ ఆసుపత్రులు బ్రతకలేపోతున్నాయి, డాక్టర్లకు జీతాలియ్యలేక పోతున్నామని చెప్పి చెబుతుంటే, అడక్కముందే ఒక నెల అడ్వాన్స్ ఇచ్చేటోన్ని అధ్యక్షా.

ఇవాళ ఈ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, రైతు భరోసా కావచ్చు, రైతు బుణ మాఫీ కావచ్చు, ఫీజు రీయింబర్స్‌మెంటు కావచ్చు, ఆరోగ్యశ్రీ కావచ్చు, లేకపోతే పేద ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలలో ఏదైనా ఒక గ్యారెంటీ ఆలస్యమైందంటే ఆ పాపం ఈ పాపాత్ములదే అధ్యక్షా. ఈ పాపాల భైరవులు రాష్ట్రాన్ని అమ్మేసి కోకాపేట అమ్మినారు, ఔటర్ రింగ్‌రోడ్ అమ్మినారు, హైదరాబాదులో భూములమ్మినారు, హైటెక్‌సిటీ అమ్మేసిరి, ప్రతిదీ అమ్మేశారు.

1.50 ప.మ. వైన్ షాపులు, మన బలహీనతను కూడా ఆరునెలలకు ముందు అమ్మేసుకున్నారు అధ్యక్షా వైన్ షాపుల పేర్లమీద. ఒక్క వైన్ షాపు ఇస్తామంటే వంద అప్లికేషన్లు తీసుకున్నారు. వాళ్ళకు పైసలు కూడా వాపసు ఇవ్వలేదు. పాపం ఏదో వ్యాపారం అయితదని వాళ్ళు 50, 50 వేల రూపాయలు కోట్ల రూపాయలు అవి కూడా కొల్లగొట్టి.. అంటే వ్యసనాలు ఉన్న వాళ్ళనూ కొల్లగొట్టారు, వ్యాపారాలు చేసే వాళ్ళని కొళ్ళగొట్టారు, 60 ఏళ్ళు మనం సృష్టించిన సంపదను కొల్లగొట్టారు. కాంట్రాక్టర్ల పేరుమీద

కొళ్ళగొట్టారు. బ్యాంకుల పేరు మీద అధ్యక్షా, ఏమైనా అప్పు తెచ్చుకుంటే మిత్తి అనేది అడుక్కుంటాం మనం. అరె జర తక్కువ చెయ్యవయ్యా మిత్తి, ఎట్లా ఇట్లయితే అని. వాళ్ళు తెచ్చిన అప్పు ఎంత రేటుకు తెచ్చారో తెలుసా అధ్యక్షా, పదకొండున్నర శాతం. ఉరి తీసినా తప్పు లేదు. అధ్యక్షా, పదకొండున్నర శాతం వడ్డీకి తెచ్చారు అప్పులు.

ఎక్కడైతే జైకా, వరల్డ్ బ్యాంకు ప్రపంచంలో గొప్పగొప్ప బ్యాంకులు కొన్ని ప్రాజెక్టులకు 2 శాతం నుంచి 4 శాతం మిత్తి తోని అప్పులిచ్చేది ఉంటే, పదకొండున్నర శాతం తోని అప్పులు తేవడం వల్ల ఈరోజు వేలాది కోట్ల రూపాయలు మిత్తికే కట్టాల్సి వస్తుంది అధ్యక్షా. ఇంత ఆర్థిక నేరం ఇతర దేశాలల్లో పాల్పడి ఉంటే ఉరి తీసి ఉండేటోళ్ళు అధ్యక్షా. దుబాయ్ లాంటి దేశాలల్లో బజారులో నించోబెట్టి రాళ్లతోని కొట్టి చంపేటోళ్ళు.

ఇంత బాధ్యత లేకుండా పదకొండున్నర శాతంతో అప్పులు తెచ్చేవాళ్ళు ఈదేశంలోనే ఎవరూ లేరు. నేను 20 సార్లు, 23 సార్లు ఎందుకు ఢిల్లీకి పోయాను. 50 సార్లు ఆర్థికశాఖలో ఉండే నిపుణుల కాళ్ళు పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కనీసం నా డెట్ రీ స్ట్రక్చర్ చెయ్యి, రేట్ ఆఫ్ ఇంట్రెస్ట్ లెవెన్ అండ్ హాఫ్ పర్సెంట్ నుంచి కనీసం ఏడు శాతానికో ఎనిమిది శాతానికో తగ్గిచ్చు అని నాలుగైదు శాతం మిత్తి తగ్గించుకుంటే మనకు వేల కోట్ల రూపాయలు మిగులుతాయి. ఆ వేలకోట్ల రూపాయలు మనం ఏదైతే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వాటికి ఉపయోగించుకోవచ్చు. ఎస్.సి. ఎస్.టి, బి.సి, మైనారిటీలకు ఏదైతే రెసిడెన్షియల్ స్కూళ్లకు ఇచ్చామని గొప్పగా చెపుతున్నారో ఒక్క స్కూలు బిల్డింగు అయినా కట్టారా అధ్యక్షా? కోళ్ళ ఫారంలో బుట్టక్రింద కోళ్ళను కప్పినట్టు నాలుగు రూములల్లో వందలాది పిల్లలు పడుకుంటున్నారు. ఆడపిల్లలకు బాత్రూంలు లేక నాలుగు గంటలు నుంచి ఆ పిల్లలు బాత్రూంల దగ్గర లైనులో నిల్చుంటున్నారు. బాత్రూంల సమస్య ఉందని మంచినీళ్లు కూడా త్రాగడం లేదు అధ్యక్షా ఆడపిల్లలు. హృదయవిదారకంగా ఉంది అధ్యక్షా. జి.ఓలు ఇచ్చి, హాస్టళ్ళు పెట్టేసి ఎస్.సి.,ఎస్.టి, బి.సి., మైనారిటీ పిల్లలు కాబట్టి వాళ్ళ చావు వాళ్లని చావనీ అని వాళ్ల కర్మకు వదిలేసి ఆ పిల్లల జీవితాలతో చెలగాటమాడి, ఈరోజు పది నెలలల్లో మీరు ఏమీ చేయలేదు, హాస్టళ్ళల్లో చచ్చిపోతున్నారని చెబుతూ సిగ్గులేకుండా తిరుగుతున్నారు అధ్యక్షా.

పదేళ్ళలో మీరు ప్రగతి భవన్ కట్టుకున్నారు, మీరు సచివాలయం కట్టుకున్నారు, మీరు ఫాంహౌస్‌లు కట్టుకున్నారు, 33 జిల్లాలల్లో పార్టీ ఆఫీసులు కట్టుకున్నారు. టి.వి ఛానల్స్ పెట్టుకున్నారు, పేపర్లు పెట్టుకున్నారు, వేల కోట్ల రూపాయల వ్యాపారాలు చేసుకున్నారు. కానీ ఆ పేదోళ్ళ పిల్లలు చదువుకోడానికి హాస్టళ్ళు కట్టారా? కట్టారా అధ్యక్షా? లక్షలాది మంది పిల్లలు. మన పిల్లలు అధ్యక్షా. ఎవరి పిల్లలు అధ్యక్షా వాళ్ళు. మీకు అధికారం కట్టబెట్టింది వాళ్ళ తల్లితండ్రులు కాదా? వాళ్ళు మన కుటుంబ సభ్యులు కాదా? మీమీద ఎంత నమ్మకంతో, విశ్వాసంతో మీకు రెండుసార్లు అధికారం అప్పజెప్తే మీ నిర్వాకం, మీ విలాసవంతమైన జీవితం, మీ సెంటిమెంట్లు, మీకు కావలసిన గూడుపుఠానీలు తప్ప ఆ పిల్లలకొక గూడు కట్టారా అధ్యక్షా?

పదేళ్ళల్లో ఎన్ని హాస్టళ్ళు కట్టారు. పదేళ్ళల్లో ఎప్పుడైనా వాళ్ల మెస్ చార్జీలు నువ్వు టైంకి ఇచ్చావా? పదేళ్ళల్లో ఎప్పుడైనా ఆడపిల్లలకు కాస్మోటిక్ చార్జీలు ఇచ్చావా? ఆడపిల్లల తల్లితండ్రులు సొంత బిడ్డను పేగు తెంచుకుని పుట్టిన బిడ్డను హాస్టళ్ళ పెడతారా? ఎంత పేదరికం ఉంటే, ఎంత తప్పనిసరి పరిస్థితి ఉంటే తప్ప ఒక తల్లి.. వీళ్ళు శ్రీమంతులు, వాళ్ళ పిల్లల పట్ల వాళ్ళకు ప్రేమ ఉండొచ్చు. కానీ శ్రీమంతులకు వాళ్ళ పిల్లలమీద ఉన్న ప్రేమ పేదోళ్ళకు లేదా? మా దళితుల, గిరిజన, ఆదివాసీలకు వాళ్ళ పిల్లల మీద ప్రేమ లేదా? ఆ ప్రేమ ఉన్నా , ఆ ప్రేమను చంపుకుని, కప్పి పుచ్చుకుని ఆ ఆడబిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి పంపిస్తే, బాత్రూంలు కూడా కట్టనందుకు పదేళ్లల్లో సిగ్గుతో తలవంచుకుని ముక్కు నేలకు రాసి

క్షమాపణ చెప్పాలి దళిత గిరిజన ఆదివాసీ సమాజానికి అధ్యక్షా.

ఈరోజు మొఖం చెల్లక వారు రావడం లేదు. వారు వస్తారేమో అడుగుదాము, కడుగుదామని సంవత్సరం నుంచి ఎదురు చూశాను అధ్యక్షా. ఈరోజు సందర్భం వచ్చింది కాబట్టి ఈ అంశాలన్నిటినీ నేను ప్రస్తావిస్తున్నాను. నాకా బాధ, దుఃఖం, ఆవేదన ఉంది కాబట్టే 40% మెస్ చార్జీలు పెంచాను, 200% కాస్మాటిక్ చార్జీలు పెంచాను. నా ఆర్థిక మంత్రిని పిలిచి స్ట్రిక్ట్ ఆదేశాలు ఇచ్చాను. నా ఫైనాన్స్ సెక్రటరీకి చెప్పినా. నువ్వు గ్రీన్ ఛానెల్‌లో వాళ్ళకు పేమెంట్లు చేయకపోతే నిన్ను సస్పెండు చేస్తానని వార్నింగ్ ఇచ్చాను అధ్యక్షా. ఇది మా నిబద్ధత. నీలాగ కాంట్రాక్టర్ల కోసం కమీషన్ల కోసం, అవుటర్ రింగ్ రోడ్డు అమ్ముడో, లేకపోతే కోకాపేటలో భూములు అమ్మో, కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు కొట్టలేదు. ఈరోజు నా నిబద్ధతను నువ్వా క్వశ్చన్ చేసేది? మీ స్థాయెంత, మీరెంత నా గురించి మాట్లాడటానికి? ఈరోజు పరిపాలన మీద నాకా మీరు సర్ది చెప్పేది. పదేళ్ళు సర్వనాశనం చేసి, రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి, రాష్ట్రాన్ని బొందలగడ్డ చేసి, 50,60 లక్షల మంది స్టూడెంట్ల జీవితాలతోని చెలగాటమాడి, పోటీ పరీక్షలు పెట్టకుండా, బడులు జరపకుండా, పదోతరగతి పరీక్షలు నిర్వహించలేని సన్నాసులు, పన్నెండవ తరగతి పరీక్ష పేపర్లు దిద్దలేని సన్నాసులు, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో క్వశ్చన్ పేపర్ల లీకులు, మీరా వచ్చి నాతోని మాట్లాడేది? అందుకే అధ్యక్షా..

(బీ.ఆర్.ఎస్ సభ్యులచే అంతరాయం)

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- అధ్యక్షా, హౌస్‌ని ఆర్డర్‌లో పెట్టండి.

మిస్టర్ స్పీకర్ :- (బీ.ఆర్.ఎస్ సభ్యులనుద్దేశించి) ప్లీజ్ కూర్చోండి.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి :- అధ్యక్షా, ఇంతకు ముందే సభ్యులు తారక రామారావుగారు మాట్లాడుతూ కాళేశ్వరంలో మేము ఉచితంగా నీళ్ళు ఇస్తాము అన్నారు. మిషన్ భగీరథలో ఉచితంగా నీళ్ల ఇస్తామన్నారు. అదేవిధంగా రకరకాల కార్పొరేషన్లమీద తీసుకున్న అప్పులు ప్రభుత్వమే కడతది అన్నారు. కానీ ఆర్థిక మంత్రి, గత ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో గానీ రిజర్వు బ్యాంకు ఇచ్చిన రిపోర్టు.. ఎందుకు రిజర్వు బ్యాంకు లెక్కలు చూపించిందంటే, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ పేరుమీద రూ. 64,651 కోట్లు అప్పు చేస్తే, ప్రభుత్వం యొక్క లయబులిటీ రూ. 16,162 కోట్ల రూపాయలని చెప్పారు. కేవలం 25 శాతమే గవర్నమెంటు లయబులిటీ అని చెప్పి 2022–23 ఆర్థిక సంవత్సరంలో తప్పుడు నివేదిక ఇచ్చారు అధ్యక్షా. అదేవిధంగా తెలంగాణా డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్‌లో రూ. 22,427 కోట్లు అప్పు చేస్తే రూ. 11,213 కోట్లు చూపించారు. అదేవిధంగా షీప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ క్రింద రూ. 1314 కోట్లు అప్పుచేస్తే రూ. 65 కోట్లు మాత్రమే మా బాధ్యత అని. ఇట్లా మొత్తం 19 కార్పొరేషన్లు అధ్యక్షా. Telangana State Water Resources Infrastructure Development Corporation Limited, DISCOMS, Telangana Housing Corporation Limited, TG Road Development Corporation Limited, HMWSSB, TG State Road Transport Corporation, Sheep Development Corporation, Telangana Urban Finance Infrastructure Development Corporation Limited, TS Power Generation Corporation Limited, Telangana State Fisherman Cooperative Societies Federation Limited, Telangana Industrial Infrastructure Corporation, ITE&C, Fiber Grid Corporation Limited, Telangana Police Housing Corporation, Telangana Horticulture Development Corporation Limited, Hyderabad Metro Rail Limited, Telangana Dairy Development Cooperative Federation Limited and Greater Hyderabad Municipal Corporation Limited. వీటన్నిటి మీద వీళ్ళు చేసిన, నేను సివిల్ సప్లైస్ కార్పొరేషన్

ఇంకా కొన్ని కార్పొరేషన్లను తీసుకోలేదు. కేవలం 19 కార్పొరేషన్లే నేను తీసుకున్నాను అధ్యక్షా.

2.00 మ. అధ్యక్షా, ఈ 19 కార్పొరేషన్లలో వీళ్ల సమయంలో చేసిన అప్పు మొత్తం రూ.1,29,283.60 కోట్లు. వాళ్లు చెప్పింది ఏమిటంటే ఆ అప్పులు మొత్తం వాళ్లే కట్టుకుంటారు, మాకేం బాధ్యత లేదు, ఇందులో ఒకదాంట్లో 5 పర్సెంటు, ఇంకొక దాంట్లో 25 పర్సెంటు, ఇంకొక దాంట్లో 50 పర్సెంటు మాత్రమే ప్రభుత్వానికి బాధ్యత ఉంటుంది. ఆ లెక్క ప్రకారము రూ.38,867 కోట్లు అని మాజీ ఆర్థిక మంత్రిగారు బడ్జెట్‌లో చెప్పారు. ఈ బడ్జెట్‌లో ఉన్న లెక్కలు తీసుకెళ్లి, రిజర్వు బ్యాంకు as it is గా రిపోర్టిచ్చింది. Whereas Rs.1,29,243 crores ఉన్న కార్పొరేషన్ల అప్పును వీళ్లు తగ్గిచ్చి, చూపిచ్చి రూ. 38,867 కోట్లు చూపించడంతో, దాదాపుగా రూ. 80 వేల కోట్ల లెక్కలు అందులో తగ్గినయ్ అధ్యక్షా. ఇంతకుముందు సభ్యులు తారక రామారావు గారు మాట్లాడుతూ ఒక మాటన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు క్రింద రైతులకు ఫ్రీగా నీళ్లిస్తున్నామని. వాటర్ గ్రిడ్‌లో 100 పర్సెంట్ నీళ్లిస్తామని. హరీష్‌రావు గారేం చెప్పారు. 75 శాతం వసూలు చేస్తామని ఇందులో రాశారు. 25 శాతమే ప్రభుత్వ బాధ్యత అన్నారు. అదే విధంగా డ్రింకింగ్ వాటర్ 50 శాతం వసూలు చేస్తామని రాశారు. అదే విధంగా సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 95 శాతం వసూలు చేస్తామని రాశారు. మా బీర్ల ఐలయ్య ఈడనే ఉన్నడు. మా గొర్లె కాపర్లకి ఏదైతే ఈ పథకం ఇచ్చినో, గొర్రెలు, బర్రెల పథకంలో, 100 పర్సెంట్ ఫ్రీ అని చెప్పారు. కాని ఇక్కడ 95శాతం గొర్రె కాపర్ల నుండి వసూలు చేస్తామని ఇక్కడ రాశారు. అదే విధంగా తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో 5శాతం మాత్రమే స్టేట్ గవర్నమెంటు కడుతుంది, మిగతాది ఎవరైతే ఉపయోగించుకుంటున్నారో వాళ్ల దగ్గర వసూలు చేస్తామన్నారు. అంటే ఈరోజు ప్రభుత్వానికి ఇంకా ఎక్కువ అప్పులు చేసుకోవడానికి, దొంగ లెక్కలు రాసి, ప్రభుత్వానికి ఇంకా ఎక్కువ అప్పులు చేసుకోవడానికి వెసులుబాటు ఉందని ఇంకొక లక్ష కోట్లు మళ్లా అప్పులు తెచ్చి, అత్యధిక వడ్డీతో తెచ్చి, వాటిని కూడా కొల్లగొడదామని కుట్రతోని, దొంగ లెక్కలు చూపించి, పాపం చంద్రశేఖరరావు గారు కూడా ఈయన కంటే ముందు ఆర్థిక మంత్రిగా ఉన్నారు. పాపం ఆయన ఉన్నది ఉన్నట్లు చూపించారు. ఆయన దొంగ లెక్కలు చూపించలేదు. ఈ పట్టికలో ఉన్నదే ఆయన చూపించాడు. అంతకంటే ముందు ఇంకొకాయన ఉన్నాడు, బయటకు తోలిండు కదా. ఆయన పేరు ఈటల రాజేందర్. వారు కూడా ఈ దొంగ లెక్కలు చూపించలేదు. పాపం ఆయన కూడా ప్లెయిన్‌గా, ఉన్నది ఉన్నట్లు చూపించాడు. ఈటల రాజేందర్‌గారు ఐదేళ్లు, చంద్రశేఖరరావు గారు ఒక సంవత్సరం మొత్తం ఆరు సంవత్సరాలు నేను చెప్పిన రూ.1,29,243 కోట్ల ప్రకారం అప్పులు తెచ్చిందని రిజర్వు బ్యాంకు బడ్జెట్‌లో పెడితే, ఘనత మహించిన ఈ పెద్దమనిషి వచ్చి దీన్ని తగ్గించి రూ.38 వేల కోట్లు చూపించి, ఈయన యవ్వారం ఎట్లుందంటే కొశ్చెన్ పేపర్ ఈయనే తయారుచేసిండు, పరీక్ష ఈయనే రాసిండు, పరీక్ష పేపర్లు ఈయన్నే దిద్దిండు. నూరు మార్కులకి నూట పదిమార్కులు వచ్చినయ్, నన్ను సన్మానించండని మెడల్ వేసుకుని తిరుగుతుండు. నూటికి నూట పది మార్కులు వచ్చినయ్ అని. అయ్యా నువ్వే రాస్తివి, నువ్వే ఇస్తివి, నువ్వే బడ్జెట్‌లో పెడితివి, అదే రిజర్వు బ్యాంకు పెట్టింది, వారు అదే దాన్ని ప్రింట్ చేసి, చుక్క పెట్టి రాశారు, నా సోర్స్ తెలంగాణ బడ్జెటే అని. నువ్విచ్చిన సోర్సే, నువ్విచ్చిన దొంగలెక్కలు, నువ్విచ్చిన తప్పుడు లెక్కలు, రిజర్వు బ్యాంకు తీసుకుని లెక్కలు రాస్తే, మళ్లా అదే తీసుకొచ్చి సభలో పెట్టి, చూసినవా రిజర్వు బ్యాంకు నాకు సర్టిఫికెటిచ్చింది, నాకు మెడలిచ్చింది నన్ను మీరు సన్మానిస్తరా, లేదా ఇప్పుడు ఈ సభలో నాకు నిలువెత్తు సన్మానం చేసి, ఏదో సమ్మక్క సారలక్కలో ఏదో చేస్తారు కదా, ఆయన్ని నిలువెత్తు బంగారంతో సన్మానం చెయ్యమని నిలబడ్డాడు, హైటు కూడా తక్కువ లేడు, ఒకమేళ గట్ల చేద్దామన్నా. నేను అడిగేదేంది అంటే మీరిచ్చిన తప్పుడు లెక్కలు, మీరు ఎంతకాలం తప్పుదోవ పట్టిస్తారు,

ఎంతకాలం ప్రజల్ని మోసం చేస్తారు, అబద్దాల లెక్కలతో, ఎంతకాలం ఈ ప్రజల్ని మభ్యపెడతారు, నిజాలు ఇప్పటికైనా గ్రహించండి. నా రిక్వెస్ట్ ఒక్కటే.. ఏం మించిపోలే. పదేళ్లు మీరు ప్రభుత్వాన్ని నడిపారు. ప్రజలు మాకు అవకాశమిచ్చారు. మమ్మల్ని ఊపిరి తీసుకోనివ్వండి. అప్పులేడున్నయో, తప్పులేడున్నయో జర మమ్మల్ని చూడనివ్వండి. సర్దుకోనివ్వండి మమ్మల్ని. మేమసలు కూడదీసుకోకముందే, చేతులు కాళ్ల దగ్గరకు తీసుకోక ముందే ఎట్లన్న చేసి రెక్కలిరవాలి, వీళ్లను ఎట్లన్నా చేసి బద్నాం చెయ్యాలి, వీళ్లని ఎట్లాగైనా చేసి పనిచేయనివ్వొద్దు. అధ్యక్షా, వీళ్లు పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపారు. నేను సూటిగా అడగదలచుకున్నా,ఆవేదనతో. కోపంతో కాదు. వాళ్ల మీద కోపంఅనే దానికి వాళ్లకు అర్హత లేదు, నేను కోపపడడానికి.

అధ్యక్షా, కొడంగల్ మీ అమ్మమ్మగారి ఊరు. ఆ ప్రాంతం ఎంత వెనకబడ్డదో మీకు తెల్వదా? మీరు కళ్లతో చూసుకుంటూ పెరిగిన్రు కదా. దేవుడు నాకొక్క అవకాశమిచ్చి, నా ప్రాంతం కాకపోయినా, నేను అక్కడ పుట్టకపోయినా, నేను అక్కడ పెరగకపోయినా 2009లో నన్ను ఆశీర్వదించి 7 వేల మెజారిటీ ఓట్లతోనన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. అయిదు సంవత్సరాల తరువాత అదే ప్రజలు మళ్లా 14 వేల మెజారిటీ ఓట్లతో నన్ను గెలిపించారు. అక్కడి ప్రజలకు నా జీవితాంతం ఏమి చేసినా కూడా, నేను వాళ్లకు ఎంత సేవ చేసినా కూడా తక్కువనే అవుతుంది. అట్లాంటిది ఈరోజు అక్కడినుండి నేను ఎమ్మెల్యేగా గెలిచి, ముఖ్యమంత్రినయ్యాను. స్వతంత్రం వచ్చినప్పటినుండి ఆ కొడంగల్ శాసనసభ నియోజకవర్గం నుండి ఒక్కసారి మనం పుట్టినప్పుడు 1965, 1966లో కొద్దికాలం పాటు అచ్యుతారెడ్డి గారు మంత్రిగా చేశారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి ఈరోజు వరకు అక్కడ ఒక మంత్రి పదవిగాని, ఇంకోటి గాని ఏది రాలేదు. ఒక పరిస్థితి ఎలా ఉందంటే మనం కర్నాటకనా, తెలంగాణనా తెలియని పరిస్థితి ఉంది. సగం ప్రజలు కన్నడం మాట్లాడుకుంటారు, సగం తెలుగు మాట్లాడుకుంటారు. ఎందుకంటే భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజన కాకముందు ఇది అటువైపు ఉంది కాబట్టి సగం ప్రజలు కర్నాటకనా,తెలంగాణనాఅనుకునే పరిస్థితి. ఇప్పుడు లేక లేక ఆ ప్రజల అదృష్టమో నాకు దేవుడిచ్చిన అవకాశమో ఇవ్వాళ నేను అక్కడ ఎమ్మెల్యేనయినా, ముఖ్యమంత్రిని అయినాను. నేడు అక్కడ వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులున్నారు. ఎక్కువచదువుకున్నోళ్లు లేరు. కొన్ని పరిశ్రమలు తెచ్చి, ఆ పరిశ్రమల ద్వారా వాళ్లకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఓ ప్రయత్నం చేసినా. పదేండ్లు ప్రభుత్వాన్ని నడిపినోళ్లు ఫార్మా సిటీనా, ఇండస్ట్రియల్ పార్కా పక్కన పెడదాం. ఎయిర్‌పోర్టుకి కూతవేటు దూరంలో అత్యంత విలువైన భూములు, ఎకరం ఐదుకోట్లు, పది కోట్లు ఉండే భూములు 15 వేల ఎకరాలు వీళ్లు సేకరించి, ఫార్మా సిటీ పెడతామని చెప్పింది వీళ్లు కాదా అధ్యక్షా? హైదరాబాద్ నగరం పక్కన, ఎయిర్‌పోర్టుకి కూతవేటు దూరంలో అత్యంత విలువైన భూముల్లో, వీళ్లు ఫార్మా కంపనీలకు, కోట్ల రూపాయల భూములను, లావాదేవీలు చేసుకుని, అగ్గువ సగ్గువకు ఇచ్చి, ఇక్కడ వీళ్లు ఫార్మా పెట్టొచ్చంట. నేను భూమి విలువ తక్కువ ఉండి, నిరుద్యోగసమస్య శాశ్వతంగాఉండి, వాళ్ల జీవితాల్లో మంచి రోజులు రానే రావా, దేవుడు అనేవాడు ఉన్నడా, లేడా అని దేవుడినే నిందించుకునేలాంటి పరిస్థితిలో సాగునీరు లేదు, తాగు నీరు లేదు, పరిశ్రమలు లేవు, విద్యా అవకాశాలు లేవు. ఏవీ లేవు నా ప్రాంతానికి అధ్యక్షా. నేను ఒక మెడికల్ కాలేజీ తీసుకుంటే తప్పు పడతారు. నేనొక ఇంజనీరింగ్ కాలేజీ తీసుకుపోతే తప్పు పడతారు. ఒక పాలిటెక్నిక్ తీసుకుంటే తప్పు పడతారు, ఒక ఐటిఐ తీసుకుంటే తప్పు పడతారు. నేను రెండు జూనియర్ కాలేజీలు తీసుకుంటే తప్పు పడతారు. నేను నాలుగు రోడ్లకు నిధులు తీసుకుంటే, కొడంగల్‌కే తీసుకుంటారని తప్పుపడతారు. నేనొక 1300 ఎకరాల్లో .. కొడంగల్ శాసనసభ నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు లక్షల ఎకరాల్లో, నాలుగు గ్రామాల పరిధిలో, ఒక గ్రామం కూడా కాదు,

ఒక 1300 ఎకరాలు తీసుకుని, ఎందుకంటే both sides National Highways ఉన్నయి. strategic location. ఈ 1300 ఎకరాల్లో పరిశ్రమలు పెడితే ఒక ఇరవై వేల మందికో యాభై వేల మందికో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తే, వాళ్ల ఉద్యోగాలతో పాటు, చుట్టుముట్టు కొంత అభివృద్ధి జరిగితే, నా ప్రజలకు మేలు జరుగుతుంది,నేను ఏమయితనో, ఎక్కడ నుంచి వచ్చానో తెలవనప్పుడు నన్ను ఇంతగా అభిమానించి, నేను ఎలాంటివాడినో తెలవనప్పుడు 15 రోజులు గుండెల్లో పెట్టి చూసుకుని, భుజాల మీద మోసి 7,500 మెజారిటీతో నన్ను ఎమ్మెల్యేని చేస్తే, ఇయ్యాల నా చర్మం వొలిచి, చెప్పులు కుట్టించినా తక్కువే అధ్యక్షా. అట్లాంటిది నేను విశ్వాసంతోటి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి, అక్కడున్న నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఒక 1300 ఎకరాలు భూ సేకరణ చేస్తే, కోట్ల రూపాయలు పంపించి, మందు తాగించి... నా మీద దాడి చేయిస్తే నేను బాధపడకపోతుండె అధ్యక్షా. నాకిది కొత్త కాదు. ఎన్నో రకాలుగా దాడులు చేశారు. కాని అధికారులు ఏం పాపం చేశారు? అధికారులు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను అమలుచేస్తారు. పదేండ్లు ప్రభుత్వాన్ని నడిపినోడు, ఎవడన్నా తను ఇంత ఎదగడానికి పనిచేసిన రెవెన్యూ అధికారులను, మున్సిపల్ అధికారులను, ఐ.టి. అండ్ ఇండస్ట్రీ ఆ మహాత్ముడే వెలగబెట్టిండు. అధికారులు పోతే రాళ్లతో, రప్పలతో దాడులు చేయించి, చంపే ప్రయత్నం చేస్తే వీళ్లను ఏం చెయ్యాలి అధ్యక్షా, నువ్వు చెప్పు? వీళ్లకు కూర్చునే అర్హత ఉందా? నేను సూటిగాఅడుగుతున్నా. కొడంగల్‌లో పరిశ్రమలు పెట్టొద్దా? కొడంగల్‌లో నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇవ్వొద్దా? కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యొద్దా? మక్తల్ నారాయణపేట ఎత్తిపోతల ద్వారా, మీరు పదేళ్లు చుక్క నీళ్లివ్వకపోతే, మేము లక్ష ఎకరాలకు నీళ్లు తీసుకుపోవలసిన బాధ్యత నాకు లేదా? మా పిల్లలు మెడిసిన్ చదవొద్దా? మా పిల్లలు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ చదవొద్దా? దొరలు మీరే చదువుకుంటారా, పేదోళ్ల పిల్లలు చదువుకోవద్దా? 95 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలున్న నియోజకవర్గం నాది అధ్యక్షా, నా ప్రజలకు నేను చేయకపోతే నాకెందుకు అధ్యక్షా ఈ కుర్చీ? వీళ్లు అడ్డమొస్తే తొక్కుకుంటూ వచ్చానని అందుకే చెప్పాను అధ్యక్షా నేను. ఎందుకు చెప్పినా? నా ప్రాంతం అభివృద్ధికి అడ్డంపడితే, నా ప్రజలకు చేయడానికి అవకాశం వస్తే, అడ్డుపడతరా?

ఇవ్వాళ మూసీ అభివృద్ధి చేస్తామంటే అది వాళ్లు చేసిన ప్రతిపాదనే. Musi River Development Corporation పెట్టింది ఎవరు అధ్యక్షా? ఈ ఘనత వహించినాయన కదా పెట్టింది. దానికి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే ఒకర్ని ఛైర్మన్‌గా చేయలేదా? ఆయన కూడా మీ దోస్తే కదా. ఇవ్వాళ మూసీ ప్రక్షాళన అంటే వద్దంటున్నాడు. మెట్రో పొడిగిస్తామంటే వద్దన్నాడు. ఫ్యూచర్ సిటీ కడతామంటే వద్దన్నాడు. రీజినల్ రింగ్ రోడ్డు వేస్తామంటే వద్దన్నాడు. రేడియల్ రోడ్ చేస్తామంటే వద్దన్నాడు. రైతు రుణ మాఫీ చేస్తామంటే వద్దన్నాడు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామంటే వద్దన్నాడు. పిల్లలకు కాస్మాటిక్ చార్జీలు పెంచుతామంటే వద్దన్నాడు. కొడంగల్‌లో పరిశ్రమలు పెడతామంటే వద్దన్నాడు. ఇగ అన్నీ వద్దన్నాక, అధ్యక్షా, ఈ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే అదెట్లా సాధ్యం అధ్యక్షా?

2.10 మ. పరిశ్రమలు పెట్టొద్దంటివి, భూసేకరణ చేయొద్దంటివి, రోడ్లు వేయవద్దంటివి, రైళ్లు తీసుకురావొద్దంటివి, రీజనల్ రింగ్‌రోడ్ కట్టొద్దంటివి, రేడియల్ రోడ్స్ వేయొద్దంటివి, సాగునీటి ప్రాజెక్టులు కట్టొద్దంటివి, దొంగలకు సద్దులు మోయబడ్తివి. దొంగలకు సద్దులు మోసే ఉద్దేశం....., ఈవేళ మీరు ఇట్లా తయారైతే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంవైపు ఏ విధంగా నడుస్తుందో మీరు చెప్పండి? అధ్యక్షా. ఏం చేయాలి అధ్యక్షా నేను? ఇన్ని రకాలుగా తెలంగాణని అడ్డుకునే వాళ్లని ఏం చేయాలో సభలో ఉండే సభ్యులే కాదు, తెలంగాణ

సమాజం కూడా నాకు సూచన చేయాలి. నేను నల్లమల అడవుల నుండి వచ్చాను. క్రూరమృగాల మధ్యలో పెరుగుతూ వచ్చాను. తొక్కుకుంటూ వచ్చాను. ఉత్తగ రాలే. ఇక్కడికి ఉత్తగ రాలే. ఇక్కడ ఉన్న వాడిని తొక్కితే అక్కడికి తేలాను,అక్కడ తొక్కి ఇక్కడికి వచ్చాను. ఉత్తగ రాలే. అయ్య పేరు మీదనో, మామ పేరు మీదనో ఎవడి పేరు మీదనో చెప్పుకొని ఇక్కడికి రాలే అధ్యక్షా. స్వశక్తి మీద కష్టపడి.. వారు ఒక్కటే సభ చూశారు. నేను జిల్లా పరిషత్తు చూసాను. శాసన మండలి చూసాను. శాసన సభ చూసాను. లోక్‌సభ చూసాను. ఈ రోజు ముఖ్యమంత్రిగా వచ్చాను. వాళ్లు అమెరికాలో, ఆంధ్రలో, గుంటూరు విజ్ఞాన్‌లో చదువుకొన్న చావు తెలివితేటలు ఉండవచ్చు. నాకు సామాన్యుడి తెలివితేటలు ఉన్నాయి. రైతు బిడ్డను నేను. అడవుల్లో నుండి వచ్చాను. నేను ఉన్న దగ్గర పులులు ఉంటాయి. పులుల నుండి, సింహాల నుండి, మృగాల నుండి ఎట్ల బయట పడాలో నాకు తెలుసు. అల్లాటప్పగా రాలే. ఆషామాషీగా మాట్లాడితే, ఎందుకంటే ఈహోదా, ఈ బాధ్యత అంతా ప్రజల కోసం ఇచ్చింది. నా వ్యక్తిగతమైన కోప, తాపాలతో ఈ బాధ్యతను నెరవేర్చవద్దని చాలా ఓపికగా, చాలా మర్యాదగా, గౌరవంగా ఈరోజు ఉన్నాను. నేను ప్రతిపక్షాలను ఒక్కటే అడుగుతున్నాను. రీజనల్ రింగ్‌రోడ్ వేసుకుందామా వద్దా? రేడియల్ రోడ్లు వేసుకుందామా వద్దా? మన ఫ్యూచర్ సిటీని కట్టుకుందామా వద్దా? మూసీని నిర్మించుకుందామా, వద్దా? మెట్రో రైతులును పొడిగించుకుందామా, వద్దా? హైదరాబాదులో ఫ్లై ఓవర్లు కట్టుకుందామా, వద్దా? హైదరాబాదులో టన్నెల్స్ కట్టుకుందామా, వద్దా? అక్బరుద్దీన్ ఓవైసీ గారిని నేను రిక్వెస్ట్ చేస్తే హైదరాబాదు అభివృద్ధి కోసం Mr. Akbar Uddin Owaisi is very much concerned about Hyderabad's development. Sir, not today, time and again he has demanded for the development of Hyderabad right from Dr.Y.S. Rajasekhara Reddy to Sri N. Chandrababu Naidu, Sri K.Rosaiah to Sri N. Kiran Kumar Reddy and including Sri K. Chandra Sekhara Rao Governments. But, the then Governments, never reacted for the development of Old City. I had told clearly that it is not an Old City, this is an Original City. I have to develop the Original City. That is my commitment. That is what I am doing Sir. అక్కడ లండన్‌లోనుండి యాదృచ్ఛికంగా నేను వారిని రిక్వెస్ట్ చేసి తీసుకొనివెళ్లి మనం ప్రపంచ దేశాలలో జరిగిన అభివృద్ధిని చూసి మన రాష్ట్రాన్ని, మన నగరాన్ని మనం ఎట్లా అభివృద్ధి చేసుకుందాం, ప్రయత్నం చేసుకుందామని సహకారం అడిగాను. మన టీమ్‌ను సౌత్ కొరియాకు చూసి రమ్మని పంపించాను. వాళ్ల ఎంఎల్ఎలను ఒత్తిడి చేసి వెళ్లకుండా చేయించారు. నేను All Party committee తో అధికారులను పంపించాను. మా ఎంఎల్ఎలను పంపించలేదు. ఎందుకంటే ఇతర దేశాలలో జరిగిన అభివృద్ధిని చూడడం ద్వారా దుబారా తగ్గించడం ఎట్లా? ప్రపంచంతో పోటీ పడడం ఎట్లా? అనే విషయాలను తెలుసుకోవడం కోసం నేను కొన్ని దేశాలను తిరిగి వచ్చాను. సౌత్ కొరియాను తమరు, కౌన్సిల్ ఛైర్మన్ సుఖేందర్ రెడ్డిగారు, ఎంఎల్ఎలు వెళ్లి వచ్చారు. వాళ్ల ఎంఎల్ఎలు పోతామంటే ఆఖరి నిమిషంలో వారిని పోవద్దని ఒత్తిడి చేసి వారిని పోనివ్వలేదు అధ్యక్షా. నేను ఒకటే అడుగుతున్నాను. ఏం బుద్ధి ఇది అధ్యక్షా, ఏం బుద్ధి ఇది? ఇది మంచిదా తెలంగాణ రాష్ట్రానికి? ఇందుకోసమేనా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నది ? ఇందుకోసమేనా 1200 మంది విద్యార్థులు ప్రాణాలు త్యాగం చేసి అమరులై తెలంగాణ రాష్ట్రం సాధించుకుంటే ఆ సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకునే సోయి మనకు లేకపోతే, సోయి ఉన్నవాడు చేస్తుంటే, కాళ్లలో కట్టె పెట్టి, కాళ్లకి అడ్డం పడి ఇట్ల చేస్తే ఈ దుర్మార్గులను తెలంగాణ రాష్ట్రం క్షమిస్తుందా అధ్యక్షా మీరు చెప్పండి? ఈ ఆర్థిక ఉగ్రవాదులను తెలంగాణ సమాజం ఎంతకాలం భరించాలని నేను అడుగుతున్నాను అధ్యక్షా?అందుకే ఈరోజు రైతు భరోసా రైతుల కోసము, నగర అభివృద్ధి, ఉద్యోగాలు చేసుకునే విద్యార్థుల కోసము, విద్యను

పెంపొందించడం, సాంకేతిక నైపుణ్యం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఇవన్నీ వినూత్నమైన ఆలోచనలు. మీరు గతంలో స్పోర్ట్స్ స్టేడియంలు కడితే దేనికి ఇచ్చాడు అధ్యక్షా? నంబన్ పార్టీలకు ఇచ్చాడు అధ్యక్షా. డ్రగ్స్ తీసుకున్న పార్టీలకిచ్చాడు అధ్యక్షా. సిగ్గులేదు అధ్యక్షా. స్టేడియం క్రీడల కోసం నిర్మించిన గచ్చిబౌలీ స్టేడియంలో తాగి, ఊగడానికి ఎవరన్నా, బాధ్యత ఉన్నవాడు ఇస్తాడా అధ్యక్షా? అట్లాంటి పనులు చేసి మళ్లీ ఇక్కడికి వచ్చి వాదిస్తారు, ఇక్కడికి వచ్చి దబాయిస్తారు, ఏంది అధ్యక్షా ఇది? ఇవన్నీ కూడా నేను కోపంతో చెప్పడం లేదు. తెలంగాణ సమాజం ఆలోచన చేయాలి. అక్కడున్న మిగతా సభ్యులకు కూడా తెలంగాణ సమాజం పట్ల కొంత కమిట్‌మెంటు ఉన్నవాళ్లు ఆ పార్టీలో ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో, తప్పని పరిస్థితుల్లో రాజకీయ విధి లేని పరిస్థితుల్లో ఉండవచ్చు. అట్లాంటి వాళ్లసావాసం చేయకండి. వాళ్లు కేవలం దొంగలకు సద్దులు మోసేటోళ్లే. తెలంగాణ సమాజం కోసం పని చేసే వాళ్లు కాదు. అక్కడ ఉండే మా సహచరులు కొంత మంది ఆఖరి బెంచీలో నాకు కావలసిన వాళ్లు ఉన్నారు. వాళ్లకు తెలుసు వారి ఆవేదన, వారి బాధ. వాళ్లు కూడా మీకు తెలుసు అధ్యక్షా. విధి లేని పరిస్థితుల్లో అచేతనంగా వాళ్లు బాధపడుతున్నారు. ఎందుకంటే వారు ఈ నగరం వాళ్లు. ఇక్కడే పుట్టారు, ఇక్కడే పెరిగారు. ఈ నగరం అభివృద్ధి చెందితే వారి గౌరవం పెరుగుతుంది.

ఈరోజు ఈ నగర పరిస్థితి..... ఢిల్లీ చూశారు కదా? ఢిల్లీ కాలుష్యం వల్ల బడులు బంద్ అయ్యాయి. వ్యాపారాలు బంద్ అయ్యాయి. పార్లమెంట్ బంద్ అయ్యింది. అక్కడున్నవాళ్లందరూ ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. హైదరాబాద్ నగారాన్ని కూడా అట్లా చేసుకుందామా? నల్గొండ జిల్లా ఏం పాపం చేసింది? మా వెంకన్న పదే పదే మాట్లాడుతుంటే మీరు విన్నారు కదా? భూమిలో ఫ్లోరైడ్ ఉంటే ఆ ఫ్లోరైడ్ బాధితులు ఇప్పటికీ తరతరలుగా కాలు వంకర, నడుము వంకర, ఈవేళ బ్రతకలేని పరిస్థితి నల్గొండ జిల్లాలో ఉండే SLBC టన్నెల్ ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి ఆ నల్గొండ జిల్లాను బాగుచేయాలని ఈరోజు బ్రాహ్మణవెల్లంల, పిల్లాయిపల్లి కాలువ గానీ, ధర్మారెడ్డి కాలువ గానీ, ఈ ప్రాజెక్టులన్ని పూర్తి చేయాలని వాళ్లు కంకణం కట్టుకొని ప్రయత్నం చేస్తే పదేళ్లు SLBC ని పడావుబెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాడు 32 కిలోమీటర్లు టన్నెల్‌ను పూర్తి చేస్తే, 10 కిలో మీటర్ల టన్నెల్‌ను పూర్తి చేయకుండా నల్గొండకు అన్యాయం చేశారు. అన్యాయం అనొద్దు దీనిని ద్రోహం చేశారు. అక్కడున్న జగదీష్ రెడ్డిగారిని గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పమనండి వాళ్లు చేసింది కరెక్ట్ అని. 10 ఏండ్లు 10 కిలోమీటర్లు టన్నెలు త్రవ్వకపోవడం కేసీఆర్ గారి గొప్పతనం, మా పార్టీ సాధించిన విజయమని జగదీష్ రెడ్డిగారు చెప్పగలరా నల్గొండ ప్రజలకు? అని నేను అడుగుతున్నాను.

ఈవేళ ఈ నగరం నుంచి వెలువడుతున్న కాలుష్యం, పరిశ్రమల నుండి తీసుకొచ్చి పోస్తున్న కాలుష్యం, ఈరోజు ఫార్మా కంపెనీల నుండి మరియు ఇతర పరిశ్రమల నుండి వస్తున్న కాలుష్యం, ఇవే కాకుండా పశువుల కళేబరాలు, మనుషుల శవాలు కొట్టుకుపోయి ఈరోజు నల్గొండ ప్రజలు తెల్లారి లేస్తే ఏ శవాలను చూడవలసి వస్తుందోననే బాధతో ఈరోజు వారు భయంతో బ్రతుకుతున్నారు. ఈరోజు మూసీ పరివాహక ప్రాంతంలో పండించిన ఏ పంటను తినడం లేదు. నేను మొన్న వెళ్లినప్పుడు ఆడపిల్లల తల్లులు నా దగ్గరికి వచ్చి కొత్తగా పెళ్లి అయిన వాళ్లకు ఈ నీళ్ల వల్ల పిల్లలు కూడా పుట్టడం లేదు, వారు గర్భం దాల్చాలంటే కూడా భయం వేస్తుందని ఆడబిడ్డలు వచ్చి చెప్పారు. మూసీ ప్రక్షాళన చేస్తాము, మూసీలోకి మంచి నీళ్లను నల్గొండ జిల్లాకు పంపుదాము, ఆ నల్గొండ జిల్లాకు దేవుడు ఒక వేళ వారికి శాపం పెట్టినా, ఆ శాపాన్ని మనం కష్టపడి కడుక్కుందామంటే, మూసీ కట్టవద్దు, ఎట్ల కడతారో నేను చూస్తాను అంటాడా

దేవాలయ భూములు, వక్ఫ్ భూములు, వక్ఫ్ భూములు సాగుదారులకి ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలలో ఉండే అంబసత్రం లాంటి వారికి, వారందరికీ కూడా అవకాశం ఇచ్చే విధంగా రుణ గుర్తింపు కార్డు ఇచ్చి వారికి కూడా భరోసా ఇవ్వాలని నేను కోరుతున్నాను.

9,17,23 వరకు సాదా బైనామీలను అంగీకరించి వారందరికీ కూడా భరోసా ఇవ్వాలని నేను కోరుతున్నాను. సెక్షను 4ఎ లో సాగుదారులను గుర్తించి వారి హక్కులు కాపాడే విధంగా వారికి కూడా ఒక కాలమ్ ఏర్పాటు చేసి వారికి కూడా ఇవ్వాలని. ఇటువంటివన్నీ పోడు భూములు, బంచరాయి భూములు అటవీ భూములు, ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, అస్సైన్‌మెంట్ భూములు ఏ ఒక్కరూ మిస్ కాకుండా వారందరికీ ఇవ్వాలని కోరుతున్నాను. దానికొక మెకానిజం అవసరం ఉంటది. దాన్ని జాగ్రత్తగా చూసుకుని చేయాలని కోరుతున్నాను.

అటవీ ప్రాతం, రెవెన్యూ ప్రాంతం క్లాజ్‌లు బాగా వున్నాయి. అడవిలో ఉన్న వాళ్ళు అవి మావి అంటున్నారు, రెవెన్యూ వాళ్ళు అది మాది అంటున్నారు. అడవి వాళ్ళ వాయిస్ ఎక్కువ ప్రివేల్ అవుతుంది. అందువల్ల ఆ భూమి ఒకవేళ రైతులు సాగుచేసుకుంటున్నా సరే, వారికి ఎటువంటి బెనిఫిట్ లేదు. దాన్ని కూడా మీరు వెరిఫై చేసి చేయాలని కోరుతున్నాను.

అలాగే చెరువు తడకలు, భూదాన భూములు ఇటువంటివి 1971 లో పాసుపుస్తకాల చట్టం ప్రకారం సెక్షను – 26 ఉండేది. దానిలో కౌలు దారులు, సాగుదారులు, భూమి తాకట్టు పెట్టుకున్న వాళ్ళకు వీళ్ళకు కూడా అవకాశం ఉంది, అది ఇప్పుడు తీసేశారు. అది పెట్టి వాళ్ళకి కూడా అవకాశం ఇవ్వాలని నేను కోరుతున్నాను. జాగీరు భూములు మక్కాల పేరుతో అగ్రహారాలు, మకాషా ఇటువంటివన్నీ కూడా ఈరోజు పేదవారి చేతుల్లో ఉన్నాయి. వారికి కూడా ఇచ్చే విధంగా చేయాలని కోరుతున్నాను.

రైతుబీమాకి సంబంధించి ఈ రైతుబీమా అనేది నేను వార్తల్లో చదివే ఒక వార్త లాగా ఉంది అధ్యక్షా. నాకు తెలిసీ ఏ రైతుకీ కూడా, మరి ఎక్కడైందో తెలియదు కానీ, అప్పుడేదో రాయలసీమలో తీసుకున్నట్లు చెపుతారు. మా తుమ్మల గారైతే ఆయన పుట్టి పెరిగిందంతా వ్యవసాయమే కాబట్టి వారేమన్నా ఏర్పాటు చేస్తారేమో తెలవదు కానీ మా కొత్తగూడెం ప్రాంతంలో అయితే ఇంతవరకు రైతుబీమా పేరుతో ఏ రైతుకీ కూడా ఏదైనా పంటదెబ్బ తింటే ఒక్క రూపాయి కూడా అందినట్లు నేను వినలేదు.

శ్రీ కె.తారక రామారావు :-(మైకు లేకుండా) పంట బీమా..

శ్రీ కూనంనేని సాంబశివరావు :- సారీ పంట బీమా. పంట బీమాకి సంబంధించి.. ఇప్పటివరకీ నేను వినలేదు అధ్యక్షా. అంటే కారణం ఏంటి? దానికి మళ్ళీ లోన్లు ఇచ్చేటప్పుడు తీసుకుంటూ ఉంటారు, కానీ ఇంతవరకూ ఇవ్వలేదు. దాన్ని సరిచేయాల్సిన అవసరం ఉంది. దాన్ని ఎలా సరిచేస్తారో. అంటే రైతుకు కొద్దిగా ఆదాయం పెరిగే మార్గాలు ఇవన్నీ. ఆ బీమాని సరిచేస్తూ కరువు బీమా అనేది లేదు అధ్యక్షా. అంటే పంటపండి దెబ్బ తింటేనే బీమా. అసలు పంటే పండలేదు అనుకోండి. కరువు వచ్చింది వారికి ఏ సౌకర్యం లేదు. కరువు వచ్చినపుడు ఏ సౌకర్యం లేదు. అందుకని అసలు పంటే వేయనప్పుడు ఏదో కరువు భత్యం అంటారు. దానిబదులు ఒక బీమా లాగా దానికి కూడా ఒక అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని నేను మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఆఖరుగా సబ్సిడీకి సంబంధించి ఒక్కమాట చెప్పి నేను సెలవు తీసుకుంటాను. మనకు సంబంధించి ఇంతకుముందు చాలా రకాల సబ్సిడీలు ఉండేవి. ప్రీమియం సబ్సిడీ, పంట రుణాలపై వడ్డీల రాయితీ సబ్సిడీ, సూక్ష్మనీటి పరికరాల సబ్సిడీ, ఉద్యాన పంటకు సబ్సిడీ ఇంకా పంటల బీమా లాంటివి ఉండేవి. ఇప్పుడు ఏ సబ్సిడీలు లేవు అధ్యక్షా. అన్ని సబ్సిడీలు తీసేస్తున్నారు. ఇప్పుడు రైతులు ఎరువులు కొనుక్కోవాలన్నా, ఇన్‌పుట్స్ కొనుక్కోవాలి అన్నా అవన్నీ విపరీతంగా ధరలు పెరుగుతున్నాయి. ఇంతకు ముందు చెప్పినట్లుగా, మనల్ని దోపిడీ చేస్తారు మన సంతోషం కోసం జేబులో పెడతారనే పద్ధతిగా ఉంది. ఆ విధంగా ఇప్పుడు నేను చెప్పిన ఇన్‌పుట్ సబ్సిడీ ఇటువంటివన్నీ కూడా తిరిగి పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉంది అధ్యక్షా.

దీనికి నేను ఒక్క పాయింట్ చెప్పి సెలవు తీసుకుంటాను. ఇప్పుడు బాగా అభివృద్ధి చెందిన దేశాలలో కూడా సబ్సిడీ ఎలా ఇస్తున్నారంటే జపాన్‌లో 90%, అమెరికాలో 80%, యూరప్‌లో 48%, కొలంబియాలో 61%, చైనాలో 37%, పాకిస్తాన్‌లో 26% ఇస్తున్నారు. మనకి మాత్రం కేవలం 3% మాత్రమే సబ్సిడీ భారతదేశంలో ఉంది అధ్యక్షా.

అలాగే 2009వ సంవత్సరం నాటికి 1లక్ష 19 వేల కోట్ల రూపాయలు మనకి రాయితీలు ఉంటే ఈరోజు కేవలం ఐదారువేల కోట్ల వరకే రాయితీ పడిపోయింది. అంటే వ్యవసాయ రంగాన్ని ఈ విధంగా పైనుంచి క్రింద వరకు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది కేవలం బోనస్ ఉండొద్దు అని నేను అనడం లేదు. బోనస్ ఉండాల్సిందే. ఈ బోనస్‌తోనే సంతృప్తి పడమని, మిగిలిన పద్ధతుల్లో మొత్తం ఈరోజు కార్పోరేటు సంస్థలకు ఆ విధంగా దోపిడీ చేసి పెడతా వుంటే ఇక ఈ దేశంలో ఆత్మహత్యలు కాకుండా ఆపడం ఎవరి తరం కాదు.

3.30 సా. కాకపోతే ఆ సంఖ్యని కొద్దిగా తగ్గించవచ్చు. రైతు భరోసా పేరుతో కొంత, బోనస్ పేరుతో కొంత ఇవ్వండి. కాని గౌరవ ప్రదమైన జీవితం ఉండాలి. రైతు కొడుక్కి కూడా పిల్లనివ్వొచ్చు, రైతు అనేవాడు సమాజంలో ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో బ్రతుకుతాడు అనే ఒక empowerment, సాధికారత కల్పించాలి. ఆ విధంగా రైతు జీవితం ఉండాలని చెప్పి, ఆ విధమైన చర్యలు తీసుకోవాలని

నేను కోరుతూ, నేను చెప్పిన అన్ని సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని,అందరికీ న్యాయబద్ధంగా, సాధ్యమైన మేరకు ఇవ్వాలని కోరుతూ, ఈ రైతుబంధు ఇచ్చే విషయంలో ఫారెస్టులు, గుట్టలు, కొండలు, రియల్ ఎస్టేట్ వాళ్లు, వాళ్లు కూడా నవ్వుతున్నారు, మా కెందుకని. అది మాత్రం మీరు విడగొడితే, మీకు చాలా కలిసొస్తుంది. ఈ సలహా, మా పార్టీ తరపున, ఒక ఎమ్మెల్యేగా నేను చెబుతూ, మీకు ధన్యవాదాలతో, సెలవు తీసుకుంటున్నాను.

డా. టి. రామ్మోహన్ రెడ్డి (పరిగి) :- ధన్యవాదాలు అధ్యక్షా. Our Telangana Government is marching towards good governance under our dynamic Chief Minister, Sri Revanth Reddyji. రాహుల్ గాంధీగారు మొన్నీ మధ్య హైదరాబాద్‌కి వచ్చినప్పుడు తెలంగాణానే మన దేశానికి రోల్ మోడల్ అని చెప్పడం జరిగింది. అంటే మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఏ విధంగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న దానికి అది ఒక సంకేతం అధ్యక్షా. మన రాష్ట్రంలో, మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఇచ్చిన మాటకి కట్టుబడి ఆరు పథకాలను అమలుచేస్తున్న తీరుతెన్నులను చూసి, మన తెలంగాణ రాష్ట్రాన్ని గర్వకారణంగా, రోల్‌మోడల్‌గా తీసుకోవాలని రాహుల్ గాంధీగారు మనందరి సమక్షంలో చెప్పడం జరిగింది. ఇది చాలా సంతోషించదగ్గ విషయం అధ్యక్షా. గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు మరియు డెప్యూటి సిఎం భట్టి విక్రమార్కగారు ఒక సబ్ కమిటీ వేసి, ఆ సబ్ కమిటీ ద్వారా ఈ రైతు భరోసాపథకం ఏ విధంగా ఉండాలి, రాష్ట్రప్రజలు వ్యవసాయం దండుగ అనే రోజుల నుండివ్యవసాయం పండుగ అని భావించాలంటే ఏ విధంగాచెయ్యాలి అని ఒక కేబినెట్ సబ్ కమిటీ వేసి, జిల్లాలకు, నియోజక వర్గాలకు పంపించి, అక్కడ ఉండే రైతులు, స్టేక్‌హోల్డర్స్ అందరితో కూడా మాట్లాడి, వారందరి అభిప్రాయాలను సేకరించి తొందరలోనే, మనం ఎన్నికల సమయంలో ఏదైతే ఆరు గ్యారెంటీలలో భాగంగా రైతు భరోసా క్రింద, ఎకరానికి పదిహేను వేల రూపాయలు, సంవత్సరానికి ఇస్తామని చెప్పినమో, దానిని కచ్చితంగా నెరవేరుస్తామనే విషయాన్ని కూడా గర్వంగా చెబుతున్నాను. అదే విధంగా చాలా ప్రాంతాల్లో, బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మైనింగ్ భూముల్లో రైతుబంధు లూటి, రాళ్లు రప్పలు ఉన్నటువంటి భూముల్లో రూ.22 వేల కోట్లు లూటీ చేశారని పేపర్లలో వార్తలు రావడం మనందరికీ తెలిసిన విషయమే. అదే విధంగా ఫేక్ పాస్‌బుక్కులు సృష్టించి, బిఆర్ఎస్ ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయలు దండుకున్నారు. ఈ విధంగా ఎన్నో వార్తలు వచ్చినప్పటికీ,అజాగ్రత్తతో, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసినందుకు, ముఖ్యంగా కేసిఆర్ దానికి బాధ్యత వహించాలి. ఆరోజు తను ముఖ్యమంత్రిగా ఉండి, ఎందుకు ఈ విధంగా లూటీ చేయడానికి సహకరించిండు, లేకపోతే బాధ్యతారహితంగా ఉన్నారో, దానికి శాసనసభకు వచ్చి, సమాధానం చెప్పవలసిన బాధ్యత ఉంది అధ్యక్షా. దీనిని రికవరీ చేసే బాధ్యతను కూడా తనకే అప్పచెప్పవలసిందిగా నేను వ్యవసాయ శాఖ మంత్రిగారిని కోరుతున్నాను.

ఎందుకంటే కష్టపడి పనిచేసే రైతుకి మనం ఈరోజు సన్న వడ్ల క్రింద మనం వేల కోట్ల రూపాయలిస్తున్నాం. నేను ఒక రైతు బిడ్డగా,ఏ గ్రామానికి, ఏ ఊరికి వెళ్లినా కూడా చెబుతున్నారు. సన్న వడ్లకు ఐదు వందల రూపాయలు బోనస్ ఇస్తామని మీరేదైతో చెప్పారో అది ఇస్తున్నారు. దాని మూలంగా ఒక్కొక్క రైతుకి 25 వేల నుండి 50 వేల రూపాయల వరకు, కొంతమందికి 75 వేల రూపాయలు కూడా డబ్బులు వారం రోజుల్లో పడ్డాయన్న విషయాన్ని, వాళ్లు నాకు ఆన్‌లైన్‌లో పడినటువంటి విషయాన్ని బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకాన్ని తీసుకొచ్చి చూపించిన్రు అధ్యక్షా. మరి వీళ్లు సభలో మాట్లాడుతున్నారు అదేదో పడటం లేదన్నట్లుగా. ఎవరికీ పడలేదన్నట్లుగా. ఈ విధంగా బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు. మా గౌరవ ముఖ్యమంత్రిగారు ఇప్పుడు చాలా క్లారిటీగా,అసలు ఎంతమందికి రైతుబంధు

వేసినం, రైతులకు భరోసాను ఇవ్వడానికి ఎంతమందికి డబ్బులు ఇచ్చినాం అనే విషయాల గురించి స్పష్టంగా తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మొత్తం 25,30,967 మంది రైతుల ఖాతాలకి రూ.20,616.80 కోట్ల డబ్బును జమచేయడం జరిగింది అధ్యక్షా. ఇది అక్షర సత్యం. నియోజక వర్గాల వారీగా వాటి వివరాలు ఏమిటంటే...

అచ్చంపేట నియోజకవర్గంలో రైతులు 34,518 మంది ఉంటే, వారికి రూ. 296.61 కోట్లు ఇవ్వడం జరిగింది. ఆదిలాబాద్‌లో రైతులు 14,129 మంది ఉంటే, వారికి రూ. 157.32 కోట్లు చెల్లించడం జరిగింది. ఆలేరులో రైతులు 30,149 మంది ఉంటే, వారికి రూ. 235.70 కోట్లు ఇవ్వడం జరిగింది. అలంపూర్‌లో రైతులు 27,695 మంది ఉంటే వారికి రూ. 228.83 కోట్లు ఇవ్వడం జరిగింది. ఆంథోల్ నియోజకవర్గంలో రైతులు 37,258 మంది ఉంటే, వారికి రూ. 300.26 కోట్లు ఇవ్వడం జరిగింది.

ఆర్మూరు నియోజకవర్గానికి చెందిన రైతులు 12,472 మంది ఉంటే, వారికి రూ. 102.34 కోట్లు ఇవ్వడం జరిగింది. అసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన రైతులు 28,272 మంది ఉంటే, వారికి రూ. 263.59 కోట్లు ఇవ్వం జరిగింది. అశ్వారావుపేట నియోజకవర్గంలో రైతులు 14,615 మంది ఉంటే, వారికి రూ. 102.01 కోట్లు ఇవ్వడం జరిగింది. బాల్కొండ నియోజకవర్గంలో రైతులు 15,849 మంది ఉంటే, వారికి రూ. 139.11 కోట్లు ఇవ్వడం జరిగింది. బాన్సువాడ నియోజకవర్గంలో రైతులు 22,728 మంది ఉంటే, వారికి రూ. 140.30 కోట్లు ఇవ్వడం జరిగింది. బెల్లంపల్లి నియోజకవర్గంలో రైతులు 18,207 మంది ఉంటే, వారికి రూ. 168.95 కోట్లు ఇవ్వడం జరిగింది. భద్రాచలం నియోజకవర్గంలో రైతులు 11,422 మంది ఉంటె, వారికి రూ. 77,084 కోట్లు ఇవ్వడం జరిగింది. భువనగిరి నియోజకవర్గంలో రైతులు 18,423 మంది ఉంటె వారికి రూ.144.26 లక్షలు ఇవ్వం జరిగింది. భూపాలపల్లి నియోజకవర్గంలో రైతులు 22,638 మంది ఉంటే, వారికి రూ. 242 కోట్లు ఇవ్వడం జరిగింది. బోథ్ నియోజకవర్గంలో రైతులు 29,821 మంది ఉంటే, వారికి రూ. 317.84 కోట్లు ఇవ్వడం జరిగింది. బోధన్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య .. 19,429 మంది ఉంటే, వారికి రూ. 125.40 కోట్లు ఇవ్వడం జరిగింది. చెన్నూరు నియోజక వర్గంలో రైతులు 17,956 మంది ఉంటే, వారికి రూ. 158.54 కోట్లు ఇవ్వడం జరిగింది.చేవెళ్ల నియోజక వర్గంలో రైతులు 22,380 మంది ఉంటే, వారికి రూ. 160.56 కోట్లు ఇవ్వడం జరిగింది. చొప్పదండి నియోజకవర్గంలో రైతులు 27,230 మంది కాగా, వారికి రూ. 217.50 కోట్లు ఇవ్వడం జరిగింది. దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన రైతులు 29,530 కాగా, వారికి రూ. 223.26 కోట్లు చెల్లించడం జరిగింది. దేవరకొండ నియోజకవర్గంలో రైతులు 38,110 మంది రైతులకు రూ. 333.09 కోట్లు చెల్లించడం జరిగింది. ధర్మపురి నియోజకవర్గంలో రైతులు 32,227 మంది రైతులకు గాను, రూ. 236.49 కోట్ల చెల్లింపులు జరిగాయి. డోర్నకల్ నియోజకవర్గంలో రైతులు 25,879 కాగా, వారికి రూ.234.72 కోట్ల చెల్లింపులు జరిగాయి. దుబ్బాక నియోజకవర్గంలో రైతులు 34,651 కాగా, వారికి రూ. 268.43 కోట్లు చెల్లింపులు జరిగినాయి. గద్వాల నియోజకవర్గంలో రైతులు 23,493 మంది కాగా, వారికి రూ. 211.91 కోట్లు చెల్లించడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రిగారి నియోజకవర్గమైన గజ్వేల్ నియోజక వర్గంలో 28,166 మంది రైతులకు గాను, రూ. 216.78 కోట్లు చెల్లించడంజరిగింది. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రైతులు 31,735 కాగా, వారికి రూ. 282.74 కోట్లు చెల్లించడం జరిగింది.హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులు 34,767 కాగా, వారికి రూ. 286.26 కోట్లు చెల్లించడం జరిగింది.

హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 26,049 కాగా, వారికి రూ.200.72 కోట్లు, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన రైతులు 28,483 కాగా, వారికి రూ.201.45 కోట్లు చెల్లించడం జరిగింది ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన రైతుల సంఖ్య 13,656 కాగా, వారికి రూ.96.25 కోట్లు చెల్లించడం జరిగింది.జడ్చర్ల నియోజకవర్గంలో రైతుల సంఖ్య 28,615 కాగా, వారికి రూ.233.87 కోట్లు చెల్లించడం జరిగింది. జగిత్యాల నియోజక వర్గంలో రైతుల సంఖ్య 15,530 కాగా, వారికి రూ.118.93 కోట్లు చెల్లించడం జరిగింది. జనగామ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 26,226, వారికి చెల్లించిన మొత్తం రూ. 240.30 కోట్లు. జుక్కల్ నియోజకవర్గంలో రైతులు 29,573 కాగా, వారికి రూ.220.56 కోట్లు చెల్లించడం జరిగింది. కల్వకుర్తి నియోజకవర్గంలో రైతులు 36,977 కాగా, వారికి రూ. 305.75 కోట్లు చెల్లించడం జరిగింది.

కామారెడ్డి నియోజకవర్గంలో రైతులు 23,495 మంది కాగా, వారికి రూ.175.13 కోట్లను చెల్లించడం జరిగింది. కరీంనగర్ నియోజకవర్గంలో రైతులు 4,629 మంది కాగా, వారికి రూ. 31.85 కోట్లు చెల్లించడం జరిగింది. ఖమ్మం నియోజకవర్గంలొ రైతులు 4959 కాగా, వారికి రూ.38.37 కోట్లు, ఖానాపూర్ నియోజకవర్గంలో రైతులు 26,777 మంది కాగా, వారికి రూ. 24043 కోట్లు, మరియు కోదాడ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 28,368 కాగా, వారికి ప్రభుత్వం రూ.186.54 కోట్లను చెల్లించడం జరిగింది అధ్యక్షా.

3.40 సా. కొడంగల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 34,683 కాగా, వారికి ప్రభుత్వం రూ. 279.49 కోట్లను చెల్లించడం జరిగింది అధ్యక్షా. అది గౌరవ ముఖ్యమంత్రిగారి నియోజకవర్గమైన, ముఖ్యమంత్రిగారి కంటే ఎక్కువ డబ్బులు రైతుల ఖాతాల్లో, అపొజిషన్ వారి ఖాతాల్లో, శాసన సభ్యుల ఖాతాల్లో ఈరోజు జమ అయ్యాయంటే ఇది మన ముఖ్యమంత్రిగారి పాలనా దక్షతకు నిదర్శమని చెప్పవచ్చు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 32,308 కాగా, వారికి ప్రభుత్వం రూ. 253.23 కోట్లను చెల్లించడం జరిగింది అధ్యక్షా. కోరుట్ల నియోజకవర్గంలో రైతుల సంఖ్య 14,993 కాగా, వారికి ప్రభుత్వం రూ. 122.31 కోట్లను జమ చేయడం జరిగింది. కొత్తగూడెం నియోజకవర్గంలో రైతుల సంఖ్య 6,431కాగా, వారికి ప్రభుత్వం రూ. 48.23 కోట్లను జమ చేయడం జరిగింది. మధిర నియోజకవర్గంలో రైతుల సంఖ్య 30,299 కాగా, వారికి ప్రభుత్వం రూ. 208.28 కోట్లను జమ చేయడం జరిగింది. మహబూబాద్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 21,296 కాగా, వారికి ప్రభుత్వం రూ. 177.02 కోట్లను జమ చేయడం జరిగింది. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 9,804 కాగా, వారికి ప్రభుత్వం రూ. 71.82 కోట్లను జమ చేయడం జరిగింది. మహేశ్వరం నియోజకవర్గంలో రైతుల సంఖ్య 8,245 కాగా, వారికి ప్రభుత్వం రూ. 60.06 కోట్లను జమ చేయడం జరిగింది. మక్తల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 28,405కాగా, వారికి ప్రభుత్వం రూ. 267.55 కోట్లను జమ చేయడం జరిగింది. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో రైతుల సంఖ్య 2కి గాను, వారికి ప్రభుత్వం రూ. 1 లక్షను జమ చేయడం జరిగింది. మానకొండూర్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 28,747 గాను, వారికి ప్రభుత్వం రూ. 223.11 కోట్లను జమ చేయడం జరిగింది. మంచిర్యాల నియోజకవర్గంలో రైతుల సంఖ్య 14,455 గాను, వారికి ప్రభుత్వం రూ. 101.66 కోట్లను జమ చేయడం జరిగింది. మంత్రిగారి నియోజకవర్గమైన మంథనిలో 22,660 గాను, వారికి ప్రభుత్వం రూ. 183.57 కోట్లను జమ చేయడం జరిగింది. మంత్రిగారి నియోజకవర్గమైనా, ఏ నియోజకవర్గమైనా తేడాల్లేవు అధ్యక్షా. మెదక్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 30,881 గాను, వారికి ప్రభుత్వం రూ. 219.53 కోట్లను జమ చేయడం జరిగింది.

మేడ్చల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 3,949 గాను, వారికి ప్రభుత్వం రూ. 23.59 కోట్లను జమ చేయడం జరిగింది. మిర్యాలగూడ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 21,976 గాను, వారికి ప్రభుత్వం రూ.158.10 కోట్లను జమ చేయడం జరిగింది. ముథోల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 32,389 గాను, వారికి ప్రభుత్వం రూ. 308.89 కోట్లను జమ చేయడం జరిగింది. ములుగు నియోజకవర్గంలో రైతుల సంఖ్య 21,054 గాను, వారికి ప్రభుత్వం రూ.172.38 కోట్లను జమ చేయడం జరిగింది. మునుగోడు నియోజకవర్గంలో రైతుల సంఖ్య 36,713 గాను, వారికి ప్రభుత్వం రూ. 317.69 కోట్లను జమ చేయడం జరిగింది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 34,520 గాను, వారికి ప్రభుత్వం రూ.281.22 కోట్లను జమ చేయడం జరిగింది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 30,549 గాను, వారికి ప్రభుత్వం రూ.255.43 కోట్లను జమ చేయడం జరిగింది. నకిరేకల్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 29, 638 గాను, వారికి ప్రభుత్వం రూ. 245 కోట్లను జమ చేయడం జరిగింది. నల్గొండ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 17, 763 గాను, వారికి ప్రభుత్వం రూ. 149.33 కోట్లను జమ చేయడం జరిగింది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో రైతుల సంఖ్య 32,507 గాను, వారికి ప్రభుత్వం రూ. 265.90 కోట్లను జమ చేయడం జరిగింది. నారాయణపేట నియోజకవర్గంలో రైతుల సంఖ్య 27,844 గాను, వారికి ప్రభుత్వం రూ. 223.36 కోట్లను జమ చేయడం జరిగింది. నా పరిగి నియోజకవర్గంలో రైతుల సంఖ్య 30,376 గాను, వారికి ప్రభుత్వం రూ. 295.01 కోట్లను మాఫీ కావడం జరిగింది.

దేశ చరిత్రలో తెలంగాణలో విమానం, ప్రమాణం అంటారు. ఇక్కడ ఉన్న శాసన సభ్యులందరినీ కోరేదేమంటే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరేడు నెలల్లో ఆగస్టు 15 కల్లా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు రెండు లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి ఒకొక్క నియోజకవర్గానికి దాదాపు రెండు వందల కోట్ల నుండి మూడు వందల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేసిన చరిత్ర మన భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయాని విధంగా మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు మాఫీ చేశారని, ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతుంటే, ఇక్కడ కూర్చున్న ప్రతిపక్ష సభ్యులు ఇప్పటి వరకు మాట్లాడిన కేటీఆర్, హరీష్‌రావు గానీ ఏ విధంగా మాట్లాడారు అధ్యక్షా? మనం అసలు రుణమాఫీ చేయలేదు అన్నట్లుగా వారు చేసిన రుణమాఫీ చారాణా, చారాణా, చారాణా చేసి ఆఖరికి చారాణా ఎగ్గొట్టి ప్రభుత్వం రాగానే ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన రెండు, మూడు సంవత్సరాలకు ప్రారంభించి, వారు ఇచ్చిన రుణమాఫీ వడ్డీ మాఫీ క్రిందకే పోయింది తప్ప రుణమాఫీ కానే కాలేదు. ఇది ప్రజలంతా గమనిస్తున్నారు అధ్యక్షా. వారి ఖాతాలన్నీ ఈరోజు ఎన్‌పిఏ అకౌంట్స్ అయిపోయి ఏ బ్యాంకరు కూడా లోనివ్వని విధంగా రైతులందరిని ఈరోజు పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టారు. కేసీఆర్ నేత్రృత్వంలో ఆయన పదేళ్ల పాలనలో మన తెలంగాణ రాష్ట్ర రైతులందరూ కూడా అధోగతి పాలైతే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు రైతులకు రైతు భరోసా కార్యక్రమం ద్వారా రైతు రుణ మాఫీ చేయడమే కాకుండా, ఆ గ్రామాలలో ఉన్న రికార్డులను సరిచేయాలని తెలంగాణ భూ భారతి పేరు మీద చట్టాన్ని మనం నిన్ననే అమలు చేసుకున్నాము అధ్యక్షా. దాని మూలంగా ఎవరికైతే తప్పుడు రికార్డులుండి, రైతు రుణమాఫీ జరగని వారు, వారి రికార్డులన్ని కూడా ఇప్పుడు పర్‌ఫెక్ట్ అయిపోయి భవిష్యత్తులో వారికి కూడా మనం రైతు భరోసా ఇచ్చే విధంగా అవకాశం కల్పించడం జరిగింది అధ్యక్షా. భూ భారతి చట్టం రాకముందు గతంలో ధరణీ రికార్డులో అన్ని తప్పుడు రికార్డులు పెట్టి, అన్ని తప్పుడు కాగితాలు సృష్టించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారు..., ఈరోజు మనం పారదర్శకంగా ఒక మంచి

ప్రభుత్వాన్ని తీసుకొని వచ్చి ఎవరైతే గతంలో పొందలేకపోయారో వారందరికీ భవిష్యత్తులో పథకాలు వచ్చే విధంగా చేసి.., గ్రామాలలో ఇండ్లు లేనివాళ్లు, గుడిసె ఉన్నవాళ్లు, మా పరిగి నియోజకవర్గంలో బండల ఇండ్లు, పెంకుటిళ్లు ఉంటాయి. మొన్ననే మన తుమ్మల నాగేశ్వర రావు గారు మా పరిగి వచ్చారు.

మిస్టర్ స్పీకర్ :- రామ్మోహన్ రెడ్డిగారు కంక్లూడ్ చేయండి.

డా. టి. రామ్మోహన్ రెడ్డి :- మా పరిగిలో గతంలో 42 వేల ఇండ్లు కాంగ్రెస్ గవర్నమెంట్‌లో శాంక్షన్ చేయించి కట్టిస్తే కేసీఆర్ గారు సిఐడి విచారణ చేపించారు. మాదగ్గర బండెంచర్ల గ్రామానికి, ఇప్పపల్లి గ్రామానికి సిఐడి పోలీసులొచ్చారు. అదేదో వాళ్లు దోచుకున్నట్లుగా, అక్కడికి వచ్చి పరిస్థితి చూసి రిపోర్టు ఇస్తే అది బండ్ చేశారు అధ్యక్షా. గత కేసీఆర్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ కారణంతో ప్రతి ఇంటికి ఎస్సీ, ఎస్టీలకి రూ.6 లక్షలు, బీసీలు, ఇతరులకు రూ. 5 లక్షలతో వారికి పక్కా ఇండ్లు కట్టించే పథకాన్ని ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ఆల్‌రెడి మన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిగారు మొన్ననే మన యాప్ ద్వారా ముఖ్యమంత్రి గారి ద్వారా ప్రారంభింపచేశారు. ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గానికి అది ప్రతిపక్షమైనా, పాలక పక్షమైనప్పటికీ 3500 ఇండ్లను ప్రతి సంవత్సరం ఇవ్వడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇండ్లను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పూనుకున్నామని తెలియజేస్తున్నాను.

ఇవే కాకుండా ఇంకా 6 పథకాలలో భాగంగా చెప్పిన విధంగా మహిళలకు గ్యాస్ సిలెండర్లు ఇచ్చాము. గ్రామాలలో ఉండే ఇండ్లన్నింటికీ 90 శాతం కరెంట్ ఉచితంగా ఇస్తున్నాము. 90 శాతం మందికి ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించకుండా మనం 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటును ఇస్తున్నాము. వాళ్లంతా గ్రామాలలో ఉండే రైతులు అధ్యక్షా. ఈ విధంగా గ్రామాలన్నింటిని ఆదర్శ గ్రామాలుగా చేసి మన గౌరవ ముఖ్యమంత్రి రేవంతి రెడ్డిగారు ప్రజాపాలన కొనసాగిస్తున్న సందర్భంలో ఈ కేటీఆర్, హరీష్ రావు 1000 మందిని సోషల్ మీడియా టీమ్‌ను పెట్టుకొని మన ప్రభుత్వం పైన అబద్ధపు ప్రచారాలు చేస్తూ, ప్రజల్లో అభూత కల్పనను సృష్టిస్తున్నారు.

లగచర్లలో ఒక సురేష్ అనే సోషల్ మీడియా ఫిల్మ్ ప్రొడ్యూసర్, మణికొండలో కోట్ల రూపాయల ఇంటిలో ఉంటాడు అధ్యక్షా. ఆయనకు డబ్బులిచ్చి ఒక కొత్త నాటకానికి తెర లేపారు. ముఖ్యమంత్రిగారి అల్లుడని ఇంతకు ముందు కేటీఆర్ గారు మాట్లాడారు. అదాని గురించి భూసేకరణ చేస్తున్నారని మాట్లాడారు. వారికి దమ్ము, ధైర్యం ఉంటే నిరూపించాలి అధ్యక్షా.

3.50 సా. వారికి మన వికారాబాద్ ప్రాంతానికి రూ.15 వేల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చి, దాదాపు 30 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని మన గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రయత్నిస్తుంటే, వీరు అన్ని అడ్డుకట్టలు వేస్తున్నారు. మన దగ్గర ఉన్న ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టును డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు శంఖుస్థాపనచేయించుకుంటే, కేసీఆర్ ప్రభుత్వం రాగానే రద్దు చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు మన జిల్లాలో ఎక్కడా జరగలేదనే విషయం మీకు తెలుసు.

మన రంగారెడ్డి జిల్లా అంటే గుండెకాయ అధ్యక్షా. తెలంగాణ రాష్ట్రం వెలిసిదంటే, మన రంగారెడ్డి జిల్లాలోని పనరుల వల్లనే అధ్యక్షా. మనకు రావలసిన రైల్వే లైనును అడ్డుకున్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తరువాత రైల్వే అధికారులను మన కార్యాలయానికి, అసెంబ్లీకి పిలిచి, రైల్వే లైన్ వికారాబాద్ నుండి పరిగి, కొడంగల్, నారాయణఖేడ్, మక్తల్‌కు శాంక్షన్ చేయాలని పూనుకున్నారు.

అదే విధంగా నా నియోజకవర్గంలోని పూడూరులో రూ. 3 వేల కోట్లతో, 3 వేల మందికి ఉద్యోగాలు రావాలి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు అడ్డుకుంటే, గౌరవ ముఖ్యమంత్రి గారు నేవీకి భూమిని కేటాయించి, నేవీ ప్రాజెక్టును మీరు నేను అందరం వెళ్ళి ప్రారంభించాము. ఆ ప్రాజెక్టు పనులు శరవేగంగా నడుస్తున్నాయి. అదే విధంగా అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నాలుగులైన్ల రహదారి.., గత పది సంవత్సరాల కాలంలో పనులు ప్రారంభించలేదు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 27వ తేదీన ఆర్డర్ తీసుకొని 28వ తేదీన పనులు ప్రారంభించడం జరిగింది అధ్యక్షా. ఈ విధంగా మన జిల్లాన్ని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంవైపు తీసుకెళతుంటే, ఓర్వజాలక అన్ని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. గతంలో మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రాణహిత చేళ్ళలో డబ్బులు మెక్కేశారని హరీష్ రావు గారు చెప్పారు. నువ్వు ప్రూవ్ చేసినట్లైతే నేను పరిగికి రాజీనామా చేస్తానని నేను ఛాలెంజ్ చేశాను అధ్యక్షా. అదే ప్రాంతానికి మీరు అడ్వాన్స్ ఇచ్చారు.

మిస్టర్ స్పీకర్ :- ప్లీజ్ కన్క్లూడ్ చేయండి.

డా. టి. రామ్మోహన్ రెడ్డి :- వారెవరూ మా దగ్గర లేరని అంటే, వారు ఆ రోజు అధికారంలో ఉండి మాట్లాడలేదు. ఈ విధంగా అబద్ధాలను బట్ట కాల్చి మీద వేసే కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్ధాల ప్రచారం చేస్తున్నారు. కాబట్టి, భవిష్యత్తులో వారికి మాట్లాడేందుకు ఎక్కువ సమయాన్ని ఇవ్వకండి అధ్యక్షా. (సభలో నవ్వులు) ఎందుకంటే మొత్తం అబద్ధాలే చెబుతున్నారు. మీరేమో ప్రతిపక్ష పార్టీ అని కొద్దిగా సాఫ్ట్ కార్నర్ చూపిస్తున్నారు కాని, దీని మూలంగా మొత్తం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారనే విషయాన్ని తమ ద్వారా తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను. జై జవాన్, జై కిసాన్!

మిస్టర్ స్పీకర్ :- కృష్ణ మోహన్ రెడ్డి గారూ, రెండు నిమిషాల్లో ముగించండి.

శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల్) :- ధన్యవాదాలు అధ్యక్షా. రైతు భరోసా మీద చర్చ పెట్టినందుకు గౌరవ మంత్రి వర్యులకు ధన్యవాదాలు. ఎందుకంటే వరి ధాన్యం సన్న రకాలకు రూ.500/– బోనస్ ఇవ్వడం వల్ల రైతులకు కొంత మేలు జరుగుతోంది. అదే విధంగా రైతు భరోసా అందరికి ఇవ్వాలని నేను కోరుకుంటున్నాను. గతంలో సాగు భూమికే కాకుండా గుట్టలు, రాళ్ళ వంటి వాటికి ఇవ్వడం జరిగిందన్నారు. ఆ విధంగా కాకుండా సాగు భూమికే ఇచ్చే విధంగా చూడాలి. అంటే, పెద్ద రైతులకు అన్యాయం జరుగుతుందని చాలామంది.., అంటే పెద్ద రైతులనే వారికి అంగీ బాగానే ఉంటుంది కానీ లోపల బనియన్‌లో బొక్కలుంటాయి. ఎందుకంటే, పెద్ద రైతులు ఈ రోజు ఏ పరిస్థితిలో ఉన్నారనేది యావత్తు తెలంగాణ రాష్ట్రానికి తెలుసు. పెద్దరైతులను చిన్న చూపు చూడకుండా అందరి రైతులకు ఇవ్వాల్సిందేనని తెలుపుతున్నాను. రైతులందరికీ రైతు భరోసా ఇచ్చిన రోజే న్యాయం జరుగుతుంది తప్ప, కొంతమందిని ప్రక్కకు పెట్టడం వల్ల అన్యాయం జరుగుతుంది. రైతు భరోసా అనేది అందరికీ ఇవ్వాలి. గత పది సంవత్సరాల నుండి ఇప్పుడిప్పుడే వ్యవసాయం విషయంలో రైతులు బాగుపడుతున్నారు. మరొక్కసారి ఆ రైతుల కుటుంబాలకు మేలు చేయాలని కోరుకుంటున్నాను. అదే విధంగా రైతు బీమాను కూడా రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలని గౌరవ ముఖ్యమంత్రిని, మంత్రివర్యులను తమ ద్వారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు :- అధ్యక్షా, గౌరవ సభ్యులందరికీ నమస్కారం. విజయరమణారావు గారు, కేటీఆర్ గారు, పాయల్ శంకర్ గారు, అక్బరుద్దీన్ ఓవైసీ గారు, సాంబశివరావు గారు మరియు రామ్ మోహన్ రెడ్డి గారు రైతు భరోసాకు సంబంధించిన అంశంపై మాట్లాడటం

జరిగింది. వ్యవసాయానికి, రైతుకు సంబంధించిన అన్ని సమస్యలు మాట్లాడాలనే ఆకాంక్షతో, ఇరిగేషన్ మీద, పవర్ మీద మరియు రుణమాఫీ వంటి అనేక సమస్యల మీద వారి యొక్క ఆలోచన విధానాన్ని సభ ముందు పెట్టడం జరిగింది. మాకు కావలసిన అంశం ఏమిటంటే, గత ప్రభుత్వంలో జరిగిన రైతు భరోసా విధానాన్ని మీ ముందుంచాము. దానిని రేపు రాబోయేటువంటి సంక్రాంతి పండుగ నుండి ఏ రకమైన పద్ధతుల్లో అమలు చేస్తే నిజమైనటువంటి రైతులకు మేలు జరుగుతుందో చెప్పాలని గౌరవ సభ్యులను పదే పదే కోరడం జరిగింది. అయినా, అనుకున్నంత ఫీడ్ బ్యాక్ వచ్చినట్లు లేదు. అయినా సరే, గతంలో జరిగిన పద్ధతి ప్రకారం ఇవ్వవద్దు. ఖాళీగా పంట వేయని భూములు అంటే, ఇందాక మీరు చెప్పినట్లు కొండలు, గుట్టలు వంటి వాటికి రైతు భరోసా ద్వారా రూ.20 వేల కోట్లకు పై చిలుకు వెళ్ళింది. అటువంటి భూములకు ఇవ్వకుండా పంట వేసిన రైతులకే రైతు భరోసా ఇవ్వాలని రమణారావు గారు చెప్పడం జరిగింది. పాత పద్ధతినే కొనసాగించి ఎట్టి పరిస్థితుల్లోనైనా అందరికీ రైతు భరోసా ఇవ్వాలనే అర్థం వచ్చేట్లుగా రామారావు గారు (కేటీఆర్) చెప్పారు. శంకర్ గారు మాట్లాడుతూ, ఆదిలాబాద్‌కు సంబంధించిన అంశాలతోపాటు రైతుకు సంబంధించిన అన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వంతో కూడా మీరు సఖ్యతగా ఉండి, అక్కడి నుండి వచ్చే కార్యక్రమాలను కూడా అనుసంధానం చేసుకోవాలని అన్నారు. తప్పకుండా.., గత సంవత్సర కాలంగా మేము అదే ప్రయత్నంలో ఉన్నాము. ముఖ్యంగా గత 5 సంవత్సరాల్లో నిలిచిపోయిన ఫామ్ మెకనైజేషన్ గాని, డ్రిప్ గాని, స్ప్రింక్లర్లు గాని, అనేక కేంద్ర పథకాలకు తిలోదకాలు ఇస్తే, వాటన్నింటిని రివైవ్ చేస్తున్నాము. తప్పకుండా కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలుపుతున్నాను. కేంద్ర మంత్రి గారు హైదరాబాద్ వచ్చినప్పుడు ఆయిల్‌పామ్‌కు సంబంధించిన ఇంపోర్ట్ డ్యూటీని మేము అడిగినప్పుడు, ఆయన గారు పెద్ద మనసుతో ఢిల్లీ వెళ్ళగానే, ఒక నెల రోజులు సమయంలోనే ఇంపోర్ట్ డ్యూటీ పెంచి, రైతాంగానికి టన్ను ధర రూ.13 వేలు ఉన్న దానిని రూ.20 వేలు పెంచడంతో, తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కూడా ఆయిల్ పామ్ వేసుకునే అవకాశం ఏర్పడింది. తప్పకుండా మళ్ళీ ఢిల్లీ వెళ్ళి కేంద్ర ప్రభుత్వానికి, ఆయనకు అభినందనలు తెలియజేశాము. ఇంకా మిగిలిన అవసరాలను కూడా మేము ఆయన దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. తప్పకుండా కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోని రైతాంగానికి సంబంధించిన అన్ని అంశాల్లో ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని పాయల్ శంకర్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే విధంగా అక్బరుద్దీన్ ఓవైసీ గారు మార్కెట్ గురించి చెప్పిన అంశం ముఖ్యమంత్రి గారి పరిశీలనలో ఉంది. ఇది జడ్జిమెంట్ రిజర్వ్ అయి ఉంది కాబట్టి, ఇంకా నిర్ణయించలేదు. తప్పకుండా దానిని కూడా పరిశీలిస్తామని విజ్ఞప్తి చేస్తున్నాను. సాంబశివరావు గారు కూడా అటవీ భూములకు సంబంధించి కావచ్చు లేదా ధరణీ రికార్డులో ఉన్న జమీందార్ల పేరు మీద రైతు భరోసా అమౌంట్ పడిపోయిందని చెప్పారు. కాబట్టి దానిని ఇప్పుడు మాములుగా ఎవరైతే కౌలుదారులు ఉంటారో లేదు కాస్తు కాలంలో ఉన్నటువంటి వారికి నిజంగా వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని, 15 ఎకరాల వరకు ఉన్న రైతుకు రైతు భరోసా ఇస్తే బాగుంటుందనేది సాంబశివరావు గారి ఆలోచనలాగా చెప్పడం జరిగింది. అదే విధంగా ఎట్టి పరిస్థితుల్లో కల్టివేట్ చేయనటువంటి భూములకు ఇవ్వకూడదని స్పష్టంగా చెప్పారు. గతంలో ఉన్న కమీషన్ల వ్యవహారం కావచ్చు, కౌలు రైతులకు ఏ విధంగా న్యాయం చేస్తారు, గత 5 సంవత్సరాల్లో పంట ఇన్సూరెన్స్‌ను గత ప్రభుత్వం చేయలేదు కాబట్టి, మళ్ళీ దాన్ని రివైవ్ చేసి పంట నష్టపోతే ఎట్టి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ ఇవ్వాలని సాంబశివరావు గారు మాట్లాడారు. ఈ ప్రభుత్వం తప్పకుండా క్రాప్ ఇన్సూరెన్స్‌ను రివైవ్ చేస్తాము అన్నారు. నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వపరంగా భరాయించలేము.

కాబట్టి రైతుల యొక్క ప్రీమియంను ప్రభుత్వం భరాయించి అన్ని పంటలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలని ఈ ప్రభుత్వం యొక్క ఆలోచన అని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే విధంగా రామ్ మోహన్ రెడ్డి గారు గతంలో జరిగిన పద్ధతికి భిన్నంగానే సేద్యం చేసుకునే రైతుకే రైతు భరోసా ఇవ్వాలని చెప్పారు. తప్పకుండా మీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకా ఎవరైనా మాట్లాడాలని అనుకున్న సభ్యులుంటే కౌలు రైతులకు ఏ విధంగా న్యాయం చేయగలుగుతారు, ఈ రైతు భరోసాను ఇంకా మేలైన పద్ధతిలో ఇస్తే ఏ రకంగా చేయగలుగుతామనే అంశంపై మాట్లాడడానికి ఇంకా మీకు సమయం ఉంది. సంక్రాంతి పండుగ వరకు స్టార్ట్ చేయాలని, కేబినెట్ సబ్ కమిటీకి తమరి ఆలోచనలు ఇవ్వాలని కోరుతున్నాను. కేబినెట్ సబ్ కమిటీ యొక్క రిపోర్టును కేబినెట్‌లో పెట్టి వెంటనే రైతు భరోసా కార్యక్రమానికి నిర్ణయం తీసుకుంటాము.

4.00 సా. Cabinet Sub-committee యొక్క రిపోర్టుని క్యాబినెట్‌లో పెట్టి ఈ రైతు భరోసా కార్యక్రమానికి తప్పకుండా వెంటనే నిర్ణయం తీసుకుంటాము. అదే విధంగా రైతు బీమాకి సంబంధించి కూడా సాంబశివరావు గారు చెప్పారు. రైతు బీమా యాథావిధిగా కొనసాగుతుంది. ఈ సంవత్సరం కూడా సుమారు 14వందల కోట్ల రూపాయలను కట్టి గతంలో మాదిరిగానే ఆ యొక్క రైతు బీమాని ప్రతి రైతుకి కొనసాగిస్తున్నాము. ఎక్స్‌ట్రాగా సన్న వడ్లు పండించే రైతాంగానికి కొంత దిగుబడి తగ్గుతుంది కాబట్టి ఆ దిగుబడికి తగ్గట్టుగా మనం బోనస్ ఇస్తే రాబోయే రోజుల్లో.., పంటల బీమా కూడా గతంలో ఆగిపోయింది. తప్పకుండా రివైజ్ చేస్తామని చెప్పాము. ఈ సంవత్సరంలోనే వచ్చే పంట కాలానికి వర్షాకాలం లోపులో ఏ రకంగా దీన్ని రూపకల్పన చేయాలో అది కూడా సభ ముందే ఉంచి పంటల బీమా పథకాన్ని కూడా రివైజ్ చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

అదే విధంగా బోనస్‌కు సంబంధించి రైతులు ఆనందంగా ఉన్నారు. దాన్ని కొనసాగించాలని చెప్పారు. ఇప్పుడు కేవలం సన్న ధాన్యానికి ఎందుకిచ్చామంటే రేపు రాబోయే రోజుల్లో పేద ప్రజలు తినే రేషన్‌కు కూడా సన్న బియ్యం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచన కాబట్టి ఆ యొక్క పంటను పండించే రైతుని మనం ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో 500 రూపాయలు సన్న బియ్యానికి ప్రకటించాం. దాని వల్లనే 21 శాతం ఉన్న సన్న ధాన్యం పండించే రైతాంగం ఈనాడు 61 శాతానికి పెరిగారు. ఇప్పుడు మార్కెట్‌కు వచ్చే ధాన్యం మొత్తం కూడా సన్న ధాన్యమే వస్తుంది. తప్పకుండా రేపు రాబోయే రోజుల్లో పేద పిల్లల సంక్షేమ హాస్టళ్ళకే కాకుండా పేదలకు ఇచ్చే రేషన్ కూడా సన్న బియ్యమే ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచన. ఎందుకంటే, ఇప్పుడు తీసుకునే బియ్యం ఎంత వరకు వాడుకుంటున్నారో, ఎంత వరకు వినియోగించుకుంటున్నారో, ఎంత దుర్వినియోగం అవుతుందో ఇప్పుడు మన సభ్యులందరికీ తెలుసు, అందరి మనస్సులో ఉంది. అది భవిష్యత్తులో ఆ రకంగా కొనసాగడానికి వీలు లేదు. ప్రభుత్వం యొక్క ధనం దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో సన్న ధాన్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. తప్పకుండా ఆ యొక్క ఫలితాలు మనకి కనపడుతున్నాయి.

అదే విధంగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పి.. పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, సోయాబీన్స్, సన్‌ఫ్లవర్ వంటి అన్ని ధాన్యాలకు నష్టమైనా, కష్టమైనా ఎంఎస్‌పికి తక్కువున్నా కూడా రాష్ట్రప్రభుత్వం భరాయించి కొనుగోలు చేసి కేంద్ర ప్రభుత్వం యొక్క ఆలోచన మేరకు ఎంత వరకు అవసరమున్నదో అంతవరకే కాకుండా ఈ రాష్ట్రంలో పండిన అన్ని పంటలను కూడా మీరు కొనుగోలు చేయాలని అభ్యర్థన చేశాము. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. ఇక్కడ పండిన పంటలన్నింటినీ ఎంఎస్‌పి ధరకే కొనుగోలు చేస్తున్నామని విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే విధంగా ఆగిపోయిన డ్రిప్ యాంత్రీకరణ కూడా పునరుద్ధరించాలని ఈ ప్రభుత్వ ఆలోచన. ఈ సంవత్సరం నుంచి ఇప్పటికే ప్రారంభించాము. ఇంకా పెద్ద ఎత్తున సభ్యులందరూ కూడా యాంత్రీకరణ మీద ఎక్కువ ఫోకస్ చేయమని చెప్పారు. తప్పకుండా ఎక్కువ నిధులను యాంత్రీకరణకు ముందు పెట్టి మారిన పరిస్థితుల్లో రైతాంగానికి కావాల్సిన డ్రోన్ కల్చర్ కూడా వచ్చింది. సన్నకారు, చిన్నకారుకు ఉపయోగపడే అన్ని యంత్రాలన్నింటిని కూడా పంపకం చేయలనేది రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆలోచన.

అదేవిధంగా గత ప్రభుత్వం రైతు వేదికలు కూడా నిర్మాణం చేసింది. అవి ఏ రకంగా ఉపయోగం లేవనే ఉద్దేశంతో, ప్రతి మంగళవారం శాస్త్రజ్ఞులతో, ఆదర్శ రైతులతో వేల మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలల్లో రైతు వేదికల ద్వారా వారికి కావాల్సిన వివరాలన్నింటినీ కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇక్కడ నుండి అందిస్తున్నాము. అది కొంతవరకు ఉపయోగంలో ఉంది. ఈ రకంగా వ్యవసాయ శాఖకు సంబంధించి ఈ రాష్ట్రప్రభుత్వం పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించింది. దానికి ముఖ్యమంత్రి గారిని క్యాబినెట్‌ని అభినందిస్తూనే గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈనాడు సుమారు 35 శాతం బడ్జెట్‌లో ప్రవేశపెట్టుకున్నాం. సాక్షాత్తు ముఖ్యమంత్రి గారే వాటికి సంబంధించిన రుణమాఫీ గురించి చెప్పారు. అదే విధంగా, సభ్యులు లేవనెత్తిన మిగిలిన అంశాలన్నింటికి ముఖ్యమంత్రి గారి సమాధానంలో ఉన్నది కాబట్టి రైతు భరోసాకి సంబంధించి మీ ఆలోచనలని వెంటనే సబ్ కమిటీలో పెట్టి క్యాబినెట్ నిర్ణయం తీసుకొని వచ్చే కొత్తసంవత్సరంలో రైతు భరోసాను కొనసాగిస్తామని విజ్ఞప్తి చేస్తున్నాను.

(ఈ సందర్భంలో బీఆర్ఎస్ సభ్యులు తమకు మైకు ఇవ్వవలసిందిగా కోరారు)

వాయిదా ప్రతిపాదనలు

1. శ్రీ ఏలేటి మహేశ్వరరెడ్డి మరియు పాయల్ శంకర్ గార్లు.. ఆరు గ్యారెంటీల్లోని మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఆర్థిక సహాయం అందించాలని మరియు ఇతర సదుపాయలను కల్పించాలని ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

2. శ్రీ కూనంనేని సాంబశివరావు గారు.. రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై పరిష్కరించాలని మరియు ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

MR.SPEAKER:- There is one. Announcement.

ANNOUNCEMENT

I am to announce to the House that as per the Proviso to Rule 41 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly, answers to 25 Starred and 3 Un-starred Questions which were not included in the list of Questions till the last day of the meeting i.e. 21.12.2024 are placed on the Table of the House. They shall form part of the proceedings of the House.

I am also to announce to the House that in respect of the Starred and Un-Starred Questions which were admitted and communicated to the Departments for which answers have not been received, the Ministers concerned are directed to send a copy of the answers to the Questions directly to the Members concerned under intimation to the Legislature Secretariat.

STATISTICS OF THE QUESTIONS

1.	Total Questions Received -	306
2.	Admitted as Starred -	227
3.	Admitted as Un-Starred -	32
4.	Starred Questions Answered-	39
5.	Postponed -	01

FOURTH SESSION: STATISTICS FROM 9TH TO 21 DECEMBER, 2024

1.	No. of days for which the Assembly sat	7 Days
2.	No. of Hours for which the Assembly worked	37 Hours 44 minutes
3.	Number of Starred Questions answered orally	39
4.	Number of answers to the Starred Questions placed on the Table of the House on 21.12.2024	25
5.	Number of answers to the Un-Starred Questions placed on the Table of the House on 21.12.2024	3
6.	Number of Supplementaries made by the Members	69
7.	Number of speeches made by the Members	71
8.	Number of Bills Introduced & Passed	8
9.	Number of Short Discussions discussed	4
10.	Number of Statements made by the Chief Minister	1

PARTY POSITION IN THE ASSEMBLY AS ON 21.12.2024

1.	Indian National Congress	65
2.	Bharat Rashtra Samithi	38
3.	Bharatiya Janata Party	8
4.	All India Majlis-E-Ittehadul Muslimeen	7
5.	Communist Party of India	1
	Total	119

MR. SPEAKER: Now, with the consent of the House, I adjourn the House ***sine die.***

(The House then adjourned *sine die* at 4.07 P.M.)

***

ANNOUNCEMENT

I am to announce to the House that as per the Proviso to Rule 41 of the Rules of procedure and conduct of Business in the Telangana Legislative Asembly, answeres to **25** starred and **3** Un-Starred Questions which were not included in the list of Questions till the last day of the meeting i.e., 21-12-2024 are placed on the Table of the House. They shall form part of the proceedings of the House.

I am also to announce to the House that in respect of the Starred and Un-Starred Questions which were admitted and communicated to the Departments for which answers have not been received, the Ministers concerned are directed to send a copy of the answers to the Question directly to the Members concerned under intimation to the Legislature Secretariat.

*****

LAQ. No. 603.-S.- Smt. Matta Ragamayee, Sarvasri Yennam Srinivas Reddy, Aadi Srinivas, Chikkudu Vamshi Krishna, Dr. T. Ram Mohan Reddy, Sarvasri Balu Naik Nenavath and Malreddy Ranga Reddy:- Will the Chief Minister be pleased to state:

a) whether it is a fact that the Government is contemplating to introduce Indira Mahila shakti Scheme in the State to m ake women a millionaire;

b) whether it is also fact that the Government is providing loans under Indira Mahila Shakti to self Help Groups (SHGs) via Mission for Elimination of Poverty in Municipal Areas (MEPMA);

c) if so, the number of Self Help Groups have been formed and the number of members have enrolled their names; the quantum of loan amount is going to be provided to the Self Help Groups (SHGs);

d) the details thereof ?

A. 603.- a) Yes, Sir.

b) Yes, Sir.

c) Till now 1,75,374 Self Help Groups (SHGs) formed with 17,72,741 women members. During the financial year 2024-25, 1,741 SHGs are formed with 17,225 women members.

The Following target is provided under Indira Mahila shakthi for the financial year 2024-25:

* Total 17,500 enterprises to be set up with financial outlay of Rs. 1025 Crs. in 1000 Area Level Federations (ALFs) in 32 districts.

* 2,500 Group enterprises to be set up with financial outlay of Rs. 500.00 Crs. per annum (@ 20.00 lakhs to each group enterprise).

* 15,000 individual enterprises to be set up with financial outlay of Rs. 525.00 Crs. per annum (@ 3.50 lakhs to each individual enterprise).

d) The following are the details of progress so far made under Indira Mahila shakthi

> Group Enterprises:

* No. of beneficiaries identified : 11,131

* No. of enterprises grounded : 8,661

* Amount disbursed : Rs. 17005. 28 Lakhs

> Individual Enterprises:

* No. of beneficiaries Identified : 1,078

* No. of enterprises grounded : 682

* Amount disbursed :Rs. 5703.35 Lakhs

నెం. 603.– శ్రీమతి. మట్టా రాగమయి, సర్వశ్రీ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఆది శ్రీనివాస్, చిక్కుడు వంశీ కృష్ణ, టి. రామ్ మోహన్ రెడ్డి, బాలు నాయక్ నేనావత్, మల్‌రెడ్డి రంగారెడ్డి:- గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలయజేస్తారా;

ఎ) మహిళలను మిలియనీర్‌లుగా చేయడానికి రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్న విషయం వాస్తవమేనా;

బి) మునిసిపల్ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన మిషన్ (ఎంఇపిఎంఎ) ద్వారా స్వయం సహాయక గ్రూపులకు ఇందిరా మహిళా శక్తి క్రింద రుణాలను ప్రభుత్వం సమకూరుస్తున్న విషయం కూడా వాస్తవమేనా;

సి) అయితే, ఏర్పాటు అయిన స్వయం సహాయక గ్రూపుల సంఖ్య ఎంత; పేర్లను నమోదు చేసుకున్న సభ్యుల సంఖ్య తెలియచేయండి; స్వయం సహాయక గ్రూపులకు (ఎస్‌హెచ్‌బి) సమకూర్చుదలచిన రుణాల మొత్తం పరిమాణం ఎంత;

డి) అయితే, ఆ వివరాలేమిటి?

A. నెం. 603.– ఎ) అవునండీ.

బి) అవునండీ.

సి) ఇప్పటివరకు, 17,72,741 మంది మహిళా సభ్యులతో 1,75,374 స్వయం సహాయక గ్రూపులను (ఎస్‌హెచ్‌జిలు) ఏర్పాటు చేయడమయింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 17,225 మంది మహిళా సభ్యులతో 1741 ఎస్‌హెచ్‌జిలను ఏర్పాటు చేయడమయింది.

2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇందిరా మహిళా శక్తి క్రింద ఈ క్రింది లక్ష్యాలను ఉంచడమయింది.

• 32 జిల్లాలలోని 1000 ఏరియా లెవల్ ఫెడరేషన్లలో (ఎఎల్ఎఫ్‌లు) రూ. 1025 కోట్ల ఆర్థిక వ్యయంతో మొత్తం 17,500 ఎంటర్ ప్రైజెస్‌ను ఏర్పాటు చేయడమవుతుంది.

• ప్రతీ సంవత్సరం రూ. 500.00 కోట్ల ఆర్థిక వ్యయంతో 2500 గ్రూప్ ఎంటర్ ప్రైజెస్‌ను ప్రతి గ్రూప్ ఎంటర్ ప్రైజెస్‌కు రూ. 20.00 లక్షల చొప్పున) ఏర్పాటు చేయడమవుతుంది.

• ప్రతీ సంవత్సరం రూ. 525.00 కోట్ల ఆర్థిక వ్యయంతో 15,000 వ్యక్తిగత ఎంటర్ ప్రైజెస్‌ను ఏర్పాటు చేయడమవుతుంది. (ప్రతి వ్యక్తిగత ఎంటర్ ప్రైజ్‌కు రూ. 3.50 లక్షల చొప్పున)

డి) ఇందిరా మహిళా శక్తి క్రింద ఇప్పటి వరకు జరిగిన పురోగతి వివరాలు క్రింది విదంగా వున్నాయి:

1 వ్యక్తిగత ఎంటర్ ప్రైజెస్:

* గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య : 11,131

* ప్రారంభించిన ఎంటర్ ప్రైజెస్ సంఖ్య : 8,661

* పంపిణీ చేసిన మొత్తం : రూ. 17,005.28 లక్షలు

1 గ్రూప్ ఎంటర్ ప్రైజెస్:

* గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య : 1,078

* ప్రారంభించిన ఎంటర్ ప్రైజెస్ సంఖ్య : 682

* పంపిణీ చేసిన మొత్తం : రూ. 5703.35 లక్షలు

LAQ. No. 617.- Sri Kunamneni Sambasiva Rao:- Will the Chief Minister be pleased to state:

a) whether it is a fact that Rs. 265 Crores Telangana Scheduled Tribes Cooperative Finance Corporation Limited (TRICOR) Subsidy funds have been sanctioned for tribal welfare from 2018 to 2020;

b) if so, the time by which the said funds will be released;

c) whether the Government noticed that new action plan is not being released every year for the welfare of Tribals;

d) the measures taken by the Government to release the sanctioned Telangana Scheduled Tribes Cooperative Finance Corporation Limited (TRICOR) subsidy funds and to release the action plan every year.?

A. 617.- a) Yes, Sir.

b) Government released an amount of Rs. 45.81 Crores, balance an amount of Rs. 219.19 Crores will be released shortly and the same is under consideration of the Government.

c) Yes Sir.

i) Telangana Scheduled Tribes Cooperative Finance corporation Limited (TRICOR) Action Plan for the years 2022-23 and 2023-24 was not released due to non-release of budget by the Government.

ii) Telangana Scheduled Tribes Cooperative finance Corporation Limited (TRICOR) Action Plan for the years 2020-21 & 2021-22 was released with a subsidy outlay of Rs. 261.66 Crores and Rs. 536.20 Crores respectively.

iii) The Action Plan for the year 2024-25 with a subsidy outlay of Rs. 360.00 Crores is under preparation and will be released shortly.

d) Government examined and released of Rs. 45.81 Crores and balance is Rs. 219.19 Crores is under consideration of the Government for release of subsidy and required steps will be taken for release of Telangana scheduled Tribes Cooperative Finance Corporation Limited (TRICOR) Action Plan every Year.

నెం. 617.– శ్రీ కూనంనేని సాంబశివరావు:– గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

ఎ) 2018 నుండి 2024 వరకు గిరిజన సంక్షేమానికి రూ. 265 కోట్ల తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ (ట్రైకార్) సబ్సిడీ నిధులను మంజూరు చేసిన విషయం వాస్తవమేనా;

బి) అయితే, ఎప్పటిలోగా నదరు నిధులను విడుదల చేయడమవుతుంది;

సి) గిరిజనుల సంక్షేమం కొసం ప్రతి సంవత్సరం కొత్త కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా ;

డి) మంజూరైన తెలంగాణ షెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ (ట్రైకార్) సబ్సిడీ నిధులను విడుదల చేయడానికి, ప్రతి సంవత్సరం కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటి?

A.. నెం. 617.– ఎ) అవునండీ.

బి) ప్రభుత్వం రూ. 45.81 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది, త్వరలోనే మిగిలిన రూ. 219.19 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమవుతుంది. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

సి) అవునండీ.

i) ప్రభుత్వం బడ్జెటును విడుదల చేయని కారణంగా 2022-2023, 2023-2024 సంవత్సరాలకు తెలంగాణ పెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ (ట్రైకార్) కార్యచరణ ప్రణాళికను విడుదల చేయలేదు.

ii) వరుసగా రూ. 261.66 కోట్లు, రూ. 536.20 కోట్ల సబ్సిడీ వ్యయంతో 2020-21 మరియు 2021-22 సంవత్సరాలకు తెలంగాణ పెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ (ట్రైకార్) కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయడమయింది.

111) రూ. 360.00 కోట్ల సబ్సిడీ వ్యయంతో 2024-25 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమవుతుంది. దీనిని త్వరలోనే విడుదల చేపట్టడమవుతుంది.

డి) ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి, రూ. 45.81 కోట్లను విడుదల చేసింది, మిగిలిన 219.19 కోట్ల సబ్సిడీని విడుదల చేసే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ప్రతి సంవత్సరం తెలంగాణ పెడ్యూల్డు తెగల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ (ట్రైకార్) కార్యాచరణ ప్రణాళిక విడుదల కోసం అవసరమైన చర్యలను చేపట్టడమవుతుంది.

LAQ. No. 629.- Sarvasri Akbar Uddin Owaisi, Ahmed Bin Abdullah Balala, Kausar Mohiuddin, Mohammed majid Hussian, Mohammed Mubeen, Jaffar Hussain and Mir Zulfeqar Ali :- Will the Chief Minister be pleased to state:

a) whether it is a fact that State Government has to clear the pending arrears of Scholarships (Pre-Matric & Post Matric) and fee reimbursement (RTF & MTF) in the Minorities Welfare Department in the State;

b) whether it is also a fact the Government has not released the pending arrears to eligible candidates for Overseas to the Minorities Students;

c) if so, the total demand of scholarship, amount sanctioned, released and pending to the Minorities Students in the State from 2019-2020 and 2024-2025; the year wise details thereof ?

A. 629.- a) Yes, Sir.

The Government for FY 2024-25 has allocated Rs. 300.00 Cr and has released Rs. 225.00 cr under RTF and allocated Rs. 120 Cr and released Rs. 90.00 Cr under MTF. There is no Pre-Matric Scholarship scheme implemented to the Minority Students.

b) No Sir,

The Overseas Scholarship amounts to the eligible candidates have been released in phase manner. The Government for the FY 2024-25 has allotted Rs. 130.00 Cr and released Rs. 97.50 Cr.

c) Rs. 770.18 Cr pending for the academic year 2019-20 to 2023-24. Statements - I & II are placed on the Table of the House.

STATEMENT - I to L.A.Q. No. 629 (STARED)

DETAILS OF POSTMATRIC SCHOLARSHIPS(RTF/MTF) :: MINORITIES WELFARE DEPARTMENT::

Sl.No	Academic Year	Name of the Department	Verified Applications	Verified Demand in Rs.Cr			Paid in Rs.Cr			Balance to be Paid in Rs.Cr		
				RTF	MTF	Total	RTF	MTF	Total	RTF	MTF	Total
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	2019-20	Minority welfare	132697	235.00	76.59	311.59	231.67	75.03	306.70	3.33	1.56	4.89
2	2020-21		137944	267.64	51.92	319.56	237.24	43.07	280.31	30.40	8.85	39.25
3	2021-22		140241	275.08	65.53	340.61	105.67	37.93	143.60	169.41	27.60	197.01
4	2022-23		137212	243.07	67.74	310.81	1.47	5.67	7.14	241.60	62.07	303.67
5	2023-24		103173	172.16	53.31	225.47	0.00	0.11	0.11	172.16	53.20	225.36
Total			651267	1192.95	315.09	1508.04	576.05	161.81	737.86	616.90	153.28	770.18

STATEMENT - II to L.A.Q.No. 629 (STARED)

Details of CMs OverseasScholarship Scheme From The Year 2019 To 2024 as on 17.12.2024

Sl.No.	Year	Phase/Season	Demand/Selected		Release/Sanctioned		Pending	
			Applications	Amount	Applications	Amount	Applications	Amount
1	2019	Spring Season (Jan-2019)	251	51.3124	251	51.3124	0	0
2		Fall season (Aug-2019)	242	49.4066	242	49.4066	0	0
3	2020	Spring & Fall -2020	298	60.9161	298	60.9161	0	0
4	2021	Spring & Fall -2021	506	104.0795	506	104.0795	0	0
5	2022	Spring-2022	265	54.1134	264	54.1134	1	0
6	2022	Fall-2022	258	53.148	164	33.784	94	19.364
7	2023	Spring-2023	249	51.294	0	0.00	249	51.294
TOTAL			**2069**	**424.27**	**1725**	**353.612**	**344**	**70.658**

Note: Out of Pending amounts for Rs.70.658 crores, a sum of Rs.41.31 Crores are under process at Finance and Rs.29.34 Crores are available with DMWOs for prepara bills preparation is under progress.

నెం. 629.– సర్వశ్రీ అక్బరుద్దిన్ ఓవైసీ, అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాల, కౌసర్ మొహియుద్దిన్, మహమ్మద్ మాజిద్ హుస్సేన్, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్ మరియు మీర్ జుల్ఫీకర్ అలీ:– గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

ఎ) రాష్ట్రంలో మైనారికిటీల సంక్షేమ శాఖలో స్కాలర్‌షిప్‌లు (ఫీ–మెట్రిక్ & పోస్ట్ మెట్రిక్), ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టిఎఫ్ & ఎంటిఎఫ్) పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్న విషయం వాస్తవమేనా;

బి) మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్యకు సంబంధించి అర్హులైన విద్యార్థులకు పెండింగ్‌లో వున్న బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదన్న విషయం కూడా వాస్తవమేనా;

సి) అయితే, 2019–20 నుండి 2024–25 వరకు రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులకు సంబంధించి మొత్తం స్కాలర్‌షిప్‌ల డిమాండ్, మంజూరు చేసిన మొత్తాలు, విడుదల చేసినవి, పెండింగ్‌లో వున్న మొత్తాల సంవత్సరం వారి వివరాలేమిటి?

A. నెం. 629.– ఎ) అవునండీ. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌టిఎఫ్ క్రింద ప్రభుత్వం రూ. 300.00 కోట్లను కేటాయించి, రూ. 225.00 కోట్లను విడుదల చేయడమయింది, ఎంటిఎఫ్ క్రింద రూ. 120 కోట్లను కేటాయించి రూ. 90.00 కోట్లను విడుదల చేయడమయింది. మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేయడం లేదు.

బి) లేదండీ. అర్హులైన విద్యార్థులకు ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ మొత్తాలను దశల వారీగా విడుదల చేయడమయింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ. 130.00 కోట్లను కేటాయించి, రూ. 97.50 కోట్లను విడుదల చేయడమయింది.

సి) 2019–20 నుండి 2023–24 విద్యా సంవత్సరాల కోసం రూ. 770.18 కోట్లు పెండింగులో వున్నాయి. వివరాలను అనుబంధ – I, IIల రూపంలో సభా సమక్షంలో వుంచడమయింది.

శాసన సభ ప్రశ్న నెం.629 కి సంబంధించిన అనుబంధం వివరణ - I

పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లు (ఆర్ టి ఎఫ్/ఎంటిఎఫ్) వివరాలు :: మైనారిటీల సంక్షేమ శాఖ ::

వరుస సంఖ్య	విద్యా సంవత్సరం	శాఖ పేరు	వెరిపై చేసిన దరఖాస్తులు	వెరిపై చేసిన డిమాండ్ రూ.కోట్లలో			చెల్లించిన మొత్తాలు రూ.కోట్లలో			చెల్లించాల్సిన మిగిలిన మొత్తాలు రూ. కోట్లలో		
				ఆర్ టి ఎఫ్	ఎంటిఎఫ్	మొత్తం	ఆర్ టి ఎఫ్	ఎంటిఎఫ్	మొత్తం	ఆర్ టి ఎఫ్	ఎంటిఎఫ్	మొత్తం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	2019-20	మైనారిటీ సంక్షేమం	132697	235.00	76.59	311.59	231.67	75.03	306.70	3.33	1.56	4.89
2	2020-21		137944	267.64	51.92	319.56	237.24	43.07	280.31	30.40	8.85	39.25
3	2021-22		140241	275.08	65.53	340.61	105.67	37.93	143.60	169.41	27.60	197.01
4	2022-23		137212	243.07	67.74	310.81	1.47	5.67	7.14	241.60	62.07	303.67
5	2023-24		103173	172.16	53.31	225.47	0.00	0.11	0.11	172.16	53.20	225.36
మొత్తం			651267	1192.95	315.09	1508.04	576.05	161.81	737.86	616.90	153.28	770.18

శాసన సభ ప్రశ్న నెం.629 కి సంబంధించిన అనుబంధం వివరణ - II

17.12.2024 తేదీనాటికి, 2019 నుండి 2024 సంవత్సరం వరకు సిఎం ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం వివరాలు

వరుస సంఖ్య	సంవత్సరం	దశ / కాలం	డిమాండ్ /ఎంపిక చేసిన		విడుదల / మంజూరు చేసిన		పెండింగ్	
			దరఖాస్తులు	మొత్తం	దరఖాస్తులు	మొత్తం	దరఖాస్తులు	మొత్తం
1	2019	స్ప్రింగ్ సీజన్ (జనవరి -2019)	251	51.3124	251	51.3124	0	0
2		ఫాల్ సీజన్ (ఆగస్టు -2019)	242	49.4066	242	49.4066	0	0
3	2020	స్ప్రింగ్ & ఫాల్ -2020	298	60.9161	298	60.9161	0	0
4	2021	స్ప్రింగ్ & ఫాల్ -2021	506	104.0795	506	104.0795	0	0
5	2022	స్ప్రింగ్ -2022	265	54.1134	264	54.1134	1	0
6	2022	ఫాల్ -2022	258	53.148	164	33.784	94	19.364
7	2023	స్ప్రింగ్ -2023	249	51.294	0	0.00	249	51.294
మొత్తం			**2069**	**424.27**	**1725**	**353.612**	**344**	**70.658**

గమనిక: రూ.70.658 కోట్ల పెండింగ్ మొత్తాలలో రూ.41.31 కోట్లు ఫైనాన్స్ వద్ద పురోగతిలో వున్నాయి, రూ.29.31 కోట్లు బిల్లుల తయారీ కోసం డిఎండబ్ల్యుఓల దగ్గర లభ్యంగా వున్నాయి. బిల్లుల తయారీ కొనసాగుతుంది.

LAQ. No. 637.- Sri K.R. Nagaraj. K. :- Will the Chief Minister be pleased to state:

a) the year wise details of funds allocated and expenditure incurred under SC--Sub-Plan from the year 2014 to December, 2023;

b) whether it is a fact that the previous Government has not allocated any budget for S.C. Sub Plan from formation of Telangana State;

c) if so, whether there is any proposal to revive the same for the empowerment of Dalit youth.

d) if so, the measures to be taken in this regard?

A. 627.- a)

Year	Total SCSDF Outlay (Cr)	Total SCSDF Expenditure (Cr)
2014-15	7579.45	2936.26
2015-16	8089.24	4682.48
2016-17	10483.96	5257.61
2017-18	14375.13	8907.93
2018-19	16452.79	10217.89
2019-20	12400.22	11075.88
2020-21	16534.97	11884.26
2021-22	21306.85	17085.76
2022-23	33937.76	15440.16
2023-24 (upto 31.12.2023)	36750.48	11121.32

b) No.

c) Does not arise.

d) does not arise.

నెం. 637.– శ్రీ కె.ఆర్. నాగరాజ్.కె.:- గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

ఎ) 2014 నుండి 2023, డిసెంబరు వరకు ఎస్‌సి ఉప–ప్రణాళిక క్రింద కేటాయించిన నిధులు, చేసిన వ్యయం సంవత్సరం వారీ వివరాలేమిటి;

బి) తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుండి ఎస్‌సి ఉప–ప్రణాళిక కోసం గత ప్రభుత్వం ఏ బడ్జెటును కేటాయించని విషయం వాస్తవమేనా;

సి) అయితే దళిత యువతకు సాధికారత కల్పించడానికి దీనిని పునరుద్ధరించే ప్రతిపాదన ఏదైన ప్రభుత్వం వద్ద ఉన్నదా;

డి) అయితే, ఇందుకు సంబంధించి తీసుకునే చర్యలేమిటి?

A. నెం. 629.– ఎ)

సంవత్సరం	మొత్తం ఎస్‌సిఎస్‌డిఎఫ్ (కోట్లు)	మొత్తం ఎస్‌సిఎస్‌డిఎఫ్ (కోట్లు)
201415	7579.45	2936.26
